భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మే 1955

సంపుటము 32 : : సంచిక 5

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మే 1955

త్రివర్ణ చిత్రము: ప్రతీక—చిత్రకారుడు: శ్రీ దివాకర్ సేన్‌రాయ్.

అను భూతి

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

[బ్రౌనింగు అను ఆంగ్లకవి వ్రాసిన *Andrea del sarto* అను ఖండకావ్యమున ననుసరించి *Andrea* పశ్చాత్తాప మిందు వర్ణితము. *Andrea* గొప్పశిల్పి. అతని శిల్పకళానిపుణతకు మెచ్చి ఫరాసురాజు తనసభాస్థలమున నలంకరింప గొప్పచిత్రములఁ జిత్రింపుమని కోరి యాతనికి కోట్లకొలఁది ధనమొసఁగి గౌరవించెను. కాని, *Andrea* అధనముకొనిపోయి *lucrezia* అనునొక మహాసౌందర్యవతిని (మిక్కిలి చంచలచిత్తను) పరిణయమాడి యామెకు వశుఁడై యున్నియుమలచి రాజును మోసగించి, ఆఁకట వలను తలిదండ్రులను తృణీకరించి, ఆజన్మసిద్ధమగు కళానిపుణతను గంగగలిపి యున్నివిధముల భ్రష్టుఁడై తుదకు తన్ను విడిచిపోయిన భార్యవలన విరాగియై యిట్లువాపోయెను.]

"ఎంతటి శిల్పియైనను మఱెంతటి సత్కవియైనఁగాని యా
వంతయుఁ గాంతలందు వలవంతఁ దగుల్గొననేని మూర వి
భ్రాంతినిమగ్నుఁడై చెడు నవశ్యము సత్యము; నాదు జీవితం
బింత కుదాహృతంబయి మహీతలమందుఁ జిరంబు నిల్చెడిన్.

ఆ సౌందర్యము మోసపుచ్చినది; బాహ్యంబంచు భావింపకే
యాసింపన్ దొరకొంటి భౌతిక శరీరాసహ్య దుర్గంధమే
నాసానందకరంబుగాఁ బ్రవిమలానందంబు దివ్యాత్మవి
ద్యాసౌశీల్యమె యిచ్చునంచెఱుఁగ మూర్ఖాగ్రేసరత్వంబునన్.

ఆ నిడువాలుఁగన్నుఁ గవ యందము నామె ముఖాంబుజప్రభా
నూతనహాస్తయుగ్మ సుమనోహరతల్ కుంచకుంభశోభ బా
గా నలినీలకుంతలవికాసము నన్ను వశానుచంద మా
హా! నిటలంబుతీరు నను నజ్ఞ నొనర్చెను శాశ్వతంబుగన్!

ఉన్నత భూమిభాగమునమండి క్రమంబుగ నిమ్నభాగమం
దున్న నదంబులోనికి జలోత్కరముల్ పఱతెంచునట్టు ల
త్యున్నత శిల్పపారగ మహోన్నతినుండి మనోజలంబు పా
ఱె న్ననయావనాంచిత శరీర సుహూపసరంబులోనికిన్.

1

ఆ రమణీలలామమును నా రసినంతనె 'ముద్దుగుమ్మ బం
గారపుబొమ్మ లేఁ జిగురుఁ గైదువుకొమ్మ వరాలసొ'మ్మ టం
చారని ప్రేముడిన్ గవితలల్లఁ దొడంగితిఁ గాని యీ కళా
కారునిపాలిమృత్యువని కాంచకపోతిని మోహమగ్నతన్.

ఆమె మొగంబుఁగాంచి దరహాసముఁ జూచి విశాలపద్మ నే
త్రామలరోచి దృష్టిఁగొని యందము చందము పుక్కిపుచ్చుకోఁ
గా మనసయ్యెఁగాని యధికంబగు దుఃఖకరంబె యౌను నా
యీ మమకారమంచు మది నెంచకపోతిని దుర్వివేకినై.

నానద సద్వివేకము ననంతయశంబును గోలుపోయితిన్
మోసముచేసితిన్ సకలమున్ ననుఁగాఁ దలపోసి కాసులన్
రాసిగ నా కొసంగిన పరాసువిభున్, తలిదండ్రులన్ వృథా
యాసపడంగఁ జేసి హృదయంబుల నేర్చితిఁ బాపబుద్ధినై.

'కళకోసంబయి జీవితార్పణమునుం గావించుపుణ్యుండు న
త్కళకున్ జీవమువోసి శిల్పివరుఁడై కాంచెన్ మహాఖ్యాతి' యన్
పలుకుల్ నాయెడ వ్యర్థమయ్యెఁగద! సంపాదించితిన్ 'చీము నె
త్తురులకాంతన్ నెఱనమ్మి భ్రష్టుఁడయె' నన్ దుష్కీర్తి నత్యంతమున్.

శిల్పకళాప్రవీణతఁ బ్రసిద్ధి గడించితిఁగాని సత్య మ
త్యల్పము నాదుశక్తియని యాత్మ నెఱింగితి నెంతయున్ బురా
శిల్పివరేణ్యశిల్పముల 'జీవము' నందలి 'ఆత్మ' లేదు నా
శిల్పమునందుఁ దోఁచును విశిష్ట విభేదము లందు నిందునున్.

కారణ మొక్కటే కలదు కాంచ మహాత్ములు నిర్జితేంద్రియ
శ్రీ రమణీయచిత్తులు వశీకృత సర్వకళారహస్యు ల
వ్వారలు నిర్మముల్, తలఁప వారికి నాకును బోల్కి యున్న దే?
మారవికార దుర్మలినమానసుఁడన్ కడుభాగ్యహీనుఁడన్.

భావిజనింపఁబోవు ప్రతిభాయుత శిల్పకళాప్రవీణులా
రా! వినుఁ డొక్కమాట అతిరమ్యము శాశ్వతమున్ ప్రసిద్ధ వి
ద్యా వినుతంబునై వకళ యబ్బదు కాముకులైనవారికిన్
జీవితమెల్ల వ్యర్థమగుఁ జెప్పెద నిక్కము నమ్ముఁడీ ననున్.

కామము గెల్వలేనియెడఁ గాంతలఁగూడి జగంబువారలై
భూమి నశింపుఁడీ మిముఁ బ్రబుద్ధులు తిట్టరు; కాని మీరు ని
ష్కాములుగాక శిల్పులనిగాని కవీంద్రుల మంచుఁగాని త
న్నామముఁ దాల్పఁ బోకుఁడు జనంబుల నాత్మల మోసపుచ్చఁగన్.

కాంతాలోలకటాక్షవీక్షణ నిమగ్నస్వాంతుఁడెవ్వండు ని
శ్చింతానూనవివేకపారగుఁ డుగాఁ జెల్వారె నెన్నండు? వి
భ్రాంతిభ్రష్టకళాప్రసిద్ధుఁ డను జెప్పన్‌సిగ్గు! కామాంత దుః
ఖాంతస్వీయచరిత్రుఁడన్ గతమహాఖ్యానుండ నిర్భాగ్యుఁడన్.

జీవితమెల్లవ్యర్థముగ జేయకుఁడీ ననుఁబోలె, సత్కళా
ప్లావిత సద్వివేకమిక భద్రముగా భవితవ్యలోక సం
భావనకున్ వ్యయింపుఁడు ప్రపంచ సుఖేచ్ఛయు తుచ్ఛకాముక
త్వావిలబుద్ధి వీడుఁడు మహాత్ములుకండు కళాప్రసిద్ధులై!

జీవితపావనంబగు విశిష్టమహానుభవంబు దీని నా
భావితరంబువారికయి పంచి శరీరము వాసిపోయి సం
భావితరీతి నేను పరమంబగు శాంతిని దాంతి నందెదన్
భావికళాప్రవీణు లతిభవ్యులుగా మనసారఁ గోరెదన్!

సిల్కు చీర

శ్రీ మురయా

కాత్యాయినీ వాళ్ళు యిల్లు ఖాళీచేసి వెళ్ళడం మీనాక్షమ్మకు చాలా కష్టమనిపించింది. ఊరికే కష్టమనిపించడం కాదు. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. అందులో ఆమె తప్పేమీ లేదు గనుక మీనాక్షమ్మ అశ్రుగర్భితములైన చూపులు చూస్తూ కలిగిన కష్టాన్ని దిగమింగుకొన్నది.

వాళ్ళిద్దరూ ఒక డాబాలో నాలుగేళ్ళు చెరో భాగంలో కలసి మెలసి ఉండి కాపరాలు చేశారు. ఆ యిల్లు కట్టించిన ఆసామి అసలు ఆ డాబాను రెండు భాగాలుగా అద్దెకివ్వాలనో లేక యిద్దరు కొడుకులకు సమంగా పంచి ఇవ్వాలనో అల్లా కట్టి ఉంటాడనిపిస్తుంది ఆ డాబాను చూస్తే. ముందు గది ఒకటే దానివెనుక ఒక చిన్న హాలూ తరువాత రెండు భాగాలనూ కలుపుతూ వరండా. ఆ వరండాకు పది గజాల దూరంలో వంటగదీ వంటగదిని ఆనుకొని స్నానాలగదీ ఉన్నాయి. ముందు గదులను కలుపుతూ విశాలమైన పంచపాళీ వుంది.

చెరో ఇరవై అద్దెక్రింద ఇచ్చేవాళ్ళు. ఒక నెల మీనాక్షమ్మ వాళ్ళకు అద్దెక్రింద జమకట్టవలసిన పైకం కొంత తక్కువైతే కాత్యాయిని అడక్కుండానే సర్ది మొత్తం నలభై యింటాయనకు అందించేసింది.

కాత్యాయిని భర్త తాలూకా ఆఫీసు గుమాస్తాగిరి చేస్తుంటే మీనాక్షమ్మ భర్త స్కూలుమాస్టరీ చేస్తుండేవాడు. ప్రొద్దుటపూట వాళ్ళిద్దరూ వెనక వంటగదుల్లో కలిసివుండి మధ్యాహ్నం కాసేపు మధ్యగదుల్లో సర్దుకొని సాయంకాలానికి ముందున్న పంచపాళీ చేరుకొనేవారు.

ఆత్మీయతలనేవి అనుకోకుండానే ఏర్పడేవే కాని కావాలని ప్రయత్నంచేస్తే వచ్చేవి కావు.

మీనాక్షమ్మ భర్త నాగేశ్వరరావు తనకు వచ్చే వందరాళ్ళతోనూ సంసారం నడుపుకోవాలనుకొన్నాడు. అందుకనే ఇంత అద్దె తాను భరాయించగలనా అని అనుమానం కలిగింది. అల్లా అతను అనుమానిస్తూనే ఆ యింట్లో భాగం తీసుకొన్నాడు. అతను ఆ వాటా పుచ్చుకొన్న వారానికి రెండో వాటాలో వెంకట్రావు వచ్చి చేరాడు.

ఇద్దరూ చేరిన రెండురోజులకే కొత్త పరిచయాలయినాయి.

మరో వారానికి వాళ్ళిద్దరూ—ఒకరు అటు ఆఫీసుకు మరొకరు ఇటు స్కూలుకూ వెళ్ళినా ఆ రెండు భాగాలముందు తలుపులు తాళాలు బిగించుకొని ఉంచవలసిన అగత్యం తప్పింది.

ఆ వచ్చిన ఇద్దరమ్మాయిలూ క్రొత్తగా కాపరానికి వచ్చినవాళ్ళే. ఇద్దరూ ఇక్కడకు వచ్చాకనే పులుసులో తిరగమోత వెయ్యడం నేర్చుకున్నారు. వాళ్ళిద్దరూ "ఏమండీ అంటే ఏమండీ" అని సరిగ్గా వారమైనా పిల్చుకోలేదు. వారం గడవకముందే కాత్యాయినికి మీనాక్షమ్మను అల్లా పిలవడం ఏదో ఎబ్బెట్టుగా ఉన్నట్లు కన్పించింది. నిమిషంలో వరుసలు కలిపింది కాత్యాయిని.

'ఏమమ్మా వదినా, నీవిల్లా వంట ఆలస్యంచేస్తే మా అన్నగారికైనా బడికి వెళ్ళాలనేనా' అంటూ వంటగదిలోకి వచ్చి కూర తరిగి ఇచ్చి కారం ఎంత వెయ్యాలో ఎప్పుడు వెయ్యాలో చెప్పివెళ్ళేది.

మీనాక్షమ్మకు ఆమెను వరుసపెట్టి పిలవడం కన్నా 'కాత్యాయినీ' అని పిలవడమే బాగుందనిపించింది. మూడు నెలలు గడవకముందే వాళ్ళిద్దరికీ ఏమే అంటే ఏమే అనుకొన్నంత స్నేహమయింది.

"మనసులు కలవాలే గాని ఆడవాళ్ళకు స్నేహమెంతలో అవుతుంది." అనుకొన్నాడు నాగేశ్వరరావు. కొత్త కాపురం ఎల్లాగా అని మొదట ఉంటూ వచ్చిన భయం అతని కిప్పుడు పూర్తిగా పోయింది.

ఎప్పుడైనా బజారుకు బట్టలకొట్టుకు వెళితే ఆ అమ్మాయిలిద్దరూ జంటగా వెళ్ళేవారు. కలిసేవచ్చేవాళ్లు. కాత్యాయిని ఏ చీరకొంటే తనూ అదే కొనేది మీనాక్షమ్మ. కాత్యాయిని కాస్త జాగ్రత్తగా బేరమాడేది. పద్నాలుగురూపాయలకంటె ఎక్కువ ఖరీదు ఏనాడూ ఏచీరకూ తను పెట్టేది కాదు— మీనాక్షమ్మచేత పెట్టనిచ్చేది కాదు. అందుకనే ఇద్దరూ ఒక్క బేరంగా ఒక్కటే ఖరీదుచీరలు కట్టుకొనేవారు. ఆ యింటాయన ఎప్పుడైనావచ్చి వెళుతుండేవాడు. కాసేపు ముందున్న పంచపాళీలో

కూర్చుని "ఏదమ్మా అమ్మాయి, కాస్త మంచితీర్థం అందుకో" అనేవాడు. వారిద్దరూ లోపలకువెళ్లి ఒకరు నీళ్ళల్లో పంచదార కలిపి తెస్తే మరొకరు మజ్జిగలో నిమ్మకాయపిండి పట్టుకొచ్చేవారు. ఆయన మొదట్లో కేవలం అద్దె వసూళ్ళకు వచ్చినా తరువాత తర్వాత మధ్యాహ్నంపూట వచ్చి కాసేపు కూర్చుని దాహం పుచ్చుకొని సంతోషించి ఆ యిద్దరు పిల్లల్నీ దీవించి వెళుతుండేవాడు. "నాకెంతో సంతోషంగా వుందమ్మా — నిజంగా నాయింట్లో ఇద్దరు కోడళ్లు తిరుగుతున్నట్లుగా వుంది. మీరిద్దరూ ఇప్పుడు కాకపోయినా పూర్వజన్మలో అక్కాచెల్లెళ్ళు అయి ఉంటారమ్మా" అనేవాడు.

అమాట ఆయనేకాదు. పాలుపోసే గొల్లదీ అమాటే అనేది. వారానికీ పదిరోజులకూ ఇస్త్రీ బట్టలు తెచ్చిఇచ్చే చాకల్దీ ఆమాటే అనేది.

మీనాక్షమ్మకంటే కాత్యాయిని రెండేళ్లు పెద్ద. కాత్యాయిని భర్త మీనాక్షమ్మ మొగుడికంటే వయస్సులో పెద్దవాడే అయినా చదువులో కొంత చిన్న అనే చెప్పాలి. ఇంటరు చదువుతూ చదువు ఆపేసి గుమాస్తా ఉద్యోగంలో చేరి అటు ఉద్యోగంలోనూ, ఇటు జీవితంలోనూ నాలుగేళ్ళ అనుభవాన్ని సంపాదించాడు.

నాగేశ్వర్రావు అల్లాగా వెంకట్రావుకంటే చదువులో కొంత ఎక్కువే చదివినా కొన్ని విషయాల్లో అతను వెంకట్రావుకు క్రిందచెయ్యే అయ్యేవాడు.

మీనాక్షమ్మకు అతనిమీద కోపంవస్తే అలిగివెళ్లి కాత్యాయినివాళ్ళ వాటాలో కూర్చునేది. బడివేళకు కంచంలోకి భోజనంరాకపోయేసరికి గత్యంతరం లేక అతను వెంకట్రావు అఫీసుగదిలోకి వెళ్ళి ఓ క్షణం మేదో మాట్లాడినట్లు మాట్లాడి "ఏమండీ కాస్త అవిడిగార్ని పిలిపించండి" అంటూ కోపం చల్లారగా మెత్తబడి అడిగేవాడు. అతను చిరునవ్వు నవ్వుతూ కాత్యాయిన్ని కేకలేశేవాడు. ఆమె తలుపుచాటున నిల్చుని అన్నగారిని కాస్త మందలించేది "చిన్నపిల్లను చేసి అకారణంగా అల్లాగా కోప్పడేస్తారా—కాస్తో కూస్తో లోపాలుండకుండానే ఉంటాయా ఏమిటి...అయినా అంత పడే వాళ్లు ఇక్కడెవ్వరేం లేరు" అనేది.

అటువంటి సమయంలో నాగేశ్వర్రావుకు మౌనమే శరణమయ్యేది.

మీనాక్షమ్మ వెనక అసరా అట్టే ఉన్న మనిషికాదు. అడపిల్లకు ఆడవాళ్లి అసరాయే ఎక్కువ కావాలి.

ఆమెకు ఇద్దరు అన్నలూ తండ్రీ ఉన్నారు కాని తల్లికానీ అప్పచెల్లెళ్ళు కానీ లేరు. మీనాక్షమ్మ పుట్టింట్లో పెద్ద ఆడదిక్కల్లా ఆమె నాయనమ్మ. ఆ ముసలావిడ ఆ కుటుంబాన్ని సరిదిద్దుకొంటూ వస్తూ కొడుకుతో ఒరేయి నేనుండగానే పిల్లలకు పెళ్ళిళ్ళు చేయరా చూసిపోతాను." అని పోరుపెట్టి తన పేరఉన్న ఎకరం పొలం అమ్మి ముందు ఆడపిల్లకూ తర్వాత ఇద్దరు మొగపిల్లలకూ పెళ్ళిళ్ళుచేసి కొడుకునూ మనుమలనూ ఆయింటి క్రొత్తకోడళ్ళనూ చూస్తూ సంతోషంగా దాటిపోయింది.

ఆవిడ ఉన్నంతకాలం వంటయింటి పనులు మరెవ్వరినీ ముట్టుకోనిచ్చేదికాదు. ఆవిడ పదిమందికి చేసి పెట్టిందే కాని తను ఒక్కరిచేత చిన్న మెత్తు చాకిరీ చేయించుకోలేదు.

"అమ్మా కాపరానికి వెళ్ళవలసిన పిల్ల దాన్ని కాస్త పని నేర్చుకోనియవే అంటే కొడుకుతో ఆ ముసలావిడ "ఏమిట్రా నేర్చుకొనేది. అక్కడికి వెళితే ఎల్లాగో వస్తుంది—ఇదేం బ్రహ్మవిద్యా—ఇప్పట్నుంచే దాన్ని బాధపెట్టడం దేనికిరా" అనేది.

అందువల్లనే మీనాక్షమ్మకు కాపరానికి వచ్చిన కొత్తరోజుల్లో అన్నీ సమస్యలుగానే కన్పించాయి.

ఊరగాయలు పెట్టుకోవడం ఎల్లాగా అన్నది ఒక సమస్య అయింది.

తనకేమో చేతకాదు. తన కెంత చేతనవునో తన సొంత వదినలకీ దాదాపు అంతే. పోనీ అత్తగార్ని పిలిపిద్దామా అంటే—అవిడ చాలా పెద్దది—అదీగాక ఇందుకోసం ప్రత్యేకంగా పిలిపిస్తే అంత బాగుండదు. మామిడికాయలు రావడం మొదలుపెట్టినప్పటినుంచీ ఆవిడ అలోచనలు ఎక్కువయ్యాయి.

ఆ సమస్యను కాత్యాయిని నిముషంలో తేల్చేసింది. "అదేమిటమ్మా వదినా! ఆ భాగ్యానికి ఇంత ఆలోచనా—అంత ఆవేదనా దేనికీ! నాలుగు డబ్బులు జాగ్రత్తపెట్టు ఇద్దరమూ కలిసి మా అమ్మ దగ్గరకుపోయి వద్దాం." అన్నది కాత్యాయిని.

తల్లికి తామిద్దరూ బయలుదేరి వస్తున్నట్లుగా ముందుగా కార్డు వ్రాసి కాత్యాయిని మీనాక్షమ్మను కొంత బలవంతపెట్టి వెంటతీసికొని పుట్టింటికి వెళ్లింది.

కాత్యాయిని తల్లి పూర్వకాలపు మనిషి. దక్షగా నిండుగా పెద్ద ముత్తైదువలా ఉంటుంది. ఆవిడ మీనాక్షమ్మను తన చిన్నకూతురిలా చూచింది. మీనాక్షమ్మ అక్కడఉన్న ఆ వారం పదిరోజులూ—తానేమో ఆ యింటికి పిల్ల అనిగాని ఆవిడ

కాత్యాయినికి మాత్రమే తల్లి అనిగానీ అనుకోలేదు. అల్లాగని ఆమెకు తోచనేలేదు.

ఆ ఉన్న పదిరోజుల్లో ఆవిడ పిల్లలిద్దరికీ రెండు సార్లు తలంట్లు పోసింది. కాటుక పెట్టింది.

వచ్చేరోజున ఇద్దర్నీ కూచోపెట్టి కాళ్లకు పసుపు వ్రాయించి క్రొత్తచీరలు పెట్టి క్రొత్తగా అత్తగారింటికి పంపించేటప్పుడుండేటంత ఆరాటం పడి పంపింది.

నాగేశ్వరరావు — మీనాక్షీ కాత్యాయినీ ఇద్దరూ అక్కా చెల్లెళ్లల్లాగా నవ్వుతూ కొత్త చీరలతో తలంట్లుపోసుకొన్న తలలతో బండిదిగి ఊరగాయిజాడీలు దింపుకొంటుండడం చూచి నిజంగా సంతోషించాడు. వెళ్ళి తెచ్చినసరుకు ఇళ్ళల్లో సర్దుకోడానికి సాయపడ్డాడు. ఆత్మీయత అంటే ఏమిటో అతని కప్పుడు పూర్తిగా అవగాహన కొచ్చింది.

వెంకట్రావు గుమ్మంలో ఎదురై తమవంతు జాడీ అందుకొంటూ "అయితే ఇంకేం చాలా లాభంగానే వచ్చారన్నమాట" అన్నాడు, నవ్వుతూ అత్తగారిసొమ్ము ఎంత అందిందో ఉజ్జాయింపుగా లెక్క వేసుకొంటూ.

తన భార్యకు తల్లిలేనిలోపం దాదాపు తీరిపోయినట్లుగా భావించి సంతోషించాడు నాగేశ్వరరావు.

మీనాక్షమ్మ ఇన్ని కనకాంబరాలుకొని ఒత్తుగా దండఅల్లి రెండుభాగాలుచేసి తానొకటి పెట్టుకొని రెండోది కాత్యాయినికిస్తే— కాత్యాయిని కావాలని అప్పటికప్పుడు బజారునుంచి గులాబీలు తెప్పించి కొన్ని మీనాక్షిజడలో ఉంచేది.

అదేమిటి కాత్యాయినీ రెండూ ఒక్కసారి దేనికే—! అవి రేపు పెట్టుకోకూడదూ అని మీనాక్షమ్మ అంటే కాత్యాయిని నవ్వుతూ "నీకు తెలియదులే అది అంతే" అనేది.

ఆ తెల్ల గులాబీలు వాలుజడల్లో చక్కగా పొంకంగా అమరి చుట్టూవున్న కనకాంబరాలకు సువాసలను అందిస్తుండేవి. అల్లాగా పూలు ధరించడం నేర్చుకొన్నాకనే మీనాక్షమ్మ కొడుకు నెత్తుకుంది.

మీనాక్షమ్మ తండ్రి కూతుర్ని పురిటికి తీసికొని వెళ్ళి కోడళ్ళ సాయంతో పురుడు పోసి తీసికొని వచ్చి దిగవిడిచి వెళ్ళాడు. పుట్టింటినుండి వచ్చినప్పటినుంచీ ఆ కుర్రవాడి సంరక్షణభారమంతా కాత్యాయినే నెత్తినేసుకొంది. 'నీకేం చేతనవునమ్మా వదినా—నీళ్ళు నేను పోస్తానుండూ' అని పిల్లవాణ్ని తీసుకొని కాళ్ళమీద పడుకోపెట్టుకొని వంటికి నూనె వత్తుగా రాసి నలుగు పెట్టి తలఅంటి నీళ్లుపోసేది.

అల్లాగా నీళ్లు పోస్తుంటే వానలో తడుస్తున్న తామరపూవులా వున్న ఆ చంటివాణ్ని బుగ్గలు సాగదీసి కాస్త ఏడిపించి ముద్దు తీర్చుకొనేది కాత్యాయిని.

నీళ్లుపోసి లోపలకు తీసికొనిపోయి నీళ్లు బాగా పొడిగా తుడిచి పౌడరద్ది ముద్దాడుతూ భర్తదగ్గిరకు తీసికొనివెళ్లి భర్తచేతికిచ్చి ఇస్త్రీ చొక్కా పట్టుకొచ్చి తొడిగి నిద్రపుచ్చేది. కాత్యాయిని ప్రక్క భాగంలోకి నాగేశ్వరరావు ఇంట్లోవున్నప్పుడు పూర్వం వెళ్లేది కాదు. మీనాక్షమ్మ ఇంట్లో చిన్న చెక్క ఉయ్యాల పడ్డాక చనువుగా వెళ్ళడం పిల్లవాణ్ని చంకనేసుకొని వెళ్ళడం పరిపాటయింది.

వారిద్దరి అన్యోన్యమూ చూచి నాగేశ్వరరావూ వెంకట్రావూ ఇద్దరూ సంతోషించారు. కాత్యాయిని ఎంత పొదుపో అంతకంటే ఎక్కువ వెంకట్రావు. "ఆ పొదుపూ ఆ జాగ్రత్తా వారిద్దరికే సరిపోయింది" అనుకొనేది మీనాక్షమ్మ. తనకు తాను అనుకోడమే కాక భర్తతో ఆమాటే అంటూ అతన్నికూడా పొదుపుగా వాడమని చెప్పేది.

అతను ప్రొద్దుట ఇంట్లో కాఫీ త్రాగి పదింటికల్లా భోజనం చేసివెళ్ళినా మధ్యాహ్నం రెండింటికి ఇంటికి వచ్చేలోగా మరొకసారి కాఫీ త్రాగేస్తాడు. సాయంకాలం సరాసరి ఇంటికి రాక స్నేహితులతో కలిసి షికారుపోయి కృష్ణా కాఫీభవనంలో హాజరు వేయించుకొని అనుకోకుండానే పావలా అర్థా ఖర్చు చేసుకొంటూ వుంటాడు రోజూ. కాత్యాయిని ఇది కనిపెట్టి మీనాక్షమ్మచేత చెప్పించేది.

చివరకు నెలకో పదో పదిహేనో తక్కువవడం లేదా అని ఒక ప్రక్కన మీనాక్షమ్మ లెక్కవేసి చెబుతున్నా "ఆ ఫరవాలేదులే పావలా అర్ధకూ ఏమిటి" అనేవాడు. ఆమె ఏదో సలహా చెప్పవస్తే విసుక్కునేవాడు. ఆ విషయాల్లోనేకాక ఇంకా కొన్ని యితరవిషయాల్లో కూడా వాళ్లిద్దరూ వివాదపడేవారు.

'ఏమిటండీ యింకా వ్రాస్తున్నారూ' అంటే అచ్చే ఇదే— ఈ ఒక్క పద్యం పూర్తిచేసి ఆపేస్తాను అనే వాడు.

అల్లా అతను ప్రొద్దుపోయేదాకా ఉండి ఆలస్యంగా నిద్రలేచేవాడు. అటు కాత్యాయిని తూర్పు తెలతెలవారకముందే లేచి అంట్లగిన్నెలు చప్పుడు చేస్తూ అవి దొడ్లో వేసేది. మరో కాసేపట్లో పని

మనిషి వచ్చి కేక వేసేది. మీనాక్షమ్మ వెళ్లి లేచి కాత్యాయినితోపాటు ముగ్గులు వేసేది వీధి గుమ్మం ముందు. పనిమనిషి వాకిలి చిమ్మి నీళ్ళుచల్లి వెళితే వారు ఇద్దరూ చక్కగా ముగ్గులు వేసేవారు. వెంకట్రావు కూడా అరింటికల్లా స్నానాదికాలు పూర్తి చేసుకొని ఎన్నడూ తరిగిపోని తాలూకా ఆఫీసు కాగితాలు ముందేసుకొని కూర్చునేవాడు.

అప్పటికీ తన భర్త నిద్రలేవకపోవడం చూచి కొంచెం కోపగించుకునేది మీనాక్షమ్మ. ఆ విషయంలో కూడా వారిద్దరూ వివాదపడేవారు.

ఆమె మొదట మెల్లగా చెప్పేది. అతను 'ఊఁ పోదూ ఫరవాలేదు లే' అనేవాడు. ఆమె కాస్త ఘట్టిగా చెప్పేది. అతనికి కోపం వచ్చేది. కోపంగా చురచురా చూసేవాడు. ఆమె రోషపడేది. వాదించేది. కొంచెం ఘాటైన వాదోపవాదాలు జరిగేవి. నీళ్లు తిరుగుతున్న కళ్ళతో మీనాక్షమ్మ మూతి బిగించుకొని చరచరా ప్రక్కవాటాలోకి పోయి కాత్యాయిని ప్రక్క చేరేది. మీనాక్షమ్మ అట్టే చదువుకొన్న పిల్ల కాదు. భాగ్యవంతుల పిల్లా కాదు. అందువల్లనే ఆమె పెళ్లిలో నాగేశ్వరరావుకు చెప్పుకోదగ్గ కట్నాలూ కానుకలూ ముట్టలేదు. కేవలం ఆమె అందం చూసీ కుటుంబం మంచిచెడ్డలు చూసీ నాగేశ్వరరావు తండ్రి ఆమెను తన కోడలుగా చేసుకొన్నారు. నాగేశ్వరరావు అందుకు సంతోషించాడు. ఎప్పుడైనా మాటల సందడిలో — అందులోనూ మీనాక్షమ్మ తనమీద అలిగివెళ్ళి ప్రక్కవాటాలోకి పోయి కూర్చునప్పుడు— కాత్యాయిని ఆమెను వెనకేసుకొచ్చినప్పుడు, నాగేశ్వరరావు మీవాళ్ళు నాకేం వేలూ వందలూ కట్నాలు పొయ్యలేదులే" అనేవాడు.

ఆమాటకు మీనాక్షమ్మ మరింత కోపపడేది. "కావాలని పదిసార్లు ఏదో వంకపెట్టుకొని వచ్చి చూసి చేసుకొన్నారుగా — ఇప్పుడు మరి దెప్పడం దేనికీ ఆడబడుచుల్లాగా" అనేది. ఆమె అనడం ఆపగానే కాత్యాయిని అందుకొని "పోనీండి అన్నగారూ— ఆ వెంకయ్యగారి అమ్మాయిని మీ కిస్తామన్నారటగా అయిదువేలు కట్నం ఇచ్చి — చేసుకోకపొయ్యారూ చక్కగా నల్లగా పోలేరమ్మలా వుండేది" అనేది. ఆ సంబంధం వచ్చిన సంగతి మీనాక్షమ్మ కాత్యాయినితో చాలాసార్లు చెప్పింది. కాత్యాయిని ఆమాట అని మీనాక్షమ్మతో చిరునవ్వులు నవ్వేది.

"అన్నగారిని వెనకేసుకొని రావడంపోయి ఎంత సేపూ వదినగారిపక్షమే పలుకుతావే!" అని వెళ్ళిపోయేవాడతను.

ఇహ ఆరోజు సాయంకాలం కాత్యాయిని ఆమెను అనేకవిధాల అలంకరించి కాటుకపెట్టి తిలకం దిద్ది పిల్లవాణ్ని నిద్రపుచ్చి ఆయనగారు వచ్చాక తన భాగంలోకి వెళ్ళిపోయేది.

అతను రాత్రిపూట భోజనం పూర్తిచేసి ముందున్న హాల్లోకి వచ్చి టేబిలుముందు కూర్చుని ఏపుస్తకమో చదువుతున్నట్లో ఏదో వ్రాసుకొంటున్నట్లో—ఏమో ఆలోచిస్తున్నట్లో నటించేవాడు.

ఒకొక్కరోజున ఆ నటన నిజంగా నటనే అయ్యేది. మరోరోజున అంతలో అందులో మునిగి పొయ్యేవాడు.

అల్లాంటిసమయాల్లో వారొకసారి సత్యభామా కృష్ణులయ్యేవారు. వేరొకసారి సుగాత్రీశాలీను లయ్యేవారు.

ఏమండీ ఆ పుస్తకాలు చదవకపోతే నేం ఇంత ప్రొద్దుపోయి...అదేదో రేపు వ్రాసుకోకూడదూ?" అనేది మీనాక్షమ్మ అమాయికంగా.

పెద్ద విద్యుద్దీపకాంతిలో ఆవిడకు నిద్రరాదు. అతని కేమో ఆ ధోరణిలో పడితే నిద్ర ముంచుకొని వచ్చేదాకా చదువుతూ కూర్చుంటే తప్ప నిద్ర పట్టదు.

"కుర్రాడికి అత్తగారాబాలు ఎక్కువయ్యాయి" అని కొంచెం ఎత్తిపొడిచేవాడు వెంకట్రావు.

ప్రొద్దుటపూట అత్త అత్త అంటూ వాడు తప్పటడుగులు వేస్తూ ప్రక్కభాగంలోకి పోయి వాళ్లింట్లోవున్న చిన్నకప్పులో పడితే నేగాని పాలు త్రాగేవాడు కాదు. వెంకట్రావు ఆ కుర్రాణ్ని కొంచెం భయపెట్టేవాడు. మీనాక్షమ్మ వాడు దేనికైనా మంకుతనం పోతే 'అడుగో అడుగో మీ మామయ్య వస్తున్నారులే" అనేది. దాంతో వాడు గప్‌చిప్.

అల్లాగా వారిద్దరి కాపరాలు అన్యోన్యంగా అక్కచెల్లెళ్ళ కుటుంబాల్లాగా నడిచాయి ఆ నాలుగేళ్ళూ.

ఆ రెండు భాగాల్లోనూ పాలు వాడికగా పోసే గొల్లది ఈమధ్య "అచ్చే వాళ్ళిద్దరూ అప్పచెల్లెళ్ళ నమ్మా—మనతో ఊరికేనే అల్లా అంటారు" అనడం మొదలు పెట్టింది.

ఆ వాడ వాడంతా అల్లాగే అనుకొన్నారు. ఆమాట నిజానికి అబద్ధమే అయినా—అది అబద్ధం అని ఎవ్వరూ అనుకొనేవారు కాదు. అసలు కాత్యాయినీ మీనాక్షమ్మావాళ్లే అనుకొనేవారు కారు.

ఇంతలో వెంకట్రావుకు రెవెన్యూ ఇనస్పెక్టరు పనిఅయింది. అతన్ని ఆఊరినుండి బదిలీ చేశారు. బదిలీ చేయించుకోడానికి వెంకట్రావు కొంత ప్రయత్నం చేశాడని మీనాక్షమ్మకు అనుమానం.

"అబ్బే అదికాదమ్మా వదినా—వాళ్లే బదిలీ చేశారటమ్మా" — అని కాత్యాయిని నాల్గుసార్లు నమ్మకంగా చెప్పినా మీనాక్షమ్మ కా అనుమానం పోలేదు.

ఆవిడ అనుమానం ఎల్లావున్నా బదిలీ అయ్యాక కాత్యాయినివాళ్ళు తమ భాగం ఖాళీచేసి వెళ్ళక తప్పిందికాదు.

మీనాక్షమ్మకు చాలా కష్టంవేసింది. నిజంగా కళ్లనీళ్ళ పర్యంతం అయింది. కాత్యాయిని మెల్లగా చెప్పి ఓదార్చింది.

"మళ్ళీ కొన్నాళ్లు పోయాక వీలయితే ఇక్కడికే బదిలీ చేయించుకొంటాము లేవమ్మా వదినా" అని మరీ మరీ చెప్పి వెళ్ళింది కాత్యాయిని పిల్లవాణ్ని పదిసార్లు ముద్దాడి తల్లి చేతికిస్తూ.

వాళ్లు వెళ్లాక నెలరోజులదాకా ఆ వాటా ఖాళీగానే ఉంది. నెల తర్వాత ఆ భాగంలోకి ఒక తహసీల్దారుగారు వచ్చి చేరారు. ఆయనలా వచ్చి చేరిన మరుసటిరోజునుంచే ఆ డాబాలో కొన్ని మార్పులు రావడం మొదలుపెట్టాయి.

వారం తర్వాత కొన్ని ఏర్పాట్లు చేశారు తహసీల్దారుగారు.

అంతకుముందే పంపకాల్లో పోట్లాడుకొని కోర్టు వారి తీర్పు వచ్చిన మరుసటిరోజునే — ఇల్లంతా అడ్డంగా నిలువుగా తడికలూ గోడలూ పెట్టుకొన్న అన్నదమ్ముల భాగాల్లాగా కన్పించాయి ఆ రెండు భాగాలున్నూ. ముందున్న పంచపాళీలో సగంలో తడిక పెట్టుకోడం చూచి నాగేశ్వర్రావు కష్టపడితే వెనక డాబాకూ వంటగదికీ మధ్యఉన్న కాస్త ఖాళీ స్థలంలోనూ తడిక పెట్టుకోవడం చూచి మీనాక్షమ్మ కష్టపడింది. అట్టే పెద్ద ఉపయోగం లేకపోయినా ముందున్న పంచపాళీ పూర్వం చక్కగా విశ్రాంతిగా విశాలంగా కన్పించేది. ఇప్పుడు మరోలా కన్పించేసరికి అతనికి కష్టమనిపించింది.

వెనుక ఖాళీస్థలంలో పిల్లవాడు విశ్రాంతిగా ఆడుకొనేవాడు. ఇప్పుడు ఆ స్థలం తగ్గి ఇరుకు అయినట్లుగా అనుకొని మీనాక్షమ్మ కష్టపడింది.

జరగవలసిన ఏర్పాట్లన్నీ జరిగాక ఆ భాగంలోకి ఆడవారు బండెడు సామానుతో దిగారు. ఆ వచ్చినావిడ ఒకత్తే వచ్చినా పదిమంది దిగినంత అట్టహాసం చేసింది. ఆ తాసీలుదారుగారిభార్య సామాను సర్దించి వంటమనిషి వడ్డిస్తే ఆపూట క్రొత్తభాగంలో తొలిసారిగా భోజనం చేసింది. వంటమనిషి పన్నెండింటికి పని పూర్తిచేసికొని యింటికి పోతూ మీనాక్షమ్మవాళ్ల గుమ్మంలో ఓ క్షణం నిలబడి కొంత భోగట్టా చేసి వెళ్ళింది. వారి భోగట్టాకూడా కొంత వినిపించి వెళ్లింది.

మరునాడు మీనాక్షమ్మ వంటయింటి వెనుక గుమ్మంలో నిలబడి పిల్లవాడికి అన్నం పెడుతుండగా తాసీలుదారుగారిభార్య కన్పించింది పెరట్లో.

పెరట్లో చెప్పులు వేసుకొని తిరగడం మీనాక్షమ్మకు చాలా క్రొత్త అనిపించింది. ఆమె పెట్టుకొన్న కళ్లజోడు ఆమెకు అందాన్నివ్వకపోయినా, దర్జానిస్తున్నాయనుకొంది. ఇంట్లో ఉన్నప్పుడు కూడా అంత ఖరీదైన చీర కట్టిందేమా అని కొంత ఆశ్చర్యపడ్డది.

ఆవిణ్ని చూపిస్తూ "ఎవలమ్మా — వాల్లు — మన కొచత్తాయివాల్లు మల్లా ఎప్పులొత్తాలూ?" అని అడిగాడు మీనాక్షమ్మకొడుకు.

ఆమాటలు కొన్ని విన్నదో ఏమో ఆవిడ మీనాక్షమ్మ నిల్చున్న గుమ్మంవైపువచ్చి కొంత దూరంలో నిలబడి "ఏమిటంటాడూ మీఅబ్బాయ్"అని అడిగింది.

వచ్చి రెండు రోజులయినా కొత్త ప్రక్క వాళ్లని పల్కరించాలన్నా అనుకోని ఆవిడకు వెంటనే సమాధానం చెప్పడానికి మీనాక్షమ్మకు అట్టే మనస్కరించలేదు.

అందువల్లనే ఓ క్షణమాగి "ఏంలేదులెండి— మొన్నటిదాకా మీ వాటాలో మావాళ్ళే ఉండి వెళ్ళారు—ఆవిషయమే అడిగాడు" అని తేల్చేసింది.

ఆవిడ "అహా అల్లాగా" అని లోపలకు వెళ్ళిపోయింది.

ఆవిడ అల్లా వెళుతుంటే చూచి "ఈవిడ అట్టే వయస్సులో పెద్దదికాదే. అవును కాత్యాయినికంటే ఓ రెండేళ్లు పెద్దయితే కావచ్చు—కాని ఆయన్ని చూస్తే...బహుశా రెండో..." పోద్దూ మనకెందుకు అని అనుకొని కొడుకునోట్లో మళ్లా అన్నంముద్ద పెట్టింది.

ఆవిడకు పిల్లల్లేరని వచ్చిననాడే గ్రహించింది మీనాక్షమ్మ.

ఆవిడగారు పెంచుకొంటున్న పొట్టికుక్క వల్ల ఏం ఇబ్బంది రాబోతోందో అని మొదటే భయపడ్డాడు నాగేశ్వర్రావు.

ఆ కుక్క రాత్రిళ్లు మధ్య మధ్య లేచి పెద్దగా మొరగడం మొదలుపెట్టింది. తాను వెళ్లి దాన్ని అటు

ఇంతలో వెంకట్రావుకు రెవెన్యూ ఇనస్పెక్టరు పనిఅయింది. అతన్ని ఆ ఊరినుండి బదిలీ చేశారు. బదిలీ చేయించుకోడానికి వెంకట్రావు కొంత ప్రయత్నం చేశాడని మీనాక్షమ్మకు అనుమానం.

"అబ్బే అదికాదమ్మా వదినా—వాళ్ళే బదిలీ చేశారటమ్మా" — అని కాత్యాయిని నాల్గుసార్లు నమ్మకంగా చెప్పినా మీనాక్షమ్మ కా అనుమానం పోలేదు.

ఆవిడ అనుమానం ఎల్లావున్నా బదిలీ అయ్యాక కాత్యాయినివాళ్ళు తమ భాగం ఖాళీచేసి వెళ్ళక తప్పిందికాదు.

మీనాక్షమ్మకు చాలా కష్టంవేసింది. నిజంగా కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. కాత్యాయిని మెల్లగా చెప్పి ఓదార్చింది.

"మళ్ళీ కొన్నాళ్లు పోయాక వీలయితే ఇక్కడికే బదిలీ చేయించుకొంటాము లేవమ్మా వదినా" అని మరీ మరీ చెప్పి వెళ్ళింది కాత్యాయిని పిల్లవాణ్ని పదిసార్లు ముద్దాడి తల్లి చేతికిస్తూ.

వాళ్లు వెళ్లాక నెలరోజులదాకా ఆ వాటా ఖాళీగానే ఉంది. నెల తర్వాత ఆ భాగంలోకి ఒక తహసీల్దారుగారు వచ్చి చేరారు. ఆయన వలా వచ్చి చేరిన మరుసటిరోజునుంచే ఆ డాబాలో కొన్ని మార్పులు రావడం మొదలుపెట్టాయి.

వారం తర్వాత కొన్ని ఏర్పాట్లు చేశారు తహసీల్దారుగారు.

అంతకుముందే పంపకాల్లో పోట్లాడుకొని కోర్టువారి తీర్పు వచ్చిన మరుసటిరోజునే — ఇల్లంతా అడ్డంగా నిలువుగా తడికలూ గోడలూ పెట్టుకొన్న అన్నదమ్ముల భాగాల్లాగా కన్పించాయి ఆ రెండు భాగాలున్నూ. ముందున్న పంచపాళీలో సగంలో తడిక పెట్టుకోడం చూచి నాగేశ్వర్రావు కష్టపడితే వెనక డాబాకూ వంటగదికీ మధ్యఉన్న కొత్త ఖాళీ స్థలంలోనూ తడిక పెట్టుకోవడం చూచి మీనాక్షమ్మ కష్టపడింది. అట్టే పెద్ద ఉపయోగం లేకపోయినా ముందున్న పంచపాళీ పూర్వం చక్కగా విశ్రాంతిగా విశాలంగా కన్పించేది. ఇప్పుడు మరోలా కన్పించేసరికి అతనికి కష్టమనిపించింది.

వెనుక ఖాళీస్థలంలో పిల్లవాడు విశ్రాంతిగా ఆడుకొనేవాడు. ఇప్పుడు ఆ స్థలం తగ్గి ఇరుకు అయినట్లుగా అనుకొని మీనాక్షమ్మ కష్టపడింది.

జరగవలసిన ఏర్పాట్లన్నీ జరిగాక ఆ భాగంలోకి ఆడవారు బండెడు సామానుతో దిగారు. ఆ వచ్చినావిడ ఒకత్తే వచ్చినా పదిమంది దిగినంత అట్టహాసం చేసింది. ఆ తాసీలుదారుగారిభార్య సామాను సర్దించి వంటమనిషి వడ్డిస్తే ఆపూట క్రొత్తభాగంలో తొలిసారిగా భోజనం చేసింది. వంటమనిషి పన్నెండింటికి పని పూర్తిచేసికొని యింటికి పోతూ మీనాక్షమ్మవాళ్ల గుమ్మంలో ఓ క్షణం నిలబడి కొంత భోగట్టాచేసి వెళ్ళింది. వారి భోగట్టాకూడా కొంత వినిపించి వెళ్లింది.

మరునాడు మీనాక్షమ్మ వంటయింటి వెనుక గుమ్మంలో నిలబడి పిల్లవాడికి అన్నం పెడుతుండగా తాహసీలుదారుగారిభార్య కన్పించింది పెరట్లో.

పెరట్లో చెప్పులు వేసుకొని తిరగడం మీనాక్షమ్మకు చాలా క్రొత్త అనిపించింది. ఆమె పెట్టుకొన్న కళ్లజోడు ఆమెకు అందాన్నివ్వకపోయినా, దర్జానిస్తున్నాయనుకొంది. ఇంట్లో ఉన్నప్పుడు కూడా అంత ఖరీదైన చీర కట్టిందేమా అని కొంత ఆశ్చర్యపడ్డది.

ఆవిణ్ని చూపిస్తూ "ఎవలమ్మా — వాల్లు — మన కాచత్తాయివాల్లు మల్లా ఎప్పులొత్తాలూ?" అని అడిగాడు మీనాక్షమ్మకొడుకు.

ఆమాటలు కొన్ని విన్నదో ఏమో ఆవిడ మీనాక్షమ్మ నిల్చున్న గుమ్మంవైపువచ్చి కొంత దూరంలో నిలబడి "ఏమిటంటాడూ మీఅబ్బాయ్"అని అడిగింది.

వచ్చి రెండు రోజులయినా కొత్త ప్రక్కవాళ్లని పల్కరించాలన్నా అనుకోని ఆవిడకు వెంటనే సమాధానం చెప్పడానికి మీనాక్షమ్మకు అట్టే మనస్కరించలేదు.

అందువల్లనే ఓ క్షణమాగి "ఏంలేదులెండి— మొన్నటిదాకా మీ వాటాలో మావాళ్లే ఉండి వెళ్ళారు—ఆవిషయమే అడిగాడు" అని తేల్చేసింది.

ఆవిడ "అహ అల్లాగా" అని లోపలకు వెళ్ళిపోయింది.

ఆవిడ అల్లా వెళుతుంటే చూచి "ఈవిడ అట్టే వయస్సులో పెద్దదికాదే. అవును కాత్యాయినికంటే ఓ రెండేళ్లు పెద్దయితే కావచ్చు—కాని ఆయన్ని చూస్తే...బహుశా రెండో..." పోద్దూ మనకెందుకు అని అనుకొని కొడుకునోట్లో మళ్లా అన్నంముద్ద పెట్టింది.

ఆవిడకు పిల్లల్లేరని వచ్చినవాడే గ్రహించింది మీనాక్షమ్మ.

ఆవిడగారు పెంచుకొంటున్న పొట్టికుక్క వల్ల ఏం ఇబ్బంది రాబోతోందో అని మొదటే భయపడ్డాడు నాగేశ్వర్రావు.

ఆ కుక్క రాత్రిళ్లు మధ్య మధ్య లేచి పెద్దగా మొరగడం మొదలుపెట్టింది. తాను వెళ్లి దాన్ని అటు

దొడ్లోనో కాళీపోతే తమ వంటగదిదగ్గరో కట్టివేసుకోమని వెళ్ళి చెప్పివస్తానంటే మీనాక్షమ్మ వద్దని భర్తను వారించింది.

తాసీలుదారిగారి భార్య ఆ భాగంలోకి వచ్చిన నెలలోపలనే ఆ రెండు వాటాల ఆడవారికీ ఒక చిన్న తగాదా కూడా వచ్చింది.

మీనాక్షమ్మ కొడుకు తడిక ప్రక్కగా వంట గదిదగ్గర పాడుచేశాడు. ఆ నీళ్లు వాళ్లభాగంలోకి పోయాయి. అది అవతలవైపునుండి గమనించిన తాసీలుదారిగారి భార్య తన వంటమనిషిచేత కబురంపించింది.

మీనాక్షమ్మకు కోపంవచ్చింది. కొడుకును పిఱ్ఱమీద ఒక్కటి అంటించి చరచరా వారి వంట యింట్లోంచి అవతలవైపుకు వెళ్లి మాట్లాడకుండా తడి గుడ్డతో తుడిచి వచ్చింది.

మీనాక్షమ్మ అల్లా తుడుస్తున్నప్పుడు దూరంగా నిలబడి ఆవిడ "ఆ మీరు తుడవక్కర్లేదు లెండి—మా వంటావిడ తుడుస్తుంది. ఊరికే చెప్పాను" అన్నది కొంచెం హుందాతనం ఒలకపోస్తూ.

మీనాక్షమ్మకు ఒళ్లుమండింది. అయినా ఒక్క మాటైనా అనకుండా వచ్చేసింది. హాల్లోకి పోయి మూలకూర్చుని అలిగి ఏడుస్తున్న కొడుకు నెత్తుకొని సముదాయించింది.

అప్పటికీ ఆవిడకు కోపం తగ్గలేదు. ఆ కోపం రాత్రి భర్తవచ్చి "ఏం అంత కోపంగా వున్నావ్" అని పరామర్శ చేసేదాకా ఏ కొంచెమూ తగ్గలేదు.

అతను అడిగీ అడగడంతోటే రోషంగా విషయమంతా చెప్పి "ఎంత తాసీలుదారిగారి భార్య అయితే మట్టుకూ అల్లా కబురుచేస్తుందా—పసివాడు తెలియక చేస్తే" అన్నది.

అయినా నువ్వు వెళ్లి తుడిచిరావలసిన అగత్యం ఏం పట్టింది!" అన్నాడతను.

"అవును. కావాలనే వెళ్లాను" అన్నది మీనాక్షమ్మ. అతను మరోక్షణమయ్యాక "పోనీయ్— పోనీయ్ — అంతటితో పోనిచ్చేసెయ్. ఇరుగు పొరుగు వారితో తగూ పెట్టుకోవడం బాగుండదు." అన్నాడతను.

ఇది మరీ బాగుంది- నేనా తగూ పెట్టుకొంది - వాళ్ళ దర్జాలంటే వాళ్ళకే ఉంటాయ్—ఈ కాస్త విషయానికి తగూ తెచ్చింది ఆవిడా నేనా" అని రోషంగా అడిగింది మీనాక్షమ్మ. "అబ్బ పోనిద్దూ" అన్నాడతను.

ఆమె ఆ పూట అంతా అలిగి పడుకొన్నది. ఆమె అభిమానం దెబ్బతిన్నదని అతనికి తేలిగ్గానే అర్థమైంది.

ప్రక్క వాటా ఆవిడచేసిన పని చాలా అనుచితమూ అన్యాయమూ అయినా ఏమీ అనడానికి వీల్లేదు కనుక అతను ఊరుకున్నాడు.

ఆ కోపంతో మీనాక్షమ్మ ప్రక్క వాటా వైపు ఒక్కసారైనా చూడనైనా చూడలేదు మరి మూడు నెలలదాకా.

తాసీలుదారిగారి భార్య తాను చేసినపని పొరపాటనీ ఆ విషయం మెల్లగా ఆవిడకు చెబుదామనీ అనుకొంటూవుండగా మరో చిన్న సంఘటన జరిగింది.

ఆవిడగారు పెంచుకొంటున్న పొట్టికుక్క ముందువరండాలో తడిక ప్రక్కన కూర్చున్నప్పుడు పూర్వం జరిగిన పొరపాటే జరిగింది. మీనాక్షమ్మ వాళ్ల వరండా అంతా ఆ నీళ్ళు పచ్చగా ప్రాకాయి. కొంత వాసనకూడా వచ్చింది. అది చూడగానే మీనాక్షమ్మలో ఇన్నాళ్ళూ అణగివున్న కోపం రోషం మళ్లీ రగులుకొన్నాయి.

మీనాక్షమ్మ ముందు వరండాలో నిలబడి ఆవిణ్ని కేక వేసింది. ఆవిడ తడిక చివరకు వచ్చి ఒయ్యారంగా నిలబడి 'ఏమిటండీ' అన్నది మెల్లగా.

తాసీలుదారిగారిభార్య మనస్సులో తాననుకొంటున్న విషయం చెప్పేయడానికి మంచి అవకాశం వచ్చిందికదా అని అనుకొన్నది.

అల్లా అనుకొనే ఆవిడ కొంత సౌమ్యంగా చూచింది.

మీనాక్షమ్మ అవేమీ గమనించకుండా రోషంతో "ఇటు చూడండి—మా వరండా అంతా ఖరాబయిపోయింది" అన్నది కోపంగా.

అవునండీ — పాడుకుక్క — పొరపాటే అయింది. మా వంటావిడ సాయంకాలం వస్తుంది— రాంగానే కడిగిస్తాను" అన్నదావిడ తాపీగా.

ఆవిడ అల్లా తాపీగా మాట్లాడటం మీనాక్షమ్మకు మరింత రోషం కలిగించింది. ఆవిడ నిర్లక్ష్యంగా అన్నట్లు తోచింది.

అయితే ఆవిడ వచ్చేదాకా ఇల్లాగే పెట్టుకు కూర్చోమంటారా...?

పోనీ నన్నేంచెయ్యమంటారూ!

"ఏంచేస్తారా—వచ్చి కడగండి" అన్నది దురుసుగా మీనాక్షమ్మ.

'షటప్' అన్నదావిడ.

"ఆ ఏడ్చేదేదో సరిగ్గా ఏడవ్వండి. ఏదో మాటలు పేలుతున్నారే!" అన్నది కోపంగా మీనాక్షమ్మ ఆవిడ అన్నమాట ఏదో తిట్టు అనుకొని.

వారిద్దరూ మాటలు మార్చుకొన్నారు.

మాటామాటా అనుకొన్నారు. రెండునిముషాలు పొయ్యాక ఆవిడ వినిపించుకోకుండా జరీచీర కొంగు సర్దుకొంటూ లోపలకువెళ్లి తలుపు వేసుకొంది.

మీనాక్షమ్మ అక్కడే చాలాసేపు నిలబడి చూస్తూ ఉండిపోయింది. రాత్రి భర్త రాగానే విషయమంతా చెప్పి ఆవిడ అన్నమాటకు అర్థం చెప్పమని అడిగింది.

ఏంలేదు శే — ఊరుకోండీ — అని అర్థం. అన్నాడు నాగేశ్వరరావు ఒక్క క్షణం ఆలోచించి వాళ్ళిద్దరికీ కలహం పెంచకుండా ఉండే తీరు ఆలోచిస్తూ. ఒసేయ్ — ఇహ నువ్వు ఊరుకో, కాస్త ఆ విషయం మర్చిపో — రేపు నే వాయనతో చెప్పి సర్దేస్తాను" అన్నాడతను.

ఆవిడ కాలేజీచదువు కొంత వెలగబెట్టిందని అతనికి తెలుసు. సగం సగం చదువులు చదివిన ఆడవాళ్లు కొందరు ఇల్లాగే ప్రవర్తిస్తుంటారనీ అతనికి తెలుసు.

అందుకే మనస్సులో విసుక్కొన్నాడు. భార్యకు జరిగిన పరాభవానికి అతనికి కష్టం కలిగింది. "పోనీ నువ్వైనా దేనికి చెప్పూ — తగూ పెంచుకోవడం — మన పనిమనిషి చేత కడిగించివేస్తే పొయ్యేదిగా" అన్నాడు నాగేశ్వరరావు. ఆ మాటకు మీనాక్షమ్మకు కోపంవచ్చింది; ఆవిణ్ని వెనకేసుకొస్తున్నట్లుగా అనిపించింది. మరింత కోపపడి "అవును నేనంత తక్కువదాన్ని నేగా — మీరు పడి ఊరుకోమనడం — నే నేం పడను. పోనీ ఆవిడగారు అంతకు ముందు ఆపనే చేస్తే బాగుండీ!" అన్నది.

"ఇద్దరు చేసినపనులూ బాగుండలేదు." అన్నాడు నాగేశ్వరరావు.

ఆమె మళ్లా అలిగింది. నాగేశ్వరరావుకు చిక్కు సమస్యే వచ్చింది.

భోజనాలయ్యాక ఆపూట అతను ఆమెను కాస్త ఓదార్చి పిల్లవాణ్ని ఎత్తుకొని రెండో ఆటకు సినిమాకు తీసికొని వెళ్లాడు.

ఆ చంద్రికారాత్రి ఆమె అతనితో అల్లా వెళ్లి తిరిగివచ్చాక — ఆమె మనస్సులోని కోపం కొంత తగ్గింది. మరునాడు ఉదయంపూట నాగేశ్వరరావు ప్రక్క వాటా వారి గుమ్మందగ్గరకు వెళ్లాడు గుమ్మానికి గుడ్డతెర ఒకటి పల్చనిది వ్రేలాడుతూ వున్నది.

లోపల ఆయన తన బల్లముందు కూర్చుని ఏదో వ్రాసుకొంటున్నారు.

అతనక్కడ ఒక్క క్షణం నిలబడ్డాడు.

ప్రక్క వాటావారి లోపాలన్నీ ఒకటొకటే ఎవరో ఎత్తి చూపించినట్లుగా కన్పించడం మొదలు పెట్టాయి.

వారా కుక్కను ఆఫీసుగదిలో వదిలిపెట్టి తలుపు వేస్తారు. అది రాత్రిళ్ళు ఒకటే మొరుగుడు. తన కొన్నిసార్లు చదువుకొంటున్నప్పుడూ వ్రాసుకొంటున్నప్పుడూ ఇబ్బంది కలిగింది.

వారు రేడియో పెట్టుకోవడం తప్పుకాదు గాని ప్రక్కవాళ్ళకు బాధాకరంగా మ్రోగించడం బాగుండలేదు.

అవన్నీ అల్లా ఉండగా ఆవిడగారి ప్రవర్తన చాలా అవమానకరంగా ఉన్నది.

ఆ చివరి ఆలోచనతో అతను ముందుకు అడుగు వేశాడు.

ఆయన నాగేశ్వరరావును చాలా గౌరవించారు. అతిసౌమ్యంగా మాటాడారు.

"మీరు కవిత్వమదీ వ్రాస్తారటగదా" అని అడిగారు.

అన్ని అడిగాక నాగేశ్వరరావు కోపం తగ్గిపోయింది. అతను చిరునవ్వునవ్వి ఊరుకొన్నాడు. చివరకు ధైర్యంచేసి తను చెప్పదల్చుకొన్నది నాల్గు ముక్కల్లో చెప్పేసి "చూడండీ మనం ఇరుగుపొరుగున ఉన్నాము. కాస్త కలిసి మెలిసి ఉంటే నాకు మనస్సు ప్రశాంతంగా ఉంటుంది" అన్నాడు.

వారు మెల్లగా "అవునండీ నాకూ అదే ఆశయం కాని చదువుకొన్నదైనా దానికి అది తెలియదు. అయినా నేను చెప్పి సర్దేస్తాను. ఈసారికి మీరు క్షమించండి" అన్నారు.

ఆయన అంతమాట అనేసరికి నాగేశ్వరరావు తను ఆవిషయం వారితో ఫిర్యాదుచెయ్యకుండా వుంటే బాగుండేది అనుకొన్నాడు.

వారిద్దరూ అన్యోన్యంగా మాట్లాడుకొన్నారు కొంతసేపు. ఇద్దరు విద్యావంతులు తమ తమ భార్యల లోపాలనూ మనస్తత్వాలనూ తమ కుండవలసిన సభ్యతలనూ బాగా ఎరిగివున్న వాళ్లలాగా ప్రవర్తించారు. ఒకరికొకరు నమస్కారాలు చేసుకొని శెలవు పుచ్చుకోవడాలతో వారిద్దరి హృదయాలూ తేలికయ్యాయి.

అతను నెమ్మదిగా బయటకు వచ్చి నిలబడ్డాడు. అంతలో యింటిముందు బండీ ఒకటి వచ్చి ఆగింది.

మీనాక్షమ్మ లోపలనుంచి గబగబా వచ్చి గుమ్మంలో నిలబడింది ఎవరా వచ్చింది అని ఆత్రంగా చూస్తూ.

బండిలోంచి నలభైఏళ్ళ ముత్తైదువ దిగుతూనే మీనాక్షమ్మను చూచి ఆమె దగ్గరకు వచ్చి "ఇక్కడ మా అమ్మాయి వాళ్లున్నారామ్మా ఈ భాగంలో" అని అడిగింది.

ఆవిడ ఒకవేళ కాత్యాయినికి పినతల్లేమో నని భ్రమపడుతూ మీనాక్షమ్మ ఎవరండీ అని అడిగింది.

అదేవమ్మా—మా అల్లుడు ఏదో తాసీలుదారు ఉద్యోగం చేస్తున్నాడు—వాళ్లు ఏ భాగంలో ఉంటా" అని అడిగింది.

"అహో—అల్లాగా. అయితే ప్రక్కభాగంలోకి వెళ్లండి" అని నిరుత్సాహపడి మీనాక్షమ్మ చరచరా లోపలకు వెళ్ళింది.

వారి వరండాలోనే నిలబడివున్న నాగేశ్వరావు వారిని కేకవేసి చెప్పాడు.

ఆవిడ లోపలకు వెళ్లింది. వెళ్లి కూతుర్ని పరామర్శించింది. నాగేశ్వరావు తన భాగంలోకి వచ్చి భార్యవంక గర్వంగా చిరునవ్వుతో చూచాడు.

కూతురికీ అల్లుడికీ ఆపూట ఆవిడే వడ్డించింది. తాసీలుదారిగారి భార్య తల్లి రాకకు లోపల సంతోషించినా అంతకుముందే కలిగిన మనఃక్లేశాన్ని కప్పిపుచ్చుకోలేకపోయింది. అందుకే మనసు విప్పి మాటాడలేక మౌనం వహించింది.

భోజనాలప్పుడు తాసీలుదారు తన భార్యను గురించి అత్తగారితో ఫిర్యాదుచేశాడు.

పూర్వం తాసీలుదారు ఉద్యోగమంటే పెద్ద ఘనమైన ఉద్యోగంగా ఎంచబడేది. ఆ ఉద్యోగస్థులూ అల్లాగే అనుకొనేవారు. కాని అన్నిరకాల కంట్రోల్సూ రేషనింగులూ వచ్చాక అది మామూలు ఉద్యోగమయిపోయింది.

వీరు రేషనింగ్ తాసీలుదారు. అందువల్లనే వారు తన ఉద్యోగం చూచుకొని ఎన్నడూ గర్వపడలేదు.

అల్లుడి ఫిర్యాదు విన్నాక ఆవిడ కూతుర్ని నెమ్మదిగా మందలించింది.

వాళ్ళ సంభాషణలూ ఆవిడ మందలింపులూ మీనాక్షమ్మవాళ్ళకు స్పష్టాస్పష్టంగా వినపడుతూనే వున్నాయి.

మీనాక్షమ్మ తనూ వంతుకుపోయి పంతానికి ఆ పని చెయ్యకుండా వుంటే బాగుండేది అనుకొన్నది.

ఆ విషయమే అనుకొంటూ ఆ రాత్రి ఆమె పిల్లవాణ్ని చిచ్చికొట్టి నిద్రపుచ్చుతూ ఏదో వ్రాసుకొంటూ కూర్చున్న భర్తవంక చూస్తూ నిద్రపోయింది.

మరునాడు ప్రొద్దున్న ముగ్గులు వేస్తుండగా తాసీలుదారుగారి అత్తగారు మీనాక్షమ్మను పల్కరించింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఆవిడ మీనాక్షమ్మ కూర్చున్న గదిలోకి వచ్చి కూర్చుని "ఏమమ్మాయ్—నీకు పిల్లలూ—ప్రస్తుతానికి ఆ కుర్రాడొక్కడేకదూ!" అంటూ ఎంతో చనువుగా అడిగింది.

'అవునండీ' అన్నది అప్రయత్నంగా సిగ్గుపడుతూ.

"బాగుందమ్మా బాగుంది. ముత్యంలాంటి కొడుకును కన్నావ్-మీ అమ్మ ఎంత సంతోషిస్తున్నదో!" తన కట్టి సంతోషం గత నాలుగేళ్లనుంచీ కలుగకపోవడాన్ని జ్ఞాపకంచేసుకొంటూ.

"మా అమ్మ లేదండీ"

"అయ్యో పాపం అల్లాగా" అని ఆవిడ ఎంతో నొచ్చుకొంది.

కొంతసేపయినతరువాత ఆవిడ కాస్త ముందుకు జరుగుతూ "చూడమ్మాయ్ నీ పేరేమిటి!" అని అడిగింది ప్రేమగా. ఆమెకూడా ముద్దుగానే చెప్పింది.

చూడమ్మా మీనాక్షీ—మా అమ్మాయ్ చూశావూ ఒట్టి దుడుకుపిల్ల—సరే—మీరిద్దరూ చిన్నపిల్లలూ—నేను కాస్త పెద్దదాన్ని కనుక ఓమాట చెబుతా వింటావూ అన్నదావిడ.

"చెప్పండీ"

అయితే నేనొకపనిచేస్తానుండు అని లేచివెళ్ళి కూతుర్ని వెంటబెట్టుకొని వచ్చింది. తాసీలుదారిగారి భార్య రాగానే మీనాక్షమ్మలేచి చాపవేసి కూర్చోండి అంది.

మీనాక్షమ్మ ఆమె తల్లికి దగ్గరగా నేలమీద కూర్చుంది. ఆమె వారికి కొంచెందూరంలో చాపమీద చీర నలక్కుండా కూర్చుంది.

మరోగంటకు ఆమె తల్లిచేసిన సత్ప్రయత్నం వల్ల వారిద్దరూ నిష్కపటంగా స్నేహంగా మాట్లాడుకొన్నారు.

వారు లేచి వెళ్లిపోతున్నప్పుడు ఒక్కక్షణం ఆగమని మీనాక్షమ్మ లేచివెళ్ళి అలమారలోఉన్న కుంకుమభరిణె తెచ్చి, ఇద్దరికీ బొట్టుపెడుతూ మీ పేరేమిటండీ' అని తాసీలుదారిగారిభార్యను మర్యాదగా పొంకంగా అడిగింది.

"కమలాదేవండీ" అన్నదామె.

అబ్బ ఎంతసేపే నీకు—అమ్మాయ్ మేమంతా కమలా అని అంటామ్" అన్నదామె తల్లి లోపలికి వెళుతూ — "చిన్నపిల్లయినా ఎంత బుద్ధిమంతురా అమ్మా" అనుకొంటూ.

ఆవిడ అక్కడ వారంరోజులుంది.

ఆ వారంలో ఆ రెండువాటాలవారికీ కొంత పరిచయాలయినాయి.

పరిచయమైనకొద్దీ మీనాక్షమ్మకు కమలాదేవి స్వభావం అర్థంకాకుండా వచ్చింది.

ఆవిడ తనవంక తను చూస్తున్నప్పుడు ఒక రకంగానూ తను చూడటం లేదనుకొన్నప్పుడు మరొకరకంగానూ చూస్తుండటం మీనాక్షమ్మకు కొంచెం కష్టంగానే ఉండేది.

ఆవిడ తరచు సినిమాలకు వెళుతుండేది. ఊళ్లోకి వచ్చిన ప్రతి సినిమా ఆవిడ చూడకుండా వెళ్ళేది కాదు. అప్పుడప్పుడు ఆవిడ బలవంతపెట్టి మీనాక్షమ్మనుకూడా వెంటతీసికొని వెళ్లేది. టిక్కెట్లకయితే నేం రానూపోనూ బండ్లకయితేనేం అయిదారు రూపాయలు ఖర్చయ్యేవి. ప్రతిసారి డబ్బు ఆవిడే ఖర్చుపెట్టేది. పోనీ నావంతైనా నన్ను ఇచ్చుకో నీయండి" అంటే ఆవిడ మీనాక్షమ్మను ఇవ్వనిచ్చేది కాదు.

మీనాక్షమ్మ కందుకనే కష్టంవేసి ఆవిడతో సినిమాకు వెళ్ళటం మానుకొంది. ఒకవేళ ఆవిడ అంగీకరించినా కొన్నిసార్లయినా తనవంతు అయిదు రూపాయలు సినిమాకు ఖర్చుపెట్టే తాహతు తనకు లేదని మీనాక్షమ్మకు తెలుసు.

ఆవిడ బజారు హోటళ్ళనుండీ మిఠాయి దుకాణాలనుండీ ఏవేవో చాలా తెప్పిస్తుండేది తరచు. తెప్పించినప్పుడల్లా కొన్ని మీనాక్షమ్మకు పంపించేది.

మొదట్లో పుచ్చుకొన్న తర్వాత 'మావారు కోప గిస్తారండీ' అంటూ పుచ్చుకోనేదికాదు ఇల్లా కొన్ని విషయాల్లో మీనాక్షమ్మకు కొంచెం కష్టం కలిగిన మాట నిజమే అయినా—ఏమైనా తర్వాత నెలల్లో వారిద్దరికీ మంచి స్నేహం కుదిరిందనే చెప్పాలి.

"రావమ్మా మీనాక్షమ్మా—కాసేపు రేడియో పాటలు విందువుగాని అని పిల్చేది కమలాదేవి మధ్యాహ్నం పూట. ఆమె పిల్లవాణ్ని చంకనేసుకొని వెళ్లేది. వాడూ పాటలు వింటూ ఎగురుతూ గంతులు వేస్తూ అల్లరిచేసేవాడు. వాడికేం అర్థమయి—ఆ పాటలు అంత ఆనందం కలిగించాయో అని అనుకొంటూ సంతోషించేది మీనాక్షమ్మ.

కమలాదేవిగారి కళ్లు ఎప్పుడూ వాడిమీదే వుండేవి—వాడెక్కడ వున్న వస్తువులు ఏం పాడు చేస్తాడో అని చాటుగా బహిరంగంగా భయపడుతూనే ఉండేది ఆవిడ.

మీనాక్షమ్మ ఆ విషయాన్ని గమనించి వాడి అల్లరిని అతి కష్టంమీద ఆపించి—వాడి ఆనందాన్నీ స్వేచ్ఛనూ ఆటంకపరచి తను జాగ్రత్త తీసుకొనేది.

కమలాదేవి అట్టే అందమైన మనిషి కాకపోయినా ఆవిడచేసుకొనే షోకులవల్ల కొత్త మెరుస్తూనే వుంటుంది. రిస్టువాచీ కళ్లజోడూ పెట్టుకొనే ఆడపిల్లలను చూస్తే నాగేశ్వరరావుకు అట్టే గిట్టదు.

చెప్పలు తొడుక్కొని వంటయింట్లోంచి కూడా వెళుతూఉండటం ససేమిరా గిట్టదు మీనాక్షమ్మకు. స్నేహమయింది గనుక "మన కెందుకులే" అనుకొని ఊరుకొనేది.

ఆఫీసరుగారి భార్య—అందులో ఇంటరు చదువుకొన్నది—అంతమాత్రం దర్జా పోషణం అబ్బురమూ కాదు - ఆశ్చర్యమూ కాదు" అనుకొనేవాడు నాగేశ్వరరావు. అతను ఆమె నొకటి రెండుసార్లు మాత్రమే సరిగా చూచాడు.

ఆ షోకులు మా ఆవిడా చేస్తే ఈవిడకంటే కనీసం వెయ్యిరెట్లు ఘనంగా మెరుస్తుంది అనుకొనేవాడతను.

కమలాదేవి అతన్ని నిదానంగా తొందర తొందరగా—చూసీ చూడనట్లుగా—నిర్భయంగా చాలాసార్లు చూచింది.

నాగేశ్వరరావు అది గమనించికూడా గమనించనట్టే ప్రవర్తించేవాడు.

ఒకరోజు సాయంకాలం కమలాదేవి రోజు కంటె గొప్పగా ముస్తాబై బండీ పిలిపించింది. మీనాక్షమ్మా వారింట్లోకి వచ్చి ఆవిడతో "ఏమండీ. మీరివ్వాళ కాస్త ఒక్క గంట తీరుబాటు చేసుకొని నాతో బజారు రావాలి" అంటూ బలవంతం చేసింది.

"ఎక్కడికండీ"

బట్టలకొట్టుకు. బేరం అదీ నాకు బాగా తెలియదు—సరుకు నాణ్యం అంతకంటే తెలియదు. ఒక్కసారి మీరు రండి - మళ్ళీ ఇప్పుడే వచ్చేద్దాము అని బ్రతిమలాడింది కమలాదేవి.

"కాత్యాయిని వెళ్లాక మళ్ళీ బట్టలకొట్టుకు వెళ్లి ఒక్క చీరైనా చూడలేదు. కట్టుడు చీర కొనుక్కో మని ఆయన ఇరవై యిచ్చారు. నేనూ వీలయితే ఇప్పుడే ఒకటి కొనుక్కోవచ్చు." అని అనుకొంటూ మీనాక్షమ్మ సరేనండీ అంటూ పని తెముల్చుకొని ఆమెతో బజారుకు బయలుదేరింది.

మామూలుగా తను వెళ్లే బట్టలకొట్టుకే ఆవిడా వస్తుందనుకొని ఆ కొట్టు కనపడగానే బండి ఆపించ

మని చెప్పింది మీనాక్షమ్మ. ఇక్కడ కాదు లెండి. ఇంకొస్త పైకి వెళదాం రండి అని ఆవిడ మరో పెద్ద కొట్టుకు తీసుకొని వెళ్ళింది. వారు వెళ్ళిన బట్టలదుకాణం చాలా పెద్దది. చుట్టూ అద్దాలూ—అద్దాల బీరువాలూ అమర్చబడివున్నాయి. పైన ఫేన్లూ క్రింద తివాసీలూ అందంగా ఏర్పాటయి ఉన్నాయి.

మీనాక్షమ్మ లోపలకు అడుగు పెడుతూనే ఆశ్చర్యపడిపోయింది — ఆ లైట్లు వెయ్యమని ఎవరు ఎవరికి చెప్పారా అని అనుకొంటూ. ఆకొట్టు యజమాని పొడుగాటి తళతళా మెరుస్తున్న సిల్కు లాల్చీతో ముందుకువచ్చి కూర్చోమని కుర్చీ చూపించాడు వారిద్దరికీ. మీనాక్షమ్మను కూర్చోమని తనూ కూర్చుంటూ "ఏమైనా మంచిచీరలు చూపించండి" అంది కమలాదేవి.

ఆవిడమాటతీరు — ఏదో పట్టిపట్టి మాట్లాడి నట్లుగా — ఇంగ్లీషు చదువుకొని నాజూగ్గా షోగ్గా మాట్లాడాలని ప్రయత్నంచేసే ఆడవారిమాటతీరులో వుంటుంది.

మీనాక్షమ్మకు ఆవిడ అల్లా మాట్లాడడం అంత రుచింపదు.

ఆకొట్టుయజమాని తనగుమాస్తాకు ఏదో చెప్పాడు ఇంగ్లీషులో.

ఆగుమాస్తా ఆమాట వినీవినడంతో బీరువా అద్దాలను ప్రక్కకు జరుపుతూ ఒక్కొక్క అరలోంచి ఒక్కొక్కరకంచొప్పున ఇరవైచీరలు తెచ్చి వాళ్ళ ముందు వరుసగా ఒకదానిప్రక్క ఒకటి పెట్టాడు.

మీనాక్షమ్మ ఆశ్చర్యపడింది.

ఆవిడ కొడుకు ఎదురుగావున్న పెద్ద నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తూ — ఆశ్చర్యపోతూ—నవ్వుతూ — కాసేపు జాగ్రత్త అన్నట్లు వేలితో బింబాన్ని హెచ్చరిస్తూ ఆడుకొంటూ ఉండిపోయాడు.

"ఏమండీ చూడండీ! ఏరంగు బాగుంటుందో" అని అడిగింది కమలాదేవి.

మీనాక్షమ్మ కొస్త తేరుకొని "ఆ. ఆ. అదేనండీ నేనూ ఆలోచిస్తున్నా"అన్నది తెలివిగా. "అన్నీ బాగానే వున్నాయే — ఇవన్నీ మంచి సిల్కుచీరలేనే" అన్నది.

కాసేపు ఇటువిటూ అటువిటూ పడేసి చివరకు ఆవిడ వాటిల్లోంచి మూడుచీరలు ఏరి మిగతావన్నీ తీసెయ్యండి" అంది.

కమలాదేవి ఆ మూడూ తీసుకొని వాటి నొకటొకటే పరీక్షచేసి పదినిముషాలసేపు—లైటుకు ఒకసారి ఎదురుగా ఎత్తుగానూ ఒకసారి క్రిందుగా వంపుగానూ పట్టుకొని కొంతసేపు చూసి "ఏమండీ వీటి పమిట కొంగులు చూపించండి" అన్నదావిడ.

ఆ గుమాస్తా వాటిని బల్లమీద విప్పి పరచాడు. ఆవిడ అందులో ఒక చీర తీసుకొని "ఏమండీ ఈ బోర్డరూ పమిటచెంగూ బాగున్నాయికదూ—రంగుకూడా బాగుంది—ఏమంటారూ—ఇది తీసుకోమంటారా?" అని అడిగింది.

"తీసుకోండి అదే బాగుంది" అని వెంటనే మీనాక్షమ్మ అనడానికైతే అనకలిగిందే కాని ఆమెకా మూడు చీరలూ బాగానే వున్నాయి. ఆమె మరో క్షణమాగి "అది సరేగానండి ఖరీదు అడిగరేం" అన్నది.

ఆ కొట్టు యజమాని ఆ మాటకు వెంటనే అందుకొని ఇల్లా అన్నాడు. "అయ్యో దానికేంలెండి— ముందు మీకు చీర నచ్చనీయండి అన్నీ ఫిక్స్‌డ్ రేట్సేగా" అన్నాడు.

ఆమాట మీనాక్షమ్మకు అర్థంకాలేదు. బహుశా ధర ఇంగ్లీషులో చెప్పాడేమో ననుకొని ఊరుకొంది.

ఏమండోయ్—ఏమైనా తేడావస్తే తిరగ్గొట్టేస్తా నండోయ్—సరిగా బిల్లుచేసి బిల్లు ఇల్లా ఇవండి" అంది కమలాదేవి.

ఆయనేదో కాయితంమీద పెన్సలుతో రెండు గీతలతో చప్పున వ్రాసేసి అది చింపిఇస్తే ఆమె అంది పుచ్చుకొని—పమిటకొంగు కొంచెం తప్పించి లోపలినుండి పర్సుతీసి డబ్బు ఇచ్చేసి గుమ్మంలో పిల్లవాణ్ని పట్టుకొని నిల్చున్న మీనాక్షమ్మను కలుసుకొంది సిల్కుచీర చేత్తో పట్టుకొని.

అంతవరదాకా ఆ చీర ఖరీదు ఎంతో మీనాక్షమ్మకు అర్థంకాలేదు. "బహుశా కొంచెం ఎక్కువే అయివుండాలి" అనుకొన్నది.

పిల్లవాణ్ని ఒళ్లో కూర్చోపెట్టుకొని బండిలో కూర్చున్నాక క్రొత్తచీర ఒళ్లోపెట్టుకొని కళ్ళజోడు సర్దుకొంటూ కూర్చున్న కమలాదేవితో మీనాక్షమ్మ ఇల్లా అన్నది. "ఇంతకీ ఆ చీర ఖరీదెంతండీ—అసలు మనం బేరం చెయ్యలేదే!"

ఎంతలెండి నూటఏభైఅయినా — ఫిక్స్‌డ్ రేట్సు అన్నాక మనం బేరంచెయ్యడం బాగుండదు —వాళ్లు బేరం చెప్పరు. అయినా మనకు బాగుండక పోతే పంపించి వేస్తామని చెప్పాంగా అన్నదావిడ చీర పైకెత్తి పరిశీలిస్తూ.

ఆమాటకు మీనాక్షమ్మ నిర్ఘాంతపోయింది.

"నూటఏభైయ్యైదురూపాయలా ఆచీర" అనుకొన్నది అప్రయత్నంగా ఆశ్చర్యంగా.

"అంత ఖరీదుటండీ" అన్నది..

"అయినా అంతధర పెట్టేసి కొనేస్తే మీవారు కోప్పడరా" అని అడిగింది మీనాక్షమ్మ అమాయకంగా.

కాత్యాయిని భర్త ఆమెను చీరకు పధ్నాలుగు పదిహేనుకంటె ఎక్కువధర పెడితే నిజంగానే కేకలేసేవాడు.

తనభర్తలయినా అంతే. ఆ విషయాలు స్ఫురణకువచ్చే అల్లా అడిగింది మీనాక్షమ్మ.

అబ్బే కోప్పడటమా! అన్నదావిడ.

ఇంటికి చేరేలోగా ఆవిడ నాల్గుసార్లు అడిగింది "ఏమండీ ఈచీర బాగుందా — మీరు మనస్ఫూర్తిగా చెప్పండీ" అని.

దారిలో పిల్లవాడు ఏదో చూపించి అది కొనమని ఏడిస్తే మీనాక్షమ్మ ఒకఅణాపెట్టి బిళ్లలుకొని వాణ్ణి సముదాయించింది.

ఇంటికి వచ్చినతర్వాత వాడాపూట పెందరాళే నిద్రపోయాడు.

మీనాక్షమ్మ కాపూట ఎందుకో తోచలేదు. రోజా తనభర్త కూర్చుని వ్రాసుకొనే కుర్చీలో కూర్చుంది.

చాలాసేపు అల్లా కూచుని ఏదో ఆలోచనల్లో పడి ఉండిపోయింది.

మనస్సులో ఎక్కడో ఏమూలో "నేనూ అటువంటిచీర కొనుక్కుంటే బాగుండును"అని ఒక కోరిక ఉద్భవించి మనస్సంతా కదులుతూ ప్రాకుతూ అంతలో అణిగిపోవడం మొదలుపెట్టింది.

వానకురిసే వేళ కొండకొమ్ములను తాకుతూ తారాడుతూ నీలి మేఘాల్లాగా ఆకోరికలే ఆ ఆలోచనలే మాటిమాటికీ ఆమెమనస్సులో మెదలడం మొదలుపెట్టాయి.

ఆమెకు అసూయ కలిగింది. దాన్ని అతిప్రయత్నంమీద ఆమె అణచుకొంది.

అసలూ—సన్నావిడ బజారుకురమ్మని ఎందుకు పిల్చిందీ! అక్కడ బేరంచేసిందేముందీ! ఆవిడ అంతధర పెట్టి చీర ఎల్లా కొనకలిగిందీ! ఆమె భర్తకు నెలకు నూటయాభయ్యేగా జీతం — మరి నెలంతా ఎల్లా గడుపుకొంటారూ?

వెనక ఆస్తి ఏమైనా వుందేమో! లేదని ఆవిడ చెప్పిందిగా. లేకపోతే మరి......పై సంపాదన ఏమైనా వుండాలి అనుకొన్నది మీనాక్షమ్మ.

అవును ఈ ఉద్యోగాల్లో అందుకు అవకాశం ఉంటుంది. తాతగారు కరణీకం చేస్తూనే పొలం పుట్రా సంపాదించుకొన్నారు. పోనీ—వీరు కూడా ఆ వెధవ స్కూలుమాస్టరీ ఉద్యోగం మానేసి దక్కగా తానూ ఈ ఉద్యోగమే చెయ్యకూడదూ? అని ఇల్లా ఏమేమో ఆలోచించింది మీనాక్షమ్మ. ఆమె కాసేపు టేబిల్ మీద ఉన్న పుస్తకాలవంక చూచింది. వాటిల్లో కొన్ని తెల్లకాగితాల పుస్తకాలూ కొన్ని ఆయన వ్రాస్తున్న పద్యాల పుస్తకాలూ మరికొన్ని దొంతరులుగా వున్న తెలుగు గ్రంథాలూ. ఆ అచ్చు పుస్తకాలన్నీ ఒకటొకటే తీసి పేర్లు చదివి మళ్ళీ అక్కడ పెట్టేసింది. ఏమిటో—ఈయనకీ పుస్తకాలే లోకం—డబ్బు సంపాదన తెలియదు. చదువుకొంటున్న రోజుల్లోనూ అంతే. ఉద్యోగం చేస్తున్నప్పుడూ అంతే. ఇహ సంపాదించే దెప్పుడూ!

అదేమంటే ఇందులో ఉండే ఆనందం ప్రపంచంలో మరెక్కడుంది పిచ్చిదానా అంటారు ఆయనగారు అనుకొన్నది మీనాక్షమ్మ

ఆ పూట నాగేశ్వరరావు ఇంటికి వచ్చేసరికి అట్టే ప్రొద్దు పోలేదు. అతను ఎనిమిదింటికే వచ్చాడు. అయినా మీనాక్షమ్మకు అతను రోజూకంటే ఆలస్యంగా వచ్చాడనిపించింది.

"ఏమండీ యింత ఆలస్యంగా వచ్చారూ?" అని అడిగింది.

"అదేమిటే ఎనిమిదేగా అయిందీ—రోజూకంటే పెందరాళే వస్తే" అన్నాడు నాగేశ్వరరావు.

"రోజూ మీ రెక్కడికండీ వెళ్తారూ" అని అడిగింది మీనాక్షమ్మ భర్తకు ఎదురుగా నిలబడి.

మీనాక్షమ్మ ఆ పూట మామూలుగా కట్టుకొనే తెల్లచీర కట్టుకొంది. ఎఱ్ఱపూల తెల్లజాకెట్టు వేసుకొంది.

అతనికి మామూలుగా తెల్లచీరమీద రంగునీలం సాదా సిల్కు జాకెట్టు వేసుకొంటే బాగుంటుంది.

"తెల్ల చీరమీద ఎఱ్ఱపూల జాకెట్టు ఇంత అందంగా ఉంటుందన్నమాట" అనుకొంటూ ఆమె వంక చూస్తూ ఉండిపోయాడు నాగేశ్వరరావు.

ఆమె మళ్ళా అడిగింది.

ఎక్కడికేముందీ—మా శాస్త్రిగారింటికే వెళ్తుంటాను. ఏదో కావ్యాలగురించి కాసేపు మాట్లాడుకొని అల్లా తిరిగివస్తాం. ఇవ్వాళ ఆయనలేరు." అన్నాడతను.

అది విన్నాక మీనాక్షమ్మకు ఎంతసేపూ అతనికా పుస్తకాలగొడవే తప్ప డబ్బు సంపాదన పట్టడం

లేదని నిర్ధారణ అయింది. "ఏమండీ ఊరికే అల్లా తిరక్కపోతే—ఏమైనా కాస్త పై సంపాదనకు మార్గం ఆలోచించకూడదూ!" అన్నది.

ఏకో వుంది—లేకపోతే అది ఇల్లా అనదు అని అనుకొంటూ "సంపాదిస్తూనే ఉన్నాగా చాలదూ?" అన్నాడు నాగేశ్వరరావు.

ఏం సరిపోవడంలేండి. అదికాక పైన ఇంకేమీ సంపాదించలేరా—ఆ తాసీల్దారుగారిలాగా" అన్నది.

"అదేమిటే — ఆయనల్లా సంపాదిస్తున్నాడని ఎవరన్నారూ — ఊరుకో — ఊరుకో ఎవరైనా వింటే లేనిపోని రభసవుతుంది."

పోనీలెండి మీ సంగతి చెప్పండి మీకు పైసంపాదనకు వీలు లేదా?

వీలెందుకు లేదూ - ఏదో రెండు ప్రైవేట్లు చెప్పుకొంటే మరో ఇరవై రాకపోవు. కాని అబ్బ అదంతా చాలా అవస్థ. అక్కడ బళ్లో పిల్లలతో అన్ని గంటలు కొట్టుకొని కొట్టుకొని వచ్చి మళ్లా ఇక్కడ చెప్పుకోవడమంటే యమయాతనగా ఉంటుంది. అని 'సరే పద వడ్డించు భోజనం చేద్దాం' అన్నాడు నాగేశ్వరరావు చొక్కా విప్పి వంకెకు తగిలిస్తూ.

అతను భోజనం చేస్తూ అతను నవ్వుతూ "ఏం విశేషం—ఇవ్వాళ అల్లా ఉన్నావ్" అన్నాడు.

మీనాక్షమ్మ జరిగిన విషయం అంతా చెప్పింది. చెప్పి "ఆవిడ అలాగా నూట ఎనభై పెట్టి చీర కొనేసింది చూశారా!" అన్నది.

అహ - అదా సంగతీ—అని ఒక చిరునవ్వు నవ్వి "పిచ్చిదానా - అటువంటి చీరలు మనకు దేనికీ! అసలు నువ్వు ఏ చీర కట్టుకొన్నా బాగుంటావ్— అసలు బాగుండనివాళ్లు చీరలకోసం తాపత్రయపడతారు" అన్నాడు.

ప్రక్క దులిపి వేస్తూ "ఈ నెల నేనూ ఒక చీర కొనుక్కొంటాను" అన్నది మీనాక్షమ్మ.

అల్లాగే కొనుక్కో. కావలంటే మరో పది ఇస్తాను. మంచిదే కొనుక్కో అన్నాడు—పుస్తకం ఒకటి తెరిచి పడుకొని చదువుకొంటూ.

ఆమె అప్పటికి సంతోషించింది.

ఆ నెల ఫస్టు తారీఖున బియ్యపు కొట్లో కొంత బాకీ అట్టే పెట్టి నాగేశ్వరరావు ఆమెకో పది రూపాయలు ఇచ్చాడు. అల్లాగా ఇచ్చి ఆ పదీ పూడే ఉపాయాలు కొన్ని అన్వేషించాడు. కొన్ని చిల్లర ఖర్చులు తగ్గించుకొన్నాడు.

ఆమె ఆ నెలే కాదు - ఉన్న ముప్ఫై రూపాయలకు మరో పది వచ్చి చేరినా మరుసటి నెలలో కూడా చీర కొనుక్కోలేదు.

ఒకసారి అతను "అదేమో—చీర కొనుక్కుంటానన్నావ్—కొనుక్కోలేదేం" అని అడిగితే ఆమె వెంటనే సమాధానం చెప్పింది కాదు.

క్షణంలో అతనికి కోపం వచ్చింది.

అంతలో బొమముడి విడిపోయింది.

ఆమెను నెమ్మదిగా మందలించాడు.

ఆమెనీ రెండు నెలలనుండి గమనిస్తూనేవున్నాడతను. ఆమెలో అజ్ఞాతంగా దాగివుండి బాధ పెడుతున్న విషయాన్ని అతను ఇట్టే గుర్తించాడు. "నువ్వు అనవసరంగా పెద్దఎత్తులకుపోబోయి అకారణంగా బాధపడుతున్నావ్—అదిమంచిపనిగాదు" అన్నాడు.

మీనాక్షమ్మ కాస్త నవ్వుముఖంపెట్టి "అబ్బే అదేమీ కాదండీ — ఇప్పుడు కట్టుకుచీరలున్నాయి కదా—దేనికి కొనడం అని ఊరుకొన్నా" అన్నది.

ఎల్లాగయినా అటువంటిచీర కొనాలని ఎప్పుడో నిశ్చయం చేసుకొని ఆ నిశ్చయాన్ని మనస్సులో గుప్తంగా ఉంచుకొంది.

నాగేశ్వరరావుకు ఆమె చెప్పినది సంతృప్తికరంగా లేకపోయినా విని ఊరుకొన్నాడు.

ఆమె క్రమంగా తన సొంతఖర్చులు కొన్ని కొంత ప్రయత్నంమీద తగ్గించుకొంది. సాయంకాలం పూట ఇంట్లో కాఫీ పెట్టుకోవడం మాని వేసింది. తరచు పూలుకొనడం తగ్గించింది.

అతని కావిషయంలో కొంచెం కష్టం కలిగి కోపగించుకొన్నాడు.

క్రమంగా కొన్ని నెలలు గడిచినతర్వాత మీనాక్షమ్మ దగ్గరవున్న ముప్ఫై, ఎనభై రూపాయిలయినాయి. ఆమె అన్నగారు సంక్రాంతిపండక్కు చెల్లెల్నీ బావగార్నీ పిలిచాడు.

"నేను రానులే — ఈసారి నువ్వు వెళ్లిరా" ఆమెను పంపించాడు నాగేశ్వరరావు.

ఆమె తిరిగి వచ్చేటప్పుడు పండగచీర తెచ్చుకోకపోవడం చూచి నాగేశ్వరరావు ఆశ్చర్యపోయాడు. తరువాత నెమ్మదిగా ఆవిషయం ప్రస్తావనకుతెచ్చి అడిగాడు. ఆమె కొంత దాచి కొంత చెప్పింది.

తొట్రుపాటు పడుతూ సమాధానం చెప్పింది. అబ్బే ఏమీ లేదండీ—మాఅన్నయ్య మీరూ వస్తారనుకొన్నాడు. మన ఇద్దరినీ కొట్టుకు తీసుకొనివెళ్ళి మనకు నచ్చినవి కొందామన్నాడట. మరి మీరు రాలేదుగా—అందుకని డబ్బు ఇచ్చాడు. ఇక్కడ కొనుక్కోమని అన్నది మీనాక్షమ్మ.

అతనామాట నమ్మలేదు. అబద్ధమాడిందని అతని కప్పుడే అర్థమయింది. అబద్ధంఆడితే అతికేటట్లు ఆడాలి. ఆడవాళ్ళు కొంతమంది మహా చక్కగా అబద్ధం ఆడేస్తారు. అబద్ధం ఆడటంకూడా ప్రత్యేకమైన నేర్పు. దీనికిది అబ్బలేదు. అదే మంచిదిలే." అనుకొన్నాడు ఆమెను చూచి నవ్వుతూ.

"అయితే ఇంకేం—భలే ఎత్తువేశావన్నమాట. ఏమాత్రం గిట్టిందే!" అన్నాడు.

"నలభై" అన్నది మీనాక్షమ్మ గర్వంగా సంతోషంగా.

సరే—మంచి లాభమే సంపాదించావే. అని ఒక్కక్షణమాగి "అయితే ఇంతకూ నీ పన్నాగమంతా ఆవిడగారు కొన్న చీరలాంటిది కొనాలని కదూ" అన్నాడు చిరుకోపాన్ని ప్రకటిస్తూ.

మరోక్షణానికి అతనికి నిజంగానే కోపం వచ్చింది. ఆమె అతనికి సమాధానం చెప్పకుండా లోపలకు వెళ్ళింది, పిల్లవాణ్ని అతనిదగ్గిర దింపేసి.

ఆమె పడుతున్న తాపత్రయం అంతా అతనికి స్పష్టంగా అవగతమైంది. ఆమె కల్లాంటి చీరకొని ఇవ్వలేకపోయినందుకు క్షణం బాధపడ్డాడు. అందుకు కారణం తన అసమర్థతే నని అనిపించింది. అవ్వేకాదు అటువంటివి మన కక్కర్లేదు" అనుకొన్నాడు మళ్ళీ. "నువ్వల్లా అనుకొంటున్నావు కాని ఆవిడ కావాలని అంతగా కోరుకొంటున్నప్పుడు పోనీ నువ్వు ఇవ్వగలిగావా!" అని ఎవరో హృదయం చాటున ఉండి అడిగినట్లనిపించింది. "నిజమే" అనుకొన్నాడు నాగేశ్వరావు చివరకు.

అతను తను వ్రాస్తున్న కావ్యం అక్కడే ఆపేసి మరునాడే తన మిత్రులతో తనకూ కాడా ఒకటి రెండు ప్రైవేటు చూసిపెట్టమని అడిగాడు.

* * *

ఆ మాసాంతంలో ఆమెదగ్గిర ఉన్న నూటఇరవై రూపాయలకూ మరో ముప్పైరూపాయలు వచ్చి చేరాయి.

ఆ తరువాత నెలలో మీనాక్షమ్మ రూపాయల నోట్లన్నీ సమంగా లెక్కపెట్టి నూటఎనభై అని ఒక నిట్టూర్పుతో అనుకొని అవి పెట్టెలో పెట్టేసి భద్రంగా తాళం వేసింది పెట్టెకు.

అప్పటి కామె మనస్సు చాలా తేలికయింది. ప్రక్కభాగం ఆవిడమీద ఏర్పడిన అసూయ క్రమంగా తగ్గిపోయింది.

అందువల్లనే ఆమె ఒకరోజు తన యింటికి భోజనానికి పిలిస్తే సంతోషంగా వెళ్ళింది.

"ఎందుకండీ ఇప్పుడు భోజనాలూ" అంది మీనాక్షమ్మ. "రేపు నా పుట్టినరోజు పండగండీ" అన్నదావిడ.

ఆవిడ తన పుట్టినరోజు పండగ అంత ఆర్భాటంగా చేసుకోవడం చూచి మీనాక్షమ్మ కొంత ఆశ్చర్యపడినా అసూయపడలేదు.

ఆరోజు మధ్యాహ్నం అంతా వెళ్ళిపోయాక కమలాదేవి మీనాక్షమ్మను తన పడక గదిలోకి తీసికొని వెళ్ళి నాలుగూ చూపించింది.

కొంతసేపయిన తర్వాత ఆమె బీరువా తీసి తన చీరలన్నీ చూపించింది. ఆవిడ తన ఆధిక్యం అందరూ అంగీకరించి ఆశ్చర్యపడాలని కోరే వ్యక్తి.

మీనాక్షమ్మ కళ్లు చెదిరిపోయాయి.

ఆ చీరలన్నీ కొత్తవీ—పట్టువీ—మేలైనవీ.

వాటిని ఆవిడ ఒకటొకటే తీసి మెల్లగా మీనాక్షమ్మ చేతికిచ్చింది. అంచులు చూడమనీ—పమిట కొంగులు చూడమనీ అంటూ. ఆమె వాటిని ఒక్కక్షణం చూసి నలిగిపోతాయేమో నని భయపడుతూ జాగ్రత్తగా తివాసీమీద పెట్టేసింది.

"ఎప్పుడు కొన్నారండీ ఇవన్నీ" అన్నది.

అవ్వే ఒక్కసారి కొన్నవి కాదండీ—అప్పుడొకటీ అప్పుడొకటీ కొన్నా" అన్నదావిడ.

అవన్నీ చాలామట్టుకు ఖరీదైనవే. వాటిల్లో మీనాక్షమ్మ కళ్ళకు తలమానికంగా కన్పించింది ఒక చీర. దాన్ని ఎత్తి తీస్తూ "ఇది మనం ఇద్దరం వెళ్ళినప్పుడు కొన్నది కదండీ" అని మరో క్షణం పోయాక "ఎంతండీ ఇదీ—అప్పుడు చెప్పారుగాని..." అని అడిగింది, ఆ చీర ధర సమంగా కనుక్కొని ఇంకా తన కెంత తక్కువవుతుందో తెలుసుకొందామని అనుకొంటూ.

ఆవిడ పరధ్యాన్నంగా ధర చెప్పి—మరో పదో ఇరవయ్యో పెడితే కాశ్మీరు జరీ అంచు చీర వచ్చేది అన్నది తానేదో పొరపాటు చేసి అందు విచారపడుతున్నట్లుగా ముఖం పెడుతూ. మీనాక్షమ్మ ఆవిడవంకనూ చూడలేదు. ఆమె అన్నమాటలూ విననూలేదు. ఆమె ఆ చీరవంకే చూస్తూ మరో అయిదూ—అయిదేగా" అనుకొన్నది.

"చాలాబాగుందండీ ఈచీర" అని మెచ్చుకొన్నది మీనాక్షమ్మ.

ఆవిడ అందుకు గర్వంగా సంతోషించింది. అదే ఆవిడకోరిక. ఆవిడకు అల్లాగా తన చీరలుచూసి

సంతోషించేవాళ్లంటే చాలాఇష్టం. "అల్లాగాఅండీ" అన్నదావిడ. మరేమీ అనుకోకపోతే—సాయంకాలం ఒకసారి నాకిస్తారూ—మావారికి చూపించి ఇచ్చేస్తా" అని అడిగింది మీనాక్షమ్మ.

"దానికేంభాగ్యమండీ—చూపించండి" అన్నదావిడ ఆచీర. అతనుకూడా మెచ్చుకొంటాడని మనస్సులో అనుకొంటూ. ఆమె మళ్లీ ఇల్లా అడిగింది. "ఏమండీ—మీకూ అల్లాంటిచీర కొనుక్కోవాలని ఉందాఅండీ"అని అడిగింది మీనాక్షమ్మ మనస్సులో ఉన్న భావాన్ని పసిపడుతూ.

మీనాక్షమ్మ తడబడింది.

"అబ్బే కాదండీ—అరంగు—ఆ ఉదారంగు చీర కొనుక్కుందామని అనుకొంటున్నా"అనిఅన్నది. ఆమె ఆమాట కొంచెం ఎగతాళిగా అన్నదేమోనని అనుమానపడుతూనే కమలాదేవి కొంచెం గర్వపడింది.

అంతలో కుర్రవాడు నిద్రలేచి ఏడుస్తుంటే మీనాక్షమ్మ తన ఆలోచనల్నీ—ఆచీరల్నీ అక్కడ వదిలేసి దప్పున తనభాగంలోకి వెళ్లిపోయింది.

ఆరోజు సాయంకాలం మీనాక్షమ్మముందున్న పంచపాళీలోకూర్చుని భర్త తొందరగావస్తే బాగుండునని అనుకొన్నది.

ఒకటి రెండుసార్లు లోపలకువెళ్లి టేబిలుమీద ఉన్న ఉల్లిపొరకాగితంలో చుట్టివున్న సిల్కుచీర తీసిచూసి మళ్లీ ముందుగుమ్మంలో నిలబడి ఆవీథి మలుపుకేసి ఒకసారి పంచపాళీక్రింద ఇసకలో గూళ్లు కడుతున్న కొడుకుకేసి ఒకసారి చూస్తూ చాలాసేపు లేచి ఉండి పోయింది.

అంతలో పోస్టుజమాను వచ్చి ఉత్తరం ఒకటి ఇచ్చివెళ్ళాడు.

ఆమె ఆ ఉత్తరాన్ని చదివి నవ్వుకొంది.

అంతలో కొంచెం కోపగించుకొంది "ఏం పాపం వెళ్ళినప్పటినుంచీ ఒక్క ఉత్తరం వ్రాయించడానికి తోచలేదు" అనుకొన్నది. అది కాత్యాయిని భర్త వ్రాశాడు. ఆమె పురిటికి వెళ్ళి పదిరోజుల క్రిందటే వచ్చిందనీ—రేపో ఎల్లుండో వీలు చేసుకొని వదినగార్ని మావారిని వస్తున్న అని వ్రాశాడాయన.

మీనాక్షమ్మకు పట్టరానంత సంతోషం కలిగింది.

టేబిలుమీద ఉన్న చీరతీసి అలమారలో దాచి దాని స్థానంలో ఆ ఉత్తరాన్ని ఉంచింది. నాగేశ్వరరావు ఆపూట ప్రైవేటుకు వెళ్ళకపోవడంచేత కాస్త పెందరాళే వచ్చాడు. అతనువచ్చి ఆ ఉత్తరం చదువుకొన్నాడు. నవ్వుతూ భార్యతో "చూశావా—మీ కాత్యాయిని వస్తోందట" అన్నాడు.

ఊరికేనే రావడంలేదు. మనకో కోడల్ని కనుక్కొని వస్తోంది.

ఇద్దరూ నవ్వుకొన్నారు.

నీతో పోటీపడిందన్నమాట. వచ్చాక తెలుస్తుంది కాబోలు మళ్ళీ—ఇంకా తాను వెనకపడానని" అన్నాడు నాగేశ్వరరావు.

ఆమె ముసిముసి నవ్వులు ఒలకపోసింది. భోజనానంతరం భర్తతో ఆ చీర ప్రస్తావన తెచ్చి దాన్ని చూపించడానికి అవకాశంకోసరం కాచుకొంది మీనాక్షమ్మ. మృదుపరిష్వంగానంతరం మీనాక్షమ్మ బుగ్గలు తడుముకొంటూ దూరంగా జరిగి అవతలకు వెళ్ళి అలమారలోంచి తీసి ఆ చీర అతనికి చూపించిస్తూ—"చూడండీ ఈ చీర బాగుందా" అని అడిగింది నవ్వుతూ.

"అయితే అప్పుడే కొనేశావన్నమాట!" అన్నాడు.

లేదు. ఈ చీర ఆవిడది. మీకు చూపిద్దామని తెచ్చా బాగుందా?"

సరే—ఇంకేం రేపే ఆ అయిదూ ఇస్తాను కొనుక్కో అన్నాడు నాగేశ్వరరావు.

అలా అని అతను మరోక్షణం పోయాక "రేపో ఎల్లుండో కాత్యాయిని కూడా వస్తుందిగా. ఆవిడ వచ్చాక ఆమెతో కలిసివెళ్లి కొని తెచ్చుకుందువు గాని సరేనా?" అన్నాడు.

ఆమె సంతోషంగా సరేనంది. కాత్యాయిన్ని కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపరచవచ్చుని అనుకొంటూ.

అంత డబ్బు—ఒక్క చీరకు ఖర్చు కాబోతోందే అని కొంత మనస్సులో మథనపడ్డా ఆమెకంత సంతోషం—సంతృప్తి కలిగింపబోతున్నానుగదా అని ఆనందించాడు నాగేశ్వరరావు కొంత ప్రయత్నంమీద.

ఆమె అప్పటికప్పుడే ఆ చీర పట్టుకొని వెళ్ళి ఆవిడకు ఇచ్చేసి "మావారు కూడా ఈ చీర బాగుందన్నారండీ" అని చెప్పి వచ్చేసింది మీనాక్షమ్మ.

* * * *

మీనాక్షమ్మవాళ్లు అనుకుంటున్నట్లుగానే కాత్యాయిని మరో రెండు రోజులకే వచ్చింది. ఆమె రావడం ఆ యింటికి పండుగ వచ్చినట్లయ్యింది.

మీనాక్షమ్మ కోడల్ని ఎత్తుకొని పదే పదే ముద్దాడితే కాత్యాయిని అల్లుణ్ని ఎత్తుకొని క్రిందదింపలేదు.

మీనాక్షమ్మ కోడల్ని ఎత్తుకొని భర్తదగ్గిరకు వెళ్లి అతనికి ఎత్తుకోమని ఆ పిల్ల నిస్తూ చూడండీ— "మనవాడికి చక్కని పెళ్లామే దొరికిందండీ" అన్నది. అని దూరంగా పిల్లవాణ్ని ఎత్తుకొని నిల్చున్న కాత్యాయినితో "ఏమే కాత్యాయినీ—నిజంగా మావాడికిచ్చి చేస్తావుటే?" అన్నది నవ్వుతూ నిష్కపటంగా అమాయకంగా.

ఒసేయ్ — వెఱ్ఱిబాగులదానా. నువ్వు కాస్త బెట్టుగా ఉండాలి. మనమే అల్లాగా అడిగితే పల్చనయిపోతామ్" అన్నాడు నాగేశ్వర్రావు.

ఓహో అల్లాగా - అయితే అన్నగారికున్న కాస్త బెట్టు నేర్చుకొన్నారన్నమాట—ఈమాటు ఆడపిల్ల పుడితే తెలిసివస్తుంది అన్నయ్యగారి పని.

అని మీనాక్షమ్మవంక తిరిగి "ఏమమ్మోయ్ మా అమ్మాయిని చేసుకోదల్చుకొనేవాడు మాకో అర్జీ పెట్టుకోవాలి" అన్నది నవ్వుతూ. అహో— అల్లాగేం పాపం. మా అబ్బాయి కావాలనుకొన్న పిల్ల తల్లీ—తండ్రీ ఇద్దరూ కలసి కట్నాలూ కానుకలూ పట్టుకొని మా గుమ్మంలో పడిగాపులు కాయాలి" అన్నది మీనాక్షమ్మ. ఓహోహో—భలే గడుసుతనం నేర్పిందే వదినగారు" అన్నది కాత్యాయిని.

"గడుసుతనమే కాదు—పెద్దఎత్తులే వేస్తోంది" అన్నాడు నాగేశ్వర్రావు.

ఆ ఆడవాళ్ళిద్దరూ వంటఇంట్లోకి దారితీసి ఓహో అంటే ఆహో అనుకొంటూ పిల్లల్ని ఎత్తుకొని లోపలకు వెళ్ళారు.

ఆ మరునాడు ప్రొద్దుట నాగేశ్వర్రావు మామూలుగా బడికి వెళ్ళాక మీనాక్షమ్మ ఏమే బజారు వెళ్లి వద్దాం వస్తావా? అని అడిగింది కాత్యాయిన్ని.

"ఏం ఉగ్గుగిన్నెలు కొనాలా"

మీనాక్షమ్మ అంతలో సిగ్గుపడింది. అంతలో సిగ్గుతెరను ముఖంనుండి తప్పించుకొని "అవన్నీ ఆడబిడ్డల బాధ్యతలు" అన్నది." అయితే ఇంకేం కాస్త బస్తీసిరా—భర్త యింటి తిండీ వంటబట్టిందన్నమాట. ఆడబిడనికూడా లెక్కలేకుండా మాటకుమాట అనేస్తున్నావ్" అని మరోక్షణ మయ్యాక పిల్ల దాన్ని ఒళ్లోకు తీసుకొంటూ అయితే ఇప్పుడు చెప్పూ—ఎందుకూ బజారుకు?" అని అడిగింది కాత్యాయిని.

మీనాక్షమ్మ నిముషంలో నిజమంతా చెప్పేసింది. ఒకసారి లేచి ప్రక్కభాగంలోకి వెళ్ళి ఆ చీర తెచ్చి కాత్యాయినికి చూపించి తిరిగి ఇచ్చేసి వచ్చింది.

కాత్యాయినికి క్రమక్రమంగా కోపంవచ్చింది. కానేపు ఆమెవంక తీక్షణంగా కోపంగా చూసింది.

ఇదేమా అని ఆశ్చర్యపోయింది మీనాక్షమ్మ.

"డబ్బుతీసి చూపించు ఎంతవుందో" అన్నది

కాత్యాయిని పిల్లకు మరోవైపు పాలుఇస్తూ. మీనాక్షమ్మ డబ్బు ఆమె ఎదురుగానే లెక్కపెట్టి ఆపర్సు ఆమె ఎదురుగానే పెట్టింది. కాత్యాయిని ఆపర్సు గబుక్కున అందిపుచ్చుకొని ఒళ్లో పెట్టుకొని "అన్నయ్య తెలియకుండాచేస్తున్నవన్నమాట ఈపనంతా" అని అన్నది. అబ్బే—వారికి తెలుసును. అదంతా వారిచ్చిందే అన్నది మీనాక్షమ్మ నెమ్మదిగా.

"ఏంకాదు. ఒకవేళ అయ్యేవుంటే నువ్వు ఇమ్మని పోరుపెట్టి ఉంటావు" అన్నది కాత్యాయిని.

మరోక్షణమాగి ఆమె మళ్లీ ఇల్లా అన్నది.

ఏమమ్మా వదినా — నీ కేమన్న మతేమైనా పోయిందా ఏమిటి — ఎవరు చెప్పారమ్మా నీకీపని చెయ్యమనీ—చెప్పినవాళ్లసంగతి అల్లాఉంచనియ్— అసలు నీకల్లా జ్ఞానంలేకుండాపోయిందీ — మనమేమైనా జమీందార్లమూ కలక్టర్లమూ — పోనీ ఆఖరికి ఓ తాసీలుదారిగారిభార్యలమైనా కాదే. పైగా పిల్లల్ని కంటున్నదానివికదా—నీకీమాత్రం తెలియనక్కర్లా— ఓబుడ్డముక్కకు నాటవనైతే తగలేస్తారూ మనబోటివాళ్లం—ఎవరోపిల్లా పాపాలేనివాళ్లలాగా. ఆకాస్త చేతిలోఉంటే ఎంత నిబ్బరంగా ఉండొచ్చూ— ఏదైనా అవాంతరంవచ్చినా ఆదుకోవచ్చుని. అయినా తెలియకడుగుతా నీకింత గర్వ మెప్పుడొచ్చిందే! అంటూ కాత్యాయిని స్వతంత్రంగా నాల్గు చీవాట్లు పెట్టింది.

చీవాట్లన్నీ మీనాక్షమ్మ నోరెత్తకుండా తిన్నది. ఆమె యదార్థంచెప్పిందని ఆ మీనాక్షమ్మకు నిశ్చయంగా తోచింది.

"నామంచికే చెప్పింది" అనుకొంటూ అన్ని చీవాట్లూ అయ్యేదాకా ఆమె నోరు మెదపలేదు. చివరకు మీనాక్షమ్మ ఆలోచనల్లోపడి తెప్పరిల్లి "అవునే కాత్యాయినీ నువ్వన్నదే బావుంది. సరేగాని యింతకష్టపడి పోగుచేసినసొమ్ము ఆయనగారికి గనక తిరిగిఇచ్చేస్తే అనవసరంగా ఇట్టే ఖర్చయిపోతుంది. ఈమధ్య ఆయన కిళ్లీలూ సిగరెట్లూ—కాఫీలు కాస్త తగ్గించారు" అంటూ ఆమె తను ఆ సొమ్ము కూడబెట్టినవిధానం అంతా సమగ్రంగా చెప్పింది.

మొత్తంమీద చాలా పెద్దపట్టు పట్టావే—" అన్నది కాత్యాయిని ఆవిడ చేసిన కృషిని అభినందిస్తూ.

ఆరోజు సాయంకాలం కాత్యాయినే మీనాక్షమ్మను వెంట పెట్టుకొని వెళ్లింది బజారుకు.

"ఎక్కడికే—అని గానీ—ఎందుకే అని గానీ అడగడానికి మీనాక్షమ్మకు ధైర్యం చాలక ఊరుకొంది.

కాత్యాయిని సరాసరి ఆమెను వెంటబెట్టుకు తీసుకొని వెళ్లింది.

వాళ్ళిద్దరూ వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ నడిచే వచ్చారు.

*   *   *   *

ఆరాత్రి భోజనాలప్పుడు కాత్యాయిని దగ్గిర వుండి మీనాక్షమ్మచేత నాగేశ్వర్రావుకు వడ్డింపించింది.

మీనాక్షమ్మ నెయ్యి వడ్డిస్తూండగా ఆ కంఠం పైన కొంచెం ముందుకు తూలి-తిరిగి కంఠాన్ని అంటుకొని అందంగా తళతళా మెరుస్తున్న గొలుసువంక చూశాడు నాగేశ్వర్రావు. "ఎవరి దదీ—కాత్యాయినిదా అది" అని అడిగాడు కాదేమో అని అనుమానిస్తూనే.

"కాదు" అన్నది మీనాక్షమ్మ నవ్వుతూ. నాగేశ్వర్రావు కొంచెం ఆశ్చర్యపోయాడు.

అందుకు కాత్యాయిని సంతోషిస్తూ "అవునండీ—అది ఆవిడకే. ఇవ్వాళే కొన్నాం. బాగుందా" అని అతను సమాధానం చెప్పకముందే లోపలకు వెళ్లి ఒక వెండిపళ్లెం—అందులో ఒక వెండి కొమ్ము చెంబూ పెట్టుకొని తిరిగి వచ్చింది.

అత నవన్నీ చూచి సంతోషిస్తూ "అయితే ఇదంతా మీ పనన్నమాట" అన్నాడు.

అవునండీ - నేనా చీర కొందామంటే వద్దని మీ చెల్లాయిగారు ఇల్లా ఖర్చుపెట్టారు. మొత్తంమీద ఆ డబ్బు ఖాళీ" అన్నది మీనాక్షమ్మ నవ్వుతూ.

కాత్యాయిని కొంతసేపయిన తర్వాత ఇల్లా అన్నది "చూడు వదినా—ఇవైతే నాల్గుకాలాలపాటు పడివుంటాయి. విలువా వుంటుంది. ఉపయోగమూ వుంటుంది. అదిల్లా ఉంచు-మరో విషయం చెప్పనా" ఎప్పుడైనా ఏదైనా అవాంతరంగా డబ్బు అవసరమైతే ఇవి తాకట్టుపెడితే తేలిగ్గా అరవయ్యో డెభ్భయ్యో వస్తాయి. ఆ చీర అయితే ఇట్టే పోతుందీ—తాకట్టుకూ పనికిరాదు. అయినా ఆ మెరుపులు మనకు దేనికమ్మా!"

కాత్యాయిని అనుభవజ్ఞతకూ—జాగ్రత్తకూ ఆశ్చర్యపోతూ ఆనందించాడు నాగేశ్వర్రావు.

"ఈసారి పురిటికి వదినగార్ని మా యింటికి తీసికెళతానండీ అన్నగారూ" అన్నది కాత్యాయిని.

అతను చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు భార్య వంక చూస్తూ.

అతను భోజనం చేసివెళ్ళి హాల్లోవున్న కుర్చీ బల్లా అవీ తీసికొనివెళ్ళి ముందుగదిలో సర్దాడు. తన ప్రక్క తీసికొని ఆ గదిలోనే పరుచుకొన్నాడు. ఆడవాళ్ళిద్దరూ ఆ హాల్లో పడుకోడానికి సావకాశం చేకూరుస్తూ.

భోజనా లయ్యాక వంటయింటి తలుపు తాళం వేసి కాత్యాయిని అన్నగారికి మంచి నీళ్లూ తాంబూలమూ పంపింది.

మీనాక్షమ్మ అంతకాలంగా తన్ను వేధించిన అర్థంలేని అకారణమైన బాధ అంతంకాగా నిశ్చింతగా చిరునవ్వు నవ్వుతూ—వాలుజడలోని పువ్వులు సర్దుకొంటూ అతను కూర్చున్న కుర్చీదగ్గరకు వచ్చి తాంబూలం అందించి పొంకంగా సత్కరించింది.

అతను ఆమెవంక చూసి చిరునవ్వు నవ్వాడు. పుస్తకం మూసేసి బల్ల ముందుకు జరిపి, ఆమెదగ్గరగా ఎదురుగా వచ్చాడు.

ఆమె నెమ్మదిగా వెనక్కి జరిగి ముక్కుమీద వేలు వేసుకొని నవ్వుతూ నిలబడింది.

ఆమె ఏదో అన్నట్లనిపించిం దతనికి.

అతను ఆహో అల్లాగా అన్నాడు.

సరసకావ్యంల ంటి చమత్కారాన్ని విని ఆనందంతో విశాలమై—రసమయమై ప్రశాంతమైన ట్లనిపించింది అతనిహృదయం. అతనక్కడే నిలబడ్డాడు.

ఆమె మెల్లగా హంసలా హాల్లోకివెళ్లి తలుపు వేసుకొంది.

ప్రక్కగదిలోనుంచి వినపడుతున్న గుసగుసలూ పకపకలూ వింటూ నిద్రపోయాడు నాగేశ్వర్రావు.

మరునాడే కాత్యాయిని ప్రయాణమై మీనాక్షమ్మ సామాను సర్దింది.

బండిలో సామాను సర్దాకకూడా మీనాక్షమ్మ వెనక్కువచ్చి భర్తతో ఏదో చెప్పబోయి సిగ్గుపడి ఓ క్షణం నిలబడింది.

రావమ్మా వదినా—కూతుర్ని ఎత్తుకొని వేగిరం వచ్చేద్దువుగానిలే. రా రా. అని పిల్లల్నిద్దర్నీ బండీలో కూర్చోబెట్టి తనూ ఎక్కింది!

పెన్నేటిపాట

శ్రీ విద్వాన్ విశ్వం

(గత సంచికతరువాయి)

నాల్గవసర్గ

గబ గబ బువ్వన్ నాలుగుకబళమ్ములు మ్రింగి, రెడ్డిగారింటికి, రో
జు బరాతమురాగా, కడవ బుజానంబెట్టి యూరబావికి వెడలెన్.

పోటుకడవ గుండెపోటువచ్చును నింపియెత్తుకొన్నమాత్ర; నింక ఏడు
మట్లలోతునుంచి మెట్లనెక్కుటయన్న నెంతకండయున్న నేమిఫలము ?
ఎన్నికడవలుపోసిన నెంతపెద్దదౌతుఖానాయొకాని, పైపైకైనరావు;
అన్నినీళ్లేమి సేతురో ఉన్నవారు; పాప మా రంగనికి బోధపడనెపడదు.

మాటయేగాని పీరిచ్చుమాటలేదు, ఏటిపట్టెలపాలేమొదాటిపోయె;
పూట కొకముంత మజ్జిగబోతు రంతె, పేదవానికదే అమృతోదనంబు.

కూరనార వానిపేరైన దెలియదు, మెరపకాయకంటె దొరకదేమి;
ఉల్లిగడ్డముక్క, చల్ల యివొక్కటే, సాదమందు వారి సాధకములు.
దేవళాలుతిరుగగాన, బావిసేవ మొదలు;
దోవ అఱిగిపోయి, గుండె చేవదప్పవఱకు.
మఱియురసవట్లు, రోకలి దరిసెనమయ్యెన్ సరే! మొదల్పగులగ నా
వరున ముగించెదునరి, కస్త రవిప్రభ ఊరి నేత్రసంద్రము జేసెన్.

లాందరాలుతుడిచి, లాంపులుముట్టించి, మిద్దెమీద వరుసమిగులకుండ
మంచములనువేసి, మనిషెత్తుపరుపులు దులిపి, పఱచి, దోమతెరలగట్టె.
ఈయింట నున్నంత సేపు, కోయన్న కోటిసామాను,
ఈయిల్లుదాటితేనేమొ, ఆయెత్తితే ఆయుసీను.

ఈయింట నేమూలనైన, చేయిపెట్టిన రాల్ వరాలు,
ఈయిల్లుదాటితే నేమొ, వే యంచుల్ దెగు నరాలు.

ఈయింట నేపెట్టినైన, ఈయూరి సిరులెల్ల పూచు,
ఈయిల్లు దాటి పారాడ, ఈయూరికడగండ్లు వేచు.

ఈయింటిలో తొంగిచూడ, ఈయూరిచెమట నీరాడు,
ఈయూరిలో తొంగిచూడ, ఈయింటిభూతమ్ము నీడ.

ఈయింట చలువరా లిమిడిచిచెక్కిన నేలపై నీ నీడవాలు దోచు;
ఈయింటనున్నట్టి యిటుకగోడల పాలగారలో అద్దాలుగలిసిపోవు;
ఈయింటిమహాడీల నెక్కినచానల వేసవిలో మబ్బుసోనలూరు;
ఈయింటదిరుగాడు నింతిపిల్లియు, నూరి పెద్దరైతుల నిల వేయజాలు;
ఇచట త్రేన్పులెగాని విన్పించవూర్పు, లిచట రూకలగలగల లెత్తిపోవు;
ఇచట లక్ష్మీసరస్వతులే వసింతు, రిచటలేనిది మానవహృదయమొకటె!

ఈయింటియజమాని యెంతొ విద్యావంతు, డెపుడు భాగవతమ్మునే పఠించు;
ఈయింటియిల్లాలు పూయించు గన్నుల, కొల్లలుకొల్లలు మల్లెపూలు;
ఈయింటికొడుకొక్క డింగ్లాండులో ప్రజాస్వామ్యశోధన నెంతొ-జరిపివచ్చె;
ఈయింటికూతురు పోయినయేడె, సాంఘికశాస్త్రమున పట్టమొకటిగొనియె;

ఎచటజూచినచిత్రాలు, నెన్నొశిల్పఖండములు గనిపించు, నెక్కడను మలిన
మన్నదే లేదు; కాని సంపన్నగృహము జొచ్చిచూచిన నాత్మయే-శూన్యమిచట.

మున్నూరుమట్టిమిద్దెల, క్రొన్నెత్తములెల్ల దీనికొత్తలరుగుల్
దన్నగలే విదియొకటే ఉన్నది ఊరెల్లగ్రమింగి యుబ్బినట్లుగన్.

కోటికొక్కరిది యిచ్చోటి రాయలసీమ, పేట కొక్కడలేని పెద్దరాయలసీమ
వేటాడివేటాడి వెదకినా యిందులో, నేటిపేదలసీమ నిజరూపు కనపడదు.

ఇది ఎడారిలోని ఒయాసిస్సే కానివ్వ,
వడగొట్టినవానికేమొ పట్టిఎండమావు.

ఇంతధనమున్న, చదువున్న, నింతబలగమున్న, నీ యింట నెవరికి సున్న హాయి;
ఒక్కొకరు నొక్కలోక, మొక్కొకరిదొక్కతీరు, నెయ్యమ్ములిచట-ప్రాదెనుగులయ్యె.

ప్రొద్దుపోకకె చదువు, ప్రొద్దుపోకకె నులివు;
ప్రొద్దుపోకకె మెదుకు, ప్రొద్దుపోకకె బ్రదుకు.

మొద్దుబాఱెను మనసు, మొద్దువాఱెను తనువు,
మొద్దువాఱెను బ్రదుకుసుద్దియే యిచట.

ఎటుచూచినా ప్రక్కలెండియున్నారు,
ఎటుచూచినా విలాపించుచున్నారు-
ఎటుచూడలేక తమకిటికీలు మూసుకొని
కటుజీవితయథార్థకథ జూడకున్నారు.

చుట్టుంజుట్టు దరిద్రతావిధురసంక్షుబ్ధక్షు దంబోధిపై
తెట్టుంగట్టు నుఱుంగుకొంప యిది; బోదెల్ పాదులుం గుళ్లె; నీ
పుట్టిఁ మోసెడువారు పీన్గులయి రేపోమాపో చానుండ, ఏ
రెట్టిఁ నిల్వరు; చూచుకోరు దరు, లల్లేచుక్కలఁ జూచుచుఁ.

దారుణకల్మషదగ్ధమారుతో। చ్ఛ్వానరోదసీక్షుద్రభూమిపై
ఘోరనారకక్రూరజ్వాలా । ఘూర్ణమానసంచూర్ణమాన బా
ధా ధరాధ రాధిత్యకపై, జంబూకరోదనాపూర్ణస్మశాన
శాన్తచ్యుతాస్థికాశిఖరముపై-
ఎట్లునిలుచు నీకృత్రిమలోక, మెట్లు నిలుచునీకృత్రిమ జీవ
మెట్లునిలుచు నీకృత్రిమహృదయ, మిట్లిట్లే చిట్లి పెట్లిపోవును.

పరిసరాలు దరిద్రతాపరిదగ్ధముకాగా
నరిసరాళి నరాలన్ని పురుగుపట్టిపోగా,
ఉరికి అర్వలేక, పురుగు తరిమివేయలేక
ఉరిమిచూచుచుంట వట్టి దరిబేసితనమ్మ.

ఎచటికోపోవుచుండి కాసింత సేపు- ఆగియున్నట్టు లుందురీ ఆస్తిపరులు
పలుకరించ రెవ్వారి; సంజ్ఞలవెలార్చి ఉత్తరువులిత్తు రంతియే యూడిగముల.

ఇంటిముసలమ్మమాత్ర మాపెంటదరిని, కుక్కిమంచమ్ములో పడుకొని ఒకపుడు
రంగనిం బిల్చిమాటాడు పొంగిపోయి, వీనినాన్న నెఱింగిన వెట్టి దామె.

పనిముగించి రంగ, డనుదినవర్తన- పుల్లగూరకొంత, చల్లకొంత
తీసుకొని, రవంత తెఱపి వచ్చెనటంచు, నింటిముఖముపట్టె నిట్టిపోలె.

మాటుమణిగిన దూరు, నిర్మానుషములు దారులన్నియు, చాకలిగేరిలోన
మటుకు, మగనిగుద్దులుదిన్నమల్లియేడ్పు, నూరకుక్కలుమాత్రమే ఊరడింప.

పెన్నేటి పాట

చీకటిముంచివేసినది చింతలపల్లెను, గుట్టకొంప ముం
దే, కదలేనిటా, లదుగుకీసి ఒకించుక ముందువేయుటే
నాకము నెక్కునంతపని, నాలుగుబారలకొక్కగుంతలో మి
ట్టో కనిపించు, వాడుకనెటో నడువన్ వలె మెల్లమెల్లగన్.
గూటిలో దీపమును బెట్టి నోటిలోన కబళముం బెట్టుకొందు రీ గ్రామజనులు;
అంతచుక్కలవెలుతురేమైనజాలు, వారికనులకుగనిపించు వస్తుతతులు.
అసలు దీపము ముట్టించునంగణములె చాలతక్కువ; ఉన్నదీపాలుగూడ
తమ్ముదామ జూపించుకోదగినజాలు, నన్నివస్తువులం జూపినంతఫలము.

ఒక్క కోమటిసుంకన్న, ఒక్క బట్టలచ్చుమయ్య, పంచాంగము రామశాస్త్రి,
ఒకసరాబు వీరాచారి, ఒక్క భజనగురువు - వీరిండ్లలోననే ఉరువుదివ్వె.
ఊరిముందట కరణముగారివిడిది, ఊరికాదట రెడ్డిగారున్నమేడ—
ఉన్నవనితోచు రాత్రుల; ఊరుమొత్త మంధకారాంతరమ్ములో నావులింప.
వేకటిచీకటి ఆకటికూకటివిరియించి రాత్రి గుబగుబలాడున్
మూకటిపగిలిన బ్రదుకులు, రోకటిమనుగడలు మాత్ర-రొప్పుచు నాడున్.

అక్కడక్కడ, నొక్కొక్క ప్రక్కనందు మోటులో మాటులో తెప్పపాటునిలిచి,
మోటుజీవాలతొందరపాటుగన్న - ఏటిబ్రదుకిదియని ఏవగింపగల్గు!
దయ్యమ్ముపోలె చీకటి- గొయ్యిని ముసుగుందగుల్చుకొనిఒక్కం, డా
వయ్యారిబసివి కొట్టముకొయ్యన్ గదలించె; కుక్క కొయ్యోయ్యమనియెన్.

వామిదొడ్లలోన దోమలగుంపులో - పాముపుట్టప్రక్కపండుకొన్న
పసలపిల్లవాడు, భయపడి యెనుముల - ప్రక్కజేరి తోకబట్టుకొనియె.
దుబ్బనాగిరెడ్డి దూడరాలేదని - వెదకబోయె ధొరువుపొదలలోన,
గూనిసుంకిరెడ్డి, గొడ్డు బందెలదొడ్డి - లోనపడినదన్న బ్రమానువడియె.
రచ్చకట్టమీదరామన్నసుబ్బన్న - వఱపుతప్పదనుచు వంతపడిరి.
బోయ చిన్నిగాడు బారుగులరంగమ్మ - అప్పుపెట్టదనుచు నఱచుచుండె.

సుంకలమ్మ పసులచొప్పదీయుచునుండ - తేలుగుట్టె నెడమకాలిమీద,
మంతరించమనుచు మరియప్పదరికేగ - గొత్తెచచ్చి వాడు గొణుగుచుండె.

సంతలోన సరుకుదొంతర నెత్తించి - బండిలోనవచ్చు బద్దరయ్య,
వల్లలేనిమొద్దు వాటువేసిన, గొంతు - చించుకొనుచునుండె చెడితిననుచు.
సందుమూల గుంపు కందిరీగలవోలె - తిరుగుచున్నవారు; బరువుగొంతు;
కడుపుతఱుగు నేడ్పు, కళవళపాటులు - రంగ డేమిటనుచు తొంగిచూచె.
ముసలిదై మంచముంబడి మూడేండ్లు; రాత్రిగడవదనెను రామదాసు,
ఇంటిమనిషి నాగి ఈరోజు కన్నది - ఆకుదేను బోయెనంట వాడు.—
పురుగుకుట్టెనంట, సరసన్న నోటిలో - నురుగుచువచ్చుచుండె, సొరుగువచ్చె;
నోటికొక్కమాట, బాటపల్లెకువెళ్ళి - మంత్రగాని దెచ్చుమార్గమేది?
రొమ్ముగొట్టుకొనుచు రోదించు నాగిని, వట్టిమాటలాడువారి జూచి,
'నేనుపోయి మంత్రగాని దెత్తు' నటంచు - ముంత నచట బెట్టి పుంతబట్టె.
పాముగఱచెను నేడమావాస్యగూడ, కష్టమేనని రామయ్య కట్టమీద,
గూరుచుండియనెఁ బోవువారితోడ, ఆకుమూటలో నున్న పొగాకు దీసి.
మూలపున్న మైనమరుసనాడేకదా - పాముగఱచిచచ్చె రాముడనుచు.
సాలె 'నారణమ్మ' చాలవిచారించి - కట్లపాడిని నోటగలుపుకొనియె.
రంగడొక్కొక్కటే విని, రగులుకొనుచు - చెంగునెగజెక్కి - బ్రరయుచేత లేక
ఆ తమోగర్భమునబడి యరుగుచుండె - భయముతోచదు కర్తవ్యభారమున్న.
గుండెతీసినబంటైన, కొండదోవ - కనుమదాటి చీకటిబడి చనుటయన్న
ఒప్పుకొనలేడు; కాని ఆముప్పుజూచి - తప్పుకొనలేదు రంగనిగొప్పమనసు.
కన్నుపొడుచుకొన్న కనరానిచీకటి - పురుగుపుట్ట యిచట పుట్లకొలది,
అసలువాడు దారినైనచూచుటలేదు - కలదుదృష్టి మంత్రగానిమీదె.
కళ్ళలోన మెదలు గంగమ్మసంగతే తట్టలేదు; రంగ డుట్టిపాటు
పయనమయ్యె రెండుపరువులపల్లెకు; ఎదకలంగునప్పు డేది నిలుచు?
ఊరుమండిపోవుచున్నసరే రెడ్డి- గారిమేడమీద; భారతమ్ము
రాగళయ్యతో పురాణమ్ము జెప్పును - రామశాస్త్రిగారు రాత్రిరాత్రి.
ఊరిబయటకు వినిపించుచుండె. నతని - పెద్దగొంతుక ఊరెల్లదద్దరిల్ల,
"తనకుదోడయివచ్చును ధర్మమొకటె" అన్నమాటయొక్కటె కొండ-యనువదించె.

సశేషం

ఆంధ్రాంగ్ల నవలలు

తారతమ్య పరిశీలన

శ్రీ వా. వె. ల. నరసింహారావు

గతంలో లేనిది వర్తమానంలో ఏమీ లేదని ఊరక పరవశించిపోయే పురాబుద్ధిజీవులు మనలో నే కాక ప్రపంచంలోని ప్రతిజాతిలోనూ ఉన్నారు. 'నవల' పుట్టుకనుగూర్చి ఊరక ఆలోచించి ఆలోచించి హోమర్ సృష్టించిన ఒడిస్సీ యూరపు తొలినవల అన్నారు కొందరు పాశ్చాత్యవిమర్శకులు. ప్రాచీన కాలంలో గ్రీకుదేశీయులు గ్రీకువీరుల సాహస కృత్యాలు కమ్మనికథలరూపంలో తమ సైనికులు ఆలపించగా పారవశ్యంతో వినివుండవచ్చును. మహావీరుడైన ఒడిస్సియస్‌లో వీరోచితలక్షణాలెంతగా పుంజీభూతమై వున్నాయో కళాప్రవృత్తికూడా అంతగా పుంజీభూతమై వుండవచ్చు. కాని అంత మాత్రంచేతనే 'ఒడిస్సీ' యూరపు తొలినవల అయితే మనంకూడా ఒకడుగు ముందుకువేసి భారతీయుల తొలినవల భారతమే అనవచ్చును. కాని వీటివల్ల ప్రయోజనమేమీ లేదు.

శబ్దస్వరూపాన్నిబట్టి పరిశీలిస్తే[1] 'నవల' అన్నది కేవలం పాశ్చాత్యసంప్రదాయానికే సంబంధించింది, అనక తప్పదు. పాశ్చాత్యదేశంలో మధ్యయుగపు సాహితీశాఖల్లో ఈ నవలకూడా ఒకటి. దీనికి సరిగా మూలరూపం నొవెల్లా అన్న ఇటలీపదం. దీనికి నిఘంటువులిచ్చిన అర్థం ఇది. 'స్త్రీ పురుషుల జీవితవృత్తంలోని విశిష్టభావావేశములయొక్క వాస్తవికచిత్రాన్ని అందించే కల్పితమైన వచనకథ' అని. ఈ 'నొవెల్లా' అనే సాహితీశాఖ ఇటలీలో వచ్చినట్లే ఫ్రాన్సులో కూడా ఫాబ్లియో అనేశాఖ ఒకటి ఏర్పడ్డది. సాధారణంగా నిందాగర్భితమైన వస్తువుతోగూడి ఛందోబద్ధంగా ఉండే కథాగతి గల రచననే వారు ఫాబ్లియో అన్న పేరుతో పిలవడం కద్దు. ఫాబ్లియోకు నొవెల్లాకు అంతరం చాలా కనిపిస్తుంది. 'నొవెల్లా' లో కల్పితకథతోగూడిన వచన రచన, స్త్రీ పురుషులు, జీవితముయొక్క వాస్తవిక చరిత్ర, భావావేశ నిరూపణము, పాత్రచిత్రణము మొదలైనవి ముఖ్యలక్షణాలుకాగా 'ఫాబ్లియో' లో నిందాగర్భిత కథాగతి మాత్రమేకాక ఛందోబంధం అన్నది ఒకటి విలక్షణంగా ఉన్నది.

ప్రస్తుతం వచనరూపంలో ఉన్న నవలలన్నింటినీ ఫిక్షన్ అన్న సాహితీవిభాగంలో చేర్చడం జరుగుతున్నది. గ్రంథాలయాలలోకూడా పుస్తకాల పట్టికలో వచన రూపంలోని నవలలన్నిటికీ పైన పెద్ద పెద్ద అక్షరాలతో గుడ్డిగా 'ఫిక్షన్' అని వ్రాసేస్తూ ఉంటారు. కాని పాశ్చాత్య విమర్శకులు ఈ పదాన్ని ఇంత సంకుచిత దృష్టితో ప్రయోగించలేదు.

"*A fiction is the invention of imaginary existances and events and obviously it enters as an element into most literary forms and notably into poetry and drama.*"

---

1. అర్వాచీనాంధ్రవాఙ్మయంలో "నవలా నాకానోక మరున్నారీశిరోరత్నముల్", "నవలా నవలాలిత దృష్టిజాలముల్" అని మనుచరిత్ర, వసుచరిత్ర మొదలైన ప్రబంధములలో ప్రయోగములు కనిపిస్తున్నాయి. ఇందలి 'నవలా' అన్న పదానికి 'స్త్రీ' అనిమాత్రమే అర్థం. సాహితీపరంగా ప్రయుక్తమౌతున్న 'నవల' అన్న పదానికీ దీనికీ ఏమీ సంబంధం లేదు.

ఈ నిర్వచనాన్నిబట్టి పద్యకావ్యాలు, నాటకాలు కూడా 'ఫిక్షన్'లో అంతర్భాగాలు కావలసి వస్తున్నవి. ఇంతటి విశాలమైన అర్థం ఉన్నది కాబట్టే 'ఫాబ్లియో' అన్న సాహితీశాఖలో ఛందోబంధం అన్నది అనివార్యంగా కన్పిస్తూంది. అయితే హాజ్లిట్ వంటి ఆధునిక విమర్శకులీ నిర్వచనానికి కూడా ఒక పరిధి ఏర్పరిచారు. 'ఫిక్షన్' అయినదల్లా కేవలం అభూత కల్పన కానక్కర్లేదు. అందులో ఊహా రెక్కలు విప్పుకొని పరువులెత్తవచ్చు. ప్రకృతి సన్నివిష్టములైన సత్యాలను ముక్కకి ముక్కగా దించకుండా కొంచెం కవితావాసన సోకించి వదలాలన్నారు.

వీని అన్నింటినిబట్టి చూస్తే—కవితావాసన, కాల్పనిక దృష్టి, కథాఘటన, సన్నివేశసృష్టి—మొదలైన లక్షణాలన్నీ ఉన్న మన కళాపూర్ణోదయాన్ని 'ఫిక్షన్' అన్న సాహితీశాఖలో చేర్చవచ్చు. అంత మాత్రంచేత దాన్ని 'నవల' అనడానికి వీలులేదు. ఒడిస్సీని యూరపు తొలినవల అనడం ఎంత సముచితంగా ఉంటుందో ఇదీ అంతే సముచితంగా ఉంటుంది.

ఇంగ్లీషు సాహిత్యంలోకూడా వచనరూపంలో సరియైన 'ఫిక్షన్'కు ఉదాహరణంగా చెప్పదగ్గ రచన ఏర్పడ్డది 14 వ, శతాబ్ది మధ్యభాగంలోనే! 'సర్ జాన్ మాండెవిల్' వ్రాసిన 'బుక్ ఆఫ్ ట్రావెల్స్' అన్న ఫ్రెంచి గ్రంథముయొక్క అనుకృతే ఇంగ్లీషులోని తొలివచన రచన అనవచ్చు. ఇందులో రచయితయొక్క అనుభూతి, కల్పన, రెండూ ఇమిడి వున్నాయి. ఆటుతర్వాత క్రమంగా థామస్ మేలరీ, జాన్‌బనియన్ మొదలైనవారు వ్రాసిన మార్ట్ డి ఆర్థర్ పిల్గ్రిమ్స్ ప్రోగ్రెస్ మొదలైన గ్రంథాలు సన్నివేశము, పాత్రలు, సంభాషణ, వర్ణన, కథాఘటన మున్నగు లక్షణాలతో 'నవల' స్వరూపానికి కొంత చేరువగా వచ్చాయి. డేనియల్ డిఫో వ్రాసిన 'రాబిన్‌సన్ క్రూసో' మొదలైనవి 'నవల'కు మరింత చేరువగా వచ్చినా తీవ్రమైనవీ, శక్తిమంతమైనవీ సంభాషణలున్నాయే కాని పాత్రలూ సన్నివేశాలూ, అవయవ సౌష్ఠవమూ మొదలైనవానిలో కొన్ని లోపాలు లేక పోలేదు. ఆంగ్లంలో సర్వలక్షణ సమన్వితమైన తొలి నవల ఏదని అడిగితే—కథాగ్రంథి విప్పడంబట్టి కాని, స్త్రీ మనస్థితులు చిత్రించడంబట్టి గాని వర్ణనా వైశిష్ట్యంబట్టిగాని—శామ్యుయల్ రిచర్డ్‌సన్ వ్రాసిన పామెలా, ఆర్ వర్చ్యు రివార్డెడ్ అనవచ్చు. రాను రాను ఫీల్డింగ్, సర్ వాల్టర్ స్కాట్, హెచ్. జి. వెల్స్, జాన్ గాల్స్‌వర్దీ, అతి నవ్యులైన డి. హెచ్. లారెన్స్, వర్జీనియా వుల్ఫ్, మున్నగువారి రచనలతో ఇంగ్లీషు సాహిత్యంలో 'నవల' సుపరిపుష్టమై సమగ్ర స్వరూపంతో వెలిసింది.

ఇక మన సాహిత్యంలో నవలవికాసం ఎల్లాగున్నా వచన రచన ప్రారంభం కావడానికే, 19 వ, శతాబ్దంవరకూ పట్టింది. మన చంపూ గ్రంథాల్లో వచన మనే భాగం ఒకటున్నా ఉత్కలిక, చూర్ణము, లలితము, వృత్తగంధి, ఖండము, చిత్రము మొదలైన లక్షణాలతో ఛేకానుప్రాసాలు, యమకానుప్రాసాలు తలమునపై ఇది వచనమా, దండకమా అన్న భ్రాంతి గల్గించేవిగా ఉన్నాయి. మొత్తంమీద ఛందోనిగళం ఊడదన్నుకు బయటపడ్డ 'ఆధునిక వచనం' అనడానికి వీలుగాఉన్న రచన వీరేశలింగం పంతులుగారు రంగంలో అడుగుపెట్టేవరకూ లేదంటే తప్పులేదు. తెనుగులో అన్ని సాహితీశాఖలకు పునాదులు వేసినట్లే 'నవల' సాహిత్యానికి కూడా పునాదులు వేసినవారు పంతులుగారే!

పాశ్చాత్య నాగరికత, సంప్రదాయం, సాహితీ ప్రభావం, భారతదేశంలోని ఇతర ప్రదేశాలన్నింటికంటే వంగదేశంలోనే ముందుగా ప్రాకేవి. కవిత్వంలో కాని, చిత్రలేఖనంలో గాని, మరియే యితర లలితకళలలో గాని పాశ్చాత్య ప్రభావానికి ముందుగా లోగింది వంగదేశీయులే! సాహితీ స్వరూపం ఎరువు తెచ్చుకున్నందువల్ల నష్టమేమీ లేదు కాని సాహిత్యమునకు అంతస్సారమైన జాతీయతాదృష్టిమాత్రం జారనీయకూడదు. అదే సాహిత్యానికి కండపట్టు. వంగదేశీయులు పాశ్చాత్యులను సాహితీ విషయికంగా అనుకరించినా జాతీయతాదృష్టిమాత్రం జారనీయ లేదు. అందువల్లనే వారి సాహిత్యానికి ఒక ప్రత్యేక గౌరవం కల్గింది. భారతదేశంలో వంగదేశంలో మొదటి నవల రచనకు పునాదులువేసిన గౌరవం బంకించంద్ర ఛటర్జీకి దక్కింది. ఈయన తత్కాలపు వంగదేశ సంఘజీవనం, రాజకీయ పరిస్థితులు, జాతీయతాకాంక్ష ఈ మూడింటినీ దృష్టిలో, ఉంచుకొనే నవల రచన ప్రారంభించాడు. ఈయన వ్రాసిన 'ఆనంద మఠ్', మున్నగు నవలల్లో ఈ లక్షణాలు

ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. అటు తర్వాతనే టాగూరు, శరత్ మున్నగువారు క్రొత్తపుంతలు త్రొక్కి నవల రచనకు వికాసం కల్పించారు. నిజానికి నవల రచనలో తెలుగువారికి ఆవేశ మివ్వడానికి ఇంగ్లీషు సాహిత్య మెంత కారణమో వంగసాహిత్యం కూడ అంతే కారణం. కాకపోతే ఈ వాటికి వంగ భాషనుండి యిన్ని నవలలు తెలుగులోకి పరివర్తితము కానక్కర్లేకపోయేది.

ఇంగ్లీషువారి పాలనలో విద్యాబోధన అంతా ఇంగ్లీషులోనే జరగడం, అందులోనూ ముఖ్యంగా కొన్ని ఇంగ్లీషు నవలలు భారతీయవిద్యార్థులు పాఠ్యగ్రంథాలుగా విధిగా చదవవలసిరావడం, కారణంగా భారతీయులకు ఇంగ్లీషు నవలలోని నవ్యత బాగా మనస్సుకు పట్టింది. కల్పనాశక్తి, ప్రతిభ గల విద్యార్థులు కొందరు 'మన భాషలోమాత్రం యిట్టి నవల రచన ఎందు కుండకూడ'దని నవలల సృష్టికి పూనుకున్నారు. ఈవిధంగా పూనుకున్న వారిలో పంతులుగారే ప్రథము లనవలసిఉంది. వీరికి ఆవేశాన్నిచ్చిన గ్రంథము ఇంగ్లీషులో గోల్డ్ స్మిత్ వ్రాసిన వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్. పంతులుగారు చాలా జాగరూకతతో గోల్డ్ స్మిత్ నవలలోని కథాసంవిధాన పద్ధతి, పాత్ర పోషణ విధానమూ అనుసరించారే కాని సన్నివేశాలు పాత్రలు మాత్రము తెలుగు జీవితంనుండే గ్రహించారు. అసలు గోల్డ్ స్మిత్ కూడా తన కాలంలో అట్టి నవల రచన ఎందుకు చేయవలసివచ్చిందో కూడా బాగుగా అవగతం చేసుకున్నారు. నిజానికి గోల్డ్ స్మిత్ ఇంగ్లీషు నవలల్లో ఒక క్రొత్తమార్గమే త్రొక్కాడు. హానోవరియన్ కాలంలోని నవలల్లో చిత్రింపబడివున్న ఇంద్రియ చాపల్యము, నీచాభిరుచులు, స్వార్థపరత మున్నగు లక్షణాలకు వ్యతిరిక్తంగా గోతిక్ నవలల్లో భయంకరత్వం, రహఃప్రవృత్తి మొదలైన లక్షణాలు వృద్ధిపొందాయి. సామాన్య మానవజీవితానికి దూరంగా పోయి రాక్షస ప్రణయం, వింత వింత భయంకర ప్రవర్తనలు గల పాత్రలకంటే నిత్య జీవితంలోని పాత్రలు నవలకు రమణీయత నాపాదిస్తాయని గ్రహించినవాడు గోల్డ్ స్మిత్. అందుకనే 'వికారాఫ్ వేక్ ఫీల్డ్'ను సాంసారి కేతివృత్త సమన్విత నవలగా రూపొందించాడు. ఇంగ్లీషులో 'ఫానీ బర్నీ' వ్రాసిన ఎవిలినకూడా ఇటువంటి నవలే! పంతులుగారు కూడా 'రాజశేఖరచరిత్రము'ను దాదాపు సాంసారి కేతివృత్త సమన్విత నవలగానే సృష్టించారు. హృదయాన్ని గిలిగింతలు పెట్టే హాస్యంతో సంఘసంస్కారదృష్టితో, ఆంధ్ర జాతీయ జీవనచ్ఛాయలు విస్మృతి పాలుగాకుండా రచించారు. 'సర్వాంటిస్' వ్రాసిన 'డాన్ క్విక్జోట్'ను దృష్టిలో పెట్టుకొని వ్రాసిన 'సత్యరాజా పూర్వయాత్ర'కూడా ఈ మార్గంలో నడిచిందే. నిర్మాణ ఫక్కి నిబట్టి మొక్కపాటివారి 'బారిష్టర్ పార్వతీశం' కూడా ఈ త్రోవలో నడిచిందే అనవలసి ఉంటుంది.

అటుతర్వాత, వెంకట పార్వతీశ్వర కవులు వంగవాఙ్మయంనుండి అనువదించిన నవలలు చూచినా, కథాకల్పనం పాత్ర చిత్రణం, తీగ సాగినట్లుండే సంభాషణలూ, చండ్రకోలతో చరిచి కొట్టినట్లుండే చురుకైన వాక్యాలూ మొదలైన వాటిలో మూలగ్రంథకర్త ఎంతటి సామర్థ్యం చూపాడో వీరు అంతకంటె ఎక్కువ సామర్థ్యం చూపి ఒక యుగం యుగం పాలనం చేసే తాహతు సంపాదించుకున్నారు. వీనిలో ముఖ్యమైనది కథా ఘటన అపరాధ పరిశోధన లక్షణంతో సమన్వితమై ఉండడం. కథాప్రారంభంలోనే ఒక సందిగ్ధత! అందులోనుంచి ముక్తుడై బయటపడేసరికి నవల పూర్తై ఊరుకోవడం. మాయావి, మాయావిని, మనోరమ మొదలైనవి జాతికి చెందినవే. ఈ పద్ధతి ననుసరించి ఒక వెయ్యి నవలలు రంగంలోకి దూకాయి. హత్యావినోది, శిశుహత్య, గజదొంగ, పడగపాము, విషజ్వాల, విషకన్య—లెక్క లేనన్ని! వీటికి తోడు మరోరకమైన సాహిత్యం కూడా ఉప్పెనవలె వచ్చి పడింది. నిండు గర్భంతో ప్రసవ వేదన పడుతూన్న భార్యకు మంత్రసానితనం నెరపడానికి వచ్చిన మిడ్ వైఫ్‌తో హఠాత్తుగా ప్రణయకలాపం ప్రారంభించే లారీ డ్రైవరు జీవితమే నవలకు సరియైన ఇతివృత్తమని మురిసిపోయిన కొవ్వలివంటి వారి రచనల వల్ల సాహితీకాంతకు ఉదరం బలిసిపోయింది తప్ప ప్రౌఢగంభీరమైన దృష్టి రసరామణీయకాలా అలవడలేదు.

కాని మహోన్నతమైన భావనాబలంతో, సమగ్రమైన సంస్కృతి విజ్ఞానంతో, నరనరానికీ ఎక్కిన ఆంధ్రాభిమానంతో పొంగులు వారే యువక

రచయితలు—పద్యాలతో గేయాలతో కసరత్తుచేస్తూనే సమాజం ఏ త్రోక్కకు నడుస్తూందో చూడాలని ముందుకు వచ్చినవారున్నారు. ఒక ప్రక్క ఆంగ్ల సాహిత్యంలోని 'నవల' తమను ఆకర్షిస్తూ ఉంటే, ఇంకొక ప్రక్క వంగదేశంలో రోజూ ఒక క్రొత్త నవల ఉద్భవిస్తూంటే చూడబట్టలేక, నిలువ త్రొక్కుకోలేక బాపిరాజు, విశ్వనాథ మున్నగు వారు నవల రచన కుపక్రమించారు.

ఇక వీరి రచనలతో అపరాధ పరిశోధక నవలలూ మొదలైనవి వెనుకకోదిగాయి. ఈ క్రొత్త రచయితలు కథాకల్పనం, పాత్రలు, సన్నివేశాలూ జాతీయమైనవి తీసుకున్నా, నవలశిల్పంలో మాత్రం ఇంగ్లీషు నవలల్ని సృష్టిలోనే ఉంచుకున్నారు. విక్టోరియన్ నవలలు గాని, ఎడ్వర్డియన్ నవలలుగాని జార్జియన్ నవలలుగాని ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా చదివి ఆయా శిల్పవిన్యాసాలు తమ రచనల్లో పొదుగుకున్నారు. అనన్యమైన ప్రతిభావ్యుత్పత్తులు తోడుగా తెలుగులో హిమబిందు, నారాయణరావు, గోనగన్నారెడ్డి, చెలియలికట్ట, మాబాబు, వేయిపడగలు, మొదలైన నవలలు రచించారు.

ఈ నవలలలోని శిల్పం పూర్తిగా అర్థంచేసుకోవాలంటే పాశ్చాత్యనవలలలోని శిల్పంకూడా కొంత అర్థంచేసికోవలసి ఉంటుంది. కథ, సన్నివేశ సందర్భము, పాత్రచిత్రణము, సంభాషణపద్ధతి, వర్ణనలు, వైయక్తికశైలి, ఆత్మీయతాముద్ర, మతరాజకీయ సాంఘిక చారిత్రిక దృష్టులు, మనస్తత్త్వ సమన్వయం, ఇవన్నీ పరిశీలిస్తే కాని ఆధునిక నవలల సమగ్ర పరిశీలనం జరిగినట్లుగాదు. వీని అన్నింట్లోనూ, ఆధునిక నవలల్లో ప్రచురంగా కన్పించెవి మనస్తత్వ విషయాలు. వీటిమీద హ్యూమ్, బెర్గ్‌సన్, ఫ్రాయిడ్ మున్నగు వారుకూడా తమ ప్రభావాన్ని కొంత కొంత ప్రసరింపచేశారు.

నవలయొక్క సాహితీ శిల్ప మంతటిలోకీ కథా సూత్ర మన్నది చాల ముఖ్యమైంది. అసలు సాహితీ శాఖల్లోనే 'కథ' అన్నది చాల ప్రాచీనమైంది. కథ అని ప్రారంభిస్తే పిల్లలుకూడా మంత్రముగ్ధులై కూర్చొంటారు. దీనినిబట్టిచూస్తే 'కథ' అంటే మానవప్రశ్నల లోనే అంతర్భూతమైన ఆసక్తి ఒకటి ఉండితీరాలి. భాషలకు సమగ్ర లిపి స్వరూపం ఏర్పడని రోజుల్లో కూడా మనదేశంలో ఊరూరా కథకులు తిరిగి రామాయణ భారతాది గాథలు మంచి ఒకుపుగా చెప్తూవుంటే సెంద్రుకలు నిక్కపొడిచి, రక్తం ఉబికి ఆవేశంతో పొంగిపోయేవారు గ్రామీణులు. సాహితీ శాఖ ఏదైనా దృష్టి సవ్యమై పలుకుబడి ముచ్చటగా ఉండి నోరు మంచిదై చెపితే రమణీయంగానే ఉంటుంది. అందువల్లనే సత్యతి అన్నది ద్రష్టలోనే ఉన్నదే కాని దృశ్యరూపమగు వస్తువులో లేదంటారు. కథ అనే స్వరూపం ఏర్పరచుకున్నతర్వాత రచయిత సిద్ధహస్తతనుబట్టి నవ్యకళాఖండం బైటికి వస్తుంది.

18 వ, శతాబ్దిలోని ఇంగ్లీషు నవలలను పరిశీలించిన 'జాన్ బక్కన్' వంటి విమర్శకులు కథావిషయాన్ని మూడు భాగాలుగా విభజించారు. వీనిలో మొదటిభాగానికి చెందిన ఇతివృత్తం ఒక వీరుడి సాహసకృత్యాలతో నడిచిపోతుంది. అనామకుడైన ఒకడు లోకమంతా అల్లకల్లోలంచేసి కూరాగ్రేసరుడని పించుకుంటాడు. ఇంగ్లీషులోని గిల్‌బ్లాస్, టామ్ జోన్స్ మొదలైన నవలల్లో ఇటువంటి ఇతివృత్తమే ఉన్నది. దీనినే పికారెస్క్ మోటివ్ అని పేర్కొన్నాడు. మన కాశీమజ్లీకథలలో ఇట్టివి వేనవేలు కన్పిస్తాయి. ఇతివృత్త విభజనంలో అదృష్టవిపర్యయం అన్నది రెండవవిభాగం. అది మహారణ్యం. అందులో దిక్కులేకుండా మఱ్ఱిచెట్టు క్రింద ఒకబాలుడు. మహాప్రవాహంలో గడ్డిపోచ ఆధారం దొరికినట్లు ఒక బాటసారి ఆ బాలుడికి అండ. ఆ బాటసారి ఆ డింభకుణ్ణి ఇంటికి తీసుకుపోవడం. హఠాత్తుగా అతని అదృష్టం తిరగడం. మంత్రాల మఱ్ఱిచెట్టు కొమ్మలు ప్రాకి నాల్గుదిక్కుల రాజుల్ని జయించి అపూర్వసౌందర్య ప్రభాభ్రాజమానయైన రాకుమారిని పెండ్లాడి సర్వప్రపంచం ఏలడం—ఇల్లాంటివి మన శుకసప్తతి, భేతాళపంచవింశతి మొదలైన కథలలో ఇతివృత్తంగా కన్పిస్తాయి. కాని పాత్రల తీర్పుతో, భాషాపాటవంతో, అద్భుత కల్పనలతో గే మానరింగ్, ఐవాన్‌హో, మొదలైన నవలలు, దాదాపు ఇట్టి కథలతోనే ఆంగ్లనవలకు పుష్టి తెచ్చాయి. ఇక మూడవ తెగకు చెందిన యితివృత్తంలో గొప్ప గొప్పవారందరూ గతించిన తర్వాతకూడా తాను

మాత్రం శాశ్వతంగానిల్చిన ఒక అనర్ఘనిజీవితమే ప్రాధాన్యం వహిస్తూంది. ఇంగ్లీషులో ఈజాతికి చెందినవి, "వానిటీ ఫెయిర్", "డయానా ఆఫ్ ది క్రాస్ వేస్" మొదలైనవి. ఇంతకూ ఇతివృత్త విభజనంలో జాన్ బక్లర్ దృష్టి గమనించినకొద్దీ ఈతడు విక్టోరియన్ నవలలకు మూలధాతువును జానపద కథావాఙ్మయంతో ముడిపెట్టి కృతకృత్యుడైనట్లు స్పష్టమౌతుంది. కాని మన తెలుగు నవల సృష్టికి జానపదకథాసాహిత్యం మూలం అని చెప్పడానికి వీలులేదు. నిత్యనూతనంగా ధారావాహికగా ప్రవహిస్తూ మహోల్బణంవలెవచ్చిన ఆంగ్ల వంగ సాహితీ రీతులు గమనించి తెలుగు నవల స్వత్వం జారనీయకుండా జాతీయమైన ఇతివృత్తాన్ని సంతరించుకొన్నదని చెప్పడం ఉచితం.

కథాసృష్టి అన్నది శిల్పసమన్వితమైన ఒక మహాసౌధనిర్మాణంవంటిది. వాస్తుశాస్త్రబద్ధమైన ద్వారబంధనిర్మాణం, ప్రవేశానికి మార్గం, నిష్క్రమణానికి మార్గం, లోపల రమణీయ రూపకల్పన — ఇటువంటివన్నీ ఉంటేనేతప్ప శిల్పకృతి పూర్తయినట్లుకాదు. పగ్గాలు చేతపట్టుకొని గుఱ్ఱాల్ని మహావేగంతో పరవళ్లు తొక్కించినట్లుగా కథను పరుగెత్తించడం కూడా ఒక శిల్పవిన్యాసమే! త్రోవలో పల్లీపత్తన వీధులు, లౌకికజగత్తు, రమణీయప్రకృతిదృశ్యాలు, — ఏవీ వదిలిపెట్టకూడదు. గుఱ్ఱాలగమనానికి ఇవేవీ అడ్డు రాకూడదు. అప్పుడే గమ్యానికిచేరినట్లు. కథాగమనంలోకూడా నవల రచయిత ఇంతటి సమన్వయదృష్టి ఏర్పరచుకోవాలి. తెలుగులో ఈ సమన్వయదృష్టిగల రచయితలు వ్రేళ్లమీద లెక్కించుటకుమాత్రమే వీలుగా ఉన్నారు. విశ్వనాథ వారి మాబాబు, కడిమిచెట్టు, బద్దన్నసేనాని మొదలైన కొన్ని నవలల్లో కథ విపరీతగమన వేగంతోనే జరిగిపోతుంది. బాపిరాజుగారినవలల్లో కథాగమనంలో ఎక్కువ వేగం కనిపించదు.

మన తెలుగునవల రచయితలు పూర్తిగా విక్టోరియన్ నవలలలోని శిల్పాన్నే అనుసరించినట్లైతే, కథాగమనంగాని, పాత్రల తీర్పుగాని, నవల బాహ్య స్వరూపంగాని చాల భిన్నంగాఉండేవి. విక్టోరియన్ నవల రచయితలు కొన్ని కట్టుబాట్లకులోనై వ్రాసేవారు. మన ప్రబంధాల్లో నాయికానాయకులు, విరహము మన్మథదూషణం ఇంకా ఇంకా....వలెనే, వారినవలల్లోకూడా నైతికపరామర్శ, సన్నివేశం, సన్నివేశంలో సన్నివేశం, నిర్దిష్టపాత్రలు, వర్ణనాసామగ్రి, ప్రకృతిదృశ్యచిత్రణం, ప్రౌఢశబ్దప్రయోగం, బృహద్విభాగాలు ఇంకా, ఇంకా ... అని విక్టోరియన్ నవలలంటే సానుభూతిలేనివారు వారిని కొంచెం అవహేళనచేస్తూకూడా వచ్చారు. విక్టోరియన్ నవలనుంచీ జార్జియన్ నవలవరకూ వచ్చేసరికి రచనాపద్ధతి యంత్రస్వరూపంనుంచీ సహజస్వభావస్వరూపంలోకి పరిణతమైంది. ఈమార్పుకు ముఖ్యంగా కారకుడైనవాడు డి. హెచ్. లారెన్స్. ఈయన ప్రభావంవల్ల వ్యక్తమైన ఈ సహజస్వభావస్వరూపం ఆధునిక నవలలకు చాలవరకు మార్గదర్శకమైనదని చెప్పాలి. ఈ ప్రభావం మన తెలుగునవలలపైనకూడ కొంతవరకు ప్రసరించకపోలేదు.

ముఖ్యంగా నవలకు ఆయువుపట్టు అనదగింది పాత్ర చిత్రణం. పాత్ర చిత్రణమునకూ పాత్ర వర్ణనమునకూ చాలా భేదం ఉన్నది. ఒకటి కేవల నాటక పద్ధతి ఇంకొకటి కేవల వర్ణనపద్ధతి. రెండవదానిలో కంటే మొదటిదానిలో కృతకృత్యులు కావడం కష్టం. పాత్రలను సృష్టించుకోవడంలోనూ, సృష్టించుకొని ఆ పాత్రలతో తాదాత్మ్యం పొంది హృదయపు లోతులు వెలికి తీసుకురావడం, ప్రతి మానుష్యవిషయాన్ని వ్యక్తంచేయడం పాత్ర చిత్రణంలో ఉన్న క్లిష్టత. నాయకపాత్ర సృష్టించేముందు సమాజానికి అతడు ఆదర్శప్రాయంగా ఉండాలనుకోవడం, దయా దాక్షిణ్యాలు, కళాశీలం మున్నగు ఉదాత్త లక్షణాలు కలవాడుగా ఉండాలనుకోవడం ప్రతి నవల రచయిత ఆశించే లక్ష్యం. హిమబిందు నవలలో సువర్ణశ్రీ పాత్ర పరిశీలిస్తాంటే అతనిలో వ్యక్తమయ్యే బ్రాహ్మణ సంప్రదాయం, లలితకళానురక్తి, అచ్ఛాంధ్ర సౌందర్యం — ఇవన్నీ బాపిరాజులో అవ్యక్తంగా అటూ ఇటూ తొణికిసలాడే ఏ ఆదర్శకళాస్వరూపుడో రూపుకొన్నా కనిపించకమానదు. అదేవిధంగా పరమ సనాతన ధర్మ ప్రతిష్ఠాపనాచార్య పీఠానికి పరోక్షంగా అధ్యక్షుడవదగ్గ ధర్మారావులో విశ్వనాథ వారి సుదృఢ పుంజీభూత సనాతన ధర్మమూర్తి కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అయితే ఈ ధర్మం లోకానికెంతవరకు మేలన్నది ఇక్కడ అప్రస్తుతం. పాత్రలతో తాదా

తత్త్వం పొంకేటప్పుడు రచయిత ఎంతవరకు సునిశితంగా ఉన్నాడన్నదే ప్రస్తుతం. నవలలో తనకు అభిమానమైన ఏ పాత్రలోనో తాను ప్రవేశించి నాటకం ఆడడంకంటే ఉత్తమ రచయిత నవలలోని ప్రతి పాత్రలోనూ తానై నిల్చి పలకడం అనేది విశిష్ట విషయం. *"The greater the novelist, in fact, the greatest his alility to project himself into the experience of others, however diverse"* అన్న ఈ వాక్యంకూడా అదే విషయాన్ని ఉద్ఘాటిస్తోంది. కాని, ఈ సందర్భంలో రచయిత తాను వర్ణించే ప్రతి విషయం తన అనుభూతికి వచ్చి ఉండాలన్న నియమం ఏమీలేదు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు మాలపల్లిలో చిత్రించిన జీవితానికీ ఆయనగారి నిత్యజీవితానికీ పూర్తిగా సంబంధం ఉండకపోవచ్చు. మానసిక దర్శనం అన్నది ప్రతి రచయితకూ అనివార్యలక్షణం. ఎవరో టాల్‌స్టాయ్ వంటి రచయిత ఒకడు సోల్జర్ జీవితాన్ని చవిచూచిన తర్వాతనే యుద్ధవర్ణనలు అమోఘంగా సృష్టించి ఉండవచ్చు. 'రాబిన్‌సన్ క్రూసో' అను నవల వ్రాసిన 'డేనియల్ ఢిఫో' జీవితంలో నౌకాభంగం ఎప్పుడూ సంభవించి ఉండదు. ఉంటే మనకా నవల దక్కి ఉండేదే కాదు.

మన రచయితలలో ఎక్కువమంది పాత్రలను నవలరంగంమీదకు నాటకీయంగా తీసుకురావడం కంటే వర్ణనాత్మకంగా తీసుకురావడమే ఎక్కువగా జరుగుతున్నది. ఈ ధర్మానికి వెలియై నిల్చినవారు చలంవంటి సమర్థులైన రచయితలు కొందరు మాత్రమే. పాత్రను ప్రవేశపెట్టడానికి ముందు ఒక రెండు పేజీల ఉపోద్ఘాతమన్నా ఉంటుంది. "అతని ముక్కు కొంచెం ఎత్తుతగ్గి కళ్లు మరికొంచెం పెద్దవిగా ఉంటే అంత క్రూరుడివలె కన్పించేవాడు కాడేమో!" ఈ విధంగా ప్రారంభిస్తారు. దీనితో మనకు రూపు కట్టవలసిన పాత్ర అట్లుండగా ముక్కునిండా పొడుమూ గుడ్డలనిండా పొడుమూ చీదుకుంటూ ఆ రచయితగారు ప్రత్యక్షమౌతారు. నిజానికి ఈ జాడ్యం కొంతవరకు విక్టోరియన్ నవల రచయితల దగ్గిర్నించే ప్రాకిందనవలసి ఉంటుంది. పాత్రల నూరక నిలువబెట్టి వర్ణించడానికి వారు తమ స్వత్వమంతా ధారపోశారు. విక్టోరియన్ కాలంలో చివరి రచయిత అయిన 'ట్రాల్లోప్'యొక్క లాస్ట్ క్రానికల్ ఆఫ్ బార్సెట్' అనే రచనలో మిసెస్ ప్రెట్టీమెన్ అనే రెండు పాత్రలున్నాయి. వీళ్ళ ఇళ్ళు సిల్వర్ బ్రిడ్జ్ దగ్గర. కథలో సన్నివేశాలూ పాత్రసంచలనమూ, అంతా ఈ ప్రదేశంలోనే జరుగుతాయి. ఈ యిద్దరి వర్ణనలు నవల అంతటా వ్రేళ్లు ప్రాకినట్లు ప్రాకిపోతాయి. సజీవ చైతన్యవంతములైన వీరి చేష్టలూ సంభాషణలూ కాక రచయిత వీళ్ళను విగ్రహాలను వర్ణించుకుపోయినట్లు వర్ణించుకపోతాడు. అయితే ఆ కాలపు రచనల్లో వీరు మరువరాని పాత్రలట! 'ఆలివర్ ట్విస్ట్'లోని మిస్ట్రిస్ కార్నీ పాత్ర, 'డికెన్సు'యొక్క 'మ్యూచుయల్ ఫ్రెండ్'లోని 'మిస్టర్ పాడ్‌స్నాప్' పాత్ర మొదలైనవి కూడా ఈజాతికి చెందినవే! కావున మొత్తంమీద పాత్రలను రంగంమీదకు పెట్టిన తర్వాత వాళ్ళచేత సంభాషణలు నడిపించడం వారి తత్వాన్ని వ్యక్తం చేయడానికి వాతావరణం, తత్తద్వర్ణనలు సృష్టించడం నవల రచయితలోని లౌకికజ్ఞానం, వాక్చమత్కృతి, భావనాబలం పరీక్ష చేస్తాయి.

వర్ణన లన్నవిషయం స్ఫురించగానే విశ్వనాథవారి 'వేయి పడగలు' జ్ఞప్తికి వస్తుంది. సృష్టిలో ఎంతటి వస్తునిక్షేపం ఉన్నదో అంతటినీ తన కలం క్రిందకు లాగి వేయి పడగల నీడను ప్రదర్శించాడు రచయిత. వెన్నెల, నడికటిల్లు, కూచిపూడివారి సంప్రదాయసిద్ధమైన నాట్యశక్తి...ఒక టేమిటి! సర్వం ప్రదర్శితమైనది. నిజంగా ఒక్కొక్కసారి ప్రబంధ వాఙ్మయంలో ఆముక్తమాల్యద కిచ్చిన స్థానం ఇవ్వాలనిపిస్తుంది నవలల్లో వేయిపడగలకు. పట్టుమని ఒక్క బిగితో పూర్తిగా నవలంతా చదవాలంటే పఠితకు అంతంత మాత్రమైన సమాధి చాలదు. కథాగమనంలో మరికొంత వేగం ఉన్నట్లయితే పఠితృ లోకానికి ఇంకొంచెం సౌలభ్యం చిక్కి వుండేది. 'స్వర్గానికి నిచ్చెనలు' అన్న నవల ప్రారంభంలో ఆ పల్లెలోని ఒక కొండ, ఆ కొండను పరివేష్టించి ప్రవహించే ఒక చిన్న కాలువ,......ఈవిధమైన ప్రకృతి దశ్యాలను వర్ణించేటప్పుడు విశ్వనాథవారి 'ఊహ' అవధులు లేకుండా నడిచింది. ఊహ, భావన విషయంలో ఆధునికులలో ఆయనదగ్గరకు వెళ్ళే అధికారం కొద్దిమందికి మాత్రమే ఉన్నది. ఆ కొండరూపం అంతా ఆయనకు ఒక మహర్షి ప్రసన్నమూర్తిగా తోస్తుంది.

ఇటువంటి అతిలోక భావన, సహజ ప్రకృతిదృశ్య వర్ణనలు వ్యక్తీకరించే సందర్భంలో ఇంగ్లీషు రచయితల్లో 'థామస్ హార్డీ'ని చెప్పి మరి యితరుల్ని చెప్పాలి. 'ది రిటర్న్ అఫ్ ది నేటివ్' అన్న నవలలో ఎగ్డన్ అన్న ఒక పాదకు, తిప్పిదేశానికి మానవత్వం ఆరోపిస్తూ, ఆయన చేసిన వర్ణన ఊహకు నికషోపలం. ఆ ప్రదేశంలో ఆయనకు 'సంగీతనాదం' వినిపిస్తుంది. అదంతా మంద్రానుమంద్రతారస్థాయిల్లో అక్కడి గాలులు పలికే నాదవిశేషం. అనంతా తిప్పిదేశ సాహితీ వైభవం అంటాడు. ఇక స్త్రీలను వర్ణించాడో పరిమాలం శారీరకంగా వర్ణిస్తాడు. 'ఆ అమ్మాయి అంతా ఒక మనోహర శృంగారగీతివలె ఉంటుం'దిట. 'ఆ అమ్మాయిని అర్థం చేసుకోవాలంటే శ్రుతి లయలకుండా పరిశీలన చేయా'లట. ఊహ, భావన విషయంలో విశ్వనాథవారికీ 'హార్డీ'కీ దగ్గర పోలికలున్నాయి. అయితే వచ్చే చిక్కంతా, ఈ ఊహ, భావన, ప్రకృతిదృశ్య వర్ణనలు—కథాగమనానికెంత వరకు ఉపకరిస్తా యన్నప్పుడే! కథాగమనానికి ఏమాత్రం ఉపకరించినా, రచయిత కథాశిల్పం మెప్పుకోదగిందే!

నవలలో 'శైలి' ఎట్లా ఉండాలన్నది చాల ముఖ్యమైన విషయం. నిజానికి శైలి అనేది ఒక్కొక్క రచయిత స్వభావాన్ని బట్టి ఒకేవిధంగా రూపొందుతుంది బాపిరాజుగారు సరిశగంభీరుడైన అచ్చాంధ్రుడు. ఆయన గారి భాషాశైలులు కూడా అదేవిధంగా ఉన్నాయి. విశ్వనాథవారి శైలికూడా వారి స్వభావానికి సన్నిహితంగానే ఉన్నది 'భావతీవ్రత' తల ముంపుగావడం, భావ నేర్పుకోవడంలో చిత్తము చిన్నము నిల్వక' పోవడం కారణంగా ఒక్కొక్క నవలలో ఒక్కొక్క శైలివిశేషం, (ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క రీతివిశేషం) వ్యక్తమౌతూవచ్చాయి. నిజానికి, కథాపరమార్థం అందుకోవాలంటే పఠితకు భాష ఒక సాధనం కావాలిగాని దీర్ఘసమాసాలకు విగ్రహ వాక్యాలు గుణించుకోవలసిన ఇబ్బంది కలుగ కూడదు.

ముఖ్యంగా మననవలల్లో ఉదాత్తమైన హాస్యం ఎంతవరకున్నదంటే కొంచెం తల తడుముకోవలసే వస్తుంది. రాజశేఖర చరిత్రము, బారిస్టరు పార్వతీశం మొదలైన రచనల్లో ఉన్నది ఉత్తమ హాస్యానికి నిదర్శనంగా చెప్పడానికి పూర్తిగా వీలులేదు. హాస్యం అన్నది పాత్రగతమై ఉండడంకంటె సన్నివేశగతమై ఉంటే సున్నితంగా ఉంటుంది. సన్నివేశం ద్వారా హాస్యం వెలువరించాలంటే రచయిత సహజంగా హాస్యరసోత్పాదకధాతువు ఉన్నవాడుగా ఉండాలి. హాస్యంకోసం పాత్రల్లోని ఔన్నత్యాన్ని త్యాగంజేసే తమిళ చలనచిత్రదర్శకు లంతటి దుస్థితికి జారకపోయినప్పటికీ ఉత్తమహాస్యం మనవారిలో ఎక్కువ మంది సృష్టించలేకపోయారనే అనవలసి ఉంటుంది. ఇంగ్లీషు రచయితలో చార్లెస్ డికెన్సు లండను భూగృహాల్లో చెమటోడ్చే అమాయిక ప్రజల జీవితంలోని విషాదం, హాస్యంతో మెదిపి పవిత్రమైన సాహిత్యం సంతరించాడు. ఇంగ్లీషువారు తమ హాస్యరసోత్పాదకుల్లో ఈయనకు షేక్స్పియర్ ప్రక్కన సమానమైన స్థానం ఇచ్చారు. 'డేవిడ్ కాపర్ ఫీల్డు' 'పిక్ విక్ పేపర్స్', ఇంగ్లీషువా రెన్నడూ మరిచిపోలేరు. చెప్పేది హాస్యమైనా అందులో ఏ వ్యంగ్యమో, సంఘంమీద విమర్శయో, ఇమిడేఉంటుంది. మార్క్ ట్వేన్ వ్రాసిన రాజా పేదా లో యువరాజు దుస్తుల్లో ఉన్న పేదవాని చేష్టలు విపరీతమైన హాస్యాన్ని కల్గిస్తాయి. వాడు అన్నం తింటూ తుమ్ముతాడు. రాజవంశంలో అన్నం తింటూ తుమ్మే అలవాటు ఒక్కడికీ లేకపోవడంచేత అనుమానం కలిగి ప్రభుత్వ వ్యక్తులు కొన్ని దట్టాలూ న్యాయసూత్రాలు సృష్టించి జాగరూకత వహిస్తారు. ఇక్కడ పైటికి సామాన్యమైన హాస్యంవలె కన్పించినా ధనికవర్గంమీద ఒక పెద్ద విమర్శకూడా ఇమిడిఉన్నది. మన పంతులుగారి రచనల్లోకూడా సంఘంమీద తీవ్రమైన విమర్శ ఇలాగే నిక్షిప్తమైఉన్నది. ఈ విధంగా హాస్యాన్ని సంఘ ప్రయోజనం కోసం వినియోగించుకోవడం ప్రపంచ రచయితల్లో చాలమందిలో కనిపిస్తుంది.

కొంచెం సూక్ష్మదృష్టితో చూస్తే భారతదేశంలోకూడా నవలసృష్టికి సాంఘికప్రయోజనం కూడా ఒక ప్రబలమైన కారణం అనవలసి వస్తుంది. కేవలం వీరేశలింగంపంతులుగారి రచనలే కాకుండా అటు తర్వాతి వారి రచనలలో కూడా 'మాలపల్లి' వంటి వానిని పరిశీలించితే పతితమైన, అస్పృశ్యమైన మానవ జీవితాన్ని సంస్కృతం చేయడం కోసమే నవల రచన సాగిందేమో అనిపిస్తుంది.

దీనికి తోడు రాజకీయోద్యమంకూడా కలిసి రావడం మరింత దోహదకారి అయింది. ముఖ్యంగా అతి నవ్యుల రచనల్లో ఛాందసుల్ని, సనాతన వాదుల్ని కాంగ్రెసువాదుల్ని దుయ్యబట్టని రచనలు చాల తక్కువ. సంఘాన్ని బాగుచేయాలని రచనలు సాగించినవారిలో పురుషుల మీద జాలిపడ్డ వారికంటే స్త్రీలమీద జాలిపడ్డవారే ఎక్కువమంది ఉన్నారు. కాని సంఘసంస్కరణ, స్త్రీ ఉద్యమము గుర్తుకురాగానే సాహితీ విషయకంగా 'శరత్' కు పూజనీయమైన స్థానం ఇవ్వవలసి వస్తుంది. వంగదేశపు సంఘంలోని స్త్రీ దుస్థితికి ఆయన హృదయం కరుణరసంతో తడిసిపోయింది. పతితస్త్రీ పునరుద్ధరణంకోసమే నవల సాహిత్య సృష్టి సాగించాడనిపిస్తుంది. ఒక విధంగా చూస్తే 'శరత్' తానొక భావనా స్త్రీ. ఒక్కొక్క నవలలో ఒక్కొక్క విచిత్రమైన స్త్రీ ప్రకృతితో ప్రత్యక్షమౌతాడు. పురుషుడి కాలిక్రింద ఉన్న స్త్రీని భగవంతుడి కంటె పూజనీయమైన స్థానానికి లేవనెత్తడమే ఈయన లక్ష్యం. ఈయన సృష్టించిన పురుషపాత్రలలో ఎక్కువమంది 'స్త్రీ' కోసం పరితపించి, పరితపించి 'డికెన్సు' చిత్రించిన 'సిడ్నీ కార్టన్' వలెనే ఆత్మనాశానికి వెనుదీయని త్యాగంతో జగజ్జ్యోతులై కన్పిస్తారు. బడదీదీ సన్నిధి కోసం జగదీశుడు తానసే పదార్థం లేకుండా అయిపోతాడు. 'సుమతి' వరసకు వదినే కాని తల్లికంటే వేయి మడుగులుగా ఆమెలో మాతృత్వం నిండి నిబిడీకృతమై అమృత కుంభంవలె తొణికిసలాడింది. ఇక 'శరత్' తాను శ్రీకాంతుని దశకు పరిణతుడయ్యేసరికి అతనికి ప్రకృతిలోని సర్వసౌందర్యాలు స్త్రీలో పుంజీభూతములైనట్లు గోచరించాయి. ప్రకృతిలోని అమాయికమైన, పాపరహితమైన ముగ్ధసౌందర్యం దివ్యతేజంతో అతనికి రాజ్యలక్ష్మిలో స్ఫురించింది. కేవల సౌందర్యమూర్తిగానే కాక జన్మసిద్ధంగా, ధర్మబద్ధంగా ఆమెలో సతీత్వధర్మం లేకపోయినా అప్రతిమానమైన సతీత్వం దర్శించాడు శరత్. అతని అనుభూతిఫలం పూర్తిగా పరిపక్వమయ్యేసరికి ఏ రాజ్యలక్ష్మిలో అతనికి సతీత్వధర్మం స్ఫురించిందో ఆ రాజ్యలక్ష్మిలోనే పరమపవిత్రమైన మాతృత్వదీపిక తెల్లని చల్లని వెలుగుల్తో సాత్త్వికమైన జీవితానికి దారితీసింది. నిజంగా, స్త్రీ తత్త్వంలోని అవధులన్నీ అతిక్రమించి ఒకానొక భావనా స్త్రీని సృష్టించి లోకానికి ఆరనిజ్యోతిగా అందించాడు శరత్. ఇటువంటి వెలుగులు దేశం నాలుగు చెరగులకూ ప్రాకి పండువెన్నెలలు కాయిస్తూంటే...... ఒక మూల, గుడ్డివెలుగులో, ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో వంపులు వంపులుగా లేచిపడే వక్షోజపు నిమ్నోన్నతాలతో, తమ శరీరం తప్ప మరేమీ లేకుండా ఏ, పూలసెజ్జలపై దొర్లాడే స్త్రీలకోసం...మూలుగుతూన్న 'చలం' గారి సన్నని గొంతు తెలుగులకు కొంచెం అసహ్యం కల్గించిందంటే ఆశ్చర్యం పడనక్కర్లేదు. ఇంత అసహ్యం కల్గినా మార్కెట్‌లో విలువున్న సినీతారవలె, కోరమీసం దువ్వుకునే కుర్రాళ్ళ మొదలు, తలపండిన తాతయ్యలవరకూ, అయస్కాంతంవలె ఆకర్షించుకుంటూనే ఉన్నాడు చలం. అదంతా అతని కలానికున్న బలం. కమ్మని పలుకుబడి. గుండెకు పట్టించిలాగే కథాకథన పద్ధతి.

నిజానికి 'చలం' అంటే సానుభూతితో చదివే వాళ్లకంటే "ఏమిటి గిలుకుతాడో చూద్దా" మని చదివేవాళ్లే ఎక్కువమంది. మొదలు పెడితే చాలు, కంపలాగా కదిలి అదే లాక్కుపోతుంది ఎటువంటి నైష్ఠికసుందరుణ్ణికూడా. అక్కడినుంచీ "చెప్పేది ఛండాలమైనా కమ్మగా చెప్తాడులే" అని 'పెద్ద మనుషులం' అని అనుకునేవారి కంటబడకుండా చాటుచాటుగా చదువుకోవడంకూడా కద్దు. అసలు చలంలోని ఈ 'ఛండాల' మేమిటని పరిశీలించడం అత్యవసరం ... చలం తన రచన లన్నింటినిండా, వ్యక్తియొక్క అతృప్తవాంఛలకు వ్యక్తీకరణం ఇచ్చాడు. లౌకికజగత్తు చివరి అంచులవరకు బారలు చాచి స్త్రీలోని భౌతికసౌందర్యం అంతా వ్యక్తి తన బాహువులక్రిందకు ఇముడ్చుకొని అనుభవించాలనే అసంతృప్తకామనయొక్క వివృతియే చలం సాహిత్యం. ఋతుసమయంలో మందలుమందలుగా మబ్బుల గుంపులు కదలినట్లు ఆబెయ్యలు కదిలిపోతూంటే, కోరకొమ్ములు విసురుకుంటూ, వెడల్పైన గంగడోలు విదిలించుకుంటూ శారెడు తోకమట్టా ఎగబట్టి వెనుదగిలివచ్చే ఆబోతువలె సర్వేంద్రియాలూ ఉద్రిక్తమైన మనఃస్థితిలో రచనసాగిస్తే తదనుగత భావవ్యక్తి గలుగవలసిందేకాని 'క్రాంతిదర్శిత్వం' కలగడం

కష్టం. బాహ్యజగత్తులో రచయిత తాను మానవుడుగా పొందిన పరనిర్వృతిలోనే రచనసాగిస్తే వచ్చే చిక్కే యిది. లౌకిక భావమలీమసమైన ఉద్రేకం అంతా చల్లనై ప్రశాంతమైనస్థితిలో సమాధిదర్శనమును పొందే అలౌకికానుభవమే రసస్పష్టి హేతువనడంలో మనవారి అభిప్రాయం ఇదే! మన సామాజికవ్యవస్థకు పాశ్చాత్యుల సామాజికవ్యవస్థకు కొంతభేదం ఉన్నది. అతృప్తవాంఛలతో వ్యక్తి ఆత్మనాశం పొందవలసిన అవసరం అక్కడ అంతగాలేదు. అనుభవించదలచినదంతా, సాధ్యమైనంతవరకు అనుభవించే సంతృప్తిపడీ, స్తిమితపడీ, శాంతంగా అనుభూతిని నెమరు వేసుకుంటూ రచనద్వారా వ్యక్తం చేస్తాడు. సమాజంమీద తానుచేసినయుద్ధంలో తనకు గల్గిన అపజయం కారణంగా రచనద్వారా అక్కసు వెళ్లబోసుకొనే క్లిష్టపరిస్థితి 'చలం'వలె పాశ్చాత్యులకు ఏర్పడలేదు. అంతేకాకుండా గై. డి. మపాసా మున్నగువారు తమ సాహిత్యంలో సృష్టించిన వాతావరణం, భారతీయులమధ్యకూడా సృష్టించాలని చలం చేసిన ప్రయత్నం, లోకంలో కొంత అలజడి కల్గించింది. ఈ దృష్టితో అయన్ను అర్థం జేసికోవడానికి ప్రయత్నిస్తే కొంతవరకైనా అర్థంకాకపోదు.

సాంఘిక ప్రయోజనాలు సాధించడంకోసం మనలోవలెనే ఇంగ్లీషు రచయితల్లోకూడా — ముఖ్యంగా ఎడ్వర్డియన్ నవల రచయితలు — కొందరు పూనుకొనే ఉన్నారు. వెల్సు తాను వ్రాసిన హిస్టరీ ఆఫ్ మిస్టర్ పోలీ అను నవలలో ప్రాథమిక విద్యావిధానంమీద తీవ్రమైన దండయాత్ర చేశాడు. ఎడ్వర్డియన్ రచయితలకంటె జార్జియన్ రచయితలు కేవలం సంకుచితదృష్టితో వ్యక్తులమీదనే దృష్టి కేంద్రీకరించి నవల రచన సాగించారు. 'విలియమ్ గాడ్విన్' మొదలైనవారు వ్రాసిన నవలలు కేవలం ప్రాపగాండా నవలలవలె తయారైనవి. ఒక నవలలో కళాప్రయోజనంమీదకంటె ఆత్మప్రయోజనంమీదనే దృష్టి కేంద్రీకరింపబడితే అందలి కళకు నైచ్యం ఆవరించక తప్పదు. అందువల్లనే ప్రాపగాండా నవలకు ఆయుర్దాయము చాల తక్కువ.

సాంఘికమైన ఆశయంకూడ నైతిక సిద్ధాంత ప్రాతిపదికమీద సాధింపబడ్డప్పుడే దానికి పవిత్రత చేకూరుతుంది. అందువల్లనే సంఘప్రయోజనాన్ని నైతికదృష్టిని భిన్నములైన అవయవాలుగా భావించకూడదు. ఈ నైతికదృష్టి అనేదాన్ని కేవలం దేశకాల వ్యవస్థలనుబట్టియే పరిశీలించవలసి ఉంటుంది. అనగా సంప్రదాయాచార వ్యవహారములనుబట్టి నైతిక దృష్టిలో పరిణామం కనిపించక తప్పదు. నిజానికి లోకయాత్రాసౌకర్యమునకు జగదేకమైన ధర్మం ఏదైనాఉంటే దాన్ని 'నీతి' అనవచ్చు. అటువంటి నైతికదృష్టి ఏ నవలలోనూ సామాన్యంగా కనుపించదు. సమకాలీనమైన సంఘవ్యవస్థకు పరిమితమైన నీతిమాత్రమే మన నవలల్లో ప్రచురంగా వ్యక్తమౌతుంది. ఈ 'నీతి' కూడా కేవలం వాచ్యంగా వివరింపబడితే నవల శిల్పానికే లోపం వస్తుంది. అందువల్లనే సిద్ధహస్తుడైన రచయితరచనలో ఈ నీతి పాలలో వెన్నవలె ఇమిడిఉండి చక్కెర పూత పూసిన వైద్యుని మాత్రవలె పనిచేస్తుంది. వ్యంగ్యంగా చెప్పలేకపోతే రమణీయత లేదు. 'ఎన్నా కారనీనా' అనే తన నవలలో టాల్‌స్టాయ్ పవిత్రాదర్శ దాంపత్య జీవితాన్ని బోధిద్దామని విశ్వప్రయత్నం చేశాడు. లోకం ఈ దృష్టిని పూర్తిగా గ్రహించలేదు. కాని పాత్ర చిత్రణం, వాతావరణ కల్పనం, పిల్లల్ని మొదలు వృద్ధగ్రామికులవరకూ కదిలించే కథాగతి — వీటికోసం మాత్రమే విరగబడి చదివారు. అందుచేత — ముఖ్యంగా నీతినే బోధిద్దామని ఆ దృష్టితోనే వ్రాస్తే లోకం దాన్ని ఆ రూపంలో గుర్తిస్తుందని నొక్కిచెప్పడం కష్టం. అయినప్పటికి టాల్‌స్టాయ్ తన ప్రభావాన్ని పెరల్. యస్. బక్, శరత్ మున్నగువారిమీద బాగా ప్రసరింపజేయగల్గాడు. పెరల్. యస్. బక్ యొక్క 'గుడెర్త్' మొదలైన రచనల్లో చిత్రింపబడ్డ విషాద జీవిత సంఘటనలన్నీ చూస్తుంటే 'టాల్‌స్టాయ్' యొక్క హృదయావేదన వ్యక్తావ్యక్తంగా కన్పిస్తూనే ఉంటుంది. ఆదేవిధంగా బెంగాల్‌లోని జమీందారీ వ్యవస్థలో ధనికవర్గానికీ మధ్యతరగతి ప్రజలకు సాంస్కృతికంగా వచ్చిన సంఘర్షణను చిత్రించే విషయంలో శరత్ రచనల్లో టాల్‌స్టాయ్ భావాలే తొంగిచూస్తాయి.

సాంఘిక నైతికదృష్టులవలెనే భారతీయ నవలల్లో మత విషయిక ప్రసక్తికూడా తీవ్రంగా సాగింది. మతం రావడంతోటే వేదాంత తత్త్వంకూడా తలయెత్తి విహరిస్తుంది. మతమన్నది భారతీయులకు జీవి

తంలో మిళితమై వస్తున్న మనోహర ధర్మమని అంటారు. అందులోనూ ఆర్షమతమంటే ఎక్కువ మందికి నాడీమండలంలో రక్తమంతా ఒక్క దూకు దూకి పారవశ్యంతో రెండు హస్తాలూ చేరువగా వచ్చి ప్రాచీన ఋషులకు అంజలి ఘటిస్తాయి. కాని బౌద్ధమతప్రభావంవల్ల కొంతమందిలో ఈ అంజలి పుటి శిల్పాది లలితకళల ప్రక్కకు తిరిగింది. దానితో ఆర్షమతస్థులకూ బుద్ధానుయాయులకూ తాత్త్వికమైన సంఘర్షణ ప్రారంభమైంది. ఈ సంఘర్షణమే బాపిరాజుగారి 'హిమబిందు'లో సువర్ణశ్రీ, స్థాలతిష్యల మధ్య చాల జాగరూకతలో చిత్రించబడింది. వివేకవంతుల మధ్య వచ్చిన సంఘర్షణ మన సత్త్వ పరిణతికి దారితీస్తుంది కాని రక్తపాతానికి దారితీయదు. ఈ మనోహరసత్యమే ఈ నవలలో వ్యక్తమైంది. విశ్వనాథవారిలో చూచినా, మతమన్నా ధర్మమన్నా ప్రతి నవలలోనూ పరిపూర్ణ స్వరూపాలతో ప్రత్యక్షమౌతాయి. 'వేయిపడగలు'లోని పసిరిక పాత్రలో అలౌకిక ధర్మప్రతిపాదనమే ముఖ్యవిషయం. పసిరిక నడకలూ, చేష్టలూ అన్నీ అతిలోకములూ, మానవ ప్రకృతి బాహ్యాలూ. సుబ్రహ్మణ్యస్వామివలెనే నాగుమయ్యవలెనే పసిరిక మెలికలు మెలికలుగా ప్రాకి ప్రాకి నాలుగుపాదాల ధర్మదేవత అనదగ్గ గోమాత స్తన్యం గ్రోలే దృశ్యం పరిశీలిస్తే ప్రకృతి బాహ్యవిషయాలు ఎంతగా పేర్చబడ్డవో అఘట్టం చదవడం పూర్తిఅయిన తర్వాతగాని అర్థంగాదు. చదువుతున్నంతసేపూ అంతా జరుగుతున్నట్లే అనిపిస్తుంది. విశ్వనాథవారి ఊహా, భావనాశక్తి, అటువంటివి. టాగూర్ వ్రాసిన 'గోరా' అన్న నవలలో కూడా సనాతనమతానికీ బ్రహ్మసమాజమతానికి జరిగేవివాదం చాల సునిశితంగా ప్రస్తావింపబడింది. భారతీయ సాహిత్యమంతటిలోనూ 'మత' మన్నది అంతర్వాహినిగా ప్రసరిస్తూనే ఉన్నది.

సాంఘిక మత రాజకీయాలకు ప్రవేశం కల్గినట్లే నవలలో చరిత్రకు కూడా ప్రవేశం కల్గింది. 'నవల' అన్నది 'ఫిక్షన్'కు చెందిందిగదా, మరి ఈ శాఖలో చారిత్రక సత్యాలు తెలదూర్చవచ్చునా అని విమర్శకులు నిశితంగానే ఆలోచించారు. 'ఫిక్షన్' అన్నది అంతా కేవలం అభూతకల్పన కానక్కర్లేదని హాజ్లిట్ వంటివారు స్పష్టంగా ఒక నిర్ణయానికి వచ్చారు. గతంలో జరిగిన సంఘటనలే అయినా ఊహ, బుద్ధి తీవ్రంగా పనిచేసి ఒక నూతన సాహితీస్వరూపం వ్యక్తమౌతుంది. అందువలన చరిత్ర కూడా సాహిత్యంలో అంతర్భాగం కావచ్చు. కేవల మానవ చర్యలకు, ఆశయాదర్శములు, శైలీ రామణీయకము మొదలైన రచయితయొక్క ఆత్మీయలక్షణములు కొన్ని చేరి రచయిత స్వత్వమునుగూర్చి కొంత, అతడు చెప్పే సంఘటనలనుగూర్చి కొంతా తెలుసుకోవడానికి వీలు గల్గుతుంది. అందువల్లనే చారిత్రిక సత్యాలు నవలలో ఇముడ్చరాదనే వాదం వేలవిడిచి సాము చేయడమే అవుతుంది. ఈ సూత్రం గమనించే సర్. వాల్టర్ స్కాట్ తన వేవర్లీని ప్రపంచంలోకి వదిలాడు. ఒక 16 సంవత్సరములలో చకచకా ఇటువంటి చారిత్రిక నవలలే ఒక పాతిక వ్రాసి అవతల పడవేశాడు. అయుగమంతా నివ్వెరపోయి చూచింది. చరిత్రలో ఉన్న పాత్రలే అయినా ఊహవల్ల క్రొత్త రామణీయకం అపాదించి "ఇతడు వ్రాస్తున్నది చరిత్రకాదు. కేవలం ఫిక్షన్ మాత్రమే" అనే భ్రాంతి గల్గించినాడు. అయితే త్వరత్వరగా వ్రాయడంవల్ల నవల బాహ్యస్వరూపంలోనూ, పాత్రచిత్రణంలోనూ అనివార్యమైన పొరపాట్లు కొన్ని దొర్లకపోలేదు. అంతమాత్రాన 'స్కాట్'కు వచ్చిన అపకీర్తి కూడా ఏమీ లేదు.

తెలుగులో కూడ చారిత్రికనవలలసంఖ్య హెచ్చుగానే ఉన్నది. 'ఆంధ్ర స్కాట్' అని బిరుదు గడించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు కూడ 'హేమలత' 'రాజస్థాన కథావళి' మొదలైన గ్రంథములలో చారిత్రికేతి వృత్తమునే స్వీకరించారు. కాని యీ యితివృత్తములు కేవల రాజపుత్రస్థాన సంబంధులు. అట్లా కాకుండా ఆంధ్రచరిత్ర పరంగా వ్రాసి ఉన్నట్లైతే చాల బాగుండేది. అయినప్పటికీ రామచంద్ర విజయము, గణపతి, సౌందర్యతిలక, శాపము, సుధాశరచ్చంద్రము మొదలైన నవలల్లో మాత్రము అపూర్వమైన కల్పనాశక్తి, శైలీసారళ్యము, లలితమైన హాస్యము వ్యక్తముచేసి, వీరేశలింగము పంతులుగారి అడుగుజాడల్లో నవల వాఙ్మయశాఖకు కొంత పుష్టి చేకూర్చారు. కేతవరపు వెంకటశాస్త్రి గారు, దుగ్గిరాల రాఘవచంద్రయ్య గారు, వెంకటపార్వతీశ్వర కవులు మున్నగువారు వ్రాసిన, రాయచూరు ముట్టడి, విజయనగర సామ్రాజ్యము, ప్రమదావనము మొదలైననవలలు

ఆంధ్ర చరిత్ర నిరూపకంగా రమణీయమగు శైలీ విన్యాసంతో రూపొందాయి. ఇవికాకుండా బాపిరాజుగారు వ్రాసిన హిమబిందు, గోనగన్నారెడ్డి మొదలైన నవలల్లోనూ, నోరి నరసింహశాస్త్రిగారి నారాయణభట్టు మొదలైన నవలల్లోను చారిత్రిక వాతావరణమే ప్రాముఖ్యం వహించింది. కాని తెలుగులో జీవితచరిత్ర, ఆత్మజీవిత చరిత్ర ఆధారంగా వెలువడ్డ నవలలు చెప్పుకోదగ్గవి లేవనే అనవలసి ఉన్నది. ఇంగ్లీషులో మాత్రం జీవితచరిత్రలే ఆధారంగా చేసుకొని నవలలు ఎక్కువగా వచ్చాయి. కాని కొందరు రచయితలు జీవితచరిత్రే కదా అని, అవకాశం చూచుకొని అయిన దానినీ కానిదానినీకూడా ఈ నవలల్లో పొదగడం ప్రారంభించారు. అది కారణంగానే ఇంగ్లీషులో కొన్ని నవలలమీద తీవ్రమైన విమర్శకూడా చేసింది 'జేమ్స్‌జాయిస్' వ్రాసిన యులిసిస్ అనే గ్రంథాన్ని గూర్చి, 'వర్జీనియావుల్ఫ్' అన్నమాట లివి. "'జేమ్స్‌జాయిస్' యొక్క ఉదాత్త రచనయైన 'యులిసిస్' ముఖ్యలక్షణాల్లో వాస్తవిక జీవితచిత్రణం గూర్చి మితిమీరిన జాగ్రత తీసుకోవడం, ఒకటి." ఈ పుస్తకాన్ని పట్టుకొ సే[illegible]గెరాల్డ్ గోల్డ్' అనే విమర్శకుడు "ఆఁ, ఇదంతా చెత్తకాగితాలబుట్ట, ఇంతకంటె టెలిఫోన్ డైరక్టరీ ఒక కళాఖండం" అని అన్నాడు నిర్లక్ష్యంగా. వీని అన్నింటినిబట్టి తేలిన విషయమేమంటే, జీవితచరిత్ర సంబంధ నవలలు వ్రాసేటప్పుడు రచయితే, సంయమనం, సద్విషయ సేకరణం అన్ని కళానియమాలకు విధిగా బద్ధుడై ఉండాలి అని.

తెలుగులో ఇప్పుడిప్పుడు జీవితచరిత్రలను, చారిత్రక విషయములను దృష్టిలో ఉంచుకొని చాలమంది నవలలు వ్రాస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంవారి నిబంధనలలో కళాశాలల్లోని పఠనీయ గ్రంథాలలో చారిత్రక విషయసమన్వితాలైన నవలలే ప్రాముఖ్యం వహించడంవల్ల రచయితలెక్కువమంది చారిత్రిక నవలలు వ్రాయడం ప్రారంభించారు. ఏ తంజావూరి నాయకరాజుల కాలమో, ఏ కృష్ణరాయల యుగమో, రెడ్డిరాజుల యుగమో కథాకాలంగా తీసుకోబడుతూంది. కేవలం ఆర్థిక దృష్టితోనే ఈ నవలలు త్వరత్వరగా వ్రాయబడటం మూలంగా వీనిలో నవలశిల్పం కొఱవడి, కథాగమనం కుంటుపడి పఠితలనుపట్టి చదివించెడి గుణమే లేకుండా పోతూంది. దీనివల్ల విద్యార్థులకు సమగ్రమైన నవల స్వరూపం ఎటువంటిదో తెలియకుండా పోతూంది.

కళాశాలల్లోని విద్యార్థులే కాకుండా, కేవలం బాలురకు ఉపయోగించే నవలలైనా తెలుగులో ఉన్నాయా అంటే స్వతంత్రమైనది ఒకటీ లేదనే అనవలసివస్తుంది. ఇక రాగా పోగా అనువాద రచనలు మాత్రం పుష్కలంగా కన్పిస్తున్నాయి. అనువాదం చేసేటప్పుడు రచయితలు ఒక ప్రత్యేక విషయాన్ని గమనించాలి. మాతృకలోని శిల్పసామగ్రిని గ్రహించవచ్చునుగాని మనుష్యుల నోర్లదగ్గరనుంచీ మక్కికి మక్కిగా దించడం అభిలషణీయం కాదు. ఈ విధంగా పాశ్చాత్య నవలల్ని అనువదించడం వల్ల పాశ్చాత్యాచార సంప్రదాయానుగుణమైన వాతావరణం వ్యక్తమౌతుంది తప్ప భారతీయ వాతావరణం వ్యక్తంగావడానికి వీలుగాదు. బాలుర పసిబుద్ధులకు ఈ విలక్షణ వాతావరణపు టవధులు దాటి కథాప్రవాహంతో కొట్టుకుపోగల శక్తి ఉండదు. అయినప్పటికీ ఇటీవల పత్రికలలో ప్రచురింపబడుతున్న రాజూ పేద, డాన్‌క్విగ్జోట్, డేవిడ్ కాపర్‌ఫీల్డు మున్నగు నవలలవల్ల బాలురకుపయోగించే నవలాసాహిత్యంకూడా తెలుగులో లేదనే లోపం తీరిపోతూంది. ఏమైనా 'మార్క్‌ట్వేన్' వ్రాసిన 'టామ్ సాయర్' వంటి నవల, తెలుగులో స్వతంత్రమైనది ఒక్కటీ లేకపోవడం ముదావహం కాదు. కాబట్టి నవ్యరచయితలు బాలబాలికల మనస్తత్వాలు దృష్టిలో ఉంచుకొని వారి బుద్ధివికాసానికి ఉపకరించే నవల సాహిత్యం సృష్టించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రస్తుతం సాహిత్యసృష్టిలో మనస్తత్వ పరిశీలనం అనేది ప్రధానమైన అవయవంగా మారింది. ఆధునిక నవల రచయితలలో మనస్తత్త్వపరామర్శ లేకుండా పాత్రలను సృష్టించినవారు చాల కొద్దిమంది మాత్రమే. మానవ జీవితంలో నవలకు అత్యంత సన్నిహిత సంబంధం ఏర్పడటంవల్ల మానవుని కేవల బాహ్య జీవితమే కాకుండా ఆంతరంగికజీవితంకూడ నవలలో మిక్కిలి ప్రాధాన్యం వహించింది. ఆంతరంగికజీవితం అంటే, బాహ్యప్రవర్తనకాక తత్ప్రవర్తనకు కారణమైన భావన, అనుభూతి, మొదలైన బాహ్యేంద్రియగోచరాలుగాని మానసిక విషయాలని అర్థం. ఇటు

వంటి విషయపరామర్శ వచ్చినప్పుడే మన తత్త్వ శాస్త్రంతో అవసరం వచ్చింది.

ఒకవిధంగా చూస్తే ఆధునిక మన తత్వశాస్త్రం ప్రాణిని సంపూర్ణమైన వ్యక్తిగా భావించడంలేదు. వివిధములైన మానసిక చైతన్యాలకులోనై త్వరత్వరగా నడిచిపోయే ప్రాణుల వరుసగా మాత్రమే భావిస్తుంది కాని ఈ వివిధ మనఃస్థితులకుండా అనుస్యూతంగా ప్రసరించే 'జాగృతి' అన్నదే వీని అన్నింటికి ఏకత సంపాదిస్తుంది. దీన్ని చూచే 'అహం' మనీ, వ్యక్తిత్వమనీ అనుకొని మనం భ్రమపడుతూ ఉంటామని ఈ శాస్త్రజ్ఞులు అంటారు. అంటే వివిధ దశాభేదాలపై యాజమాన్యం సాగించే ప్రాణి అంటూ ఒకడుంటే తద్భిన్న మనఃస్థితులను ఏక సూత్రంగా బంధించేదో అదేవ్యక్తిత్వం అంటూఉంటామని పర్యవసానం. నిజానికి 'అహం' అన్నదిగాని 'వ్యక్తిత్వం' అన్నదిగాని ఏదైనా ఒకటిఉంటే— దాని అనుభూతి మనకు వేరుగానే వ్యక్తమౌతుంది. అదేమీ అతిలౌకికమైన అలౌకికమైన విషయం కాదని హ్యూమ్స్, 18 వ, శతాబ్దంలోనే చెప్పి ఉన్నాడు. ఈయనవాదం బట్టి చూస్తే ప్రాణితో 'అహం' 'వ్యక్తిత్వము'ల సంబంధమే పూర్తిగా శంకాస్పదం అయిపోతూంది. ఈ అభిప్రాయ వివరణం కొరకే బెర్గ్‌సన్ ప్రసిద్ధములైన కొన్ని శాస్త్రీయ దృష్టాంతాలుకూడా ఇచ్చిఉన్నాడు. ఫిల్మ్ తిరిగేటప్పుడు ఏ బొమ్మకాబొమ్మ విడివిడిదైనప్పటికీ ఒక సామాన్యచైతన్యం వల్ల ప్రాణుల సజీవచైతన్యం ఉట్టిపడుతూంది. అంతేకాదు. భౌతిక శాస్త్రంలోకివెళ్ళి ఏ విద్యుద్యంత్రమో ఉదాహరణగా తీసుకొనిచూచినా ఈ ప్రాణుల సాధారణ చైతన్యపరంపరవల్ల వ్యక్తమయ్యే అహం, వ్యక్తిత్వములలోని సత్యాసత్యములు స్పష్టం కాగలవు. రెండు విద్యున్మండలములమధ్య సంచరించే విద్యుత్పరమాణువులు దేనికది విడివిడిగా సంచరిస్తున్నా నిరంతరసాధారణచలనంవల్ల ఒకే విద్యుదణువు గమనం వలె గోచరిస్తుంది. ఇక్కడ ఈ విద్యుదణువునకు అహం వ్యక్తిత్వము లున్నవనడంలో ఎంత క్రమం ఉన్నదో ప్రాణుల కదలికలవరుసల్లోకూడా అహం వ్యక్తిత్వము లున్నవనడంలో అంతే క్రమంఉన్నదని యీ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

ఇక ఈసిద్ధాంతాలను సాహిత్యానికికూడా అన్వయించడానికి ప్రయత్నించారు. సాహిత్యంలో పాత్రలనుసృష్టించేటప్పుడుకూడా ఆపాత్రలను కేవలం విభిన్న మనఃస్థితులు గల ప్రాణులవరుసలుగా చిత్రించడానికే ప్రయత్నించారుతప్ప వానిలో అహం, వ్యక్తిత్వముల నిరూపణకు పూనుకోలేదు. కాబట్టి వీరి పరిభాషలో ప్రాణుల ఉనికి, కదలికల వరుసలు విభిన్న మనఃస్థితులు ... అనవలసిందేతప్ప వీనికి మధ్య సంబంధంకల్పించి వ్యక్తిత్వనిరూపణకు ప్రయత్నిస్తే "అయ్యో, జీవితాన్ని అసత్యమార్గంలో నిరూపిస్తున్నా" అని కసురుకుంటారీ ఆధునికమన తత్వశాస్త్రజ్ఞులు. కాబట్టి ప్రాణులకదలికల అనుస్యూతతలోని ఏకత్వాన్ని అంగీకరిస్తే 'వ్యక్తిత్వాన్ని' కూడా అంగీకరించవలసి వస్తుంది. అందువల్లనే వీరు ఈ అనుస్యూతతలోని ఏకత్వం ప్రసక్తికి దిగరు. ఈ దృష్టితో పరిశీలిస్తే పాత్రలవ్యక్తిత్వం, శీలనిరూపణం, కథాకల్పనం మొదలైనవన్నీ 19వ, శతాబ్ది నవల లక్షణాలైతేకావచ్చుకాని 20వ, శతాబ్ది నవలయొక్క అనివార్యలక్షణాలుమాత్రం కావని వీరిదృష్టి.

ఈ లక్షణాలు దృష్టిలో ఉంచుకొనే 'వర్జీనియా వుల్ఫ్' మున్నగువారు తమ రచనలో భిన్నసన్నివేశాలయొక్క భిన్నమనఃస్థితులయొక్క వరుసలు చిత్రించారేకాని వీనిమధ్య అనివార్యసంబంధం ఉండితీరాలన్న పట్టుదల చూపలేదు. ఇటువంటి వానికి జాకోబ్స్ రూమ్ మొదలైన నవలలు నిదర్శనంగా చూపవచ్చు. ఇది ఇట్లాఉండగా జాయిస్, లారెన్స్, హక్స్లే మొదలైనవారి కొన్ని రచనల్లో అసలు పాత్రలున్నాయా లేవా అన్న అనుమానం కూడా రావడానికి వీలున్నది. నిజానికి వీరు తమదృష్టి అంతా స్త్రీ పురుషులపాత్రలమీదకంటే, సన్నివిష్టములైన హేతుచైతన్యములమీదనే కేంద్రీకరించారు.

ఈ సిద్ధాంతములకు సంబంధించిననవలలు వ్రాసేటప్పుడు రచయితలు ఒక విలక్షణ రచనా పద్ధతికూడా అవలంబించారు. సన్నివేశ సంఘటనలను చిత్రించేటప్పుడూ, చాల దీర్ఘకాలంలో జరిగిపోయిన మానసిక పరిణామాలను వ్యక్తంచేయవలసి వచ్చినప్పుడు ఒకటి రెండు వాక్యాలలోనే వ్యక్తంచేయడం ఈ తెగకు చెందిన నవలల్లో ప్రచురంగా కనిపిస్తుంది. ఇందలి శైలికి ఒక క్రొత్తపేరుకూడా పెట్టి ఊర్ధ్వపంక్తి శైలి

అని పేర్కొన్నారు. అంటే ఈ పద్ధతినిబట్టి రచయిత ఒక్కొక్క సంఘటనకూ ఒక్కొక్క సన్నివేశానికీ ఒక్కొక్క 'పేరా' యే త్యాగం చేయడం కద్దు. ఇందు కుదాహరణంగా 'సి. యి. యమ్. జోడ్' లయొనల్ బ్రిటన్ వ్రాసిన హంగర్ అండ్ లవ్ అన్న నవలనుండి ఈ క్రింది వాక్యా లుదాహరించడం

నాగరకత నిలిచిపోయింది.

వ్యాపారం సాగిపోతూనే ఉన్నది.

ప్రణయం తన అధికారం తిరిగి నిలువబెట్టుకొంటూనే ఉన్నది.

ఇక్కడ ప్రణయప్రభావ వ్యక్తీకృతికి ఎన్నో పేజీలలో చెప్పతగ్గ విషయాన్ని ముక్తసరిగా మనస్సుకు సూటిగా తగిలేటట్లు మూడు వాక్యాలూ మూడు పేరాలుగా విభజించి శైలిలో ఊర్ధ్వపంక్తి పద్ధతిని వ్యక్తీకరించాడు.

ఈ పై పరిణామాలన్నీ ఆంధ్ర నవల సాహిత్యంలోకి కూడా దిగుమతి అయినవేమోనని పరామర్శించ బూనుకోవడం కొంచెం హాస్యాస్పదంగానే ఉంటుంది. ప్రాణి జీవితంలోని అహం, వ్యక్తిత్వాలను వదిలిపెట్టితే భారతీయ సాహిత్యమే లేదు. ఆత్మశక్తి, ఆధ్యాత్మికబలము—ఈ రెంటిని వదలిపెట్టి మన సాహిత్యాన్ని పరిశీలించటమనేది సరియైన మార్గంకూడా కాదు. కాబట్టి హ్యూమ్, బెర్గ్‌సన్ సిద్ధాంతాలకు ఒదిగే నవలా సాహిత్యం మనలో ఉన్నదని చూపించడం కష్టం. అయినప్పటికీ ఆధునిక కథానికలలో మాత్రం ఈ సిద్ధాంతాలనూ, క్వాచిత్కంగా ఈ ఊర్ధ్వపంక్తి శైలినీ నిరూపించడానికి వీలున్నది. కాని ఇక్కడ ఈ వ్యాసంలో అది ప్రస్తుతం కాదేమో!

ఇది ఇట్లా ఉండగా పాశ్చాత్య నవలల్లో అధికభాగం, సైకో ఎనాలిసిస్, 'బిహేవియరిజమ్' మొదలైన మనస్తత్వశాస్త్రవిషయముల సమన్వయంతోనే కనిపిస్తూంది. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సైకో ఎనాలిసిస్ ముఖ్యంగా రెండుభాగాలుగా వ్యక్తమౌతూంది. ఇంద్రియజ్ఞానరహితమైన మనఃస్థితి, జాంతవప్రకృతిని అణచుకొన్న మనఃస్థితి. మానవ ప్రకృతిలో శైశవ, జాంతవ, రాక్షస ప్రకృతులు మూడూ అణచబడే ఉన్నాయి. ఇవి ఎంతవద్దన్నను, నాగరక జీవితంలో కూడా వ్యక్తమౌతూనే ఉన్నాయి. 'లైంగిక సుఖ' మన్నది వివాహప్రక్రియలో అంతర్భూతమై ఉన్నది. శత్రువును చంపాలన్న రాక్షసప్రకృతి యుద్ధంలో వ్యక్తమౌతూనే ఉన్నది. పాశవప్రకృతికి సంబంధించిన కోర్కెలను సాంఘిక ప్రయోజనాలన్న తెరలవెనుక వ్యక్తంచేసి తృప్తిపడడమనేది నాగరక మానవుడు సాధించిన నైపుణ్యం మాత్రమే. ఈ విధంగా పరిశీలన చేసిచూస్తే ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని బట్టి పాశవప్రకృతియొక్క ఛిద్రత్వం అంతా చంపుకొని మానవుడు మోసంగా బ్రదుకుతున్నాడన్నది స్పష్టం. ఒక్క ముక్కలో చెప్పాలంటే మానవజీవితం అంతా బాహ్యపరిస్థితుల చేతిలో కీలుబొమ్మ అంటుంది సైకో ఎనాలిసిస్. మానవుని కాత్మశక్తి అంటూ ఏదన్నా ఉంటే అది భౌతికశరీరం చేతిలో కీలుబొమ్మ అంటుంది బిహేవియరిజమ్. బాహ్య పరిస్థితులయొక్క, భౌతికశరీరంయొక్క ప్రభావాలు విడిచిపెట్టి ఫ్రాయిడ్ సిద్ధాంతాన్ని పరిశీలించడానికి పూనుకోవటమే తప్పు. ఇది కారణముగానే ఒక్కొక్కసారి బాగా ప్రేమించుకొన్న వ్యక్తులు శాశ్వత విరక్తులు గావడం, ఒక్కొక్కసారి పరస్పరం అనురక్తి లేనివారు కూడ బద్ధానురాగులు కావడం సంభవిస్తూంది. 'లారెన్సు' వ్రాసిన 'ఏరాన్స్‌రాడ్' అన్న నవలలోని నాయక పాత్ర మనఃస్థితిలో ఈ వైలక్షణ్యం బాగా కనిపిస్తూంది.

నిజానికి మానవులలోని సుప్తమనోగోళాలు ఎప్పుడైతే ఛిద్రభావనలతో నిండిపోతాయో అప్పుడే పాశవప్రకృతి విజృంభణం ప్రారంభమౌతుంది. ఇట్టి పాశవప్రకృతి విజృంభణం సాహిత్యం ద్వారా వ్యక్తీకరించడానికి ప్రయత్నంచేస్తే సాంఘిక వ్యవస్థకే ముప్పు వాటిల్లడానికి వీలున్నది. అందువల్లనే యుగముల తరబడి పరిణతినంది నాగరకుడైన మానవుణ్ణి తిరిగి ప్రాక్తనదశకు తీసుకొనిపోయి పాత్రత, వివేచన, సంకల్పం, లలితకళానుభూతి మొదలైనవాటి నన్నింటినీ మరుగుపరిచే స్థితి సైకో ఎనాలిసిస్ వల్ల సృష్టికావడానికి వీలున్నదని సి. యి. యమ్. జోడ్ మొదలైనవా రభిప్రాయపడ్డారు. లారెన్సు వ్రాసిన నవలల్లో ఈ సైకో ఎనాలిసిస్‌వల్ల వచ్చిన లోపాలను విమర్శకులు విమర్శిస్తూనే ఉన్నారు.

ఇక 'అల్డస్ హక్స్లే'వంటి రచయితలు 'బిహేవియరిజమ్' వ్యక్తీకరించాలని మొట్టమొదట మానవుని ఆత్మశక్తిమీద భౌతికశరీరం చేసే దాడిని అంగీకరించి చార్వాక ఫక్కీలో రచనలు సాగించి నప్పటికినీ తర్వాత తర్వాత ఒక విచిత్రమైన మర్మదృష్టినే వ్యక్తంచేశారు. గ్రీకు దేశీయులు మానవుణ్ణి దేవుడి పేరుచెప్పి దడిపిస్తే 'హక్స్లే' ప్రాథమికదశలో భౌతికశరీరం పేరుచెప్పి ఆత్మశక్తిని దడిపించాడు. కాని రానురాను తర్వాత మార్పు చెందాడు. పదార్థ వాదులు చెప్పినట్లుగా మానవుడు కేవలం భౌతిక పదార్థం కాదన్నాడు. ఆదర్శవాదు లన్నట్లు కేవలం బుద్ధిసంబంధం అని కూడా అనలేదు. భౌతిక పదార్థం, బుద్ధి, ఆత్మ, మూడూ కలిసిన ఒక మనోహరవస్తువు మానవుడు—అని అన్నాడు. అంటే పదార్థవాదాన్నీ ఫ్రాయిడ్ సిద్ధాంతాన్నీ పరిమిత పరిధుల్లో అంగీకరిస్తూ కూడా 'ఆత్మ' అన్నదాన్ని ప్రవేశపెట్టి మర్మదృష్టిని సాధించాడు. ఈ భావాలను దృష్టిలో ఉంచుకొనే 'సోమర్సెట్ మామ్' కూడా తన 'రేజర్స్ ఎడ్జ్' అన్న గ్రంథంలో లారీ పాత్ర సృష్టించాడు. అయితే 'మామ్'కు ఈ సిద్ధాంతాలు పూర్తిగా మనస్సుకు పట్టలేదుగాని కథ చెప్పడం, సన్నివేశాలు సృష్టించుకోవడం, పాత్రల మీద వెలుగులు చల్లడం—వీటిమీదనే అతడు బాగా దృష్టి కేంద్రీకరించాడు. ఈవిధంగా పాశ్చాత్యుల నవలల రచనల్లో ఆధునిక మనస్తత్వశాస్త్ర విషయాలు రెక్కలు విప్పుకొని సంచరించాయని చెప్పవచ్చు.

తెలుగు నవలల్లో కూడా ఫ్రాయిడ్ మనస్తత్వ సిద్ధాంతాలు అక్కడక్కడా కనిపిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు జి. వి. కృష్ణారావుగారి కీలుబొమ్మలు' అన్న నవలలో 'డాక్టరు' జీవితంలో ఒక రాత్రి సంఘటిల్లిన సన్నివేశంలో ఫ్రాయిడ్ సిద్ధాంతమే ప్రతిపాదించబడింది. నిజానికి డాక్టరు, సంఘశ్రేయో విషయంలో కాని, రాజకీయజీవితంలో కాని, నిష్ఠుర బ్రహ్మచర్యంలో కాని గొప్ప శీలవంతుడే అని చెప్పాలి. కాని పుల్లయ్య గుమస్తా అయిన సత్యనారాయణ భార్య, పద్మ తనపట్ల చూపిన శ్రద్ధకారణంగా ఆమెమీద ఆయనకు అవ్యాజమైన ప్రేమ ఏర్పడి మనస్సులోని సుప్తగోళంలో నిక్షిప్తమై ఉన్నది. సుప్తమనోగోళంలో నిక్షిప్తమై ఉన్న ప్రణయభావం కారణంగానే అర్ధజాగృతస్థితిలో అతనికి పద్మతో కూటమి కల్గుతుంది. డాక్టరు ఆ కూటమి కేవలం కలగా భ్రమపడినప్పటికీ వాస్తవంగానే ఆరాత్రి 'పద్మ'తో డాక్టరుకు పొత్తు కల్గింది. అమరువాడు ఆమె తలుపు చాటుగా ఉండి చూచిన క్రీగంటిచూపులవల్లనూ, రచయిత సిద్ధహస్తంతో డాక్టరుకూ పద్మ కొడుకుకూ జరిపిన రెండర్థాలు స్ఫురించే సంభాషణలవల్లా, పతిత తేలికగా పద్మ, డాక్టరుల కూటమి ఊహించుకోవచ్చు. ఇక్కడ ముఖ్యంగా గ్రహించవలసిన విషయాలు రెండున్నవి. ఒకటి డాక్టరు ఎంత శీలవంతుడైనను, నాగరక జీవియైననూ, తనలో ఉన్న పాశవప్రకృతిని మాత్రం అణచుకోలేకపోయినాడు. అంటే పాశవ ప్రకృతి విజృంభణం అనివార్యమైందని స్పష్టం. రెండవది. సుప్తమనోగోళంలో ఉద్బుద్ధి పొందిన పాశవ భావన అర్ధజాగృతిస్థితిలో వ్యక్తమై ఉండడం. ఈ రెండూ ఫ్రాయిడ్ సిద్ధాంతానికి ఒదిగిపోతూనే ఉన్నాయి. రచనలో ఇక్కడి ఈ సుందర స్వప్నకల్పన రచయిత ఊహాశక్తినీ, శాస్త్ర విజ్ఞానాన్నీ వ్యక్తం చేస్తున్నది. కేవలం కల్పనా దృష్టితో మాస్తే జేమ్స్ జాయిస్ వ్రాసిన ఫినిగన్స్ వేక్ అన్న గ్రంథంలో ఇటువంటి సుందరస్వప్నకల్పనలు విరళంగా కన్పిస్తాయి.

ప్రేమికుల సుప్తమనోగోళాలు ఉద్రిక్త భీభత్స భావనలతో నిండిపోయినప్పుడు వారిలో వ్యక్తమయ్యే జాంతవప్రకృతికి నిదర్శనంగా 'చలం'గారి రచనలను పరిశీలించవచ్చు. 'బ్రాహ్మణీకం' మొదలైన నవలల్లో వలసినన్ని సంఘటనలు చూడవచ్చు. ఒక్క చలం గారి రచనలేకాకుండా ఇతరుల రచనలను కూడా చూడవచ్చు. 'చంఘిజ్ ఖాన్' వంటి వాడిలో అసలు ప్రణయసంబంధమైన ఉద్వేగం రావడమే కష్టం. వచ్చిందో, అది పరమరాక్షసంగా కాని వ్యక్తంగాదు. దూరంగా ఉండి, సుదృఢ కుడ్యాల సందుల్లో నుంచి జంఘిజ్ ఖాన్, స్నాన సుందర అయిన సున్నితమైన, వివస్త్రయైన స్త్రీని చూస్తాడు. అతని రక్తం అంతా ఉబుకుతుంది. పాశవత ప్రకోపిస్తుంది. 'శామ్సన్'వలె గోడలన్నీ బద్దలు గొడతాడు. స్నానంచేస్తున్న ఆ అబలవద్దకు కబంధుడి లాగ వచ్చి నిలబడతాడు. ఇదంతా అతడిలో ప్రకో

పించిన ఉద్రిక్త ప్రణయ భీభత్సభావనను వ్యక్తం చేస్తుంది.

మన స్తత్వశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే— ప్రాణుల మధ్య ఉండే పరస్పర ప్రేరణప్రత్యుత్తరాల వల్లనే ఆ యా మనఃస్థితులు కూడా వ్యక్తమౌతూంటాయి. ఒక ప్రాణి కల్పించే ప్రేరణ కారణంగానే రెండవ ప్రాణిలోని ప్రత్యుత్తరం గాని ప్రతిక్రియ గాని వ్యక్తమౌతూంది. ఏ ప్రాణిలో ప్రేరణను అణచుకోగలశక్తి మిక్కుటంగా ఉంటుందో ఆ ప్రాణి సంయమన శక్తి సమన్వితమైనదని అంటాము. ఆ పాత్రల తీర్పులోనే రచయిత సిద్ధహస్తతకూడా వ్యక్తమౌతుంది. బాపిరాజుగారి 'నారాయణరావు' నవలలో నారాయణరావు శారదను ఏకాంతంగా గదిలో కలుసుకుంటాడు. శారదలో నారాయణరావు ఆశించిన ప్రత్యుత్తరం రాకపోవడంచేత తనలోని ప్రేరణను బలవంతంగా అణచుకుంటాడు. తిరిగి శారద మనస్సులో చిత్రమైన పరిణామంవచ్చేవరకూ, ప్రేరణను బలవంతంగా అణచుకొన్న ఈతనిపాత్రనూ, శారద పాత్రనూ తీర్చిదిద్ది మనఃపరిణామాలను వ్యక్తం చేయడంలో రచయిత నైపుణ్యం తెలుస్తుంది.

ఇక విశ్వనాథవారి 'చెలియలికట్ట' గాని—మరే నవలగాని తీసుకుంటే భారతీయ వేదాంత దృష్టి ఆధారంగా చేసికొని పాత్రలకు చిత్తసంస్కారం కల్పించడం, తదనుగుణ మనఃపరిణామాలు వ్యక్తంచేయడం కనిపిస్తుంది.

శరత్ సృష్టించిన కొన్ని పురుష పాత్రలను చూస్తాంటే అసమర్థప్రకృతి గోచరిస్తూంటుంది. జగదీశుడు ఎప్పుడూ ఎవరో ఒకరు తనను గోకాడందే ఏపనీ చేయలేకపోతూంటాడు. దేవదాసువంటివారిలో అసమర్థత, నిరాశ, నిస్పృహ వ్యక్తమౌతుంటాయి. గోపీచందుగారి 'అసమర్థుని జీవయాత్ర' వంటి రచనల్లోకూడ పాత్ర మనస్తత్వ వివరణం విపులంగా జరిగింది. 'బుచ్చిబాబు'గారి 'చివరకు మిగిలేది' అన్న నవలలోని పురుషపాత్రలను పరిశీలిస్తే "అయ్యోపాపం ఈ మగాడు ఇట్లా అయిపోయాడేమిటి" అనిపిస్తుంది. బుజ్జాసుబ్రహ్మణ్యంగారి 'విజయ' అన్న నవలలో నాగరకత ప్రభావానికి లోగి మధ్యతరగతి కుటుంబాలలో విద్యావతులు పొందే మానసికాందోళనము స్పష్టంగా చిత్రింపబడింది. ఇంకా కొందరి ఆధునికుల రచనల్లో దరిద్రక్షుద్రుడైన నవ్యమానవుని మనః పరిణామ వ్యక్తీకరణమే ప్రాధాన్యం వహిస్తూంది.

కాలాన్నిబట్టి బాపిరాజుగారు అతినవ్యులలో ఒకరుగాకపోయినప్పటికీ. మన స్తత్వ నిరూపణంలో అతినవ్యులలో ఒకరుగా చెప్పుకొనదగ్గవారు. కల్పించిన ఒక విలక్షణ భౌతిక వాతావరణం కారణంగా ఒక ప్రాణి మనస్సులో విశిష్టపరిణామం రావటం, అనేది ఒక ముఖ్యమైన[1] మనస్తత్వశాస్త్రవిషయం. కల్పితమైన భౌతికవాతావరణ ముద్ర ప్రాణిమనస్సుపై ఎంత బలంగాపడితే తన్మనఃపరిణామంకూడా అంత బలంగా ఉంటుంది. బాపిరాజుగారిపాత్ర సృష్టిలో 'రుద్రమదేవి' చాల విచిత్రప్రకృతి. ఈమెచుట్టూ శివదేవయ్య కల్పించిన భౌతికవాతావరణపరిధి కారణంగా ఈమెలో పుంస్స్వభావాలే ఉంటాయిగాని, స్త్రీసహజమైన లాలిత్యంగాని ఒయ్యారంగాని కనిపించవు. ఎంతసేపటికీ తానొక పురుషుడనుకొంటుంది కాని స్త్రీనన్న స్పృహయే ఆమెకు రాదు. హఠాత్తుగా ఆ వెన్నెలరాత్రిలో పూర్ణపురుషుడైన చాళుక్య వీరభద్రుణ్ణిచూచేసరికి—ఆమెలో అంతవరకూ అట్టడుగున జడరూపంలో కరుడుగట్టిన స్త్రీత్వం మెల్లమెల్లగా కరిగి హిమజలంవలె వెలుగులు చిమ్ము

---

1 దీనినే కన్డిషన్డ్ రిఫ్లెక్సు అంటారు. దీన్ని ప్రయోగించినవాడు పావ్లవ్. ఈయన మచ్చికపడ్డ జంతువుమీద కొన్ని ప్రయోగాలచేశాడు. ప్రతిదినమూ ఒక నిర్ణీతసమయంలో ఆ జంతువుమీద కొన్ని ప్రయోగాలుచేశాడు. ప్రతిదినమూ ఒక నిర్ణీత సమయంలో ఆ జంతువుకు ఆహారం పెడుతూ అదేసమయంలో ఒక గంటకూడా మ్రోగిస్తూ ఉండేవాడు. కొన్నాళ్ళైన తర్వాత ఆహారం పెట్టకుండానే ఆ గంట మ్రోగించేసరికి ఆహారం తీసుకుంటున్నట్టే దాని నోటిలో లాలాజల గ్రంథులూరడం, ఆనందంతో తోకాడించడం చూచాడు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యవిషయం ఇది. గంటకొట్టడమనే కల్పిత భౌతిక వాతావరణంద్వారా జంతువు మనస్సులో వచ్చిన విశిష్టపరిణామం, ఇది ఆయన మానవ మనస్సులమీద కూడా ప్రయోగించి సమన్వయింపచూచాడు. కాని ఆధునిక మనస్తత్వశాస్త్రజ్ఞులుమాత్రం ఈయనను జీవశాస్త్రజ్ఞుల వరుసలో చేర్చారు తప్ప మనస్తత్వశాస్త్రజ్ఞుల వరుసలో చేర్చలేదు.

కుంటూ, లలిత లలితమైన సర్వస్త్రీ ప్రకృతినీ తనతో ప్రతిబింబించుకొంటూ ప్రవహిస్తుంది. ఈ మనఃపరిణామం చిత్రించేటప్పుడు రచయిత ప్రదర్శించిన శిల్పనైపుణ్యం చిరస్మరణీయం.

ఈవిధంగా ఆంగ్లాంధ్రములలోని నవలవాఙ్మయ శాఖా సమాంతర పరిశీలనం చేయడంవల్ల పరస్పరం జన్యజనకభావం గాని, బింబప్రతిబింబభావం గాని నిరూపించడం ఈ వ్యాసం ఆశయం కాదు. సామాన్యమైన పోలికలు ఎక్కడున్నాయో అవి స్థూలంగా వ్యక్తీకరించడంమాత్రమే. సాహిత్యవిషయకంగా అన్యభాషలనుంచీ శిల్పీకరణములు అరువు తెచ్చుకున్నందువల్ల నష్టమేమీ లేదు కాని ఇతివృత్త సేకరణలో మాత్రం జాతీయతాదృష్టి సడలనీయరాదు. నవలరచయితల్లో — ముఖ్యంగా అనువాదరచనలు చేసే వారిలో ఈ దృష్టి సడలడం మంచిది కాదు. అంతే కాక మత్తేభాలదగ్గరకూ శార్దూలాలదగ్గరకూ పోకపోవడం ఎందుకైనా మంచిదే అని వచనగీతికలతోనే తృప్తిపడుతున్న ఆధునిక కవులవలెనే, అతినవ్యులైన రచయితలుకూడ 'నవల' జోలికి పోకుండా కేవలం కథలతోటి, కథానికలతోటి, గల్పికలతోటీ సర్దుకుంటున్నారు. ఈ పరిణామానికి కేవలం రచయితలే కాక పఠితలుకూడా కారణం అనక తప్పదు. ఆఫీసుల్లో యాంత్రికమైన జీవితం గడిపే పఠితలకూ రచయితలకూ, నవలలవంటి పెద్ద పుస్తకాలు చదవడానికి వ్యవధి లేకపోవడంవల్ల, సన్నివిష్టములైన హేతుచైతన్యముల నిరూపణకూ, 1 జీవిత ఖండ వ్యక్తీకరణకూ కథానిక చాల అనువుగా ఉండటంవల్ల నవ్యుల దృష్టిఅంతా కథానికమీదనే కేంద్రీకరింపబడింది. ఈ కథానికలలోకూడా 'ఓ పువ్వు పూసింది' అన్న చలంగారి రచనల వంటివి కావ్యత్వ గౌరవంకూడా పొందుతున్నాయి. ఏమైనా నవ్యులు నవల రచన విరమించుకోవడం ముదావహం కాదు. జాతీయపు టితివృత్తకథనంతో, బహుముఖ శిల్ప విన్యాసంతో నవల రచన సాగించి ప్రపంచపు నవల వాఙ్మయంలో తెలుగునవలకు కూడా విశిష్ట స్థానం ఏర్పరుస్తారని ఆశిద్దాము.

---

1. జీవితంలోని ఏ అంశాన్నో గ్రహించి దాన్ని బాగా ప్రపంచించి 'కథానిక' వ్రాయడమన్న ఈ ప్రయత్నానికి పాదు పెట్టినవాడు 'చెకోవ్' అన్న రష్యన్ రచయిత. కాథరిన్ మాన్స్‌ఫీల్డు మున్నగువారు ఈ ఉద్యమానికి నీరుపోసి పూలు పూయించారు. రష్యనుల జీవితంలో అంతర్భూతమై ఉన్న విషాదాన్నీ గూఢతత్వాన్నీ అద్భుత వాతావరణ కల్పనంతో చెకోవ్ బాగా వ్యక్తీకరించాడు.

రిక్షా తాత

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

పాత్రలు:

1. రిక్షాతాత
2. శ్రీహరి
3. జగ్గడు
4. పైడి
5. ఇద్దరు పెద్దమనుష్యులు
6. ఒకసెట్టి
7. శారద
8. లవంగి
9. బేబీబాల...

1

* [కొద్దిదూరంలో కారు హారన్లమోత. రిక్షా, సైకిళ్ళ బెల్లుల గణగణచప్పుడు—జట్కాల టకటక చప్పుడు—'ఏయ్ ఏయ్ తప్పుకో' 'బాబూ రిక్షా,' 'పక్కకెళ్లండి' ఇత్యాదిమాటలు]

1-వ రిక్షావాడు: బాబూ రిక్షా...

2 వ రిక్షావాడు: రిక్షా బాబూ...

ఒక బొంగురుగొంతు: అయితే తేఁవరు రేపు మేల్లో తిరిగొత్తారన్నమాట?

మామూలుగొంతు: అవునోయ్ శెట్టీ...ఏయ్ రిక్షా...

2 వ రి : వత్తున్నా బాబూ...

2 వ రి : ఆఁ...ఇదిగో బాబూ. — (రిక్షాలు లాగిన చప్పుడు)

మా.గొం: ఎవడో ఒకడు రండోయ్.

1 వ రి : రండి బాబూ...

2 వ రి : రండి బాబూ...

బొం. గొం : అరే యెదవలు...బాబుగారి సేతిలో గొడుగూ సంచీ సెరొకటి లాగుతున్నారు ...కుక్కల్లాగ. ఏటిరా అదీ ..ఈ మెత్తలు బావున్నాయి ఇందులో కూసోండి బాబుగారు.

మా.గొం : ఏయ్ గొడుగిలా ఇయ్య...

2 వ రి : బాబు పిలవడంతోటే ఆ అని పలికి రిక్షా తెచ్చినోడ్ని నాను. నువ్వెవడ్రా ఎక్కించడానికి?

1 వ రి : బాగా పలికినావు. అసలు బాబుగార్ని మూసి ముందడిగింది నానురా. ఎల్లెల్లు...

2 వ రి : నే వంతెనకుముందే సూసినాను బాబుగార్ని. నీ కిదో యేసమయింది. తక్కినోళ్ల బేరాలు నాక్కోడం. మక్కలిరగ్గొట్టేత్తాను.

1 వ వా : ఏదీ మొగోడైతే రా సూద్దాం! కంత్రీ యెదవ...

2 వ వా : రారా యెదవా, కక్కుర్తెదవా!

మా.గొం: ఆఁ...ఆఁ...ఆగండాగండి. (కొట్టుకుంటున్న చప్పుడు)

బొం. గొం : యాళ్లంతేనండి! పల్లకోండిరా. అందరూ కడుపుకోసమొచ్చినోళ్ళే...

[దూరంనుంచి రిక్షా దగ్గరకు వచ్చినచప్పుడు]

ము.గొం: ఏట్రా దెబ్బలాట...ఆగండాగండి.

2 వ వా : చంపేత్తా నీయాల కొడ్డి.

1 వ వా : నువ్వే సంపేమొగోడివి...చావు, చావు.

ము.గొం : ఆ గండాగండి. ఆగరా పైడీ...(గుద్దుగుద్దినచప్పుడు) అబ్బా....

---

* [రేడియో నాటికల పోటీలో రెండవ బహుమతిపొందిన నాటిక]

మా.గొం : మున్సనా తాతకు తగిలింది, ఇంక చాలు రావోయ్ కోటీ మైకవుతోంది.

1వ వా : గట్టిగా తగిలించేటి తాతా...నువ్వెందు కడ్డొచ్చావు?

తాత : పరవాలేదులే, ఇంక నువ్వెళ్లు పైడీ. అవ్వ్రా జగ్గా...ఆ బాబెవరో అందులో కూచుంటే జట్టీ ఎందుకురా చేరానికి? నీకు దొరికినవాళ్లు నీకు దొరుకుతారు.

జగ్గ : కాదు తాతా. బాబుగారు పిలవడంతో చే ముందెళ్లింది నాను. ఆ పైడి రొదవ... (రిక్షా నడుస్తున్న చప్పుడు)

పైడి : మళ్ళీ యేటిరా?

తాత : నువ్వెళ్లు పైడీ.

జగ్గ : రొదవ! పవురుసం లేని కక్కుర్తిదవ!

మా.గొం : వాడితో నీకేమిటి పదవోయ్. వస్తానోయ్ శెట్టీ.

బాం.గొం : సెత్తం బాబూ. శెలవు. (రిక్షా వెళ్తున్న చప్పుడు) ఆ, ఇదిగో బాబూ తేవరు రే పొచ్చినప్పుడు... (ఫేడౌట్)

తాత : ఒకే అందరిదీ ఒక్కటే కక్కుర్తిరా జగ్గా... దెబ్బలాటలెందుకు మనలో మనకి...

జగ్గ : మద్దేన్నంనుండి బేరమున్నది నేడు తాతా... ఇందాకోపాలీ ఇలాగే సేహాడా పైడెదవ. అయిదణాలు తక్కువకి రానంటే పావలా డబ్బులికి కక్కుర్తిపడి ఎగరదన్నుకు పోనాడు కాలేజీ పిల్లల్ని.

తాత : (విచారంగా నవ్వి) కంప్టీషనంటే అదే నురా. ఎవరు నిలబడగలిగితే వాడే నిలబడతాడు. కష్టపడేదాని కందరూ సిద్ధమేగాని కష్టపడి గడించుకునేది ఎవళ్లో కొందరే.

జగ్గ : నువ్వేదో యేదాంతాలు సెపుతుంటావు పొద్దత్తమానమూ-కడుపు మండిపోతుంటే...

బాం.గొం : ఏయ్ తాతా. డాబాతోట కొస్తావా?

తాత : వస్తాం బాబూ...వెళ్ళరా జగ్గా...

జగ్గ : నువ్వే యెల్లుతాతా— నిన్ను పిలిసినారు బాబు.

తాత : వాకి ప్రొటకో రెండు రూపాయలు దొరికాయిలే. అదీగాక అలుపుగా ఉందిరా— నువ్వెళ్ళు.

జగ్గ : పెద్దోడైపోయినావు పాపం. రండి బాబూ.

బాం.గొం : ఎంత కావాలి?

తాత : తనుకు తెలియదేటి బాబూ...బేరమెందుకు. అయిదణాలు తీసుకోరా జగ్గా.

కొ.గొం : షరే పద...

2

(బేబీ బాల పాట దూరంనుండి దగ్గరవు వస్తుంది.)

పాట

బేబీ : పాటతో మనసులే పరవశము కావాలి
ఆటతో జగమెల్ల అవశమై పోవాలి
జంత్రి కారిణినోయి నిజమోయ్
చెలుడ—
మంత్రగత్తెను నేను కనవోయ్.

తాత : (పాట అవుతుండగా) అదిగో బాల వొస్తోంది.

బేబీ : తాతా—తాతా.. (దగ్గరగా)
జంత్రికారిణినోయినిజమోయ్— చెలుడ—
మంత్రగత్తెను నేను కనవోయ్.

తాత : (ఆనందంగా పకపక నవ్వి) అవునమ్మా, నువ్వు నిజంగా మంత్రగత్తెవే బాలమ్మా.

బేబీ : బాలమ్మా అనొద్దన్నానా నిన్ను మునిలి దానిలాగ—బేబీబాల.

తాత : బాలంటేనే బేబీ అన్నమాట తల్లీ.

బేబీ : బేబీ అంటే బాలకాదు తాతా — పాపన్నమాట.

తాత : (నవ్వుతాడు) పోనీ బేబీ బాలమ్మా అంటానులే.

బేబీ : మళ్ళీ అమ్మా ఎందుకు? బాలా అను.

తాత : మేం పైవాళ్లం బాలమ్మా అనే అనాలి.

బేబీ : పైవాళ్లూ బేబీబాల అనే అంటారు నన్ను.

తాత : వాళ్లసంగతి వేరు, నాసంగతి వేరు. అవును గాని ఈపాట ఎక్కడ నేర్చుకున్నావు

కొత్తపాట? ఉండుండు, కూర్చుందుగాని, సీటు దులపనీతల్లీ. (ఊదినచప్పుడు)

బేబీ : పరవాలేదులే తాతా! మా స్కూల్లో నిన్న సాయంత్రం డాన్సొకటి అయిందిలే— అందులో పాడించారిద ఈపాట. బావుంది కదూ?

తాత : బాగుందమ్మా, చాలాబాగుంది. ఒక్కసారిలే తల్లీ...

బేబీ : ఎందుకూ? (రిక్షా సీటుతీసి చుట్ట టక్కుమని వేసినచప్పుడు) ఏమిటది తాతా ఆ పొట్లం?

తాత : ఇంకకూర్చో—ఇదిగో.

బేబీ : కోవాబిళ్లలా ? ఏమిటో అనుకున్నాను. బావుంది. ఇవంటే ఎంతో యిష్టం తాతా నాకు. అసలు మొన్న నా పుట్టిన రోజు పండుగు. మా అమ్మని కోవాబిళ్లే చెయ్యమన్నాను. తీరామోసి ఆ మధ్యాహ్నం అమ్మా నాన్నా ఎందుకో మాటలు ముడుచుకుని సాయంత్రం హోటల్లోంచి జిలేబీలు తెప్పించారు. పైగా జిలేబీలు అసయ్యం నాకు. రసం కార్తూ అంటుకుంటుంది చేతులకీ, గౌనుకీ, మూతికీ.

తాత : నీ పుట్టినరోజునాడు దెబ్బలాడుకొన్నారా? ఎంతో సరదాగా ఉండవలసినరోజది! ఎందుకసలు?

బేబీ : నా కైప్పుడూ అంతేలే. ఎందుకో ఒకందుకు...

తాత : అసలు నీకివి ఇష్టమనే మొన్నా నిన్నా కూడా తెచ్చాను. నువ్వు రాలేదు.

బేబీ : మొన్న ఇంట్లోనే ఉండిపోయాము. నిన్న స్కూల్లో డాన్సుండడాన్ని ఆలస్యమైంది. మరేం చేశా వా కోవాబిళ్ళలు ?

తాత : (నవ్వి) నేనే తినేశానులే.

బేబీ : మంచిపని చేశావు. నీలా నాకూ ఓ చిన్న రిక్షాఉంటే చిన్న-చిన్న పిల్లల్ని కూచోబెట్టి డబ్బులు పుచ్చుకొని ఆ డబ్బుల్తో రోజూ కోవాబిళ్ళలూ మైసూరుపాకులూ కొనుక్కు నేదాన్ని.

తాత : (నవ్వి) నువ్వు రిక్షా తొక్కగలవమ్మా?

బేబీ : ఏం? చిన్న ఇంతరిక్షా అయితేసరి. అసలు మొన్న ఒకరోజు నువ్వలా వెళ్లావుగదూ, దుకాణానికి, నన్నిక్కడుండమని. అప్పుడు ఈరిక్షాయే ఇక్కడ్నుంచి అల్లక్కడిదాకా లాగాను ముందు చక్రం పట్టుకుని ... సులువేతాతా తొక్కడం రిక్షాని.

తాత : సులువేనమ్మా. నీపాటి హుషారుంటే ఎంత దూరమన్నా తొక్కొచ్చు.

బేబీ : కావాలంటే కూచో ఒక్కసారి నువ్వు. అక్కడికి లాగుతాను.

తాత : వద్దు వద్దు కూచోమ్మా, లాగలేవు.

బేబీ : అలాకాదు. కూచో. ఈ పుస్తకా లిక్కడుండనీ. కూచో తాతా. నామాట విను తాతా, కూచో.

తాత : అయితే లాగు.

బేబీ : ఊ—ఊ—అమ్మ...అమ్మయ్య, కదలడం లేదు. తాతా.

తాత : చెప్పాను కదమ్మా. రా కూర్చో. నువ్వు లాగలేవు.

బేబీ : ఆవేళ లాగాను మరి?

తాత : ఖాళీరిక్షా కొద్దిగా జరుగుతుంది. ఊ, ఇప్పుడు లాగు.

బేబీ : ఊ, అ, ఆ, కొద్దిగా జరిగింది, జరిగింది. హోయ్, హోయ్.

తాత : ఇంకచాల్లే. పడిపోతావు రాళ్లమీద. ఎక్కి కూర్చో.

బేబీ : అవునుగాని తాతా అవంతీ రాజకుమార్తె కథ చెప్పావావాళ. నిన్న మా స్కూల్లో మణికి చెప్దామని మొదలుపెట్టి సగంలో మర్చిపోయాను. ఆ రాజకుమార్తెకు కోటలో ఉండడం విసుగుపుట్టింది. దూరంగా నది గట్టున చేపలు పట్టేవాళ్లని చూసి సరదా పుట్టిందట. తానూ చేపలు పడదామని దొంగతనంగా వెళ్లింది. అక్కడేమో రాజకుమారుడు...

తాత : అప్పే ముందు రాజకుమారుడని చెప్పెయ్యకూడదు. ఎవడో చేపలు పట్టేవాడు కనిపించాడు.

బేబి : ఉండుండు... నేన్ చెప్తా. ఆ చేపలు పట్టే వాడు రాజకుమార్తెకి తన విద్య నేర్పించాడు. ఇద్దరికీ స్నేహమయింది. అక్కణ్నించి, మరేమో ఇద్దరూ, అవును గాని పెళ్ళి చేసుకున్నారా, చేసుకుందామనుకున్నారా తాతా?

తాత : చేసుకుందామనుకున్నారు, రాజుగారి దగ్గర కెళ్లారు.

బేబి : ఆఁ...ఆఁ...అవునవును, రాజుగారికి కోపం వచ్చింది. కోపం వచ్చి ఆ చేపలవాణ్ని జెయిల్లో పెట్టుకున్నారు. ఈ సంగతి తెలిసి అది...అది...అదే దేశం తాతా?

తాత : మగధ దేశం.

బేబి : ఊఁ...మగధ—మగధ దేశం రాజు అవంతీ రాజ్యం మీదికి దండెత్తి వచ్చాడు. చేపల వాణ్ని జెయిల్లోంచి విడిపించి తన కుమారుడే అని చెప్పేశాడు. ఆనందంగా వాళ్ల పెళ్ళి జరిగింది. అవంతి రాజకుమార్తె చేపల వాడి వేషం ఎందుకు వేసుకున్నావంటే 'పెద్ద అందమైన చేపను పట్టానని బుద్ధి పుట్టింది' అన్నాడు రాజకుమారుడు. ఆ పెద్దచేప ఎవరు తాతా?

తాత : అమ్మో, నా కథకు కొంత కవిత్వం కూడా కలిపావే!

బేబి : చెప్పు చూదాం—ఎవరా చేప?

తాత : ఎవరు చెప్మా...

బేబి : ఓస్ ఇంతేనా—ఆ రాజకుమార్తే పెద్ద అందమైన చేప. మా అమ్మ చెప్పిన మరో కథలో ఉందీమాట. అదీ దీనికి కలిపాను.

తాత : చాలా బావుందమ్మా. పద చీకటవుతూంది. నిన్ను దిగబెట్టేస్తాను.

బేబి : దగ్గరే కదూ. నడిచిపోతాను. మా అమ్మ చూస్తే నాన్న జేబులో డబ్బులు దొంగలాడి రిక్షా ఎక్కానని తంతుంది.

తాత : మీ ఇంటి కివతలే దింపేస్తానులే.

బేబి : సరే పోనీ. (రిక్షా నడిచేచప్పుడు)
పాటలో మనసులే పరవశము కావాలి
ఆటలో జగమెల్ల అవశమైపోవాలి......
(ఫేడౌట్)

3

[రిక్షా నడుస్తున్న చప్పుడు. రోడ్డుమీద మామూలుగా అయ్యే రకరకాల చప్పుళ్లు, గోల]

రిక్షాతాత: (టంగ్ టంగ్) తప్పుకోండి బాబూ.

శ్రీహరి : కూర్చో బాలా. ఎందుకా నిలబడ్డం, తుళ్ళి పడడానికి?

బేబి : ఇరుకుగా ఉందక్కడ నాకు నాన్నా.

శ్రీహ : ఇరుకేమిటమ్మా, ఇరుకు...

శారద : నిలబడనిండి, కొంపమునిగిపోతేను, ఇంతలో కేకలెందుకు?

శ్రీహ : కోపంగా కేకలా? మీ ఇష్టం, ఒక మాటన డానికి కూడా హక్కు లేదు నాకు.

శార : హక్కు లేదన్నానా?

బేబి : ఊరుకో అమ్మా. పోనీ కూచుంటాన్లే.

శార : ఆ తండ్రిపోలికే విరుచుకు పడడానికి.

శ్రీహ : అవును.

[ఒక పదిసెకండ్లు అంతా మౌనం. రిక్షా నడుస్తూ ఉంటుంది.

బేబి : అదిగో, ఆ షాపులోనే నమ్మా, ఆ వాళ మేజోళ్లు కొనుక్కున్నాం నాన్నా నేనూ. నీ జోళ్లెక్కడేక దూ కొనుక్కున్నావు?

శ్రీహ : సమాధానం చెప్పావు సరదాగా పిల్లడి గిందానికి - ఎందుకా మూతిముడుపు అస్తమానం?

శార : ఏమూతి ముడుపూ లేదు. ఆనందంగానే ఉంది.

శ్రీహ : ఏమిటి తక్కువైందని ఆనందంగా లేకపోవడం? దేవుడిచ్చినంతలో తిని సుఖంగా...

శార : అదుంటే బాగానే ఉండును.

శ్రీహ : (కోపంగా) శారదా!

శార : నోర్మూయ్ అనేగదూ! మాట్లాడను లెండి. దాని పుట్టిన రోజునుండి ఒకటే ఆనందంగా ఉంది.

బేబి : ఊరుకో అమ్మా - ఎవరన్నా వింటే నవ్వుతారు.

శార : నవ్వుకోని, ఇప్పుడు నవ్వుకోటం లేదూ. అందరూ? ఎప్పుడూ ఇంతే!

శ్రీహ : రాత్రింబగళ్లూ బాధపడుతున్నాను. చెమట లోడ్చి పనిచేస్తున్నాను.
మిమ్ము సుఖపెట్టేందుకే. అక్కడికీ ఇంకెలా సుఖపెట్టడమో తెలియటం లేదు.

శార : కూచోని కష్టంలేకుండా మింగుతూంది. నే నేకదూ!

శ్రీహ : అబ్బా...మాటంటే పది అర్థాలు తియ్యకు శారదా. తెలిసిన ఫ్రెండు సైకిలుమీద వస్తున్నాడు మాట్లాడకు. హల్లో... ఆపవోయ్ ఒకసారి.

ఫ్రెండ్ : హల్లో శ్రీహరీ. మీ ఇంటివైపే వెళ్దామని బయల్దేరాను. ఎక్కడికి, పిక్చర్ కేమిటి?

శ్రీహ : లేదు. మా పిన్నమ్మగారింటికి.

ఫ్రెండ్ : సరే వెళ్లు. ఎంతసేపట్లో వస్తావు మళ్ళీ?

శ్రీహ : లేటే అవుతుందోయ్! తొమ్మిది పది గంటలకి మీ ఇంటివైపే వస్తానులే.

ఫ్రెండ్ : అలాగే - వస్తాను మరి.
(కొంతసేపు మౌనం)

శార : వెళ్లకపోయారా ఫ్రెండుతోటి?

శ్రీహ : తరువాత వెళ్తాను. అదిగో, ఆ ఎడంచేతివైపు వీధిలో పోనీ.

తాత : చిత్తం బాబూ.
(రిక్షా చప్పుడు ఫేడౌట్)

4

[శేబీబాల వెక్కి వెక్కి ఏడుస్తూ దగ్గరకు వస్తుంది]

తాత : అరె బాలమ్మా! ఎందుకమ్మా ఎండలో ఏడుస్తూ వచ్చావు? మొహం చూడు ఎలా కందిపోయిందో, ప్చ్ ప్చ్-ఏడవకూడదు.

శేబి : (ఇంకా కొద్దిగా గట్టిగా ఏడుస్తుంది)

తాత : చూడు నా కళ్ళల్లో చూడు. ఎందుకమ్మా అలా? ఛీ. ఏడవద్దు. ఊఁ, మరి నా మాట వినవూ? ఎందుకు, అమ్మకోప్పడ్డారా?

శేబి : లేదు. (వెక్కుతూ మాట్లాడుతుంది) అమ్మా నాన్నా దెబ్బలాడుకుని మధ్యాహ్నం భోజనం మానేశారు. నాకు మట్టుకు అన్నం పెట్టిందమ్మ. చెరొక గదిలోనూ పడుకున్నారు వాళ్ళు. చూసిచూసి లోపలికి వెళ్లి అమ్మను పిలిచాను. ఎంత పిలిచినా మాట్లాడదు.
(ఏడుస్తూ) వచ్చి మేడమెట్లమీద కూర్చున్నాను. ఏడుపొచ్చింది. ఎప్పుడూ ఇంతే వాళ్ళు. ఆదివారం వస్తే భయం నాకు అందుకే. ఇంతలో నీ రిక్షా, నువ్వూ కనిపించారు.

తాత : ఏడవకు తల్లీ. ఎందుకు దెబ్బలాడుకున్నారు. వాళ్లు?

శేబి : అదెందుకో! ఎవరన్నా చెప్తేగా! నాకు మట్టుకేమీ కారణం కనిపించదు. ఈవాళ పొద్దున్న కాఫీలప్పుడు బాగానే ఉన్నారు పంచదార తక్కువైతే అడిగి మరీ వేయించుకున్నాడు నాన్న.

తాత : అవునుగాని బాలమ్మా! మొన్న రిక్షాలో మీ చిన్నమామ్మగారింటికి వెళ్ళినప్పుడు కొద్దిగా విన్నాను. మీ అమ్మగా రెప్పుడూ అలాగే వాదిస్తారా మీ నాన్నగారితో?

శేబి : అమ్మెప్పుడూ అంతే. నవ్వుతూ నాన్న మాట్లాడినా అంతలో ఏదో మాటని కోపం తెప్పించేస్తుందమ్మ!

తాత : ఒక్కొక్కళ్లి తీరే అంత. వాళ్లు సుఖపడలేరు. ఒకళ్ళని సుఖపడనివ్వరు. (తనలో తను మాట్లాడుకున్నట్లు) రాజం ఇలాగే ఉండేది.

శేబి : రాజం ఎవరు తాతా?

తాత : ఆఁ? ఏమీలేదులే, ఏదో ఎవరో జ్ఞాపకమొచ్చారు. అవునుగాని నువ్వెందుకమ్మా మనస్సు కష్టపెట్టుకోడం? అదేదీ జరగనట్లు నీపాటికి నువ్వు హాయిగా చదువుకో, తిరుగు, వాళ్లడిగితే మాట్లాడు... లేకపోతే లేదు.

శేబి : ఎలా తాతా అలా ఉండడం.

తాత : కష్టమేనమ్మా. నేనూ అలా ఉండలేకపోయాను. కాని అలవాటు చేసుకుంటే సాధ్యం అవుతుందని అనిపిస్తుంది నాకు.

బేబి : వాళ్ళలా ఉంటే నాకేమీ తోచదు తాతా. అందులో నాన్న ఆఫీసులో బోలెడన్ని కాగితాలు రాయాలట. ఎంత కష్టపడ తాడో! వితవది రెండు పేజీలు కాపీ రాయడమంటే నా కొళ్లు మండుతూంది. అప్పుడప్పుడు నాన్న అంతంత ఫైళ్ళట, అవేమిటో పట్టుకొస్తాడింటికి. జాలివేస్తుంది నాకు. నేనే అమ్మంత ఉంటే చక్కగా అవన్నీ రాసిపెట్టేదును నాన్నకి! అంతే గాదు, నాన్నకి సరదాగా ఉండడానికి ఆయన కిష్టమైన జంతికలూ, సేమియా పాయసం, రోజూ చేసి పెడ్తాను.

తాత : (నిట్టూర్చి) నా కన్నతల్లీ! పెద్దయ్యాక అలాగే సుఖపెడుదువుగాని తండ్రినీ, తల్లినీ. వెయ్యేళ్లు బతుకు తల్లీ!

బేబి : ఎందుకు తాతా నీ కళ్లవెంబడి అలా నీళ్లు కారుతున్నాయి?

తాత : ఏమీలేదులే...నీలాగే మాట్లాడేపిల్ల ఒకతె జ్ఞాపకం వచ్చింది.

బేబి : ఎవరు తాతా అది?

తాత ఎవరో నాకూ సరిగ్గా తెలియదమ్మా. ఎప్పుడో కలలో చూశానేమో.

బేబి : కలలోనా! మంచి తాతవే. (నవ్వుతూ) నిజంగా అనుకున్నాను నేను!

తాత : కలా ఒకరకంగా నిజమైందేమో నమ్మా. సగంకాలం కలలు గంటూనే గడుపుతాం. ఆ సగమే ఎందుకు నిజంకాకూడదు?

బేబి : కలలన్నీ ఉత్తుత్తివే తాతా. నిజమెలా అవుతాయి? కళ్లు మూసుకుంటే కల, తెరుస్తే నిజం. అమ్మా నాన్నా దెబ్బలాడుకోవడం అంతా ఏదో పెద్ద కలనీ కళ్లు మూసుకుని తెరిస్తే పోతుందనీ అనిపిస్తుం దప్పుడప్పుడు. గట్టిగా కళ్లుమూసుకుని కొంతసేపుండి తెరుస్తాను. తీరా చూసేటప్పటికి (విచారంగా మాట్లాడుతుంది) మళ్ళీ ధుమధుమలాడే అమ్మ మొహం, జాలిగా గడ్డంకింద చెయ్యి పెట్టుకుని కూచున్న నాన్న కళ్లూ కనిపిస్తాయి.

తాత : నా వెర్రితల్లీ! నీలాటి రత్నం ఉండికూడా ఎందుకో ఒక్కొక్కళ్లు సుఖంగా ఉండ లేరు. (నిట్టూరుస్తాడు)

బేబి : నాన్నకూడా అదేమాటన్నాడు ఒకరాత్రి. నేను మంచంమీద కళ్లుమూసుకుని పడు కున్నాను నిద్రపోయినట్లుగా. నాన్నవచ్చి పక్కమీద చాలాసేపు కూర్చున్నాడు నా జుట్టు తన వేళ్లతో సవరిస్తూ. చివరకు నన్ను ముద్దుపెట్టుకుని మెల్లిగా అను కున్నాడు 'ఇలాటి రత్నముండికూడా సుఖం లేకపోతున్నది' అని.

తాత : పాపం!

బేబి : అదుగో...నాన్న లేచి మేడమీది కిటికీ దగ్గర నిలబడి కొబ్బరిచెట్లవైపు చూస్తు న్నాడు. వస్తాను తాతా.

తాత : వెళ్లు తల్లీ. నువ్వుమట్టుకు మామూలుగా నవ్వుతూ తిరుగుతూండు. వాళ్లే దారి కొస్తారు కొన్నాళ్ళకి.

బేబి : (దూరంనుండి) అలాగే తాతా. సాయంత్రానికి కోవాబిళ్లలు తెచ్చిపెట్టవూ?

తాత : (గద్గద కంఠంతో) తెస్తాను తల్లీ, తెస్తాను.

5

[రేడియో పాడుతూ ఉంటుంది. హిందీ పాట గట్టిగా]

శారద : ఆపేద్దూ లవంగీ రేడియో, తిలనొప్పడుతుంది.

లవం : పూర్ గర్ల్! అవునుగాని ఇంత మొరోజ్ గా తయారవుతున్నావేం నువ్వు? వాల్యూం బాగా తగ్గించాలే.

శారద : నీలా తాడు తెగిన గాలిపటంలా ఉంటే మొరోజ్ గా ఎవరూ ఉండరు.

లవం : అందుకే చిన్నప్పుడు అర్ఫనేజిలో ఉన్న ప్పుడు పెళ్ళి చేసుకోకూడదనుకున్నాం. నువ్వూ నేనూ. నేనుమట్టుకు మాట నిలబెట్టు కున్నాను గాని నువ్వు బురదలో దిగబడి పోయావు శారదా...

శార : వాడొకరకం బురదైతే నీది మరొక రకం బురద. అదిష్టంలేక ఈవైపుకు మళ్ళించాను గాని ఇటూ నడవలేక పోతున్నాను.

లవం : నాకేం ఖర్మం బురదిలో బతకటానికి, జెలసీ అనిపిస్తున్నది నీ చేత ఆమాట.

శార : నిన్ను చూసేం జెలసీలేదు లవంగీ. నన్ను చూసి నాకే జెలసీగా ఉంది. ఇప్పటి నేను గాదులే — నాలుగయిదేళ్ల కిందటి నన్ను చూసుకుని పెళ్ళయిన ఆ మొదటి నాలుగేళ్లూ సుఖంగానే ఉండేది. అక్కడ ఆ అడవుల్లో ఫారెస్టరుగా ఆయన ఉన్నప్పుడు! అది మానేసి ఈ ఉద్యోగానికి వచ్చిం దగ్గరి నుంచే మొదలైంది ఆయనకీ దుర్బుద్ధి నన్నేడిపించుకుని తినడానికి!

లవం : మొదటి రోజు అతగాణ్ని చూసినప్పుడే నేననుకున్నానులే — నీ దేవుడో శ్రీహరి కాదు, సౌఖ్య శ్రీహరి అని.

శార : నీ మనసులో ఆలోచనే తథాస్తు అయినట్లుంది. మొదట్లో ఫారెస్టరుగా ఉంటున్న రోజుల్లో బాగానే ఉండేవాళ్లం. ఒక్క అడవి, ఏ సరదాలూ లేవు అన్నది తప్పిస్తే ఏదో హాయిగానే ఉండేదాన్ని ఆరోజుల్లో. నాది అని ఒక పసిపాప ఉండడమూ, ఆయన నన్నొదలకుండా హెడ్ క్వార్టర్సులో ఉన్నన్నాళ్లు ఉండడమూ, ఎంత సుఖంగా ఉండేది ఆ శారద! ఇప్పుడేమిటో ఒంటరిదాన్ని అయిపోయాను లవంగీ. ఆయనా నా వాళ్లు కారు. అదీ, బేబీ, నాది కాదు. కాదు. ఆయనకీవాళ గుమాస్తా ఉద్యోగమూ, స్నేహితాలూ, ఇవే పెళ్లాంకంటె ఎక్కువైపోయాయి! అబ్బా, ఆ రేడియో కుయ్ కుయ్ ఒక టెందుకు, ఆపేద్దూ.

లవం : (రేడియో పూర్తిగా ఆపుతుంది) అప్పుడెప్పుడో మీ ఆయన్ని రేడియో కొనమన్నాను. కొంటారన్నావు?

శార : రేడియో కొన్నట్లే ఉందిలే! కాఫీలో కొద్దిగా పాలెక్కువ పోస్తేనే నసుక్కుంటున్నారాయన — ఎందు కింతంత పాలు పోసి చిక్కగా చెయ్యడం అని. ఆమాట ఆయన అన్న తర్వాత వెధవ కాఫీ తాగాలని మరి బుద్ధిపుట్టదు!

లవంగి : అందుకే ఒకడిమీద ఆధారపడి బతకకూడదు అని నా సిద్ధాంతం. మన వ్యక్తిత్వం, స్వేచ్ఛా, అభిరుచులూ అన్నీ చంపుకుని మరొకడి చేతికింద దొప్పయిపోయి, వాడు నంది...అంటే నందనీ...

శార : చాలిద్దూ ఇంక... నే పోతాను.

లవం : అప్పుడే వెళ్లిపోవడమేమిటి కూర్చో శారదా. కోపం వచ్చిందేమిటి క్రిటిసైజ్ చేశానని...

శార : కోపమెందుకు, ఉన్నమాటన్నావు! ఈ పరిస్థితుల్లోనుంచి పైకి ఎలా పడటమో తెలియకుండా ఉంది. రోజురోజుకీ భరించడం కష్టమైపోతోందనుకో లవంగీ. అబ్బా తల నొప్పిగా ఉంది ఏంచేతో.

లవం : ఉండు. స్టౌమీద ఒకకప్పు స్ట్రాంగ్ కాఫీ పెట్టిస్తాను. (స్టౌ సర్దే చప్పుడు) మాట్లాడుతూ వెలిగిస్తుంది. (స్టౌ చప్పుడు) దీనికింత పెద్ద ఆలోచనెందుకు, బ్రెయిన్ పాడు చేసుకోవడమెందుకు? వన్ ఫైన్ యీ వెనింగ్ అతగాణ్ని పిలవడం — అబ్బాయి, ఏదో అనుకున్నాం గాని చూస్తే మొత్తంమీద మన ప్రకృతులు కలిసినట్లు లేదు; నీతోవ నీది, నాతోవ నాది ఈవాళటినుంచీ, గుడ్ బై, అని చెప్పడమూ, నీ ఫ్రెండ్ లవంగి ఇంటికి ఒక రిక్షా కట్టించుకుని వచ్చెయ్యడమూ — ఆరాత్రి నిద్రపోయి పొద్దున్న లేచి చూసేటప్పటికల్లా, చురేముంది, ఒకసరికొత్త హొరైజన్ లేస్తుంది నీకళ్ళ ముందు! ఏమిటలా చూస్తున్నావు, బేబీ ఒకతుంది, దాన్నెలా వదలడమనా? మన హిందూలా ప్రకారం తండ్రికే పూచీ, తనే చూసుకుంటాడు చచ్చినట్లు. ఆ పాతబతుకు తాలూకు మెమెంటో లేపి ఇక్కడికి తెచ్చుకోకు. అదేమిటలా కళ్లు తేలేస్తున్నావు? ఏమిటది శారదా?

శార : (నీరసంగా) ఏమిటో కళ్లు తిరుగుతున్నాయి ...చెవులు గింగురు మెంటున్నాయి... నువ్వు చెప్పేమాట లేదో సరిగా వినపడటం లేదు...

లవం : మధ్యాహ్నం భోంచెయ్య లేదు కదూ నువ్వు? మాటిమాటికీ డబ్బాలాటల్లో భోజనాలు మానేస్తున్నావు! పూర్ లాస్! అందుకే యీ నీరసాలు! యీ మంచంమీద ఇలా పడుకో ఒక్క నిమిషం. నీళ్ళు కాగిపోయాయి. పాలుకూడా కొద్దిగా కాచి కాఫీ ఇస్తాను.

[స్టౌ వంపు కొడుతున్న చప్పుడు ఫేడౌట్]

6

జగ్గ : బీడీ ఓటుంటే ఇయ్యి తాతా సలేత్తున్నాది.

తాత : ఇదిగో... అయినా పడుచువాళ్లు మీకేం చలిరా జగ్గా?

జగ్గ : సలికి పడుసేటి ముసిలేటి తాతా! అందులో సెమటలో ముద్దై తడిసుంటాదా వుడితినీ, ఈ రేత్తిరి గాలికి ఒకటే సలి.

తాత : అదిగో గంజాయి పీల్చినట్టుగా అలా దమ్ము లాగకురా బీడీ. విషం గుండెల్లోకి పోక్కా తుంది.

జగ్గ : సత్తే ఒకపాలే పీడొదిలి పోతాది తాతా.

తాత : అంత సులువుగా రాదురా చావు.

జగ్గ : నీదంతా యేదాంతం కవుర్లే. కావాలంటే ఎందుకు కాదులే సావడం.

తాత : (తనలో అనుకున్నట్టు) అవునవును, నిజమే బతకాలంటే బతకటం కష్టం. కాని చావడం సులువే...ధైర్యం ఉన్న వాళ్లకి అతి సులువు.

జగ్గ : అవును గాని తాతా, ఇందాకేటి సెప్తుండావు ఈయాలే అకరురోజని రికసా సాగడానికి నిజమే నేటి?

తాత : నిజమే. ఈ తెల్లవారుఝామున రైల్లో వెళ్లి పోతాను. మరొక్క రూపాయి తక్కువుంది వందకి. ఆ దీరాత్రి గడించానంటే పూర్తవుతుంది. దాంతో తిన్నగా కాశీ పోతాను. ఈ ప్రాణం గుటుక్కుమనేదాకా ఆ పరమేశ్వరుడి కాళ్ళ దగ్గర అక్కడే పడుంటాను.

జగ్గ : అయితే తాతా వొంద రూకలు దాపినావు! అయిదు రూకలిక్కి గతి లేక పోతోంది నాకు. అయినా నాలాగేటి నువ్వు? భార్యాపిల్లలూ ఎవరూ నేరు నీకు. నుడిసె కెల్లినానంటే రొండు బుజాలూ, తలా, ఒడీ పాల్దు నాకు పిల్లలెక్కుతుంటావికి. వొంద రూకలే ఉంటేనా, చిన్న దుకాణ వొంకటెట్టుకుని సుకంగా ఉందును. అదురుట్టమంతుడివి తాతా నువ్వు.

తాత : (విచారంగా నవ్వి) అదృష్టమేలే. (దూరం నుండి పిలుపు)

కొత్త.గొం: ఏయ్ రిక్షా...

జగ్గ : వొత్తున్నా బాబూ. (రిక్షా లాగుకు వెళ్ళిన చప్పుడు).

కొ.గొం: (దూరంగా) స్టేషనుకెళ్ళాలి. ఒక పావుగంటే టైముంది. తీసుకెళ్ళగలవూ?

జగ్గ : (దూరంగా) ఓం.. సిటికెలమీద ఎల్లిపోతాం బాబూ.

తాత : బాబుగారు. ఒరేయి జగ్గా నేనే వెళ్తానుండరా.

జగ్గ : (దూరంగా) అయితే రా...

[రిక్షా నడిచిన చప్పుడు]

తాత : రండి బాబూ, కూర్చోండి. కలకత్తా పాసెంజరుకేనా? బోలెడంత టైముంది.

శ్రీహ : పద.

[రిక్షా జోరుగా నడుస్తుంది. ఆగుతుంది]

శ్రీహ : ఏమిటయింది?

తాత : దీపంలో కిరసనాయిలు అయిపోయినట్లుంది. వత్తి కాల్తున్నది. ఉండండి. రెండు చుక్కలు దమురేసుకుని వెళ్లిపోదాం.

శ్రీహ : కిరొసిన్ ఇప్పుడెక్కడ దొరుకుతుంది?

తాత : పెట్లో సీసాలో ఉందిబాబూ. ఒక్కసారి తమరు లేవండి.

శ్రీహ : వేగం కానీ. (సీటు తీసిన చప్పుడు) కూర్చోండి బాబూ, పోదాం.

శ్రీహ : వేగం పద.

[రిక్షా వస్తూంటుంది. కొంతసేపటికి పెడల్ గట్టిగా కొట్టినచప్పుడు]

శ్రీహ : ఏమిటది తాతా.

తాత : చెయి నూడిపోయింది. ఒక్క నిముషంలో తగిలించేస్తానుండండి.

శ్రీహ : ఈవాళ బండి అందనిచ్చేట్లు లేవు.

తాత : అందకేం బాబూ! అస లీవాళ అరగంట లేటట.

శ్రీహ : లేటా?

తాత : ఏమో, అదెవరో అన్నారు. అయినా లేటు కాకపోయినా అందుతుంది బాబూ.

[చెయిను తగిలిస్తున్న చప్పుడు]

శ్రీహ : ఏమిటంతసేపు చేస్తున్నావు చెయిన్ తగిలించడానికి?

తాత : చీకట్లో కనపడటంలేదు బాబూ.

శ్రీహ : బుద్ధిపొరపాటున ఎక్కాను నీ రిక్షా. నడిచి వెళ్తే వేగం వెళ్లిఉందు నేమో! అర్జంటుగా వెళ్లవలసి ఉంది.

తాత : నిజంగా అంత అర్జంటైన పనేనేమిటి బాబూ?

శ్రీహ : (కోపంగా) అనవసరం ప్రశ్నలు నీకెందుకు? నీపని వేగంకానీ.

తాత : పొరపాటు బాబూ, క్షమించండి. అయిపోయింది వెధవదృష్టి చీకట్లో సరిగ్గా ఉండదు.

శ్రీహ : నువ్వు చదువుకున్నవాడిలా ఉన్నావు?

తాత : నేనా? (ఆగి) లేదండి.

[రిక్షా నడిచిన చప్పుడు]

శ్రీహ : అదిగో, పాసెంజర్ ఇంకా స్టేషనులోనే ఉంది! వేగంపోనీ. సెకండ్ బెల్ లా ఉంది, పద తాతా, పద! మళ్ళీ ఏమిటయింది, ఆపుతున్నావు? ఇదేం దరిద్రమోయ్?

తాత : మళ్ళా చెయినూడిందండి.

శ్రీహ : మళ్ళానా?

తాత : అయిపోయింది. (మళ్ళీ రిక్షా నడుస్తుంది) నాలాగే ముసలిదైపోయిందండి రిక్షాకూడా.

[రైలుకూత, కదిలిన చప్పుడు]

మరి లాభంలేదు బాబూ.

శ్రీహ : దంపేశావ్. (రైలు జోరుగా వెళ్లేచప్పుడు) వెధవ చెయిను పాడుచేసింది పనంతా.

తాత : అంతా మంచికే అని ఇంగ్లీషులో అంటారట లెండి.

శ్రీహ : (వినిపించుకోకుండా తనలో తాను) హెల్ — హెల్ — తప్పుకుపోదామంటే అయిందికాదు.

తాత : బాబూ, వెనక్కి తిప్పమంటారా రిక్షా?

శ్రీహ : ఆఁ...వెనక్కా? లేదు. దిగిపోతాను. నువ్వెళ్లు.

తాత : మరిప్పుడు కలకత్తా వైపుకు బండిలేదండి. మళ్లీ తెల్లవారుజామునే.

శ్రీహ : నాకు తెలుసు. అంతవరకూ ఇక్కడే ఉంటాను. ఇదిగో అరణాలు.

తాత : డబ్బులొద్దండి...నా మూలాన్ని బండీ తప్పిపోయింది!

శ్రీహ : అది నా దురదృష్టం. తీసుకో, వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఆఖరురోజున ఈ ఊళ్లో ఎవరి కష్టమో ఉంచేసుకున్నా నన్నమాట ఉండిపోకూడదు.

తాత : నాదీ అదేబాధండి. ఈ ఆఖరురోజున ఎవరి పనో పాడుచేసి పైగా వాళ్లదగ్గర డబ్బులు పుచ్చుకున్నానన్నమాట ఉండిపోతే నాకూ కష్టమేనండి.

శ్రీహ : నీకేం ఆఖరు రోజు?

తాత : అవునండి. ఈ రాత్రితో ఈ పని మాని కాశీ వెళ్ళిపోతున్నానండి. ఒంటిలో ఓపిక లేదండి?

శ్రీహ : పాపం పెద్దవయసు! తీసుకో ఇంద.

తాత : వద్దండి...క్షమించండి.

శ్రీహ : (కొద్ది కోపంగా) ఇదేం గోలోయ్ తాతా!

తాత : కోపమొద్దండి. (ఆగి) కావాలంటే ఓపని చెయ్యండి.

శ్రీహ : ఏమిటది?

తాత : ఇంకా చూడండి. ఇప్పుడు పదకొండే అయింది. బండి మళ్ళీ అయిదుంబావుకి. ఇక్కడెక్కడ కూర్చుంటారు? యీగోలలో నిద్రపట్టదు. చక్కగా బీచికి పోదాం పదండి. అటునుంచి నాలుగు నాలుగున్నర వేళకి బయల్దేరివస్తే చక్కగా అందుతుంది బండి. అప్పుడిద్దరుగాని డబ్బులు ఇదీ అదీ కలిపి. నేనూ బండీ అప్పజెప్పేసి వెళ్ళిపోతాను. పదండి బాబూ, ఇక్కడేంచేస్తారు?

శ్రీహ : నిజమేగాని...

తాత : అసలు బండి తప్పిపోయిందని విచారించకండి. కొంతకొంతమంది బతుకుల్లో సరిగ్గా వేళకు బండి అందకపోతే వాళ్ళకి, వాళ్ళ బతుకులు మరోలాన నడిచి ఉండేవేమో! మళ్ళీ బండివేళకు అసలు వెళ్ళే అవసరమే ఉంటుందో ఉండదో కొంతమందికి.

శ్రీహ : ఉహూఁ. లేదు. నేను తెల్లవారిజామున వెళ్లి తీరాలి.

తాత : ఆహాఁ...తమరు వెళ్ళాలిలెండి...తమ సంగతి కాదు, లోకం భోగట్టా చెప్తున్నాను. ఎక్కండి బాబూ వెళ్దాం.

శ్రీహ : పద.

తాత : (రిక్షా నడుపుతూ) అరే జగ్గడా! నువ్వేలా వచ్చావురా? బేరం దొరికిందేమిటి?

జగ్గ : లేదు. యీ టేసిన్‌కాడేమన్నా దొరుకుతుందేమో వచ్చాను. మళ్ళీ ఎడకెల్తున్నావు తాతా?

తాత : (దూరంనుండి) బీచికి.

7

(పన్నెండు గంటలు కొడుతుంది గడియారం)

శేబి : పన్నెండులా ఉందమ్మా!

శార : అవును.

శేబి : నాన్నింకా రాలేదు. ఇంతరాత్రి ఎక్కడికి వెళ్ళిపోయారమ్మా?

శార : ఎక్కడికి వెళ్తారు? ఆయనే వస్తారు!

శేబి : నాకేమో భయంగా ఉందమ్మా.

శార : ఏమీ భయంలేదు, కళ్ళుమూసుకు పడుకో. నీకెందుకు అనవసరంగా ఈ గొడవలు?— (భర్త నుద్దేశించి) అన్నీ ఉత్తబెదిరింపులు! అంత సులభంగా పోతారేమిటి వీరు!

శేబి : అమ్మా......

శార : నోరుమూసుకు పడుకో

8

(దూరంగా సముద్రపుహోరు)

తాత : బాబూ.

శ్రీహ : ....

తాత : బాబూ...నిద్రపోతున్నారా?

శ్రీహ : లేదు తాతా. రా. కూర్చో...ఇళ్ళలో పరుపులకంటె ఈ ఇసుకే ఎక్కువ హాయిగా ఉంది తాతా.

తాత : హాయి అన్నది ఆ వస్తువుల్లో లేదు బాబూ. మన మనసుల్లోనే ఉంది.

శ్రీహ : అది నిజమేలే.

తాత : (ఆగి) వస్తువులేకాదు బాబూ, మనుషులూ అంతే! వాళ్ళు మనకు హాయి కలిగిస్తారు అని మనం అనుకుని ఆ నమ్మకంతో నడుచుకున్నామంటే వాళ్లూ హాయే కలిగిస్తారు మనకి.

శ్రీహ : ....

తాత : నామాట నమ్మదగిందిగా కనపడలేదేమిటి బాబుగారికి?

శ్రీహ : నమ్మడానికేముంది తాతా! ఒక్కొక్కళ్ళ అభిప్రాయాలు ఒక్కొక్కలాగుంటాయి.

తాత : అభిప్రాయం కాదు బాబూ, అనుభవంవల్ల గ్రహించానిది. చూడండి, నా వయస్సులో సగంకూడా ఉండదేమో మీ వయసు! కోప్పడకండి, ఇలా అన్నందుకు.

శ్రీహ : కోపమేమీలేదు తాతా. ఈ అభిప్రాయం నాకూ ఉండేది కొన్నాళ్ళు. కానీ చివరకు మోసపోయాను.

తాత : మోసపోలేదు బాబూ. ఆ నమ్మకం పోయిందన్నమాట. అలా మనుషుల్లో మనకున్న నమ్మకాన్ని జారిపోనివ్వకూడదు బాబూ.

ఓడిపోయినట్లే అనిపిస్తుంది అప్పుడప్పుడు. కాని గట్టిగా నమ్మకంగా నిలబెడ్డామంటే గెలుస్తాం. గెలిచి తీరుతాం. ప్రతీ మనిషిలోనూ ఎదుటివాడికి హాయి కలిగించే శక్తి ఉంది, మనలోనూ ఉంది. మనలో ఉన్న శక్తిని పూర్తిగా ఉపయోగించి నమ్మకంగా నడుచుకున్నామంటే ఎదుటిమనిషీ తన శక్తి ఉపయోగించి తీరుతుంది. (ఆగి) తమరేమనుకోకుండా ఉంటే ఒకటి చెప్తాను. ముఖ్యంగా భార్యాభర్తల్లో ఒకళ్లమీ దొకళ్లకి ఈ నమ్మకం అవసరం.

శ్రీహ : ....

తాత : ఈ ముసిలోడిమీద తమకు కోపంవచ్చినా సరే కొన్నిమాటలు, నా అనుభవంవల్ల నేను తెలుసుకున్నవి తమకు చెప్పాలని బుద్ధి పుట్టింది నాకు. అసలు మీమీద కొంత హక్కుంది నాకు, మీరు బాలమ్మగారి తండ్రి...

శ్రీహ : బాలమ్మా, నీకు మా బాలమ్మ తెలుసా?

తాత : మా రిక్షాలాగే జంక్షనుదగ్గరేకదండి మీయిల్లు! బాలమ్మగారు రోజూ స్కూలు కెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు ఈ ముసిలోణ్ని పలకరించందే వదలరండి.

శ్రీహ : నువ్వు మాకు పాత స్నేహితుడివన్నమాటే! బాలమ్మ రిక్షాతాత, రిక్షాతాత అనేది అప్పుడప్పుడు నిన్నుగురించే అన్నమాట!

తాత : అవునండి. బాలమ్మగారు మంచి చలాకీ అయిన పిల్లండి! నిజంగా ఒక రత్నమేనండి!

శ్రీహ : (విచారంగా) అవును.

తాత : (హటాత్తుగా) అలాటి రత్నం ఇంట్లో ఉండీ సుఖపడలేక మీరు వెళ్ళిపోతున్నారంటే తప్పు మీదికదూ బాబూ? క్షమించండి, ఇలా అడిగినందుకు...

శ్రీహ : (ఆగి) పరవాలేదులే. మరో వాడు ఈ మాటలు నువ్వంటే ఎంతదూరం వెళ్లేదో! కాని, ఈనాశమట్టుకు ఎవరో దేవత ఆకాశంలో నుంచి మాట్లాడుతున్నట్లుంది.

తాత : మీరు వెళ్ళిపోతే వాళ్ళకేందిక్కో ఆలోచించారా బాబూ? అప్పటి కేదో వచ్చిన కోపంలో ఇలా తమరు బయల్దేరి వెళ్ళిపోవడమేనా?

శ్రీహ : ఆ దిక్కులగురించిన ధైర్యం తన కున్నట్లే మాట్లాడుతుందది!

తాత : ఏదో అహంకారం మీద నేమాటలు బాబూ అవి. ఆ శారదమ్మగారిలాటివాళ్లు ప్రపంచంలో చాలామంది ఉంటారు. వాళ్లకి దేవుడు సరిగ్గా మాట్లాడ్డం నేర్పలేదు. వాళ్ల తప్పుకాదది. అయినా ఆ చేతగానితనానికి వాళ్లూ, వాళ్లతో సంబంధమున్న వాళ్ళూ, సుఖానికి దూరమై శిక్షపడి బాధ పడాలి. ఆ చేతగాని తనాన్ని అర్థం చేసుకుని మీలాటివాళ్లు నడవగలిగితే అందరికీ సుఖం—ఎవరూ బాధ పడక్కరలేదు. క్రమంగా సరిగా మాట్లాడడం వాళ్లే నేర్చుకుంటారు. ఆ ప్రయత్నం పూర్తిగా చెయ్యకుండా పారిపోవడం ఉత్తి పిరికితనం బాబూ!

శ్రీహ : అవునుగాని నేనెంత ప్రయత్నం చేశానో నీకు తెలియదు తాతా? లాభంలేదన్న నిర్ణయానికి వచ్చాకే......

తాత : తొందరపడ్డారు మీరు ఎలాగన్నా! క్షమించండి, తెలిసినట్లుగా మాట్లాడుతున్నందుకు, మీరు సరిగ్గా ప్రయత్నమే చేసినట్లు లేదు!

శ్రీహ : నీకు తెలియదు తాతా. అది అడవుల్లో ఉండలేదని, పట్నవాసం కావాలి దానికని పండులాటి ఉద్యోగం పాడుచేసుకున్నాను.

తాత : అదే మీరుచేసిన పొరపాటు. ఆవిడకి తన మీద తనకే నమ్మకం సరిగాలేని స్థితిలో ఆ నమ్మకం కలిగించేందుకు బదులు ఉన్న నమ్మకాన్ని లాగేశారు మీరు! అడవుల్లోనూ సుఖంగా ఉండొచ్చు అన్న విషయం ఆవిడకు నచ్చచెప్పలేకపోయారు.

శ్రీహ : కావచ్చు.

తాత : ఇక్కడికొచ్చీ ఆవిడ సుఖపడటంలేదు. అసలిదివరకున్న కాస్త సుఖాన్నీ పాడుచేసుకున్నారేమో కూడా, ఒకనాడావిడా ఎవరో స్నేహితురాలూ నా రిక్షాలో వెళ్లారు. అప్పుడు వాళ్లమాటలు కొన్ని విన్నాను.

శ్రీహ : తెల్లగా, సన్నగా, రెండు జడలు వేస్తుంది అదేనా?

తాత : అవునండి. లవంగి అని కాబోలు పేరు.

శ్రీహ : (కోపంతో) అదే దీన్ని పాడుచేస్తున్నది...

తాత : ఆవిడని తిట్టి లాభంలేదు. అలాటి వాళ్లెంత మందో ఉన్నారు ప్రపంచంలో, అస లలాటివాళ్లే స్నేహంకోసం ఆవిడ ప్రాకు లాడకుండా ఉండే పరిస్థితులు కలిగించవల సింది మీరు.

శ్రీహ : ఎంతకని ప్రయత్నించను. ఈ వెధవ ఉద్యోగంలో ఊపిరితీయడానికి కూడా...

తాత : కలిగించుకోవాలంటే బోలెడంత వీలుం టుంది. మీ రసలు కావాలనే తీరుబడి లేకుండా చేసుకుని మీలో మీరు ముడు చుకుపోతున్నారేమో అని నా అనుమానం.

శ్రీహ : నువ్వెవరో దేవతలా ఉన్నావు తాతా! మనస్సులో దూరి ఆ మనసు నే మాట్లాడేలా చేస్తున్నావు! మామూలు రిక్షా తొక్కుకుని బతికేవాడివి, ఇంత చక్కగా మాట్లాడడం ఎలా నేర్చుకున్నావు తాతా?

తాత : నే నేమీ నేర్చుకోలేదు బాబూ—అనుభవం వల్ల నే తెలుసుకున్నానివన్నీ! (నిట్టూర్చి, ఆగి) యీవాళ మీకు తప్పిపోయినట్టే ఇరవైఏళ్ళక్రిందట ఒక రైలు అందకుండా తప్పిపోయి ఉన్నట్లయితే ఎంతోమంది బతు కులో మరోరకంగా నడిచిఉండేవి.

శ్రీహ : నిజంగా తాతా?

తాత : నిజమే బాబూ. మీలాగే ఒక మధ్యతరగతి సంసారి, పెళ్లాంతో దెబ్బలాడి—లేక ఆ పెళ్లామే అతనితో దెబ్బలాడిందో, దెబ్బ లాటలో ఎవరిది ముందు తప్పో చెప్పడం కష్టం—పెళ్లాన్ని, ఎనిమిదేళ్ళ కూతుర్ని, మంచి ఉద్యోగాన్నీ, వదిలి రైలుస్టేషనుకు వెళ్ళాడు. కాని అప్పుడిలా రిక్షాలులేవు, నడిచివెళ్లే వేళకుసరిగా రైలు కందుకు న్నాడు. తప్పిపోతే ఎంత బాగుండేది?

శ్రీహ : (నిద్రలోలా) ఊఁ...తరువాత?

తాత : కొన్నాళ్లకు మళ్ళీ తన తప్పు తెలుసుకుని తిరిగి వచ్చాడు. కాని మరి అతనికి అడుగు పెట్టడానికి ఇల్లు లేదప్పుడు.

శ్రీహ : (ఆదుర్దాగా) ఏమయింది తాతా?

తాత : (నిట్టూర్చి) అతడికి రైలందిన టైముకే ఆ భార్య తన కాలికిందఉన్న బిందె తన్నేసి దూలంనుండి వేళ్ళాడిందిట.

శ్రీహ : అరే, పాపం.

తాత : (గద్గద కంఠంతో) ఆ పిల్లనెవరో ధర్మా త్ములు తీసుకుపోయారు పెంచడానికి. దరి ద్రుడికి తగినశాస్తి అయింది తన తొందరకి!

శ్రీహ : నాకేదో భయంగా ఉంది తాతా.

తాత : సహజమే, వెళ్లండి బాబూ ఇంటికి. లేవండి. ఇటువంటి వేళ ఆలస్యం కూడదు, లేవండి.

శ్రీహ : (గాభరాగా కొద్దిగా గట్టిగా) బాల, శారద, బాల......

తాత : బాబూ పదండి. రిక్షాలో మీ ఇంటిదగ్గర దిగబెట్టేస్తాను.

శ్రీహ : ఏదీ? ఎక్కడుంచావు రిక్షా? (దూరంగా) రా, తాతా. రా. వేగం వెళ్దాం.

తాత : (దూరంగా) రండి బాబూ. ఇక్కడుంది రిక్షా. రండి.

9

(శారద ఏడుస్తున్న ధ్వని, చిట్టి బాల వెక్కి వెక్కి ఏడుస్తుంది)

శ్రీహ : ఏడవకు శారదా. నా మాట విను.

శార : (ఏడుస్తూ) ఏడిపించడానికే వచ్చారు మీరు.

శ్రీహ : (జాలిగా) ఈమాట నువ్వు ఇదివరకు అన్న ట్లయితే మళ్లీ వెనక్కు గిరుక్కున తిరిగి వెళ్లిపోయి ఉండేవాడిని. ఈ వాళ నుంచి అలా వెళ్లదలచుకోలేదు. నువ్వేమన్నా సరే! ఏడిపించడానికి కాదు. నిన్ను సుఖపెడ దామనే వచ్చాను. నామాట నమ్ము. ఏడవకు శారదా.

శార : నాది ఏకుపు బతుకే అయిపోయింది.

శ్రీహ : ఎందుకలా అనుకోవాలి శారదా? ఒకనాడు గలగలమని పారే చిన్న సెలయేటి ఒడ్డున, నల్లటి రాళ్ళమీద కూర్చుని ఉన్న గర్భవతి అయిన ఒక అమ్మాయి చుట్టుపక్కలంతా చీబురుగాఉన్న చెట్లల్లో ఎక్కడో దాగు కుని ఉన్న పిట్టల వింతవింత గొంతుల మధ్య

ఏమందో తెలుసా? (శారద మౌనం) ఇదిగో చూడు ఊ, జ్ఞాపకమొచ్చిందా? చెప్పవూ, నీ శ్రీహరికి చెప్పవూ?

శార : (ఏడుస్తూ) ఆ అమ్మాయి ... గట్టున విరబూచి ఉన్న కందపూలు చేతులతో తాకుతూ...ఆకాశంమీద అలముకుంటున్న ఎర్రని రంగుల్ని...చూస్తూ అందిగదూ... ఆ మాటలు?

శ్రీహ : అవును. ఏమందో జ్ఞాపకముందా?

శార : బ్రదుకు...బ్రదుకు...

శ్రీహ : సిగ్గెందుకు శారదా! తలపైకెత్తి చూడు. నా కళ్లల్లో! బ్రదుకులో ఎంత తీపి ఉంది అని కదూ అంది.

శార : అవును.

శ్రీహ : నా శారద! బాలా...బాలేదీ? అరేమందం మీద పడుక్కుని ఏడుస్తున్నావు? (దూరంగా) లేలే. ఛీ. ఏడుపెందుకు.... అమ్మ పిలుస్తుంది, లే బాలా. నామాట వినులే.

శార : (దూరంగా) బాలా బాలా...లే బాలా,

బేబి : (దూరంగా) అమ్మా....

10

[తాతపాట దూరంనుండి దగ్గరకు వస్తుంది వణకేగొంతు]

తాత : అంతులేని బాటలోన
నడిచే ఓ వెర్రి మనిషి
ఈపయనం ఆగుతుంది
ఒక్కనాడు సాగుతుంది
భయపడకోయ్ వృథగ నీవు—
త్వరపడకోయ్ వ్యథలు పడుతు!

ఎవరది—ఓహో—జగ్గడిరిష్టా! ఏమిరా?

జగ్గ : ఏటీ లేదు. నిన్ను స్టేషనుకాడ దింపేద్దామని. రికషా అప్పజెప్పేసినావా సావుకారికి?

తాత : అప్పజెప్పేశాను. ఈవాళతో ఋణం తీరిపోయిందిరా దానికీ నాకూ. ముసిలోడంటే అభిమానంకొద్దీ వచ్చినట్లున్నావు, నీమాటెందుకు కాదనడం! పద. ఇలా మన జంక్షనుమీదంచి తీసుకెళ్లిరా! అక్కడ మా బాలమ్మగారి నొక్కసారి చూడాలి వెళ్ళిపోయేముందు.

జగ్గ : ఎక్కయిలే. (రిక్షా చప్పుడు ఫేడౌట్)

11

శార : తరువాత?

శ్రీహ : మరేముంది? మళ్ళీ ఆ పాడయిన ఇల్లువది[...] ఎక్కడికో వెళ్లిపోయాడట అమనిషి. పాపం[...] నా కనుమానం; ఆ రిక్షాతాతే అతడని. త[...] కథే చెప్పిఉంటాడు.

శార : తనపేరు చెప్పాడా ఆతాత?

శ్రీహ : లేదు.

శార : అతని మొహం మీరు సరిగా చూశారా?

శ్రీహ : గడ్డాలూ, మీసాలూ, అవునవును. అక్క[...] స్టేషనుదగ్గర లైటుపక్కనే ఆపాడు— మొహం బాగా ముడుతలు పడిఉంది.

శార : అదికాదు. ఎడమ కంటికీ ఎడమ చెవి[...] మధ్యన మొదలై ముక్కు పుటాలవరకు ఏ[...] వాలుగా ఏమన్నా మచ్చ ఉందా ఒకపావ[...] గుళం లోతున?

శ్రీహ : ఆఁ? అవును ఉంది.

శార : (గట్టిగా) ఉందా? ఉందా? మా నాన్న మా నాన్న!

శ్రీహ : మీ నాన్నా? మీ నాన్నా?

శార : అవును మా నాన్నే. వెళ్దాం పదండి. వెతి[...] తీసుకొద్దాం.

శ్రీహ : ఈ ట్రెయినులో వెళ్లిపోతానన్నాడు. ఇంకా[...] అరగంటపైన టైముందిలే. నేను వెళ్ళి తీసు[...] కొస్తాను. నువిక్కడే ఉండు, బాలతో.

శార : వేగం వెళ్లండి. వెళ్లిపోనియ్యకండి[...] నాన్నని. నాన్న! మా నాన్న!

శ్రీహ : (దూరంగా) వెళ్తున్నా, తలుపేసుకో.

[దూరంగా అమ్మో అని కేక]

ఎవరా అరిచింది?

శార : ఏమిటది? ఏదో. మీరు వెళ్లండి వేగం[...] (తలుపు వేస్తుంది)

[ఒక అరనిముషం జాలిగా మ్యూజిక్]

శ్రీహ : (వెర్రిగా అరుస్తూ) తలుపుతియ్యి శారదా[...] తలుపుతియ్యి.

శార : (గడియలాగి) చేతిలో ఏమిటది? ఎవరది[...] నెత్తురు?

శ్రీహ : రిక్షా తాత రిక్షా తాతగానే వెళ్లిపోయాడు[...]

శార : నాన్నా.........

బేబి : తాతా.........

[ఆలిండియా రేడియో అనుమతిని ప్రకటితము]

ఘటికాచల మాహాత్మ్యము

శ్రీ కేతవరపు వేంకటరామకోటిశాస్త్రి

ఈ గ్రంథమునకు కర్త తెనాలిరామకృష్ణకవి. పాండురంగమాహాత్మ్యకృతికర్తయు నీతడే. రామలింగ రామకృష్ణు లభిన్నులని విమర్శకు లంగీకరించియుండుటవలన ఉద్భటారాధ్య చరిత్రమునకును కర్తృత్వ మీతనిదే యైనది. రామలింగకవి కందర్పకేతువిలాసము, హరిలీలావిలాసము అను గ్రంథములను వ్రాసినట్లు వినుకలియే గాని కనుకలి లేదు. రామకృష్ణకవి మొదట శైవుడుగానుండి యుద్భటారాధ్య చరిత్రము రచించి తరువాత వైష్ణవము స్వీకరించి ఘటికాచలమాహాత్మ్యమును, పాండురంగ మాహాత్మ్యమును రచించెనని పండితుల యూహ. రామకృష్ణకవివిగా మన కుపలభ్యములైన మూడుగ్రంథములలో ఘటికాచలమాహాత్మ్యమున కొక వైశిష్ట్య మున్నది. ఉద్భటారాధ్యచరిత్రము దేవమంత్రికిని, పాండురంగ మాహాత్మ్యము విరూరి వేదాద్రిమంత్రికిని అంకితము గావింపబడినది. అనగా రామకృష్ణకవియే వారికా యాగ్రంథముల నంకితము గావించెను. ఘటికాచలమాహాత్మ్యమునుమాత్ర మెవరికిని అంకితము చేయలేదు. పండితు లభిప్రాయపడుచున్నట్లు రామకృష్ణ కవి చిట్టచివరి కావ్యము పాండురంగమాహాత్మ్యమే యైనచో, తా నంతకుపూర్వము రచించిన యొకగ్రంథ మింటపడియుండగా క్రొత్తగ్రంథమును వ్రాసి వేదాద్రిమంత్రికి అంకితముచేసినాడని చెప్పవలయును. ముందువ్రాసిన గ్రంథ మొకరి కంకితము చేసికదా మరొక గ్రంథరచన కుపక్రమించుట. ఒకవేళ వేదాద్రి మంత్రి వైష్ణవుడగుటచే పౌండరీక విభువిచరిత్ర వ్రాయవలసినదిగా రామకృష్ణకవిని కోరియుండవచ్చుననినచో ఘటికాచల మాహాత్మ్యము గూడ వైష్ణవమేగదా? దీనినిగూడ వేదాద్రికే అంకితము సేయవచ్చునుగదా? అట్లేల చేసియుండలేదు? పోనీ నరాంకితము చేయుట కిష్టముకానివాడా యనిన మిగిలిన రెండు గ్రంథములను నరాంకితము గావించినాడు గదా!—అట్లు గాక ఘటికాచల మాహాత్మ్యము ప్రథమ రచనయగుట కవికిని దానియం దంత యాదరభావము లేక మూల బడిపోయిన దేమో అనుకొనుటకును వీలు లేదు. అట్లనుకొనినచో రామకృష్ణకవి మొదట శైవుడుగానుండి తరువాత వైష్ణవుడైనాడనుట పొసగదు. అపుడు, ముందు వైష్ణవుడైయుండి ఘటికాచల మాహాత్మ్యమును వ్రాసి తరువాత శైవుడై ఉద్భటారాధ్య చరిత్ర వ్రాసి తిరిగి వైష్ణవుడై పాండురంగ మాహాత్మ్యమును వ్రాసియుండునని చెప్పవలసి వచ్చును. ఇంతకంటె అసందర్భ ముండదనుకొందుము. ఇక మిగిలినది పాండురంగ మాహాత్మ్యము రచించి వేదాద్రి కంకితము గావించి, చరమదశలో ఘటికాచల మాహాత్మ్యమును గ్రథించి యెవరికిని అంకిత మీయకుండగనే రామకృష్ణకవి పరమపదించి యుండునని చెప్పుట. ఇదియు నిర్బాధకము గాదు. గ్రంథరచనాభ్యాసము పెరుగుకొలది ప్రతిభా వ్యుత్పత్తులలో ప్రౌఢిమ, సాంద్రత గోచరింపవలయును గదా? అన్ని విషయములను పాండురంగ మాహాత్మ్యము, ఉద్భటారాధ్య చరిత్రకు పైచేయిదే. ఆ లెక్కను ఘటికాచల మాహాత్మ్యము పాండురంగ మాహాత్మ్యమునకంటె మిగులై యుండవలయును. కాని అట్లు లేదు. పాండురంగ మాహాత్మ్యమునందువలె హృద్యములైన కథలుగాని, ఉన్న కథలోనైనను క్రమోన్మీలనమైన గమనముగాని, ఉక్తివైచిత్రిగాని ఘటికాచల మహాత్మ్యమున మృగ్యములు. పాండురంగ మాహాత్మ్యము కీగ్రంథము తీసికట్టు. సందేహము లేదు. ఈ గ్రంథ మీ యవస్థలో నుండుటకు, రామకృష్ణ కవికి ముదిమిచేత శక్తము గాని మేధకారణము గావచ్చును.

ఘటికాచల మాహాత్మ్యము 1902 సంవత్సరమున రాజమహేంద్రవరమునందలి కళావతీ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది. (మొదటి కూర్పు 500

(ప్రతులు) ఈ గ్రంథమునుగూర్చి ప్రకాశకు లేమియు వ్రాయలేదు. పీఠిక (కృత్యాది) మాత్రమే వేంకటగిరీంద్రుని కవిత్వము అనియున్నది. ఈ వేంకటగిరీంద్రుని కవిత్వము షష్ఠ్యంతములను కలుపుకొని అరువది గద్య పద్యములు. పీఠికలోని విశేషములు — వేంకటగిరీంద్రుడు ఇష్టదేవతా నమస్కారాదులు గావించుకొని ఖండోజీక్షోణీ మండలాఖండలుపై నొక మహాప్రబంధము రచియింప బూనియుండ, నొకనాడు తిరుమణి నుదుటగల విప్రుడొకడు వచ్చి పేరోలగమునున్న ఖండోజిని దర్శించి ఒక కావ్యమాతనికిచ్చి ఇది 'తెన్నలి రామకృష్ణ సత్కవికుల వజ్రపాణి' రచించిన 'ఘటికాగిరినాథు మహాచరిత్రము' అని గ్రహించవలసినదిగా కోరినాడు. అంత ఖండోజి దానిని గ్రహించి ఆ బ్రాహ్మణున కిష్టసిద్ధి గావించిపంపి, వేంకటగిరీంద్రుని రావించి, గౌరవించి "రామకృష్ణకవి కల్పిత కావ్య మొకండుదెచ్చి సద్భావముతోడ నాకతని పాత్రు జేసంగె. మదంకితంబుగా ...మదీయ వంశావళి చెప్పి కూర్పుము.' అని ఆదేశించినాడు. వేంకటగిరీంద్రు డట్లొనరించినాడు.

ఈ ఖండోజి దక్షిణాంధ్రదేశమును పాలించిన మహారాష్ట్రులలో నొకడైయుండును. ఇతడు వేంకటగిరీంద్రుని రావించి

"పద సందర్భవిశుద్ధి, ప్రౌఢతర
  శబ్దప్రక్రియాబుద్ధి, సా
రద గంభీర చతుర్విధ ప్రథిత
  ధారాసిద్ధి ప్రాపించి సం
పదభిఖ్యద్గిరిరాజ సోదరత
  యొప్పన్ మించు పుంభావశా
రద శ్రీవేగదవన్న వేంకట
  గిరీంద్రా! సాంద్ర మేధానిధీ!
విచిత్రప్రబంధములు చే
డ్కదినరంగ మదంకితములుగఁ గావించినను
మొదల పవిత్రముచేసితి
పదయాత్మ విచిత్రరాయ చంద్రవతంసా"

అని పలికినాడు. ఇందువలన వేంకటగిరీంద్రుడు గిరిరాజానకు సోదరుడనియు, ఇతఃపూర్వమే కొన్ని గ్రంథములు రచించి ఖండోజీకి అంకితము చేసియున్నాడనియు స్పష్టము. వేంకటగిరీంద్రుడు రుక్మాంగదచరిత్రము, అభినయదర్పణము అను గ్రంథములను రచించెను. అభినయదర్పణము పద్యకృతి. ఖండోజీ కంకితము. రుక్మాంగద చరిత్ర ద్విపద కావ్యము. (విజయ. మార్గశీర్షము. భారతి. పు. 501, 502) ఇదికూడ ఖండోజీకే అంకితము గావింపబడియుండును. రుక్మాంగద చరిత్రమున కవి తనవంశమును వర్ణించుకొనినాడు. ఇతనిది లోహిత సగోత్రము. ఆపస్తంబసూత్రము. ఇంటిపేరు దర్భ. తండ్రి ఓబళుడు. తల్లి జానకమ్మ. వీరు నలుగు రన్నదమ్ములు. గోపన, గిరిరాజు, వేంగన, వేంకటగిరి. గిరిరాజకవి శాహరాజేంద్రుని యాస్థానమునను, తిరువాతి శరభరాజేంద్రుని యాస్థానముననుండి అనేక నాటకములను—పదములనురచించెను. వేంకటగిరికి కవిగిరియను నామాంతర మున్నది. పైన ఉదాహరించిన రెండవ పద్యము చివరిపాదమునను విచిత్రరాయ (చంద్ర) వతంసా యనునది వేంకటగిరీంద్రునకున్న బిరుదు గావచ్చును. బహుశః ఖండోజియే తన తండ్రి పేరుతో ఆ కవీశ్వరున కా బిరుద మొసగియుండును. అభినయదర్పణము విచిత్రరాయ వతంసప్రణీతమనియే యున్నది. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమ వ్యాసమున "ఈ విచిత్రరాయ వతంస బిరుదాంచితుడు గిరికవి (వేంకటగిరి) యని భావించుటకు కారణము కృతికర్త దీనిని ఖండోజిరాయని కంకితము కావింపుటయే" అని వ్రాసినారు. ఘటికాచల మాహాత్మ్య పీఠికలో ఖండోజిరాయడు వేంకటగిరిని విచిత్రరాయ [చంద్ర] వతంసాయని సంబోధించుట వలన శ్రీ శర్మగారి వ్రాతకు పుష్టికూడినది. ఖండోజిరాయ జేప్రాంతిమున, ఎప్పుడుండెనో సరిగా తేల్చి చెప్పుటకు నావద్ద తగిన సామగ్రిలేదు. అది అసలు చరిత్రకారుల పని. ఘటికాచల మాహాత్మ్యమునందున్న ఖండోజి వంశవృక్షమిది.

మాలి
|
కృష్ణరాజు (భార్య. గంగాయి)
|
పరసరాజు (భార్య. గురుజాయి)
|
సుందరరాయడు. — విచిత్రరాయడు (భార్య. భాగాంబ)

విచిత్రరాయడు
|
ఖండోజిరాయడు. కృతిభర్త. (భార్యలు. మానాయి. వీరాయి.)

ధాత — కుశికుడు — కుశనాభుడు — గాధి — విశ్వామిత్రుడు. ఇతని తరువాత చాలమంది జనించిరి. చివరకు మాలియనువానితో నా వంశము మాలివంశ మైనది.

ఇక ప్రకృతము. ఘటికాచల మాహాత్మ్యము నందలి కథ — నైమిశమున మునులందరును సూతుని పద్మాద్రీశ సద్మములలో నుత్తమమైన దొకదానిగూర్చి చెప్పవలసినదిగా కోరిరి. అంత సూతుడు నారదభృగు సంవాద మొకటిట్లున్నదని చెప్పెను. మానస సరసీ తటమున భృగ్వాశ్రమ మున్నది. అతడు నిత్యము శ్రీహరిని భజించును. ఒకనాడు నారదు డచటికి వచ్చెను. భృగువు వానిని తగురీతిని పూజించి 'సుజ్ఞా విష్కృతి వైష్ణవోత్తమ పవిత్రితశేష కథల్' దయతో చెప్పవలసినదిగా ప్రార్థేయపడినాడు. నారదుడు తాను దర్శించిన వైకుంఠమును, విష్ణుమూర్తిని, భూలోకము నందుగల కమలాధిప లీలావిలాస వాసములైన నూట యెనిమిది తిరుపతులను పేర్కొని వర్ణించినాడు. అంత భృగువు ప్రాసంగికముగ వచ్చిన ఘటికాద్రినిగూర్చి విపులముగా ముచ్చటించగోరినాడు నారదుని. నారదు డిట్లుపక్రమించినాడు.

సరయూ తీరమున అయోధ్య యను పట్టణ మున్నది. అందు ధవళాంగుడు అను రాజు గలడు. ఒకనాడు సింహాసన మధిష్ఠించి కొలువుకూటముననుండి హఠాత్తుగ కిరాతుడైనాడు. పూర్వజ్ఞానము నశించి వెంటనే రాజ్యమును త్యజించి అడవుల వెంటబడి నాడు. మృగముల వేటాడుచు కొంతకాలమునకు వసిష్ఠ ఋషి తపోవనము చేరినాడు. వసిష్ఠుడు దివ్య దృష్టిని వాని దశ గ్రహించి ఆ కిరాతునితో 'రాజా! పూర్వ మొకప్పుడు నీవు వేటాడుచు విశ్వామిత్రుని యాశ్రమవాటి కేగితివి. అత డాగ్రహించి నీకీ శాప మిచ్చెను. కానిమ్ము. ఇక నీమముగను లెమ్ము' అని నాడు. అంత కిరాతవేషము పోయి ధవళాంగుడు యథాప్రకారము రాజయ్యెను. "అరుదా సాధు సమాగమంబున శుభం బౌటల్ జటిగ్రామణీ" అని "విను మిన్నియు నేటికి ము,జ్జనన కథాకథనమే ప్రశస్తోత్తరమై, అనఘా తెగును" అనుచు నారదుడు భృగువునకు తన జన్మకథ నిట్లు చెప్పెను. ఇది ప్రథమాశ్వాసము.—

హరిదక్రమను పుర మొకటున్నది. అందు గోవింద శర్మ యను విష్ణుభక్తితత్పరు డొకడున్నాడు. అతని భార్యపేరు భద్రాంగి. వా రిరువురకు నలుగురు తనయు లుద్భవించిరి. వారు కృతాధ్యయన సంపన్నులు. పితృవాక్యము నౌదల ధరింతురు. గోవింద శర్మ కాయమెత్తిన వైష్ణవధర్మము. ప్రతిదినము వైష్ణవార్చన గావించుకొని వచ్చిన యతిగులను సంతుష్టినందజేసి, బాలరామాయణము పఠించుకొని, అర్ధాంగియిచ్చిన విడెము సేవించి, విష్ణుకథలందు మనసు లగ్నము చేసి కాలము గడుపుకొనుచున్నా డతడు. వారియింట తరళ యను నామె యొకర్తు వారి సేవ చేయుచుండెను. వారి యింటిప్రక్క నే వసించు హరిశర్మ యను బ్రాహ్మణ యువకు డామెను ప్రేమించెను. వానియందు తరళకును భావ మంకురించెను. వారికి సమాగమమైనది. నారదుడు జన్మించినాడు. ఇంతలో వర్షాకాలము వచ్చినది. జడివానలు సాగినవి. ఆ సమయమున కౌండిన్యుఁ డను మౌని సంచారమొనరించుచు, ఆ హరిదక్రమునకు వచ్చినాడు. గోవిందశర్మ యెదు రేగి వానిని తనయింటికి పిలుచుకొనిపోయినాడు. సుధారసరూపములైన భోజనాదికములతో కౌండిన్యుని తృప్తుని చేసి, గోవిందశర్మ వర్షాకాలముగుట రెండుమాసము లచటనే యుండవలసినదిగా కోరి నాడు. మహర్షి అంగీకరించినాడు.

నారదుడు ప్రతిదినము కౌండిన్యునివద్ద కేగెడివాడు. బాలుడై తనను చేరిన నారదునకు నామహర్షి వైష్ణవ మాహాత్మ్యమును బోధచేసి నాడు. వైష్ణవమంత్రోపదేశము చేసినాడు. నారదునకు కొంత జ్ఞానము కలిగినది. కౌండిన్యు డచటు వీడి వెళ్లినాడు. దైవకృతమున తరళ మరణించినది. అంత నారదుడు తన తల్లికి (తనకు) యజమానియైన గోవిందశర్మ యనుమతినంది ఘటికాద్రికి చేరుకొని హరినిగూర్చి తపమున కుపక్రమించినాడు. విష్ణుమూర్తి తార్క్ష్యుపైనెక్కి ప్రత్యక్షమగుచు రథసగతి నేగినాడు. అందువలన సరిగా నారదుడు వానిని దర్శించలేదు. అంత నిజముగా విష్ణువును కందునని ఘోరతపమూనగా నశరీరవాణి జన్మాంతరమున మాత్రమే యది పొసగునని చెప్పినది. నారదుడంత జన్మాంతంబు పర్యంత మీ తను వేలయని యోగ సంగతిని గాత్రమును త్యజించి, వనజాతోద్భవ నందనుడుగా దివ్యమూర్తి గైకొనినాడు.

అని చెప్పగా నారదుడు, భృగువు తనివితీరక యింకను ఘటికాచల మాహాత్మ్యమును నుగ్గడింపవలసినదిగా కోరినాడు. నారదుడిట్లు ప్రారంభించెను. సప్తఋషులు హరిని దర్శించు పూనికతో శతశృంగ పర్వతమున దంచలతయు, వేసటయు లేక తపముసేయ నారంభించిరి. ఇంద్రునిచే నియమింపబడిన చారుడొకడా విషయము గ్రహించి దేవేంద్రున కెరుక చేసినాడు. ఆచార్యునకుగాని ఇంద్రునకు గాని సప్తర్షుల యాంతరభావము తెలియనందున, నాకలోకాధిపత్యమును కోరకేనని నిశ్చయించుకొనిరి. ఇంద్రుని గుండె జల్లనినది. వెంటనే రంభను పిలిపించి 'మునులు వశిష్ఠ ముఖ్యులు తపోనియతిని శతశృంగ పర్వతంబున నున్నవారు. వారి నేశ్వరము వలరాచవాని బారి గావించి' రావలసినదిగా నియమించినాడు. రంభ వల్లెయనినది. మేనకాద్యప్సరసలతో శతశృంగము చేరినది. తదాగమనమున తత్ప్రాంతమునంతయు వసంత మలముకొనినది. రంభాద్యప్సరోగణము పాటల నాటల నా మునుల డాసినది. కాని మహర్షుల తేజమునకు తట్టుకొనలేకపోయినది. దూరమునుండియే అప్సరసలు విలాసములు నెరపిరి. జలక్రీడలు సలిపిరి. ఇంతలో సూర్యాస్తమయమైనది. చిమ్మచీకటులు లోకముల నలముకొనినవి. చంద్రోదయమైనది. మహర్షులు చలింపలేదు. అప్సరసలు వ్యర్థప్రయత్నలైరి. వచ్చినదారిం జనిరి. తెల్లవారినది. మహర్షులు రమాజాని ప్రత్యక్షము గాకుండుటనుగూర్చి విచారింపకొడగిరి. అంత నంబరవాణి 'ఘటికాద్రి కరుగు డచ్చట, ఘటికామాత్రమున మీకు కాంక్షితమెల్లను ఘటియిల్లు'నని చెప్పినది. ఆ మాట విశ్వసించి మహర్షులు బయలుదేరి, గంగాస్నానము గావించుకొని, జగన్నాథుని దర్శించుకొని శ్రీకాకుళాంధ్రదేవుని పూజించుకొని, కృష్ణవేణి యందు కృతావగాహులై, వేంకటశైలము (తిరుపతి) చేరుకొని తన్మయులై యట సంచరించి, కాంచికాపురమును డాసి వరదరాజులవారిని కొల్చుకొని మూడు యోజనములు పయనించి ఘటికాచలము చేరుకొనిరి. అచట కొందరు మునులు తపమాచరించుచుండిరి. వారిని సప్తర్షులు ప్రశ్నించిరి. 'కృతయుగమున సప్తర్షులు ఘటికాద్రిని తపమాచరించి హరిని దర్శింతురు. మీరును హరి నప్పుడే కనగలరు. అటకు పొండు' అను నశరీరవాణి మాటలనుబట్టి అట తాము తపమాచరించుచున్నామని యా మునులు సప్తర్షులకు సమాధానము చెప్పిరి. అందరును హరినిగూర్చి తపించదొడగిరి. అంత హరి నరసింహదేవుడై ప్రత్యక్షమాయెను. మునులు, సప్తర్షులు నరసింహుని స్తుతించిరి—ఇది ద్వితీయాశ్వాసము.

నారదుడు భృగువునకు మరల ఇట్లు ప్రారంభించెను. ఆ నరసింహాకృతి గనజాలక మహర్షులు శాంతస్వరూప మొందవలసినదిగా హరిని ప్రార్థించిరి. ఇంతలో నొక విమానము కనబడినది. అందు ప్రముఖ వైభవముతో నున్న ప్రసవాయుధ హరిని దర్శించిరి. మరియు సౌమ్యాకారమున నిల్చిన శ్రీ నరసింహదేవు నాలోకించిరి. స్తుతించిరి. అంత పరమేశ్వరుడు తాను ప్రహ్లాదుని రక్షించిన విధము చెప్పి వారిని వరములు కోరుకొండనియెను. మహర్షులు తమ్మూర్తి దర్శనమే చాలునని విన్నపమొక టున్నదని "మూడుయోజనములదాక నిగ్గిరిమీద ఝరులు, దీర్ఘికలు, నదులు, ఏరులు, మడువులు, భూరిమోక్షదములు గావుత. పీడాదిగాక నిందు వసియించుజనుల కాపద లెవ్వియును లేక దయ, శాంతి, దాంతి, ధర్మబుద్ధి గలుగవలయును. మృగము లన్యోన్యము మైత్రిచే నెప్పుడు మనగవలయును. శబర యవనపుళిందాదిజనములెల్ల జ్ఞాన వైరాగ్య ధర్మములు పూనవలయును. నెలనెల మూడువానలు గురియ ధరణి సస్యసమృద్ధమై తనరవలయు"ననియు నాలుగు వర్ణములవారును సుఖముండవలయుననియు నృసింహదేవునకు చెప్పి యట్లు కరుణింపవలయుననిరి. భగవానుడట్లే యనెను.

అటుతిరువాత వైఖానసులు ఘటికాద్రి కజుని పంపునవచ్చి యమృతఫలసరస్సునను, భక్తోచిత సరస్సునను స్నానము గావించి, హరినావాహనము చేసి పూజచేసిరి. అని నారదుడు చెప్పగా వే భృగువు హరికావాహనము, నుద్వాసనము గలుగువిధ మడిగెను. శిలాగర్భమున నగ్నియున్నట్లు శౌరి యన్నింటియందును నుండుటవలనని నారదుడు చెప్పెను. మరల భృగువు వైఖానసు లెవరని యడిగెను. నారదుడిట్లు చెప్పెను. అంబుధీశ్వరుడు యాగము చేయుచున్నాడు. అచటకు వచ్చిన బ్రహ్మ జల యను అప్సరసను చూచినాడు. వీర్యము స్ఖలించినది. దానిని పర్ణపుటినుంచి వహ్నిలో

బోయ నర్పియును భృగుండును, అంగారపిండంబు నందంగిరుండును అత్రిమునియు, విఖనసపాంగత్యమున విఖనసుండును పుట్టిరి. విఖనసుని సంతానము వైఖానసులు. వారు సమస్త మంత్రార్థ రహస్య నిధులు. విప్రులు. ఒకనాడు వైఖానసులు వసిష్ఠునితో భాషించిరి. అందు వారు విషమమైన ఘటికాచల ప్రాంతమున వసించుటెట్లనిరి. వసిష్ఠుడు "ఇమ్మహీంధ్రమ్మునకు చుట్టు నెవ్వరేని సమతలంబుగచేయ జాలిరేని ఇందు మీరు సుఖంబున నుందు" రనియెను. వైఖానసులు శ్రీ నృసింహుని ప్రార్థించిరి. అతడు ప్రత్యక్షమైనాడు. వారి కోర్కె ననుసరించి కార్య ఫల ప్రాప్తికి ఆంజనేయుని మనసున తలచినాడు. అతడు ప్రత్యక్షమైనాడు. భగవాను డాదేశించినాడు. హనుమంతుడు వెంటనే భూమి సమతలముగచేసి యొక గ్రామమును నిర్మించినాడు. దానికి హనుమగ్రామమని పేరు. వైఖానసు లా గ్రామమునచేరి ఘటికాచల నృసింహస్వామికి కల్యాణమహోత్సవము జరుప నిశ్చయించిరి. దేవత లందరును వచ్చిరి. భూలోకము నందలి రాజులందరును వచ్చిరి. వేదోక్తవిధిని కళ్యాణమైనది. ఇందిరా నరసింహుల వివాహ మహోత్సవము తొమ్మిదిరోజులు జరిగినది. ఆ దంపతులు సుఖాబ్ధి నోలలాడిరి. అని నారదుడు భృగుమహర్షికి వినుపించెను. ఇది తృతీయాశ్వాసము. ఇంతటితో గ్రంథము పూర్తియైనది.

ఘటికాచల మాహాత్మ్యమను నీ గ్రంథము స్థల మాహాత్మ్య ప్రశంస ప్రధానముగాగలది. ఈ జాతికి చెందిన గ్రంథము లాంధ్రవాఙ్మయమున చాలగలవు. వీనియందన్నింటను మాత్రప్రాయముగానుండు భావ మాయాస్థలములు మోక్షప్రదములనియు—ఆయా దైవతములు భక్తసులభములనియు, ఈ విషయమనేక కథానికలచేత ప్రపంచించుట-ఆ యా గ్రంథములందు జరుగును. ఈ జాతి గ్రంథములందు కావ్యకళ ప్రధానము గాదు. సులభమైన భక్తిమార్గమున మోక్షమును చూపుటయే ప్రధానము. మహాకవులు కొందరు రెండవదానితో మొదటిదానిని మేళవించవచ్చును. కాని అది యప్రధానమే. ఎందుకనగా నీమార్గమున గ్రంథరచన కుపక్రమించుటకు భక్త్యావేశమే కారణము. శైవులు శివుడు భక్తసులభుడని, వైష్ణవులు విష్ణువు భక్తసులభుడనియు విశ్వసింతురు. వారు దాని నే ప్రచారము చేయుదురు. స్థూలముగా చూచినపుడు ఈస్థలమాహాత్మ్యములన్నియు శైవములు, వైష్ణవములు అను రెండు తెగలక్రిందకు మాత్రమే వచ్చును. ఇందును వైష్ణవ మాహాత్మ్య గ్రంథములే యధికములు. విష్ణువునకున్న యవతార వైశిష్ట్యము శివునకు లేకపోవుటయే అందుకు హేతువు గావచ్చును. ఏ తెగకు సంబంధించిన గ్రంథమునందైనను, ఆయా స్థలతీర్థ, దైవత మాహాత్మ్య నిరూపణము ముఖ్యము. అనగా ఆ గ్రంథములందలి కథలన్నియును ఆయా నిరూపణములందు లీనములు కావలెను. అప్రస్తుత ప్రసంగములకా గ్రంథముల తావుండరాదు. నదులు సముద్రమున కెక్కినట్లు కథలన్నియు తన్మాహాత్మ్య నిరూపణమున కెక్కి దానికి పుష్టిచూర్చి తాము సార్థకములు గావలయును. కాని యిట్టి పద్ధతి మాహాత్మ్య గ్రంథము లన్నింటిలోను గానరాదు. నిబిడబంధము గలిగిన మాహాత్మ్యములు తక్కువ. మహాకవుల కోటిలోనివారు రచించిన మాహాత్మ్యముల యందే నిబిడ బంధము లేదు. ఇక పెరల మాట యేల?

ఘటికాచల మాహాత్మ్యమునను నిబిడబంధము లేదని ముందు వివరించిన కథాభాగమునుబట్టి గ్రహింపనగును. ప్రథమాశ్వాసమున నారదుడు వైష్ణవ పుణ్యతీర్థములనుగూర్చి వివరించుచు ఘటికాద్రిని పేర్కొనెను. తద్వర్ణనానంతరము భృగువు

"ప్రకటింపుము నదుము నొకిం
చుక ఘటికాచలము మహిమ సూచించితి, రు
త్సుకతన్ హరి యా శైలము
నకు వేంచేయుటకు కారణం బెయ్యదియో"

"ఎఱిఁగింపగదే" అని నారదు నడిగినాడు. నిజమునకు నారదు డాకారణము చెప్పవలయును. నారదుడు తన్మయుడై హరిని కీర్తించుచు కములలో దన భక్తిపాంగత్య మబ్బినపుడె యార్యునిలలవు వికసించు ననగానే భృగువు సాధుసంగము శ్రీవరవైభవంబు నానతీయవలసిన దనినాడు. ధవలాంగుని కథ చెప్పబడినది నారదుని చేత. అంతటితో నాగక నారదుడు

వినుమిన్నియు వేఁటికి మ
జ్జనవకథాకథనమే ప్రశస్తోత్తరమై
యనఘా, తను నిందులకవి
వినుపించెం దక్కథాను వృత్తంబిటులన్.

ద్వితీయాశ్వాసమున నారదుడు తనకథ చెప్పెనది సాధు సంగమఫలమును నిరూపించుటకే. కౌండిన్యునియొక్కయు, గోవిందశర్మయొక్కయు సాంగత్యమునకే తాను ఘటికాద్రికి వెళ్ళి తపమాచరించి గాత్రము త్యజించి దివ్యమూర్తి గైకొనినది. ఇంకొక విషయమును స్థాపించుటకు రెండు కథలు వ్రాయబడినవి. మొదటిదానికంటె రెండవది సాధు సాంగత్యమును తత్ఫలితమును బాగుగా విశదీకరించుచున్నది. మొదటి కథలో సందర్భశుద్ధిలేదు. కొలువుకూటమునందున్న రాజు హఠాత్తుగ కిరాతుడుగా మారుట సత్యమునకు దూరమైన విషయము. విశ్వామిత్రుని శాప మున్నదిగదా యనిన, ధవలాంగు డడవికి వేటకు వెళ్ళిన సమయమున గదా విశ్వామిత్రుడు శపించినది, కనుక అప్పుడే అడవిలో రాజు కిరాతుడు కావలయును. అట్లుకాక సుఖముగా ఇంటికివచ్చి రాజ్యపాలన చేయుచు కొలువు తీర్చియున్న సమయమున కిరాతుడైనాడని చెప్పుట పొసగనిది. పోనీ విశ్వామిత్రుడే, కొలువుకూటమున నున్న సమయమున కిరాతుడగునట్లు శపించెనా యనిన అదియును చెప్పబడలేదు. కావనమున సంచరించుచు ధవలాంగుడు వశిష్ఠమహర్షి యాశ్రమోపాంతమునకు వెళ్ళినందున, సాధుసమాగమము సిద్ధించి కిరాతవేషము త్యజించుట జరిగినది. ఈ విషయ నిరూపణమున కల్పిత కథలో జిగిలేదు. బిగిలేదు. ఇట్టి కథ నారదునకే తృప్తి నీయలేదు కాబోలు తన కథను వివరించినాడు. నారదుని తల్లిదండ్రులు అగ్నిసాక్షిగ వివాహమాడుకొనినవారు కారు. యౌవన ప్రాదుర్భావమున కలిగిన మానసిక వికారఫలితముగ నైన తన తల్లిదండ్రుల సంగమఫలము నారదుడు. అట్టి వానికి జ్ఞానబోధన విషయమున నెవరు శ్రద్ధవహింతురు? ధర్మచ్యుతికి పాల్పడిన తల్లిదండ్రులు బహుశః పూనుకొనజాలరు. కారణమేమన అట్టి పాపకృత్యములు స్త్రీల కాన్యతమీదనే జరిగియుండునని లోకము విశ్వసించిన వారిని చేరుగా జూతురు. నిజమునకా పాపమున కొడిగట్టిన పురుషుడును తన కేమియు పట్టనట్లు సంచరించును. ఇది లోక ప్రవృత్తి. అట్టిపో సంఘ మంగీకరించని సంతానమున కెవరును జాగ్రత వహింపరు. వహింపవలసిన తల్లి కా స్థితియుండదు. కనుక నా సంతానము తమ శక్తిమీదనే తా మభివృద్ధి కావలయును. నారదు డా విధముగ నభివృద్ధిలోనికి రావలసిన స్థితిలోనున్నాడు. ఈ నారదుని కథతో గోవిందశర్మకథ యంత సంబంధించినదిగా తోచదు. మాతృత్వముగా పాలించిన గోవిందశర్మ యునికియే నారదుని కా వ్యక్తివృద్ధికి మార్గమైనది. గోవిందశర్మ హరిసేవా తత్పరుడును ధార్మికుడును, సత్యసంపన్నుడును అగుటచేతనే కౌండిన్యుడు వారి యింట నుండుట సంభవించినది. నారదుని తల్లి తనకే గోవిందశర్మ యింట సేవకురాలుగ నుండుటవలననే నాలుగైదు తరములు నిండీ నిండని నారదుడు తనయు, తల్లితోను, ఒంటరిగను గోవిందశర్మ యింటి కరుగుటకు వీలుకలిగినది. గోవిందశర్మ యింటి వాతావరణమంతయు వైష్ణవమగుటచేతనే బాలకుడైన నారదుని మనస్సు వైష్ణవమువైపు మొగ్గుచూపినది. గోవిందశర్మ యింటికి వచ్చిన కౌండిన్యుడు రెండు మాసములపాటుండుటకు కారణము చెప్పటయే వర్షాకాలవర్ణన. కౌండిన్యుడు రెండు నెలలపాటుండుటవలననే నారదునకు మహర్షిపట్ల చనవు, గౌరవము, మహర్షికి నారదునిపట్ల వాత్సల్యము గాఢముగా నేర్పడుట కవకాశము గలిగినది. మహర్షినుండి వైష్ణవ మంత్రోపదేశమును పొంది, తన తల్లి మరణించుటచేత ఇక నచట నుండవలసిన యవసరము లేదని, తన యజమానియైన గోవిందశర్మ యనుమతిని పొంది ఘటికాద్రికి వెళ్ళి దివ్యమూర్తిని గైకొనినాడు నారదుడు. ఇదంతయు సాధుసంగము శ్రీవైభవమే గాని మరొండు గాదు.

ఇంత కథను విని, భృగువు మొదట తాను చేసిన ప్రశ్నకు సమాధానమును కోరువాడై "ఘటికావృత్తము విస్ఫుటముగ" చెప్పవలసినదిగా నారదు నడిగినాడు. నారదుడు సప్తర్షుల తపోవృత్తాంతమును చెప్పి శతశృంగము నుండి ఘటికాద్రికి వారరుగుటకు గల కారణము చెప్పినాడు. శతశృంగమున తపమాచరించు సప్తర్షులకు భంగపాటొనరించుటకు ఇంద్రుడు రంభా మేనకాద్యప్సరసలను పంపినాడు. అప్సరః ప్రయత్నము వృథాయైనది. ఈ వ్యర్థప్రయత్నమంతయు 77 గద్యపద్యములలో వర్ణితము. ఇంత దీర్ఘముగా వర్ణించి కవి సాధించిన ప్రయోజనము లేదు. ఇందు రంభా వర్ణనము, ప్రయాణము, వనవిహారము, పుష్పాపచయము, ఆటలు, పాటలు, జలక్రీడలు, సూర్యాస్తమయము, చంద్రోదయము విపులముగా వర్ణించి

బడినది. ఇది మాహాత్మ్యగ్రంథమగుటచేత ప్రాబంధిక రచన కవకాశములేదు. ఎట్లైనను చొప్పించవలయు నన్న ఆకాంక్షతో నీ వ్యర్థప్రయత్నము నవకాశముగా కల్పించుకొని కవి వ్రాసినట్లున్న దీఘట్టము. కాని యింత వర్ణించినవాడు, అప్సరసలచేత మహర్షుల తపోభంగము చేయించినచో కొంత ఫలితము దక్కినది లెమ్మని తృప్తిపడవచ్చును. అదియును లేదు. వట్టి గొడ్డు తాకట్టువలె నున్నది. దాని కది వ్యర్థమగుట కాక యీ వర్ణనము కథయందలి యెడతెగనితనమును పాడుచేసినది. దీనివలన కథను కవి యాపవలయునని యాపినట్లున్నది.

ఆకాశవాణి పలుకులనుబట్టి సప్తర్షులు ఘటికాచలమునకు పోవుచు కాంచీపట్టణమును దర్శించిరి. ఆ పట్టణసౌభాగ్యమును, వసిష్ఠుడు తన భార్యయైన యరుంధతికి వర్ణించి చెప్పెను. ఈ ఘట్టము పాండురంగమాహాత్మ్యమున, సామియులకు సభార్యుడై ప్రయాణమునగట్టిన అగస్త్యమహర్షి మార్గమధ్యమున వచ్చిన మాల్యవంతాదికములను తన భార్యకు చూపి వర్ణించు విధమును బోలియున్నది. ఈ రెండింటియందును నొక లోపమున్నది. శమదమాకారులైన మహర్షులు శృంగార విషయిక వస్తువర్ణనము చేయుట సముచితము గాదు. రెండు గ్రంథములయందును కవి యీ విధముగ వర్ణింపించుట జరిగినది. పాండురంగ మాహాత్మ్యమున విషయ మొకరకమున సమర్థనీయము. అగస్త్యుడు కేవలము తన భార్యతో చెప్పిన మాటలవి. చుట్టుపట్ల నెవ్వరును లేరు. వారిరువురే గనుక నట్లు మాటాడినాడని అగస్త్యుని బోనీయవచ్చును. ఈ గ్రంథమున నట్లుపేక్షించుటకు వీలు లేదు. మహర్షులందరును కలసిపోవుచున్నారు. పోవునది హరిని దర్శింపవలయునన్న ఉత్సుకతతో. అట్టి సమయమున మహర్షుల చిత్తవృత్తి యెట్లుండును? మార్గమధ్యముననున్న వైష్ణవదేవాలయములు దర్శించుకొనుచు, హరిని స్మరించుకొనుచు పోవువారిలో మొదటివాడైన వసిష్ఠుడు కాంచీపురమునందలి స్త్రీవర్ణన, సౌధవర్ణన, చేయుటకంటె అనౌచిత్య ముండ దనుకొందును. వైష్ణవ వర్ణనము చేయవచ్చును. అసలు వారి ప్రవృత్తియే ఆ ముఖముగా నున్నది గనుక నది యుచితము. వసిష్ఠుడు "నిజవధూటికి కాంక్షయొదవఁగ" నగర వర్ణన చేసినాడట. అవగా వర్ణింపబడిన విషయమును బట్టి యరుంధతియు కాంచీపురియందలి శృంగార జీవిత విషయమున నాసక్తయైన ట్లూహింప వలసి వచ్చును. పాపము శాంతించుగాక. ఈ కాంచీ నగర వర్ణనయు ఇతఃపూర్వము పేర్కొనబడిన ప్రాబంధిక వర్ణనలలో చేరినదే. ఈ గ్రంథము నందలి గాథ యొక నగరము ననుసరించియున్నది కాకపోవుటచేత నగరవర్ణన కవకాశము చిక్కినది గాదు కవికి. మరి యింత గ్రంథము వ్రాసి నగర వర్ణన లేకపోయిన నెట్లని వసిష్ఠుని ముఖమున కాంచీ నగరవర్ణన కావించినాడు కవి. కాని కవి స్వయముగా నా కార్యమును నిర్వహించియుండవలసినది. అప్పుడు కేవల మిరికించినట్లున్నను మహర్షుల విషయమున ననౌచిత్యదోష ముండెడిది గాదు. కాని కవి యట్లు చేసినవాడు కాడు.

ఘటికాచలము చేరి తపము చేయుచున్న మహర్షులకు శ్రీనరసింహదేవుడు ప్రత్యక్షమగుట, శాంత స్వరూప మొందవలసినదిగా ఋషులు కోరుట జరిగిన పిదప విమాన మొకటి గానబడినది.

"వారంతఁ దద్విమాన
ద్వారము సాత్తెంచి నిలువ దక్షిణ దిశగా
జేరి వెసం బ్రసవాయున
నైరి నిరీక్షించి ప్రముఖ వైభవ మెసఁగన్.

"కరముల శంఖ చక్రములు దాల్చినవాని,
మురువైన తెలనోటి యొరపువాని
లోవంక మూపుల శీవిఁ బొల్చినవాని,
బద్మాసనంబునఁ బరగువాని
యోగ పట్టిక నొప్పు నూరు ద్వయంబుపైఁ,
దోరయు నిల్పిన కేలుదోయివాని
మేరుకూటంబుపై మిహిరబింబములీల,
శిరముపై మకుటంబు చెలగువాని
బాలచంద్రునిపైనున్న బాలచంద్రుఁ,
బోలు నలుకోర్ధ్వ పుండ్రంబు పొలుపువాని
గనకప వెలుంగు నంగారకవితమునను,
గాన నయ్యెడి మిక్కిలి కంటివాని

మరియు...............వైంద్రజాలికుని పోలిక మున్నుగైకొన్న యాకారంబు మాయించి సౌమ్య

కారంబు దాల్చి నిల్చినవాని శ్రీనరసింహదేవు వాలోకించి" (ఆ. 3. ప. 6,7,8) నుతి చేసిరి" అని యున్నది. ఇందు శివుని ప్రసక్తి యున్నదనుట నిర్వివాదము. మహర్షులు నరసింహుని శాంతస్వరూపమున దర్శన మీయవలసినదిగా ప్రార్థించిరి. అంతే విమానము వచ్చుటకు హేతువు కనుపించదు. విమానము వచ్చినను నందు ప్రసవాయుధవైరియుండుట సందర్భోచితముగాదు. ఒకవేళ, ప్రత్యక్షమైన హరిని దర్శించుటకు వచ్చెననుకొనినను సీసపద్యవిషయము బాధకముగా నున్నది. ఈశ్వరుడు శంఖచక్రములు ధరించుట వింత. పోనీ యా సీసపద్యము విష్ణువునకు సంబంధించినదేమో అనిన చిట్టచివరి 'మిక్కిలి కంటివాని' అను విశేషణము బాధించుచున్నది. 'బాలచంద్రునిపైనున్న బాలచంద్రుఁబోలు నలికోర్ధ్వ పుండ్రంబు' అను దానియర్థమేమో విచార్యము.

మునులకు ప్రత్యక్షమైన శ్రీ నరసింహదేవుడు

"దుష్టశిక్షణమును శిష్టరక్షణ మొన,
రింప ధరణి నవతరించు టేను,
కనకకశిపువధయుఁ గరుణఁ బ్రహ్లాదావ,
నంబున నివి దర్శనములు గావె"

అని చెప్పి ప్రహ్లాదునికథయు, తాను వానిని రక్షించినవిధమును చెప్పుకొనుట కేవల మసందర్భమేగాక అనౌచిత్యమునై యున్నది. ఆత్మోత్కర్షయైన తరువాత భగవానుడు మహర్షులను వరములు కోరుకొండనినాడు. వారు నిశ్శ్రేయసమే తాము కోరుకొనువరమని విన్నవించుట వారి యుదాత్తతను పరాకాష్ఠకు తీసికొనిపోయినది. నరసింహమూర్తి వారికా వర మొసగినతరువాత

"హరియు విరించియు నపుడ
గ్గిరిమాహాత్మ్యము నృసింహుకృప ముని భాగ్య
స్ఫురణము మెచ్చుచు తమ మం
దిరములకుం జనిరి ముదిని నివ్వెరయొదవన్"

అను పద్య మున్నది. నృసింహుని కృపను వివరించి మెచ్చుకొనిన మెచ్చుకొనవచ్చునుగాని హరియు మెచ్చుకొనినాడనుట సందర్భము కుదురనిమాట. అసలచటకు విరించి యెపుడు వచ్చినదియు నంతకు పూర్వము చెప్పబడలేదు. ఇది యటుండ 'హరియు' ననుచోట 'హరుడు' అను పాఠమును కల్పించుకొనుటకు యత్నించినను "పురహర పురందరాదిక, దురధిగమంబై భవాది దూరమ్మగు నీ యురుమూర్తి గనుటకంటె" అను మహర్షుల స్తోత్రపాఠ మడ్డువచ్చుచున్నది. కనుక నిదియు నసందర్భముగనే యున్నది.

అటుతరువాత వైఖానసు లట నివసించవలయు ననుకొనుట, వసిష్ఠునకుగుట, అతడు మార్గము చూపించుట, వైఖానసులు నరసింహుని ప్రార్థించుట, ఆ దేవదేవుడు హనుమంతుని చేత నా కార్యము నిర్వహింపజేయుట, వైఖానసులు సంతసమున నృసింహకల్యాణము గావించుట, క్రమముగా నున్నవి. ఇంతటితో గ్రంథము సమాప్తమగుటయు సముచితముగనే యున్నది.

ఇది కేవలము స్థలమాహాత్మ్యమునకు సంబంధించిన గ్రంథము. అనగా తీర్థ—దైవ—మాహాత్మ్యములకు ప్రాధాన్యము తక్కువనుట. ఆ స్థలమాహాత్మ్యమును బట్టియే నారదునకు, సప్త మహర్షులకు, వైఖానసులకు హరి ప్రత్యక్షమైనట్లు వర్ణింపబడినది. నరసింహాకృతిని హరి ప్రత్యక్షమగుటవలన అది నరసింహక్షేత్ర మనవచ్చును. సప్తర్షుల ప్రయాణమును బట్టి చూడగా నీ ఘటికాచల క్షేత్రము కాంచీనగరమునకు మూడు యోజనములు దక్షిణముగా నున్నట్లు తెలియుచున్నది.

ఈ ఘటికాచల మాహాత్మ్యమునకు గీర్వాణ మాతృక యున్నట్లు కానరాదు. ఈ ఘటికాచల ప్రసక్తి పురాణములందును గానరాదు. కావున నీ గ్రంథము రామకృష్ణకవి స్వకపోలకల్పితమనవచ్చును. ద్వితీయాశ్వాసమునందలి నారద జనన కథమాత్రము బ్రహ్మవైవర్త పురాణమునుండి గ్రహించి రామకృష్ణకవి కొన్ని మార్పులతోను, కూర్పులతోను రచించినాడు. ఆ పురాణమునందలి నారదజననకథ యిది.—బ్రహ్మ తన కంఠప్రదేశమునుండి నారదుని పుట్టించి జనులను సృజింపుమనినాడు. నారదుడందుల కంగీకరించలేదు. ఆగ్రహించి స్త్రీలోలుడగునట్లు బ్రహ్మ వానిని శపించినాడు. శాపము క్రమ్మ

రించవలసినదిగా ప్రార్థించినాడు నారదుడు. అంతట బ్రహ్మ నారదునితో, మొదట గంధర్వుడవై స్త్రీలోలుడవై, అటుతరువాత దాసీపుత్రుడవై హరిభక్తుడవై, కాయము త్యజించి మరల నాకు తనయుడవై పుట్ట గలవు లెమ్మనెను. అంత నారదుడు గంధర్వుడై పుట్టి తరువాత దాసీపుత్రుడై కన్యాకుబ్జమున పుట్టెను. ఆ పట్టణమునకు రాజు ద్రుమిలుడు. వాని భార్య కళావతి. వారు సంతానహీనులు. అడవికి వెళ్లిరి. కశ్యపుడు తపము చేసికొనుచుండెను. వానివలన సంతానము గనవలసినదిగా తన భార్య నాదేశించినాడు ద్రుమిలుడు. ఆమె మునికెదురుగ నున్నది. కశ్యపుడు కనులు తెరచి యామెను చూచి మోహించి, సంయమి గనుక, నిలువద్రొక్కుకొనెను. కాని స్ఖలనమైనది. కళావతి దానిని స్వీకరించి గర్భవతియైనది. రాజు సర్వమును త్యజించి యామె నొక బ్రాహ్మణ గృహమున నుంచి యడవికి వెళ్లెను. తరువాత ఆమెకు నారదుడు బుట్టినాడు. చిన్నతనమునుండియు నాతనికి హరిభక్తి నాటుకొనినది. వర్షములు లేని కష్టకాలమున నతడు జన్మించెను. వర్షములు కురిసినవి. కనుక నే నారదుడైనాడు. ఆసమయమున నారదుడు, అతని తల్లియున్న బ్రాహ్మణ గృహమునకు నలుగురు విప్రవరులు వచ్చిరి. వారి యెంగిలి బాలుడైన నారదుడు తినెను. దాన సంతోషించి ఆ విప్రులలో నొకడు నారదునకు శ్రీ కృష్ణమంత్రము నుపదేశించినాడు. అతడు దానిని జపించుకొనుచుండెను. ఒకనాటి రాత్రి కళావతి పాము కఱచుటవలన మరణించినది. తరువాత నారదు డా విప్రులతో కలిసి యడవికిపోయి హరిని స్మరించుకొనుచు కొంతకాలమునకు దేహత్యాగము చేసి బ్రహ్మకు తిరిగి కుమారుడుగా బుట్టెను—ఇది కథ. రామకృష్ణకవి యీకథను మనస్సున బెట్టుకొనియే తన గ్రంథమున నారద జనన కథను వ్రాసినాడనుట స్పష్టము. తన కనవసరములైన భాగములను వదలినాడు. అసందర్భములను తొలగించినాడు. కథలో బిగుతుదనము కలుగుటకు కుదించినాడు. ఎచట యెట్లు చేసినదియు రామకృష్ణునికథతో పై పురాణ కథను పోల్చి చూచుకొనిన విస్పష్టమగును. ఇంతకుమించి రామకృష్ణకవి ఇతర గ్రంథముల నుండి గ్రహించిన విషయము కనుపించుటలేదు.

ఇక నీ గ్రంథమున పరిశీలించవలసిన విషయము నిర్మాణ శిల్పము. కథా సంవిధానము, భావుకత, పాత్రోన్మీలనము, ప్రకృతి చిత్రణము, శైలీరమ్యత, నైతికపు విలువ - ఇత్యాదులను మనసున బెట్టుకొని మహాకావ్యములను విమర్శించి, ఆకావ్యమెంతవరకు రసపర్యవసితమగుచున్నదో నిర్ణయించుట విమర్శకుల పద్ధతి. కావ్యము లనేకరకములు. అందీ స్థల మాహాత్మ్యము లొకరకము. ఇట్టి గ్రంథములందు కావ్యకళకుగాక, భక్తిభావ నిరూపణమునకే ప్రాధాన్యము హెచ్చని ముందే తెలిపితిని. కథాసంవిధానమనగా వస్త్వైక్యము. మహాత్మ్య నిరూపణ గ్రంథములందు దీనికి తావులేదు. పూర్వాపర సంబంధములేని కథ లనేకము లీ జాతి గ్రంథములందుండును. వస్త్వైక్యమును పాటించవలయునను దృష్టి మాహాత్మ్యగ్రంథకర్త కుండదు. తాను వ్రాసిన ప్రతి కథ యందును నేదో యొక మాహాత్మ్యముండుటయే కావలయు నీజాతి గ్రంథకర్తకు. ప్రతి కథయు దానికది ప్రత్యేకముగా నొక క్రమము ననుసరించి యుచితరీతిగా నుండునట్లు వ్రాయుటయే ఈజాతికవి పాటించు కథాశిల్పము. ఘటికాచల మాహాత్మ్యమున నున్న కథలు నాలుగు - ధవలాంగునికథ, నారదుని జన్మకథ, సప్తమహర్షులకథ, వైఖానసులకథ. — ఈ కథలలోని యుచితానుచితములను పైన చర్చించితిని. ధవలాంగుని కథ యనుచితముగా నున్నది. సప్త మహర్షుల కథ, రంభాదుల యాగమన కారణముగ, కుంటుపడినది గమనమున. కాంచీపుర వర్ణనవలన వసిష్ఠుని యుదాత్తత నశించినది. వైఖానసులకథ మామూలుగా నున్నది. నారద జనన కథమాత్ర మన్నింటికంటె మేల్తరముగా నున్నదని నాయభిప్రాయము.

భావుకత యనగా కాల్పనికశక్తి. ఇది ఈజాతి గ్రంథములందుండదు. ఈ గ్రంథమునను లేదు. పాత్రోన్మీలనమన పాత్ర చిత్రణము, పోషణము. ఈజాతి గ్రంథములందు దీనికిని స్థానము లేదు. ఐనను పాండురంగ మాహాత్మ్యమున నిగమ శర్మయందును, వానియక్క యందును నొక వైయక్తిక వైశిష్ట్యము క్రమోన్మీలన మగుటను పురస్కరించుకొని విమర్శకులు రామకృష్ణకవి ఆ పాత్రములను నొక దృష్టితో పోషించినాడనియు, కనుక పాత్ర పోషణము మనోహరమనియు చెప్పుచున్నారు. ఆదృష్టితో ఘటికాచల మాహాత్మ్యమును దర్శించినపుడట్టి పాత్రపోషణము నారదుని విషయమున (జననకథయందు) జరిగినదని చెప్పవలయును. దాసీ పుత్రుడుకైన నారద

దుడు బ్రహ్మసాయుజ్యము చెందువరకు సముచితమైన వాతావరణము కల్పించి రామకృష్ణకవి క్రమోన్మీలనము గావించినాడు. సప్త మహర్షుల విషయమున పాత్రపోషణ ప్రశ్న యుదయించదు. కాని వసిష్ఠుని చేత కాంచీపట్టణమును వర్ణింపించుటవలన వాని పాత్ర ముదాత్తముగ పోషింపబడుటకు మారు అధోగతి పాలైనది. వైఖానసులు కేవలము వైష్ణవారాధనా సక్తులు.

ప్రకృతి చిత్రణ మనగా స్థానిక ప్రకృతి చిత్రణము. స్థల మాహాత్మ్య గ్రంథములందా యా స్థల ప్రకృతులను వర్ణించుట సమంజసము. కాని ఘటికాచల ప్రకృతి ఈ గ్రంథమున నేమాత్రమును వర్ణింపబడ లేదు. అసందర్భముగా నున్నను కాంచీపుర వర్ణనమున నైనను స్థానిక ప్రకృతి చిత్రణముండవలసినది. అదియును లేదు.

ఇక శైలీరమ్యత. ఈ శైలి యనునది బ్రహ్మపదార్థమువలె అనిర్వచనీయమైనది. శైలి, శయ్య, రీతి, మొదలైన శబ్దములు పర్యాయములుగా కొందరు వాడుచున్నారు. కొందరు భేదము పాటించుచున్నారు. పాశ్చాత్యుల 'స్టైలు' అను పదమునకు సమానార్థకముగ శైలి యను శబ్దమునువాడుచు, ఆఖ్యాయిక శైలి, నాటకీయ శైలి, వర్ణనాత్మక శైలి అని మూడు విధములుగ వ్యవహరించుచున్నారు కొందరు. ఏది ఎట్లున్నను "రామకృష్ణుండను సురారామగజము". ఈ గ్రంథమున పాశ్చాత్య పద్ధతి ననుసరించి చెప్పవలయుననిన ఆఖ్యాయిక శైలి, వర్ణనాత్మక శైలి రెండును మిళితములైన వనవలెను. ఈజాతి గ్రంథములందుండవలసినదే ఆఖ్యాయిక శైలి. ప్రసన్నముగా కథా కథనము చేయుటయే ముఖ్యము. రామకృష్ణుని కథాకథనము వైలక్షణ్యము గలది. వాని చేతిలో బడిన కథ దానికదే యొక వేగమును తెచ్చుకొని చరచర సాగిపోవును. ఆ వేగమున భావ్యర్థ సూచనము నిముడ్చుట రామకృష్ణుని వైశిష్ట్యము. నిగమ శర్మోపాఖ్యానమున నెంత వేగమున్నదో ఈ గ్రంథమున వారన జనన కథాకథనమున నంతే గలదు. తపోభంగ మొనరించుటకు రంభాదుల యాగమనాదిక మంతయు ప్రాబంధిక మార్గము ననుసరించి వర్ణనాత్మక శైలియందున్నది.

భక్తిని ప్రబోధించుట ప్రధానాశయముగా గల యిట్టి గ్రంథములందు నైతికపు విలువలను గాని-రస విషయమును గాని చర్చించుటకు యత్నించరాదు. ఈ గ్రంథకర్తల కాదృష్టియుండదు. వారూహించని దానిని మనము చర్చించుటెట్లు?.

ఏక కర్తృకములైన గ్రంథములందు కొన్ని పోలికలుండుట సహజము. లేకుండుట అసహజము. రామకృష్ణ కవి గ్రంథములు మూడు మనకు లభించినవి. అందు పాండురంగ మాహాత్మ్యమునకును, ఉద్భటారాధ్య చరిత్రమునకును గల పోలికలను, బ్రహ్మశ్రీ బులుసు వేంకట రమణయ్యగారు తాను టీక వ్రాసిన పాండురంగ మాహాత్మ్య గ్రంథ పరిచయమున చూపియున్నారు. అందు ఘటికాచల మాహాత్మ్యమునకును, ఉద్భటారాధ్య చరిత్రమునకును గల పోలికలను గూడ వారు చూపినారు. ఘటికాచల మాహాత్మ్యమునకును, పాండురంగ మాహాత్మ్యమునకును గల పోలికలను వారు చూపలేదు. నేను చూపుదును. పోలిక యనునది స్థూలముగ నీ విషయమున మువ్విధము. శబ్దముల పోలిక, భావముల పోలిక, పద్య గమనముల పోలిక. ఈ మూడును వేరు వేరుగా నుండక ఏకదేశముగా కూడ నుండవచ్చును. సర్వ తంత్ర స్వతంత్రుడై సురారామ గజమను పేరొందిన రామకృష్ణకవి గ్రంథములందు పోలిక లెక్కువగా నుండవు. అయినను కొన్ని యనివార్యములై యుండును.

శ్రీలన్ రాజిలు నైమిశంబునఁ
    దపస్విశ్రేణి పౌరాణిక
త్వాలంకార సమేతు సూతుగని
    పద్మాక్షీశ సద్మంబులన్
శ్రీ లీలా నిరవద్య మాద్యము
    మరుత్సేవ్యంబు దివ్యంబుగా
నాలోకించి యొకండు గల్గిన మహాత్మా,
    తెల్పవేనావుకున్.

(ఘటి. ఆ 1. ప 1.)

తులితోత్తుంగ ధ్వజసూతుడై వెలయు
సూతుంగాంచి మున్ శౌనకా
దుల......క్షేత్రంబును వేల్పుతీర్థము.........
యిలపై నొక్కెడఁ గల్గెనే సనఘమూర్తీ,
తెల్పవే నావుడున్

(పాండు. ఆ 1. ప96)

జలకంబుసవరించెఁ గలశపారావార
కల్లోల కణసిక్త గాత్రునకును

హారన్నంబు పైఠాణి సన్నపాల్వలొనంగఁ
గాంచిత...పటీరాంచితునకుఁ
గాశ్మీర తిలకంబు ఘటియించె రాధాకుచాగ్ర
సాంకవ కుంకుమాంకితునకు
నవరత్నమయ భూషణములు సమర్పించెఁ
గౌస్తుభ భూషా వికాసితునకు
సర విరి విరిసరములు నెయ్యమునవైచెఁ,
దపసి డెందంపు సత్తమ్మి తావుకొరకు
దీప మర్పించెఁ గ్రూర దైతేయవీర,
తిమిర దీప ప్రతాప సందీపితునకు.

(ఘటి. ఆ 2. ప 12.)

అభిషేక మొనరించె నాకాశవాహినీ
జనన కారణ పాద జలరుహునకు
వైచెఁ దోమాలిక వైజయంతీ కాంతి
వలయిత వక్షఃకవాటునకును
గాశేయ మర్పించెఁ గాంచనరుచు పటీ పల్ల
వారుణాకటీ బంధురునకుఁ
జందనంబలఁదె నీశేందిరా కుచకుంభసంగి
కుంకుమ పంకిలాంగునకును
రత్నహారంబు సాతువిరత్నసిద్ధ, కౌసుభోదర్చి
రభిరామ కంధరునకు
ధూపకల్పనమున్నగా దీపమిచ్చెఁ,
దెలవ! యాతడు త్రైలోక్యదీపకునకు.

(పాండు. అ. 2. ప 21)

తేలెడి కన్నులన్నిదుర జేల బుగుల్కొను
తావి పూలఁగై
వ్రాలిన కొప్పు లంపములవ్రాలఁ
జనుంగవ భారకంబునం
దూలు వలగ్నము ల్పైకొను తూలకణమ్ములఁ
బోల నీవికం
గేలికి దార్చి వెల్వడిరి కేళి గృహంబులు
వారకామినుల్.

(ఘటి. ఆ. 2. ప. 183)

తేలెడు కన్నుదోయి వడ నేరదు
ముద్దుమొగంబు సారెఁగై
వ్రాలెడు గొప్ప కొప్పు వసి వాడెడు
నన్ను వకౌను కౌకలం
దూలెడు లేత మేనవయి లోత్రటిలం
వమ్మగవాలి నాలిబా
గా లఘు వర్తనుం జరసి యంగజబాధిత గాఁ
దలంచుచున్

(పాండు. ఆ. 3. ప. 65)

ఇట్టి పోలిక లింకను వచ్చుటచ్చుట నున్నవి. ప్రథమ పర్యాయము నేను ఘటికాచల మాహాత్మ్యము చదువుచుండగా నాయాసందర్భముల స్ఫురణకు వచ్చిన పాండురంగ మాహాత్మ్యమునందలి పద్యములను గుర్తించి కొన్నింటిని పైన నుట్టంకించితిని. పై విషయముగ స్ఫురణకువచ్చు మరొక విషయము కళాపూర్ణోదయమునందలి మణికంధరుని తీర్థయాత్రాభివర్ణనము. అనగా నీ గ్రంథములోని ప్రథమాశ్వాసము నందలి నారదుని తీర్థయాత్రను బోలినదే మణికంధరుని తీర్థయాత్రయనుట.

దిఙ్మాత్రముగ గ్రంథస్థ విషయములను తీసికొని విమర్శించితిని. పాండురంగ మాహాత్మ్యమునందలి ప్రౌఢిమ యిందు లేదనుట నిర్వివాదము. అయినను ఉద్భటారాధ్య చరిత్రకంటె యిది మేలుగా నున్నదని నాభావన. ఉద్భటారాధ్య చరిత్రము మకాలప చరిత్రయే యుత్తమము. అందు పటుత్వమున కంటె మాధుర్యము హెచ్చు. ఈ గ్రంథమునందలి నారద జననకథకు సంబంధించిన రచనయే యుత్తమము. ఇంకా మాధుర్యముతోబాటు చమత్కారమును గర్భమునందిముడ్చుకొని పటుత్వమును గలదు. ఈ రెండింటికంటెను పాండురంగ మాహాత్మ్యము నందలి నిగళశర్మ పాఖ్యానమున శిల్ప ప్రౌఢిమ యధికము. కనుకనే ఆ గ్రంథ ముత్తమమను కొనుచున్నాము.

నావద్దనున్న గ్రంథము 1902సంవత్సరమున ముద్రింపబడినది. తప్పులు కుప్పలుగా నున్నవి. ప్రకాశకులు తామేతాళప్రతి ననుసరించినదియు చెప్పలేదు. వారు చూచిన ప్రతి కొంత క్రిమిదష్టమైనట్లున్నది. ఆరుపద్యము లాపాచనతో ముద్రించబడినవి. తాళపత్రప్రతిని సేకరించి, పాఠ్యపదములను గూర్చి మరల యీ గ్రంథమును ముద్రింపవలసిన యావశ్యకతయున్నది. గ్రంథముంతయు మూడాశ్వాసములు. 475 గద్యపద్యములు. ప్రకాశకులీ గ్రంథవిషయమున శ్రద్ధవహించి ముద్రించుటకు పూనుకొనవలసినదిగా కోరుచున్నాను.

బంధవిముక్తి

'వజ్రపాణి'

ఆనాడు ఒకటో తారీఖు!

గవర్నమెంటు ఉద్యోగులకు ఈ ఒకటో తారీఖు ఎంత మహత్తరమైన దినమో వేరే వర్ణించడం అనవసరం. ఆనాడు వాళ్లముఖాలు ఓ దివ్యతేజస్సుతో కళకళలాడుతుంటాయి. ఆ పవిత్రదినంకోసమే— ఎండనక, వాననక, రోగం వచ్చినా, రొష్ఠు వచ్చినా అలాగే పనుల్లోకి పోతుంటారు వాళ్లు. ఈ రోజుల్లో కాళిదాసే బ్రతికివుంటే "ఒకటో తారీఖు సందేశం" అనే మరో ఉత్తమ ఖండకావ్యం రాసేవాడే!

సంజీవరావు కలెక్టరేట్‌లో ఓ గుమాస్తా. నెల ముప్పైరోజులూ పనిచేస్తే ఒకటో తారీఖున దయ తలచి అతని చేతుల్లో ఎనభైరూపాయలు పెడుతుంది ప్రభుత్వం. అతను బహు కుటుంబి. అంటే, వృద్ధుడని కాదు. యువకుడే! పాతికేళ్లే నిండు యౌవనంలో వున్న నవయువకుడు!

ఏం లాభం? ఇంత చిన్నవయస్సులోనే నుదుట ముడుతలు పడ్డది. కళ్లలోని తేజస్సు అంతరించిపోయింది. నడుంలో కొంచెం గూనికూడా వచ్చినట్టు—ప్రేక్షకులకు దృశ్యాదృశ్యంగా కనిపిస్తుంది. అతను నవ్వి ఎన్ని సంవత్సరాలైందో ఇతమిత్థమని నిర్ణయించే ఆధారాలు దొరకటంలేదు. తలకు రెండుప్రక్కలా వెంట్రుకలు తెలుపెక్కుతున్నయ్. ఏంచేత?

అతను బహు కుటుంబి అని చెప్పనే చెప్పాను. అతనిమీద ఆధారపడి జీవించేవాళ్లు ఆరుగురు. వాళ్ల జాబితా యీ విధంగా వుంటుంది: అతను సరేసరి! అతని భార్య, తండ్రి, తలచెడిన అక్క, చెల్లెలు, కుమార్తె. ఈ కుమార్తె మూడేళ్ల పిల్ల.

ప్రొద్దుటినుండీ అతను అదో మోస్తరుగా వున్నాడు. షుమారు తొమ్మిదిగంటలకు సేఫ్టీరేజర్‌తో క్షౌరకల్యాణం ముగించి, దొడ్డిలో నూతిదగ్గర నాల్గు చేదల నీళ్లు ద్రిమ్మరించుకుని "టైమైపోతోంది! టైమైపోతోంది!" అంటూ వంటింట్లోకి పోయాడు. అప్పటి కతని భార్య బియ్యం కడుగుతోంది. భర్త గ్రుడ్లురిమి చూచాడు: "ఇప్పుడా బియ్యం కడిగేది? టైమెంతయిందో తెలుసా?" స్వర్ణ—అతని భార్య—మౌనం తాల్చింది. "నీతోనే మాటాడేది! గోడలతో కాదు! అసలు నీ వుద్దేశమేమిటే? వేళకింత వండి వార్చటం కూడా కష్టమైపోతోందన్నమాట!"

స్వర్ణ—భర్త కళ్లల్లోకి దీనంగా చూచింది. ఆమె చూపులలోని భావమేమిటో, అసలు చూపులలో కూడా భావాలనే పదార్థాలు ఉంటవో, లేవో కూడా అతనికి తెలీదు, తిరిగి, గర్జించాడు.

"నామీద అలా విరుచుక పడతారేం? ఇంట్లో బియ్యం నిండుకున్నయ్. ఇరుగు పొరుగులదగ్గర ఇదివరలో చేసిన అప్పులే యింకా తీర్చలేదు. క్రొత్తపేటవెళ్లి సరోజినిగారిదగ్గర రెండుశేర్లు తెచ్చేసరికి యీ వేళయింది. ఉడకడం ఎంతసేపూ? మీరు బట్టలు వేసుకోండి!" అంది.

"ఏఁవిటీ? నిన్నకాక మొన్నేకదుటే పదిశేర్ల బియ్యం తెచ్చాను?" ఆశ్చర్యపోయాడు భర్త.

"ఐతే మీరనేదేఁవిటీ? ఒక్కతెనే—గుడినీ, గుడిలోని విగ్రహాన్ని దిగమ్రింగేందుకు నేనేం రాక్షసినా? అపూటా యీపూటా కలిపి రోజుకు పన్నెండు కంచాలు లేవాలి! పదిశేర్ల గింజ లేం భాగ్యం?" అంది స్వర్ణ.

ఏతత్ సుముహూర్తమునకు అభినయపూర్వకంగా రంగంలోకి ప్రవేశించింది—సంజీవరావు విధవ అక్క జానకమ్మ. చిత్రవిచిత్రంగా చేతులు త్రిప్పుతూ—"ఐతే మేమేనటే రాక్షసులం! నోటికి ఎంతకూతవస్తే అంతకూతా కూసెయ్యడమేనా?" అని సాగదీస్తూ హుంకరించింది.

"నేనలా అనలేదు. మీరు అయినదానికీ కానిదానికీ గిల్లి కజ్జాలు పెట్టుకోవాలని చూస్తున్నట్టుంది. మేం ఉభయులమూ ఏదో కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నాం!" పుల్ల విరుపుగా జవాబిచ్చింది స్వర్ణ.

జానకమ్మకు శివమెత్తింది. ఆమెలో నిద్రిస్తోన్న కైకా, మంథరా ఒక్కసారిగా మేల్కొన్నారు. భరతనాట్య భంగిమలు ప్రదర్శిస్తూ, "విన్నావురా తమ్ముడూ! ముందు పుట్టిన చెవులకంటె, వెనుకవచ్చిన కొమ్ములే వాడిట! అట్లా వుంది దీని ధోరణి. ఐతే, నే నే పరాయిదాన్నన్నమాట! మమ్మలి నందరినీ యిలా ఉసురు పెడుతోంది–దీనికేం పోయేకాలం వచ్చిందో కాని!" అని మెటికలు విరిచింది.

"చూచారా! మీ అక్కగారి ధోరణి! ముండా భగవంతుడు నన్ను తీసుకుపోయినా బాగుండేది!" అన్నది స్వర్ణ.

అంతటితో యుద్ధం ప్రారంభమైంది. ఇంట్లోని వ్యక్తులందరూ రంగంమీద ప్రత్యక్షమయ్యారు. కొందరు జానకమ్మనూ, కొందరు స్వర్ణనూ సమర్థిస్తున్నారు. మన దేశపు వైదేశిక విధానం లాగున తటస్థంగా వుండిపోయిన వాళ్ళు ఇద్దరు మాత్రమే! ఒకడు సంజీవరావు. రెండో వ్యక్తి—అతని చెల్లెలైన సుహాసిని.

ఇరుపక్షాలూ ఓ పదిహేను నిమిషాలు వాగ్యుద్ధంలో పాల్గొన్నాయి. న్యాయం స్వర్ణపక్షాన్నే వున్నప్పటికీ—గయ్యాళిగా కీర్తిపొందిన జానకమ్మ కుతర్కంలో ప్రౌఢమార్గాల్ని అందుకున్నది. ఆడబడుచు సవ్యాపసవ్యంగా ప్రయోగించిన అవమానాస్త్రాలకు తాళుకోలేకపోయింది స్వర్ణ. తన భర్త అయినా తనకు సహాయపడకపోవటంతో ఆమె సిగ్గుతోనూ, అవమానంతోనూ క్రుంగిపోయింది. ఆమె కళ్ళలో నీరు తిరిగింది. కన్నీరు చూచిన భర్త హృదయం కరిగి, వాగై, ప్రవహించింది.

"నన్ను యింట్లో ఉండమంటారా? లేకపోతే సన్యాసం పుచ్చుకుని ఏ కాశీకో పొమ్మంటారా?" అని అతను కేకలు వెయ్యటంతో రభస తాత్కాలికంగా ఉపశమించింది. త్వరత్వరగా బట్టలు వేసుకుని, భోజనమైనా చెయ్యకుండానే వెళ్లిపోబోతూండగా స్వర్ణవచ్చి, త్రోవ కడ్డంగా నిల్చుని, కన్నీళ్ళ పర్యంతమై "మీకు కూడా నామీద కోపమేనా? రండి! అన్నం వార్చాను. ఇన్ని మజ్జిగనీళ్ళయినా వేసుకుని కొంచెం ఎంగిలి పడండి!" అని దీనాతిదీనంగా అడిగింది.

"ఎబ్బే, నాకు తిండెందుకూ? నేను మనిషిని కానుగా! యంత్రాన్ని! గాడిదను! అసలు నేను సుఖపడటానికి పుట్టలేదుగా! జీవితమంతా ఏడ్వమని నా నొసటను రాశాడు భగవంతుడు! ఛీ! త్రోవ తప్పుకో! టైమైపోతోంది!" అని కోపంగా స్వర్ణను ప్రక్కకు నెట్టి ముందడుగు వేశాడు.

"అబ్బబ్బబ్బబ్బ! మీరంతా కలిసి నాడి ప్రాణాలు కొరుక్కుతింటున్నారే!...అః! ఒరే, అబ్బాయ్! ఇటు చూడూ! ఇవాళ ఫస్టు తారీఖు కదూ! సాయంత్రం యింటికి వచ్చేటప్పుడు ఓ వంద లంక పొగాకు చుట్టలు పట్రా! మొన్నటిమాదిరివి తెచ్చేవు సుమీ! లోపల పొగాకు కాడలు పెట్టి చుట్టారు. కాల్చలేక దవడలు పీక్కుపోతున్నయ్" అన్నాడు తండ్రి.

సంజీవరావు "అలాగే" అని మరో అడుగు ముందుకు వేశాడు.

"ముండా భగవంతుడు నన్నన్నా తీసుకుపోయాడు కాడు. నావల్ల నేకదా తిండీ, తిప్పలూ లేకుండా నువ్విట్లా ఆఫీసుకుపోవాల్సి వచ్చింది.... ఒరే, తమ్ముడూ! బట్టలన్నీ చిరిగి, పరుసులైపోయాయిరా! ఈనెల అయినా ఒకటో రెండో రామబాణం మార్కు వైనుపంచెలు కొనిపెట్టరా! ఆడముండనిరా! సిగ్గుతో ఛస్తున్నాను! నన్ను ఉసురు పెట్టడం మీకు క్షేమం కాదురా!" అన్నది జానకమ్మ.

సంజీవరావు తిరిగి "అలాగే" అని యింటిమెట్లు దిగుతూండగా అతని చెల్లెలు సుహాసిని, "అన్నయ్యా! వచ్చేప్పుడు 'ఫైవ్ పండిట్స్ నోట్సు' మరచిపోకు! క్లాసులో ఒక్క తెలుగు పాఠమూ అర్థంకావటం లేదు. ఆ తర్వాత నీ యిష్టం! నా బట్టలుకూడా పీలికలైపోయాయి. క్లాసులో అంతమంది మగాళ్ల మధ్య కూర్చోవటానికి సిగ్గువేస్తోంది!" అంది.

కసాయివాడి చేతిలో కత్తి చూచి, ప్రాణాల మీద తీపి పూర్తిగా వదలుకున్న మేకపిల్లలాగు

"అలాగే" అని మరోసారి అని, ఓసారి వెనక్కు తిరిగి చూచాడు సంజీవరావు. స్వర్ణ చంటిబిడ్డ నెత్తుకుని, అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తోన్న కన్నీటి ధారల్ని పైట చెరగుతో తుడుచుకుని, లేనినవ్వును తెచ్చిపెట్టుకుని భర్త వైపు అదోవిధంగా చూచింది. ఆ చంటిబిడ్డకు కడుపులో 'బల్ల' పుట్టింది. పిల్ల నానాటికీ నీరసించి పోతోంది.

అడుగుల్లో అడుగులు వేసుకుని కోర్టుకు చేరుకున్నాడు సంజీవరావు. అప్పటికే పది దాటిపోయింది. సంజీవరావును చూచిన రామయ్యగారు- హెడ్ గుమస్తా- కోపంతో కనుబొమలు చిట్లించి, కర్కశత్వం ఉట్టిపడే సహజధోరణిలో "ఏమయ్యా! ఇంత ఆలస్యంగా వచ్చావేం? టైం చూడూ! *You are late by half an hour!* ఇలా అయితే పనికిరాదు. మరోసారి ఇట్లా చేస్తే నీమీద 'డిసిప్లినరీ ఆక్షన్' తీసుకోవాల్సి ఉంటుంది"—అన్నారు.

"మా ఆవిడకు చాలా 'సీరియస్'గా ఉండటం చేత కొంచెం ఆలస్యమైంది సార్! ఈ సారి క్షమించండి!" అని ఆపద్ధర్మంగా బొంకాడు సంజీవరావు.

"నీ ఒక్కడికే కాదయ్యా! మా అందరికీ వున్నారు పెళ్ళాం బిడ్డలు. ఇల్లు ఇల్లే! కోర్టు కోర్టే! నీలాగే ప్రతి గుమస్తా రోజూ లేటుగా వచ్చి, 'సార్! నా భార్యకు సీరియస్‌గా వుంది!' 'సార్! నా కొడుక్కు కడుపులో తలనొప్పి పుట్టింది' అంటో కుంటిసాకులు చెబితే ఇక్కడ పని సాగేదెట్లా? 'పంక్చ్యుయాలిటీ' అన్నది లేకపోతే పని చెయ్యటం చాలా కష్టం!" అని మండిపడ్డాడు హెడ్ గుమస్తా.

సంజీవరావు వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు. తన ముందు ఫైలులూ, కేసులూ కొల్లలు! కొల్లలు!

ఆనాడు అతనికి పని చెయ్యడానికి మనస్కరించలేదు. ఏదో బాధతో, అవమానంతో, భయంతో అతని గుండెలు తీవ్రంగా కొట్టుకోసాగాయి. ముఖం మీద చెమట బిందువులు ముత్యాల తోరణాలు కట్టినై. గొప్ప 'ఇనకన్వీనియన్స్'గా వుంది. దీనికి తోడు కడుపులో చిట్టెలుకలు పరుగులు పెడుతున్నయ్. ఉదయం పరగడుపున ఓ కప్పు కాఫీ ఏం త్రాగడో అంతే! ఆ తర్వాత ఓ గ్లాసెడు మంచి నీళ్ళయినా పుచ్చుకోలేదు.

ఛీ! వెధవ బ్రతుకు!

అది డిస్ట్రిక్టు కలెక్టరుకోర్టు. అందులో తనలోటి వాళ్లు కొన్నివందల మంది పనిచేస్తున్నారు. యువకులూ, వృద్ధులూ, సన్మార్గులూ, దుర్మార్గులూ— భిన్నభిన్న వయస్కులు — భిన్నభిన్న తత్వాల వ్యక్తులు పనిచేస్తున్నారు. అయితే వచ్చిన చిక్కల్లా ఎక్కడ వుందంటే—సంజీవరావు కూర్చున్న కుర్చీ తన ఇన్‌ఛార్జికి మరీ ఎదురుగా వుండటంలో. ఏతత్ కారణంబున అతను బయటకుపోయి కాసేపు గాలి షికార్లు సేవించడానికి కాని, కుప్పలు కుప్పలుగా పడివున్న ఫైలు కట్టలమధ్య దాక్కుని తక్కిన గుమాస్తాలతో లోకాభిరామాయణం పారాయణ చేయటానికి కాని వీల్లేదు.

హెడ్ గుమాస్తా రామయ్యగారు స్వతః మంచి వారు. ముప్పై సంవత్సరాలు 'నిష్కళంకమైన' సర్వీస్ చేశారు. బహు కుటుంబి కావటంచేత ఆయనకు ఈ లోకంలోని చికాకులూ, కష్టనష్టాలూ క్షుణ్ణంగా తెలుసు. ఐనప్పటికీ ఆయన చాలా కటువుగా మాట్లాడతారు. ముఖం చిట్లించి, కళ్లు చిన్నవిగా చికిలించి ఎదుటి మనిషిని హడలగొట్టేసే విద్యలో పండితుడు. అట్లా వుంటేనే తప్ప ఈ 'కుఱ్ఱకారు గుమాస్తాలు' వళ్లు వంచి పని చెయ్యరని ఆయన తన ముప్పైఏళ్ల అనుభవం ద్వారా తెలుసుకున్నారు. అంతే! కాని, ఆయన 'నిండుమనంబు నవ్య నవనీత సమంబు' ఏం చివాట్లు పెట్టినా ముఖ మెదురుగానే అంటాడు కాని—మనిషి వెనుక గోతులు త్రవ్వటమూ, అయినదానికీ, కానిదానికీ పై అధికార్లతో రిపోర్టులు చెయ్యటమూ అతనికి తెలియని విషయాలు.

రామయ్యగారికి సంజీవరావుమీద ఓ ప్రత్యేకమైన సదభిప్రాయం వుంది. గత నాలుగేళ్లనుండీ సంజీవరావు రామయ్యగారి క్రిందనే పనిచేస్తున్నాడు. అతను ఓ యంత్రంలాంటి మనిషి. తనూ, తనపనీ తప్ప అతనికి వేరే ప్రమేయమే వుండదు. లోకం ఒక్కసారిగా నశించిపోయినప్పటికీ అతను తనకు కాదన్నట్టుగానే వ్యవహరిస్తాడు. మరో కారణం కూడా రామయ్యగారిని ఆకర్షించింది. అది సంజీవరావు ప్రవర్తన. తక్కిన గుమాస్తాల మల్లే సంజీవరావు బీడీలూ, చుట్టలూ, సిగరెట్లూ కాల్చడు. కాఫీ హోటళ్లకు వెళ్లడు. గర్వంతో, అహంభావంతో రొమ్ము విరుచుకుని తిరగడు. తలవంచుకొని కోర్టుకు

రావడమూ, తలవంచుకునే ఇంటికిపోవడమూతప్ప— తనవెనుక ఓ చిన్న హైడ్రోజన్ బాంబు పడినప్పటికీ తిరిగి చూడడు.

ఏవంవిధ గుణగణగరిష్ఠుండైన సంజీవరావు ఈనాడు లేటుగా రావటమూ, వచ్చినతర్వాతఅయినా తనపని తాను చూచుకోకుండా స్థాణువులా కూర్చుని వుండటమూ గమనించిన రామయ్యగారికి కొంత ఆశ్చర్యం కలిగింది. తనపని తాను చూచుకుంటూనే మధ్యమధ్య ఓరచూపుల్తో ఆయన సంజీవరావును గమనిస్తూనే వున్నాడు. సంజీవరావు ఓ కేసు విప్పి దాన్ని చదివి అర్థం చేసుకోవాలని ప్రయత్నించాడుకాని విఫలుడైపోయాడు. ఊహూఁ! మరోకేసు పుచ్చుకున్నాడు. ఊహుహూఁ!

వివిధమైన ఆలోచనలలో అతని బుఱ్ఱ వేడెక్కిపోతోంది.

అతను మనిషై పుట్టినప్పటికీ 'పశువు'గానే పెరిగాడు. తన తండ్రి ఓ ప్లీడరు గుమాస్తాగా పనిచేసినప్పటికీ ఆ వృత్తిలో ఆట్టే రాణించలేక పోయాడు. నందిని పందిగా పందిని నందిగా మార్చే తెలివితేటలు లోపించినకారణంచేత ఆయన కొంచెమైనా ఆర్జించలేకపోయాడు. అంచేత సంజీవరావు విద్యార్థిదశలో వున్నప్పుడైనా ఖరీదైనబట్టలు వేసుకోవటమూ, పెద్ద పెద్దవాళ్లే అబ్బాయిలలో స్నేహంగా వుండటమూ ఎరగడు. ఆతర్వాత స్కూల్ ఫైనల్ పాస్ చెయ్యటమూ, తన తండ్రి వాళ్లనూ, వీళ్లనూ ఆశ్రయించి కోర్టులో గుమాస్తాగా వేయించడంతో అతను పూర్తిగా యంత్రమైపోయాడు.

తాను మనిషిననీ, మనిషి అన్న ప్రతివాడిలోనూ అంతరాత్మ అనే పదార్థం ఒకటి వుంటుందనీ, ఆ 'పదార్థం' అస్తమానమూ సౌఖ్యం అనుభవించాలని కోరుతుందనీ, బ్రతికిన నాల్గునాళ్ళూ వైభవంగా జీవించాలనీ అతనికి తెలీదు.

దుఃఖం అన్నది రూపం మార్చుకున్న కాలకూటవిషంతప్ప మరోపదార్థంకాదనీ, అది మనిషిలో ప్రవేశించాక నిలువునా క్రుంగదీసి కృశింపజేస్తుందనీ కూడా అతనికి సరిగా తెలీదు.

ఐతే, ఈనాడు తనకావిషయాలు కొంచెం కొంచెం గుర్తువస్తున్నాయి.

అతను ఆలోచనా సముద్రంలో మునిగి తేలుతున్నాడు.

"ఈ కోర్టులో—ఆ మాటకువస్తే, ఈ 'చతురంభోధి పరీతమైన ధరణీ చక్రంబు' లో ఒక్కరికీ లేని ఈ బాధా, ఈ కష్టాలూ నాకొక్కడికే యెందుకు కలగాలి? ఏం? నేను మనిషిని కానూ? వీళ్ళందరి మల్లే పుట్టలేదూ? వీళ్ళందరూ హాయిగా, ఉల్లాసంగా కేరింతలు కొడుతూ, ఎగిరి త్రుళ్లిపడుతోంటే—నేనొక్కణ్ణీ యిట్లా స్థాణువునై రాతి బొమ్మలాగు అధోలోకాలలోకి దిగజారి పోతున్నానేం? నాకు జీవితం తక్కువా? పరువు ప్రతిష్ఠలు తక్కువా? ఏఁవిటి తక్కువైందని చెప్పి నేనిట్లా ఉసూరుమంటో రోజు లీడుస్తున్నాను?"

ఈసారి అతని మనస్సు తన కుటుంబంమీదికి—కోపంతో ఉరుకెత్తి—పరుగెత్తింది:

"ఎంతకాలం? ఎంతకాలమని నేనీ బరువు మొయ్యగలను? ఒకరా? ఇద్దరా? వెరసి ఆరుగురు జనాభా. మా ఆవిడ చెప్పినట్టు 'రోజుకు పన్నెండు కంచాలు లేవాలి'! వీళ్లందరికీ ఎక్కడనుండి తెచ్చేది? కరువుచూస్తే ఇట్లా మండిపోతోంది. బజారుకు వెడితే కళ్లనుండి నెత్తురు చుక్కలు పడుతున్నయ్. ఇంతా ఏడుస్తే వీళ్లకు నామీద అభిమానమా? చట్టుబండలా? ఇవ్వాళటికివ్వాళ నేను తిండీ తిప్పలూ లేకుండా ఇలా కడుపుమంటతో కోర్టుకు వచ్చేస్తోంటే, ఒక్కరన్నా అడ్డువచ్చి 'ఇంత ఎంగిలి పడిపోరా! ముదనష్టపాడా!' అనగలిగారూ? ఎబ్బే! ఎందుకంటారూ? నా వంతుభోజనం కూడా మిగులుతే ఒక్కొక్కళ్లూ మరి రెండేసి ముద్దలు ఎక్కువ తినొచ్చుగా! వీళ్ళందరినీ పెంచుతానని నేను కంట్రాక్టు రాశానా? 'అమ్మో! నిరాహారంగా అలాగే పోతున్నావే!' అని కనికరించటంలేదు సరిగదా—వీళ్ళందరికీ గొంతెమ్మ కోర్కెలు! ఒకరికి శుభ్రమైన లంకపుగాకుచుట్టలు ఓ వంద కావాలి! అందులో కాడ లుండకూడదు! మరో ఆవిడకి రెండు రామబాణం మార్కు సైనుపంచెలు! ఇంకో ఆవిడకు కంపల్సరీగా ఫైవ్ పండిట్స్ నోట్సుకొని తీరాలి! వీళ్లైతే ఒకటో రెండో వాయిల్ చీరెలుకూడా కావాలి! ఇది అష్టనల్! తెచ్చిన జీతం డబ్బులు తిండికే చాలీ చాలనట్టుంటే—వీళ్ళందరికీ చదువులూ చట్టుబండలూను!

అన్నీ వేషాలు! జరిగివస్తే జ్వరం వచ్చినంత సుఖమే లేదు. ఇక్కడేమీ డబ్బు కుప్పపోసి వుంచలేదు— కుంచాలతో కొలిచి దానం చెయ్యటానికి. 'ఏదో! ఈ కరువుకాలంలో ఇంత పెద్దకుటుంబాన్నీ గుట్టుగా ఈడ్చుకవస్తున్నాడు. అంతే చాలునే!' అన్న జిజ్ఞాస ఏ ఒక్కరికన్నా వుందా?"

ఈసారి, తన భార్యవైపు ప్రసరించిన మనస్సు కోపంతో ఉడుకెత్తలేదు—జాలితో ద్రవించి, ఏరై, నదియై, సముద్రమై కెరటాలు చాచి, కెరట్లు విరిగి, పరవళ్లు త్రొక్కింది:

"స్వర్ణ! అన్వర్థనామధేయురాలు! అనగా, బంగారంవంటి మనిషి. ఏం లాభం? ఈ దరిద్రుణ్ణి పెళ్లాడి తనూ దరిద్రురాలైపోయింది. నే నేనాడైనా దానికి—వెండి బంగారాల సంగతి సరే సరి!—ఓ మంచి చీర అయినా కొనగలిగానా? కన్నారే మిస్తున్నారో, అంతే! అదయినా, 'నా కదికావాలి! ఇది కావాలి!' అని నన్నెన్నడైనా అడిగిన పాపాన పోయిందా? ఎలా అడుగుతుందీ? నా దగ్గర ఏం మిగుల్తోందని అడుగుతుందీ? ఈపాటి జ్ఞానం తక్కిన వాళ్లకుకూడా వుంటే ఎంత సంతోషించేవాణ్ణి! ఆ చంటిదానికి కడుపులో 'బల్ల' పుట్టింది. పిల్ల 'నా నాటికి తీసికట్టు నాగంభొట్లూ' అవుతోంది. ఏ లివర్ క్యూరో వాడుదామా అంటే డబ్బేదీ? నెలజీతం వారంరోజులకే సరిపడక ఊరినిండా వందలూ, వేలూ అప్పులు పెరుగుతోంటే డబ్బు మిగిలే దెప్పుడు? మందు వాడే దెప్పుడు? ఉష్ష్! ఎంతకాల మీ దరిద్రం? దీనికి అంతం అనేది లేనట్టే వుంది!"

సంజీవరావు మస్తిష్కంలో తుఫానుగాలులు చెలరేగినై. వాటిధాటికి అతను తట్టుకోలేక పోతున్నాడు. తన హృదయాన్ని ఏదో ప్రచండమైన ఓశక్తి కదిలించి, కుదించి, ఊపివేస్తున్నట్టుగా అతను దద్దరిల్లిపోతున్నాడు.

ఈ దద్దరిల్లిపోవటాన్ని రామయ్యగారు గుర్తిస్తున్నారు.

మధ్యాహ్నం ఒంటిగంట అయింది. (ఆనాడు ఒకటో తారీఖు అన్న సంగతి పాఠకోత్తములు విస్మరించారా?) సంజీవరావు సహోద్యోగులందరూ ఒక్కొక్కరే ట్రెజరీకివెళ్లి జీతా లందుకుని వస్తున్నారు. కేరింతలతో, కేకలతో, నవ్వులతో గదులన్నీ ప్రతిధ్వనిస్తున్నయ్.

కాలచక్రం ఆగలేదు.

రెండుగంటలైంది. ప్రతిరోజూ ఆవేళప్పుడు ఇంటినుండి ఫ్లాస్కులో తెచ్చుకున్న కాఫీ త్రాగటం అలవాటు. ఆనాడుకూడా అలాగే కాఫీ జ్ఞప్తికివచ్చి, లేచి అలమారుతాళం తీశాడు. ఫ్లాస్కు లేదు. అ లేక పోవడంతో అతనికి తను కాఫీ తే లేదన్న విషయం తెలిసింది. ఈ సంఘటనతో అతనిలోని 'బాధ' ద్విగుణీకృతమైంది. ఇంట్లోవాళ్ళనందరినీ అమాంతం నమిలి మ్రింగాలన్నంత కోపం వచ్చింది.

"అబ్బాయ్!" అని రామయ్యగారు కేక వెయ్యడంతో అతను త్రుళ్లిపడి, ఊహాలోకంనుండి భౌతిక విశ్వంలోనికి ఊడిపడ్డాడు. "జీతం అందుకున్నావా?"

"లేదు" ఉదాసీనంగా, నిర్లిప్తతతో జవాబిచ్చి మళ్లీ ఊహాలోకానికే ప్రయాణించాలని చూస్తోండగా రామయ్యగారు "నాతో రా!" అన్నారు. కరడుకట్టిన ఆయనముఖంలోవున్న భావం కోపమో అభిమానమో కూడా అర్థం కావటంలేదు.

అది మేడపై అంతస్థులో ఓగది. రామయ్యగారు మేడమెట్లు దిగుతోండగా — కసాయివాణ్ణి అనుసరించే మేకపిల్లలా — సంజీవరావు ఆయన్ని అనుసరిస్తున్నాడు. నడుస్తున్నంతసేపూ అతనిగుండెలు గుండెల్లోలేవు. గంభీరంగా 'పోజ్' పెట్టిన రామయ్యగారినిచూచి "ఇవ్వాళతో నాపని సరి! రామయ్యగారు ఏ కలెక్టరుతోనో, డిప్యూటీతోనో రిపోర్టు చెయ్యటానికే నన్ను తీసుకవెడుతున్నారు" అని కంగారుపడిపోతున్నాడు.

ఐతే, అదృష్టవశాత్తూ అటువంటిదేమీ జరగలేదు. రామయ్యగారు కోర్టు ఆవరణలోనే ఓమూలకు తీసుకవెళ్లారు సంజీవరావును. అక్కడ ఎవరూ లేరు. ఓ చిన్న వేపచెట్టునీడలో ఓ సిమెంటుబెంచి వేయబడి వుంది. రామయ్యగారు సంజీవరావునుచూచి "కూర్చో, నాయనా!" అన్నారు.

ఆ కంఠంలోని మార్దవం చూచి సంజీవరావు తనను తనే నమ్మలేకపోతున్నాడు. రామయ్యగారు "పెద్దపులి" అన్న బిరుదు సంపాదించుకున్న వ్యక్తి.

ఆయనలో దయాదాక్షిణ్యాలు ఏకోశానా లేవని అందరికీ తెలుసు. అటువంటివ్యక్తి స్వరంలో మార్దవం తొణికిసలాడుతోందంటే నమ్మడమెట్లా? పైగా ఆ స్వరంలో ఏదో ప్రేమ—లేకపోతే అభిమానం—కూడా లేకపోలేదు.

ఆ యిద్దరూ ఓ బెంచీమీద కూర్చుచున్నారు.

గుబురుగా పెరిగిన వేపచెట్టు ఆకులమధ్యనుండి ప్రసరిస్తున్న సూర్యకిరణాలు అంత తీక్ష్ణంగావున్నట్టు లేవు.

"నాయనా! అలా వున్నావేం?" అన్నారు రామయ్యగారు.

"ఎట్లా వున్నానూ?" అన్న అర్థం స్ఫురించేట్టు చూశాడు సంజీవరావు.

"వంట్లో బాగులేదా?"

"బాగానే వుంది."

"ఇంట్లో అంతా క్షేమంగానే వున్నారా?" రామయ్యగారి ఈ వివరమైన ప్రశ్నలవల్ల కొంత తొట్రుపాటు కల్గింది. "నా సంగతులన్నీ ఈయన కెందుకూ? అర్చేవాడా? తీర్చేవాడా?" అనుకుని మనస్సులో బాధపడ్డాడు.

ఆది గమనించారు రామయ్యగారు.

"అబ్బాయీ! నన్ను మరోవిధంగా అనుమానించకు. నేనూ మనిషినే నయ్యా! పెద్దపులినో, సింహాన్నో అనిమీరు నన్ను గురించి అనుకుని, అపోహ పడటం సబబుగానే వుందికాని—ఇది ఉద్యోగ ధర్మమోయ్! నేనే మెత్తగా మంటిపాములా ఊరుకుంటే మీరు వల్లువించి పనిచేస్తారూ? 'తా గుట్టక యున్న తేలు గని కుమ్మరి పురుగని యందురే కదా!' అన్నాడు వెనకటి కో కవీశ్వరుడు. నే నెట్లాంటివాడినో మీ నాన్నగారి నడుగు, చెబుతారు. ఆయనా నేనూ కలిసి చదువుకున్నాం—చిన్నప్పుడు..అసలు, ఏమైంది? నీలో ఏదో బాధ కలిగింది. వాడిగ్గర దాచకు. ఇటు చూడూ! మనలోని బాధలు మనలోనే వుంచుకుని మథనపడటంకంటె—మనకు ఆప్తులైన ఒకరిద్దరి దగ్గర వెళ్ళబోసుకోవడం మంచిది. కొంత హృదయభారమన్నా తగ్గుతుంది."

"ఎబ్బే! ఏమీలేదండీ! మనస్సు కొంచెం కలతగావుంది. అంతే!" అన్నాడు సంజీవరావు.

"ఇటు చూడు నాయనా! ఇది ఏభైరెండేళ్ల పండిపోయిన జుత్తుమాత్రమే కాదు—పండిన అనుభవం! ఈ ముప్పైఏళ్ళ సర్వీసులోనూ నే నెన్ని దశలో దాటాను. ఎన్ని అనుభూతులో పొందాను. ఎన్నిరకాల మనస్తత్వాలనో చూశాను. నీ బాధ ఏమిటో చెప్పు! సంకోచించకు!" అని అమృతం ఉట్టిపడే మాటలతో సాంత్వనపరిచారు రామయ్యగారు.

సంజీవరావు యిన్నాళ్లకు రామయ్యగారిలో ఓ విలక్షణమైన సరిక్రొత్త వ్యక్తిని చూడగలిగాడు. ఓహో! ఈ పెద్దపులి పంజాలలో వున్నది కర్కశత్వం కాదు—నవనీత మృదుత్వం! ఈ నల్లతాచు కోరలో వున్నది కాలకూటం కాదు — నవనీత మృదుత్వం!

అతను తన హృదయవేదనను రామయ్యగారి ముందు వెళ్ళబోసుకున్నాడు. రామయ్యగారు, విని, నవ్వారు. "ఇంతేనా? ఈపాటి కష్టాలకే యింత సతమతమైపోతున్నావా?" అన్నారు.

"ఇట్లా నవ్వుతారనే నేను మొదట్లో చెప్పనన్నాను. ఏం చేసేది? ఈ దరిద్రబాధలో నేను క్రుంగిపోతున్నాను. విచారాలతో తిన్న తిండి వంటబట్టడంలేదు—రాత్రులు సరిగా నిద్రకూడా పట్టదు. ఊరునిండా అప్పులు! ఏ నెలజీతం ఆ నెలకే చాలక ప్రతినెలా పది పాతికా క్రొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. వడ్డీలు కట్టేసరికి నా తాతలు దిగివస్తున్నారు.

ఇదివరలో చేసిన అప్పులే తీర్చకపోతే-క్రొత్త అప్పులు ఇచ్చేదెవరు? ఈ అప్పులవాళ్ల వత్తిడి నావాటికీ దుర్భరమైపోతోంది. పోనీ, నాకేమైనా దురభ్యాసాలున్నాయా అంటే అదీలేదు. బీడీ, సిగరెట్ వగైరాలు కాల్చనే కాల్చను సరికదా — ఓ కాని యిచ్చి కిళ్ళీనుక్క అయినా వేసుకోను. నాకెందుకీ శిక్ష? ఎన్నాళ్లిని?"

"అప్పులెంతవరకు వున్నాయ్?"

"ఇప్పటికి నాలుగు వందల పైచిలుకు"

"సరే! ప్రస్తుతానికి ఓ వందయిస్తున్నా. తీసుకుని, మరీ వత్తిడి చేస్తున్న వాళ్ల ఋణాలు తీర్చు!" అని పది—పదిరూపాయల నోట్లు లెక్కపెట్టి సంజీవరావు చేతిలో వుంచారు రామయ్యగారు. సంజీవ

రావు చేతులు హత్యచేయబోయేవాడి చేతులు మళ్లే వణికిపోసాగాయి. చేతులు వెనక్కు తీసుకున్నాడు.

"క్షమించండి! నన్ను మీరపార్థం చేసుకున్నారల్లేవుంది. ఉచితంగా స్వీకరించటానికి నా మనస్సు ఒప్పుకోదు" అన్నాడు.

"తీసుకోవయ్యా! పోనీ అప్పుగా యిస్తున్నాననుకో!" అన్నారు రామయ్యగారు.

గత్యంతరం లేని సంజీవరావు ఆ వందరూపాయలూ స్వీకరించాడు. దానమో, రుణమో—ప్రస్తుతానికి ఆ డబ్బు అతనికి అత్యవసరంగా కావాలి! అర్జంటుగా తీర్చాల్సిన రుణాలు కొన్ని వున్నాయి.

"జీతం అందుకోలేదేం?" అని రామయ్యగారు ప్రశ్నించటంతో, "జీతమా?" అన్నట్టు రామయ్యగారి కళ్లలోకి చూచి "ఏదో పరధ్యానంలో పడిపోయి జీతం సంగతే మరచిపోయాను" అని జవాబిచ్చి, "వెళ్లొస్తా!" అని అయినా చెప్పకుండానే చకచక ట్రెజరీ వైపు నడిచిపోయాడు సంజీవరావు.

"ఇంత అమాయకుడు ఈ మాయ ప్రపంచంలో ఎలా జీవించగలడో తెలీదు. కష్టాలతో యితని మనస్సు కదిలిపోయింది." అనుకుంటూ ఆఫీసు గదిలోకి పోయారు—రామయ్యగారు. అప్పటి ఆయన ముఖంలో ఓ పవిత్రకాంతి తళుకుమన్నది.

సంజీవరావు తన ఎనభై రూపాయల జీతమూ, రామయ్యగారిచ్చిన వందరూపాయలూ కోటుజేబులో వుంచుకుని, తిరిగి తన స్థానానికి పోయి—ఉదయం నుండి పనిచెయ్యని కారణంచేత త్వరలోనే తన పనిలో నిమగ్నుడై పోయాడు.

సాయంత్రం అయిదయింది. గుమాస్తాలందరూ వెళ్ళిపోయారు. ఆఫీసులో వున్నది సంజీవరావూ—ఇద్దరు బంట్రోతులు మాత్రమే. వాళ్లుకూడా ఇంటికి పోవలసిందేకాని—అతను పనిచేస్తున్న కారణం చేత అంతవరకూ ఆగిపోవాల్సి వచ్చింది.

చూచి, చూచి "బాబూ! అయిదయిపోయింది!" అన్నారు బంట్రోతులు. అతను హఠాత్తుగా తలపైకెత్తి గోడ గడియారంవైపు చూశాడు. ఐదుంబావైంది. త్వరత్వరగా కాగితాలన్నీ ఫైల్సులో కట్టి, డ్రాయరుకూ, అలమారుకూ తాళాలు వేసి, "భద్రంగా తలుపులూ, కిటికీలూ మూసి తాళాలు వెయ్యండి!" అని, ఆఫీసునుండి బయటపడేసరికి ఐదున్నర అయింది.

కాలచక్రం అతివేగంగా తిరిగిపోతోంది! తన కడుపులో ఆకలి దహించుకపోతోంది.

తన తండ్రికి చుట్టలూ, గంగా భాగీరథీ సమానురాలైన అక్కగారికి సైను పంచెలూ, చెల్లెలికి ఫైవ్ పండిట్స్ నోట్సూ కొనాల్సివుంది కనుక బజారువైపు త్రోవతీశాడు. ఆకలి సహించలేక ఓ కాఫీ హోటల్లో దూరాడు. అతను హోటల్కు వెళ్లి ఏ రెండేళ్లో, మూడేళ్లో అయివుంటుంది. ఈ కాఫీ హోటళ్లన్నా, అందులోని పదార్థాలన్నా అతనికి అసహ్యం! ఐనప్పటికీ 'ఆపద్ధర్మం' గా హోటల్లో అడుగుపెట్టాడు.

ఆకలికొద్దీ అతను రకరకాల స్వీట్సూ, కారపు పదార్థాలూ కడుపు పట్టినంతవరకూ తిని, ఒక కప్పు ఓవల్టిన్ పుచ్చుకున్నాడు. సర్వరు రూపాయి శేషకు బిల్లు ఇచ్చాడు. ఆ బిల్లుచూచి అతను ఆశ్చర్యపోయి, హడలెత్తిపోయాడు. ఎంత ఘోరం! ఒక మనిషి టిఫిన్ ఖరీదు రూపాయి రెండణాలా? ఎంత దారుణం!

హోటల్ మానేజరు దగ్గరకువెళ్లి, బిల్లు అతని చేతిలో వుంచి, డబ్బుకోసం కోటుజేబులో చేయి వుంచాడు.

భగవంతుడా! నీ హృదయం ఎంతటి శిలామయం కాకపోతే నిన్ను రాతి విగ్రహంగా మలుస్తారు!

జేబులో డబ్బులేదు. అసలా జేబుజేబుగాలేదు. కత్తిరించబడివుంది.

"ఆఁ!" అని అతను అరచిన అరుపును ఏ కాళిదాసో అయివుంటే ఒక మహాకావ్యంగా వర్ణించివుండేవాడు. ఆ అరుపులో ఎంత బాధ! ఎంత బాధ!

ఐనప్పటికీ ఆశకొద్దీ అతను తిరిగి తను టిఫిన్ చేసిన స్థలందగ్గరకు వెళ్లి వెతికాడు. పిచ్చికాకపోతే, జేబు కత్తిరించబడ్డ తర్వాతకూడా ఇంకా వెదుకుతాడా? తిరిగి మానేజరు దగ్గరకు వచ్చేసరికి అతని శరీరం వణుకు పుట్టుకుంది.

"క్షమించండి! నా జేబెవరో కత్తిరించేశారు. నూటఎనభై రూపాయలు కొట్టేశారు. అరగంటలో వచ్చి మీ డబ్బు మీకిస్తాను" అన్నాడు.

మా మానేజరు మంచివాడే! కాని, క్రమశః అతనిలో దయాదాక్షిణ్యాలు ఎండిపోయినై. అతనికి ప్రతిరోజూ కనీసం అయిదారుసార్లన్నా యిలాంటి సంఘటనలు తటస్థపడుతుంటవి. మనీపర్సులు పోయినట్టు కొందరూ, ఇళ్ళవద్ద డబ్బు మరిచినట్టు కొందరూ, జేబులు కత్తిరించబడ్డట్టు మరికొందరూ చెబుతుంటారు.

ఇటువంటి సంఘటనలలో సత్యాసత్య నిర్ణయం చేయబూనుకుంటే తాను హోటల్ నడిపినట్టే!

“అవన్నీ పనికిరావు. ముందు డబ్బక్కడ పెట్టు! కదిలావంటే గూబ కదలేస్తాను!” అని హుంకరించాడు మా మానేజరు.

హోటల్లో - కూర్చుని, రేడియో సంగీతం వింటూ, అరకప్పు కాఫీ రెండున్నర గంటలసేపు సేవించే పెద్దమనుషులు ఫక్కుమని నవ్వారు.

దొరకనంతవరకూ ప్రతి దొంగా దొరగానే చెలామణీ అవుతాడు.

పాపం! సంజీవరావు! డబ్బు పోయినందుకే ఏడుస్తాడా? అవమానం జరిగినందుకే దుఃఖిస్తాడా?

“నిజమండీ! నే నబద్ధం చెప్పటం లేదు!” కన్నీరు కారుస్తూ ప్రాధేయపడ్డాడు.

“తేరగా వచ్చిందని చెప్పి రూపాయిబేడ టిఫిన్ మెక్కావేం? డబ్బక్కడ పెట్టు. లేకపోతే, పోలీసును పిలిపిస్తా! తిన్నది కక్కిస్తా! ఖబర్దార్!” హుంకరించాడు దయాళువైన హోటల్ మానేజరు.

ప్రపంచంలో న్యాయం నశించిపోతోంది. అన్యాయమూ, అధర్మమూ లోకాన్ని సర్వత్రా ఆక్రమించడంతో మనుష్యులు న్యాయాన్యాయాల్ని పోల్చుకోలేక తప్పటూహాలు పెంపొందించుకుంటున్నారు.

“ఆకోటు విప్పు! అట్లా మూస్తావేం? ఆ వెత్తి వెత్తి ఏక్షన్లు కట్టిపెట్టు! డబ్బుతెచ్చి విడిపించుకపో! సాయంత్రంవరకూ గడువిస్తున్నా!” మా మానేజరు తేజో దుర్నిరీక్ష్యుడు! అబ్బో!

విధిలేక సంజీవరావు కోటువిప్పి మానేజరు కిచ్చాడు.

ఆ విప్పడంలో అతని చినిగిపోయిన కమీజు హోటల్లో ఆరగిస్తోన్న పెద్దలకంటబడ్డది. అంతా మరోమారు ఘొల్లున నవ్వారు.

అందులో ఒక కవిశిఖామణిగారు గూడు బండి నడుస్తున్నట్టు నవ్వి “తేటనీరు చెరువు అట్టడుగున పేరుకున్న బురదను తనలో దాచుకున్నట్టు— ఒకకోటు తనక్రిందవున్న చింకి కమీజు తాలూకు పరువుప్రతిష్ఠల్ని కాపాడుతుంది!” అని ఆంధ్రలోకానికి ఓ దివ్యమైన సుభాషితాన్ని అందజేశాడు.

సంజీవరావుకు గాయంమీద కారం చల్లినట్లైంది. మూర్తీభవించిన దైన్యంలా ఆ కవివైపు చూచాడు.

తిరిగి అందరూ నవ్వారు.

అబ్బా! బాధ! కనిపించని, వినిపించని బాధ!

హోటల్నుండి రోడ్డుమీదికి ఒక్క అంగలో వచ్చిపడి, అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఏడుపు ముఖంతో, ఈడుపుకాళ్లతో యింటిముఖం పట్టాడు.

తన యింటి ముందు ఓ ఖాళీజట్కా నిలబడి వుంది.

ఇంట్లోపలనుండి తన చెల్లెలు హార్మోనియం మీద “ఎన్నగాను రామభజన” తోడిరాగంలో పాడుతోంది. ఇంట్లోవాళ్ళంతా ఉల్లాసంతో కేరింతలు కొడుతున్నారు.

అబ్బా!

తనెవరికోసం అష్టకష్టాలూ పడుతూ నీచాతినీచంగా జీవిస్తున్నాడో—వాళ్లకు తన జీతంతోనే కాని తనతో నిమిత్తమే లేనట్టుంది!

ఇంట్లో అడుగుపెట్టాడు.

మధ్య గదిలో— పొరుగింటివాళ్ళ దగ్గరనుండి ఎరువు తెచ్చి వేసిన తివాసీలమీద—ఎవరో పరస్త్రీలు కూర్చున్నారు. తల వంచుకునే ఆ గది దాటి వంటింట్లోకి వెళ్లాడు.

ధూళిధూసరితమైన కేశాలూ, కళ్లు లోతుగా దిగుకపోయిన ముఖమూ, చింకి కమీజూ చూచిన ఆ పరస్త్రీలు చీరలచెరగులమాటున కిసుక్కుమన్నారు. కిలారుమన్నారు.

సుహాసిని పాట ఆపింది.

సంజీవరావు స్వర్ణను పిలిచాడు. స్వర్ణ వంటింట్లోకి వెళ్ళింది.

"అర్జంటుగా కావాలి! నీదగ్గర రెండు రూపాయలుంటే ఇటివ్వు!" అన్నాడు. స్వర్ణ తన నాలుగేళ్ళ దాంపత్య జీవితంలోనూ మూడు రూపాయలు మిగుల్చుకుంది. అందులో రెండు రూపాయలు భర్తకిచ్చింది.

"వీళ్ళంతా ఎక్కడినుండి వచ్చారూ?" భర్త అడిగాడు.

"ఏలూరునుండి వచ్చారు—మీ చెల్లెలును అడగటానికి. వాళ్ళ అబ్బాయి రైల్వేలో గుమాస్తాగా పని చేస్తున్నాట్ట! జీతం నెలకు......" భార్య సమాధానాన్ని భర్త మధ్యలోనే తుంచేశాడు.

"పొమ్మనూ! డబ్బేదీ? ఎవడో నా కోటు జేబు కత్తిరించి ఒక్కసారి నూట ఏభై రూపాయలు కాజేశాడు."

"ఆఁ! ఇప్పుడేం చెయ్యడం? అప్పుల వాళ్ళంతా ఇప్పటివరకూ యిక్కడే వున్నారు. ఇంతలో వీళ్లు రావటంవల్ల వాళ్లను ఎట్లాగో బ్రతిమాలుకుని పంపించేశాం. తిరిగి వాళ్లు రేపు ఉదయమే తయారౌతారు. పాలమనిషికి పదహారు చిల్లర యివ్వాలి. ఇంటద్దె గత మూడు మాసాలనుండీ కట్టలేదు. మొత్తం ముప్ఫై ఆరు. పచారీ దుకాణానికి పదిహేను పైచిలుకు ఇవ్వాలి. పెట్టె సంగతి మీరెరగని దేముంది? తొందర పెడుతున్నాడు..." చెప్పుకుపోతోంది భార్య.

ప్రళయం రాబోతోందా? అతని పాదాల క్రింద భూమి అట్లా దిగజారిపోతోందేం—పాతాళంలోనికి? ఆకాశం విరిగి నెత్తిన పడుతోందేం?

రెండు చేతులతోనూ చెవులు మూసుకుని "చెప్పకు! వినలేను! వినలేను!" అని పిచ్చివాడిలా కేకలు పెట్టి, గబగబా యింటినుండి బయటపడి తిన్నగా హోటల్‌కు చేరుకున్నాడు.

ఆ రెండు రూపాయలూ హోటల్ మానేజరుకిచ్చి, పద్నాలుగణాలూ, కోటూ తీసుకున్నాడు.

హోటల్ యజమాని ఒక్కసారిగా బహువచన ప్రయోగం అంకించుకున్నాడు.

"నాకు తెలుసు మీ రెట్లాగూ వస్తారని! ఈ రోజుల్లో వుండే, చూశారూ, దొంగలెక్కువైపోయారండీ! ఎవరు పెద్దమనుషులో, ఎవరు తుంటరులో తెలుసుకోవటం మహా కష్టమైపోతోంది!" అన్నాడు. వ్యాపారస్థులకు లౌకికం ఉగ్గుపాలతో పెట్టిన విద్య!

ఇదంతా గమనించి వినిపించుకునే స్థితిలో లేడు సంజీవరావు.

వెళ్ళాలి!

ఎక్కడికి?

ఇంటికి!

ఊహూఁ!

తిన్నగా ఊరి బయటకు త్రోవ తీశాడు.

అన్నీ వరిపొలాలు. సస్యలక్ష్మి పచ్చలు ఆభరణాలుగా ధరించినట్టుంది.

పెద్ద చెరువుగట్టుమీదకు వెళ్ళాడు. అది విశాలమైనది. గట్టుమీద రెండు ముసలి చింతచెట్లున్నాయి. ఒక చెట్టుక్రింద కూర్చుని అతను నిర్లిప్తతతో ప్రకృతి దేవి ఒడిలో లీనుడైపోయాడు.

అస్తమిస్తున్నాడు సూర్యుడు. పచ్చని వరిపొలాలకు మరింత సొబగు కూర్చే ఆ సంధ్యారాగంలో 'శ్రేణుల్ కట్టె నభోంతరాళమున బారెన్ బకాళులు... జపాశోణంబాయె పతంగ బింబము, దిశాప్రాంతంబు శోభాదరిద్రాణంబాయె.'

క్రమంగా చీకట్లు లోకాన్ని సర్వత్రా ఆక్రమించుకున్నయ్. ఆ చీకటిలో అక్కడ వరిపొలాలు వున్నట్టే కనిపించడం లేదు. ఆ కాలిమలో సర్వమూ ఏకమైపోయింది.

ఇప్పుడు సంజీవరావు మనస్సు పూర్తిగా జడమైపోయింది. ఆ మనస్సులో సుఖం లేదు. దుఃఖం లేదు. ఒకవిధంగా చూస్తే మనస్సే లేదు. పాంచభౌతికమైన శరీరంలో ప్రాణం మాత్రముంది. ఇది భయంకరమైన దుఃఖాతిశయంవల్ల కలిగిన నిజమైన అమనస్క స్థితి. తాత్కాలికమే!

బాగా రాత్రి అయింది. అది కృష్ణపక్షం. త్రయోదశి. మామూలైన చలి ఆ చీకటివలన మరి కొంచెం ఎక్కువైనట్టు వణికిపోయాడు సంజీవరావు.

రామయ్యగారు సంజీవరావు మనోదర్పణంలో ప్రతిబింబించాడు. ఆ పవిత్రమూర్తిని కృతజ్ఞతాపూర్వకమైన స్వచ్ఛమైన కన్నీటితో అభిషేకం చేశాడు. తన దురదృష్టానికి ఆ మహానుభావుడేం చెయ్యగలడు?

గత్యంతరం లేదు. పోయి ఆయనతో నే చెప్పుకుంటే! ఉహూఁ!

ఏదో ఒకటి చెయ్యాలి!

కూర్చున్న దగ్గరనుండి లేచాడు.

ఒకటి! రెండు! మూడడుగులు ముందుకు వేశాడు!

తన కుడికాలు మెత్తగా త్రాడువుల్లే వున్న ఏదో వస్తువును త్రొక్కినట్టయింది.

ఆ 'వస్తువు' కడుపు మంటతో వకనకలాడుతూ తిండికోసం బయలుదేరింది. తెలియక - కనిపించక — దాని తోక త్రొక్కాగు కథానాయకుడు.

అసలే — నల్లత్రాచు! అది కోపంకొద్దీ బలమంతా కోరల్లో కేంద్రీకరింపజేసి తనను త్రొక్కి అవమానించి బాధించిన 'నరమానవుని' కాలుమీద కాటు వేసింది.

కాటు వేయుటమే కాదు! ఒక చిన్న మాంసం ముక్కను చీల్చి వేసింది! త్రాచుపగ!

"చచ్చానోయ్! దేవుడా!" అని అతడు భయంతో, బాధతో, ఆవేశంలో ఊరివైపు పరుగు తీశాడు. బలంగా కాటువేసింతేమో — ఆ విషం నెకన్లమీద అతని రక్తాన్ని విరిచేస్తోంది. కళ్లు సరిగా కనిపించడం లేదు.

ఆ పరుగులో అత డొక వేపచెట్టును ఢీకొన్నాడు. తల పగిలింది. పడిపోయాడు. ఐనప్పటికీ ప్రాణంమీద తీపి అతన్ని ఊరుకోనివ్వలేను లేచాడు. ఒళ్లు కంపరమెత్తిపోతోంది. తలనుండి రక్తం వరద కట్టి ప్రవహిస్తోంది.

పరుగెత్తి పరుగెత్తి ఓ మురికి కుంటలో పడిపోయాడు. అందులో హరిజనులు పశుచర్మాలు ఊరవేస్తుంటారు. నీరు దుర్గంధభూయిష్ఠమైవుంది. అడుగున అంతా బురద — ఊబి. లోపలలోపలగ దిగజారిపోతున్నాడు కథానాయకుడు. ఒకటి రెండుసార్లు అంచులు పట్టుకొని బయటపడాలని చూచాడు కాని— అంచులు నానిపోయివుండటంచేత నిష్ప్రయోజనమైంది.

విషం పూర్తిగా పనిచేసింది. తలమీది గాయం నుండి రక్తం చాలావరకు పోయింది.

అతడా మురికినీళ్లగోతిలో నే మూర్ఛపోయాడు.

ఆ మూర్ఛ తాత్కాలికమైంది కాక — అతని పాలిట శాశ్వతమైపడింది! తెల్లారిపోయింది!

సంసారం చెయ్యలేక ఆత్మహత్య చేసుకున్నాడని లోకం ఏకగ్రీవంగా తీర్మానించింది!

మానవ శల్యపరిశీలన

శ్రీ వి. వి. యస్. ఆర్. హనుమంతరావు

మానవుని ప్రతిభ అనేక చిత్ర విచిత్ర విషయములను సూచించుటలో నిమిడియున్నది. ఎన్నడూ కనివిని ఎరుగని పరిస్థితులను నిరూపించి, ప్రజల కమితాశ్చర్యము కలుగజేయుటకు అనన్యసామాన్యమైన శాస్త్రజ్ఞుల పరిపూర్ణవిజ్ఞానమే దానికి కారణము. అమితాశ్చర్యకరమైనసందర్భములలో పరిశోధనలు సాగించి, ఎన్నియో నిగూఢరహస్యములను బయటపెట్టినవారిలో డాక్టర్ విల్టన్ క్రోగ్ మెన్ ఒకడు.

ఈయన అమెరికాదేశస్థుడు. పెన్సిల్ వేనియా విశ్వవిద్యాలయములో పనిచేయు మేటి శాస్త్రవేత్తలలో నొకడు. క్రోగ్ మెన్ చేయు పరిశోధనలను, విజయముసాధించిన విషయములను తలచినయెడల విస్మయమునొందనివా రుండరు. ఈయన విచిత్రవృత్తి, అస్థిపంజరములతోడను, మానవుని దేహమునందుండు ఎముకలతోడను పరిశోధనలు సలుపుటయే. ఈయన పరిశోధనలు వేలకొలది భీమాకంపెనీలకు, పరిశ్రమలకు, పోలీసుశాఖలకు అనేకవిధములుగా తోడ్పడును. ఒక అస్థిపంజరముగాని, ఒక పుఱ్ఱెగాని, లేక ఒకే ఒక ఎముకగాని ఈ పరిశోధకుని కిచ్చినయెడల, వాటిని సూక్ష్మదృష్టితో పరిశీలించి, అవి స్త్రీశరీరములోనివో, పురుషునిశరీరములోనివో ఇట్టె చెప్పగలడు. అంతేగాక, ఆయావ్యక్తులయొక్క వయస్సు, ఎత్తు, బరువు, ఆరోగ్యపరిస్థితి, ఏజాతికి చెందినవారను విషయములను విపులీకరించి చెప్పగల ప్రతిభాశాలి. అందువలననే 'ఈయనతో అస్థిపంజరములు మాట్లాడు ననియు, మరణించిన వ్యక్తులు తమ కథలను చెప్పుదు రనియు' చమత్కారముగా చెప్పుట పరిపాటి.

డాక్టర్ క్రోగ్ మెన్ మానవశరీరములోని ఎముకల పరిశీలనావృత్తిలో దాదాపు ఇరవైసంవత్సరముల నుండి జయప్రదముగా పనిచేయుచున్నాడు. అమెరికాదేశములోనేగాక ప్రపంచమంతటిలోను ఎముకల పరిశీలనావృత్తిలో నిమగ్నులైన వారందరిలోను డాక్టర్ క్రోగ్ మెన్ అగ్రగణ్యుడని నిస్సందేహముగా తేల్చబడినది.

డాక్టర్ క్రోగ్ మెన్ మానవశరీర శల్యశాస్త్రవేత్త. ఈయన సాగించు పరిశీలనలు - వ్యక్తులను పరీక్షించడం, అవయవములను కొలిచి, తత్సంబంధమైన లెక్కలు తయారుచేసి, తద్వారా, వ్యక్తియొక్క పొడవు, బరువు మొదలైన వివరములు, ఇదివరకెట్లున్నవి, ప్రస్తుత మేరీతిగా నుండినవి, ఇకముం దెట్లుండును మొదలైన విషయములు- సూచిస్తాయని చెపుతారు. శరీరశాస్త్రజ్ఞుడు, జీవశాస్త్రజ్ఞుడు, ఉత్పత్తి క్రమము దెల్పు శాస్త్రవేత్త, స్థితిశాస్త్రము సూచించువాడు మొదలైనవారియొక్క వేర్వేరు పనులు కేంద్రీకరించబడి ఒక్కనియందే వుండుటచే, ఈయన చేయు పనులు సర్వసామాన్యమైనవి గాక, అతీతమైనవిగా నొప్పుచుండును. అందులకే అనేక శాస్త్రవేత్తల పని డాక్టర్ క్రోగ్ మెన్ ఒక్కడే నిర్వర్తించగల ప్రజ్ఞావంతుడుగా పరిగణింపబడుటకు కారణము.

విజయములు

నిగూఢ రహస్యముల నెన్నియో బయటబెట్టిన డాక్టర్ క్రోగ్ మెన్ సాధించిన విజయము లత్యద్భుతములు. పదిలక్షల డాలర్ల విలువగల దావా నొకటి తేల్చిన విధానము ఈ శాస్త్రవేత్త ఎముకల పరిశోధనలపై ఆధారపడవలసి వచ్చినది. డేవిస్ జాక్సన్ అనే నీగ్రో ఇండియన్‌కు రేమండ్ జాక్సన్ అనే కుమారు డుండెడివాడు. రేమండ్‌కు తండ్రి గార్డియన్. రేమండ్‌కు పెద్దభూమి ఉన్నది. అందు నూనెగనుల నేకమైన వున్నట్లు తేలినది. ఈ నూనెగనుల హక్కులను, కొడుకు తరఫున తండ్రి అడ్డెకిచ్చుట జరిగినది. తర్వాత కొంతకాలమునకు రేమండ్ జాక్సన్ కని

పించకపోవుటచే, చనిపోయినట్లు పుకారుపుట్టినది. అతని శరీరమును ఒక రైలురోడ్డు ప్రక్క పూడ్చబడినట్లు కూడ తేలినది.

ఎనిమిది సంవత్సరముల తర్వాత, నూనెగనుల అద్దె బాగా పెరుగుటచే, డేవిస్ జాక్సన్, అతని సతి, కొడుకు తరఫున, ఇంకొక పెద్ద నూనెకంపెనీ కద్దెకిచ్చుట కుద్యుక్తులయిరి. ఈ సమయమున కాలిఫోర్నియానుండి ఒకడు, కెంటుకీనుండి మరియొకడు తామే రేమండ్ జాక్సన్ అనీ, నూనెకంపెనీల కద్దెకిచ్చు హక్కులు తమకే వున్నవనీ, ఈ విషయంలో డేవిస్ జాక్సన్ కేవిధమైన హక్కులు లేవనీ వాదించుటచే, ఎల్ల విషయము కోర్టు కెక్కినది.

ఈ సందర్భములో తేలిన దేమన, రేమండ్ జాక్సన్ ఎనిమిది సంవత్సరములకు పూర్వము, రైలు ఎక్కు సమయమున క్రిందపడి మరణించినట్లు, తర్వాత ఆ రైలుమార్గము ప్రక్కనే ఆ దేహము పూడ్చబడినట్లు. తన కొడుకు బ్రతికివున్నప్పుడు, డేవిస్ జాక్సన్ తొలుత నూనెగనుల నద్దెకిచ్చినట్లు నిరూపించాలి. అట్లు నిరూపించినయెడల, ఎక్కువ అద్దెకు కూడా మరియొక నూనెకంపెనీకి అద్దెకిచ్చే అర్హత డేవిస్ జాక్సన్ కుండును. లేనియెడల అతని కేవిధమైన హక్కు లేదు. అందుచేత, రేమండ్ జాక్సన్, ఎనిమిది సంవత్సరముల క్రితం, అనగా, కొడుకు జీవించి యున్నప్పుడే, అతని తరఫున నూనెగనుల నద్దెకిచ్చినట్లు, రైలుమార్గము ప్రక్కనే పూడ్చబడిన శరీరము, రేమండ్ జాక్సన్ దే అనియు, నిరూపించవలసిన అగత్య మేర్పడినది

రేమండ్ జాక్సన్ అని వక్కాణించే ఇద్దరి వ్యక్తుల న్యాయవాదులు, డేవిస్ జాక్సన్ న్యాయవాది, నిపుణులైన డాక్టర్లు, న్యాయస్థాపన నెలకొల్పు కొందరు ఉద్యోగుల సమక్షములో, రైలుమార్గము ప్రక్క పూడ్చబడిన శరీరము, తగు పరీక్షలకొరకు త్రవ్వబడినది. ఆ పరీక్షసమయమున, ఆ అస్థిపంజరము రేమండ్ జాక్సన్ది మాత్రము కాదనియు, అది ముప్పైసంవత్సరములు పైబడిన ఒక తెల్లవానిదై యుండుననియు డాక్టర్లుద్దేశించినట్లుగా తేలినది.

ఇట్టి సందర్భములో డేవిస్ జాక్సన్ తరఫు న్యాయవాదులు డాక్టర్ క్రోగ్ మెన్ సహాయము కోరుట తటస్థించినది. ఈ శాస్త్రవేత్త పరీక్షకొరకు అస్థిపంజరమును మరల త్రవ్వి బయటకు తీయుటకు కోర్టువా రనుమతిచ్చిరి. అస్థిపంజరము ననేకవిధముల పరీక్షించిన తర్వాత, డాక్టర్ క్రోగ్ మెన్ ఈవిధముగా తీర్మానించుట జరిగెను. 'అస్థిపంజరము పద్దెనిమిది సంవత్సరముల ఆరు మాసములు వయస్సుగల ఒక పురుషునిది. ఆ వ్యక్తి సగము నీగ్రో, సగము ఇండియన్ జాతికి చెందినవాడు. ఎత్తు ఐదడుగులు ఒకటిన్నర అంగుళములు.' ఇవన్నియు రేమండ్ జాక్సన్ శరీరమునకు సరిపోయినవి.

ఈ తీర్మానమును ప్రతిపక్షమున వాదించు న్యాయవాదు లొప్పుకొనలేదు. వాగ్వాదములు తీవ్రముగా జరుగుచుండగా, కోర్టువారు భోజనమునకు లేచుట తటస్థించినది. న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు కలసి ఒకేచోట భోజనము చేయుచుండిరి. ఆ సమయమున నూనె కంపెనీ తరఫున పని చేయు న్యాయవాది, 'డాక్టర్. క్రోగ్ మెన్, ఎముకలు పరీక్షించు వారు మీ రనుకొన్నంత మేధావంతులు కారు.' అని అనడము జరిగినది. వెంటనే క్రోగ్ మెన్ తన భోజనములో దొరకిన కోడి ఎముక నొకదానిని తీసి, 'మీ రంత ఆపోహ పడనవసరము లేదు. మీ రంత పరీక్షించ దలచినయెడల, ఈ ఎముకగల కోడి వయస్సెంతయో, ఒక వారం అటో ఇటో వ్యత్యాసములో, చెప్పగలను,' అని అనెను.

'ఐతే చెప్పండి. చూద్దాం మీ ప్రజ్ఞ.' అని న్యాయవాది అనెను. వెంటనే క్రోగ్ మెన్ ఆ ఎముక అటూ ఇటూ త్రిప్పి, పరీక్షించి, దాని జన్మదినము చెప్పెను. వెంటనే న్యాయవాది, భోజనము తయారుచేసిన వానియొద్దకేగి, కోడిని ఏ కోళ్లఫాలము నుండి కొనుట జరిగినదో తెలిసికొని, ఆ కోళ్ళఫాలమున కేగెను. ఆ ఫాలము యజమానిని తమకు భోజనము తయారుచేసిన వాని కమ్మిన కోడి జన్మదినము నడిగెను. కోళ్లు పుట్టిన తేదీలు, అమ్మిన తేదీలు, ఎవరికే కోళ్ళమ్మిన వివరములు గల పుస్తకములు చూచి, ఆ కోడి జన్మదినమును చెప్పెను. డాక్టరు క్రోగ్ మెన్ చెప్పిన జన్మదినమున కది ఆరురోజుల వ్యత్యాసములో సరిపోవుటకా న్యాయవాది ఎంతయో ఆశ్చర్యమును పొందెను.

భోజనానంతరము కోర్టువారు తిరిగి దావా విచారణ ప్రారంభించినప్పుడు, ప్రతిపక్షమున పనిచేయు

న్యాయవాదులు డాక్టర్ క్రోగ్‌మెన్‌ను ఏవిధమైన ప్రశ్నలు వేయలేదు. దానికి కారణమేమని డాక్టర్ క్రోగ్‌మెన్ న్యాయవాదులనడుగగా, ఒక న్యాయవాది ఇట్లు సమాధానమిచ్చెను. 'దానికి కారణము ఆ కోడి కాలే. కోళ్లను పెంచెడివాడే చెప్పలేని కోడివయస్సు చెప్పిన మీరు, మానవుని ఎముకలు పరీక్షచేసి ఆ మానవుని వయస్సు చెప్పలేరని కాదు. మీ సూచనలవలన కోర్టువారిని నమ్మించకుండుటకొరకే మిమ్ములను ప్రశ్నించలేదు.'

ఇది ఇట్లు జరిగినప్పటికి కోర్టువారు రేమండ్ జాక్సన్ ఎనిమిదిసంవత్సరములక్రితం మరణించినట్లు, అతని తలిదండ్రులే అతనివారసులనియు, నూనె గనులను క్రొత్తిగా అద్దెకిచ్చు అర్హత వారికే ఉన్నదనియు శాసించిరి.

డాక్టర్ క్రోగ్‌మెన్ సాధించిన విజయములలో ఈ పైవిషయము యొక ముఖ్యమైనదని చెప్పవచ్చును. ఇట్టివే మరికొన్ని విజయములను పేర్కొనుటవలన ఎముకల పరిశీలనాశాస్త్రముయొక్క ఘనత వెల్లడిఅగును.

మిచిగాన్‌స్టేటు పోలీసులు క్రోగ్‌మెన్‌కు ఒక పుర్రె, అక్కడక్కడ దొరకిన మరికొన్ని ఎముకలు పంపిరి. ఈ మానవశరీరములోని ఎముకలు ఒక వ్యక్తివో ఇద్దరువ్యక్తులవో తెలిసికొనుటకొరకు డాక్టర్ క్రోగ్‌మన్‌తో సలహాచేసిరి. క్రోగ్‌మెన్ వాటిని పరీక్షించి అవన్నియు ఒకవ్యక్తివే యని తేల్చెను.

మిడ్ వెస్టర్న్ భీమాకంపెనీ ఒక దగ్ధమైన అస్థిపంజరమును పంపుతూ, అది తమ భీమాకంపెనీలో భీమాచేసినవానిదై యుండునా యని ప్రశ్నించిరి. కంపెనీ డాక్టర్లు భీమాచేసినవానిది కాదనియు, అదొక ఒంటికాలు మనిషిదనియు నొక్కి చెప్పిరి. క్రోగ్‌మెన్ ఆ అస్థిపంజరమును బాగుగా పరీక్షించి అది ఒంటికాలుమనిషిదిమాత్రం కాదనియు, రెండుకాళ్ళ మనిషిదేఅనియు, లేనికాలు బాగా దగ్ధమైనది కాబట్టి కానవచ్చుటలేదనియు చెప్పి ఆ వ్యక్తియొక్క వయస్సు, బరువు, ఆకారము వగైరాలు వివరంగా వర్ణించిచెప్పెను. ఆ వర్ణనలన్నియు భీమాచేసినవానికి సరిపోవుటచే భీమాకంపెనీ ఆ వ్యక్తియొక్క భీమా పాలసీ నిట్టే పరిష్కరించుట జరిగినది.

ఎముకల పరిశీలనవలన డాక్టర్ క్రోగ్‌మెన్ ఖూనీజరిగిన వివరములను కూడ చెప్పగలడు. మెన్‌టార్‌లో ఒక వ్యవసాయదారుడు కనబడకుండ వుండుటవలన పోలీసు లాతని సోదరుని ప్రశ్నించుట జరిగినది. తొమ్మిది మాసములక్రితం తానే సోదరుని తుపాకితో కాల్చి చంపి, ఆ పొలములోనే ఆ శరీరమును పూడ్చినట్లతను ఒప్పుకున్నాడు. ఇట్లు చంపుట ప్రత్యేకం ఖూనీచేయు నిమిత్తం కాదనియు తన్ను తాను రక్షించుకొను ప్రయత్నములోనుండగా ఈ ఘోరకార్యము జరిగినదనియు చెప్పెను.

ఈ సంగతుల నేమాత్రము చెప్పక, చనిపోయిన వాని అస్థిపంజరమును పరీక్షించమని డాక్టర్ క్రోగ్‌మెన్‌ను పోలీసువారు కోరిరి. ఎముకల నన్నిటిని బాగుగా పరిశీలించి, ఖూనీ జరిగినట్లు డాక్టర్ క్రోగ్‌మెన్ నిర్ణయించెను. తుపాకి గుండు తగిలినచోటు కొలిచి, ఖూనీ కాబడిన వ్యక్తి కుడిచెయ్యి తలమీదికి ఎత్తివుండగా, ఖూనీచేసినవాడు వంగియున్నట్లు నిర్ధారణ చేసెను. ముద్దాయి చెప్పిన విషయములను, డాక్టరు నిర్ణయించిన విధానమును పోల్చి చూచుటచే తేలినదేమన, చనిపోయినతడు కత్తిపెత్తి చంప నుద్యుక్తుడైన సమయమున, రెండవ వ్యక్తి తుపాకితో కాల్చి చంపెనని ఈ వాదము సరియైనదే అని కోర్టువారు నమ్మి, ముద్దాయికి శిక్ష తగ్గించడము జరిగినది.

ఈ విషయ మెట్లు చెప్పగలిగితిరన్న ప్రశ్నకు 'ఎముకల పరిశీలనశాస్త్రము సరియైనదగుటచేతనే' అని డాక్టర్ క్రోగ్‌మెన్ సమాధాన మిచ్చెనట.

క్లైవ్‌లాండు పోలీసు లొకవ్యక్తి అనేక ఖూనీలు చేసినట్లు భయపడి,అతనిని పట్టుకొని ప్రశ్నించారు. ఒకే ఒక చిన్నపిల్లనుకడ తేర్చినట్లతను ఒప్పుకున్నాడు. కాని పోలీసు ఉద్యోగులు అనుమానమున్నచోట్ల త్రవ్వగా అనేకమైన ఎముకలు దొరకినవి. ఇవన్నీ డాక్టర్ క్రోగ్‌మెన్‌కు పంపబడినవి పరిశీలనకొరకు. అవన్నియు ఆయన పరీక్షించి పోలీసువారి కీవిధముగా తెలియజేసెను. 'నాకు పంపిన ఎముకలు, ఒక మేకపిల్లవి, ఒక బాగా పెరిగిన గొఱ్ఱెపిల్లవి, మూడు బాగా పెరిగిన గొఱ్ఱెలవి. ఒక ఆవువి. ఒక పావురమువి. ఒక ఆడ ఎలుకవి. ఒక సీమకోడివి. ఒక పసిబాలికవి.'

పరిశీలనా విధానము

క్రోగ్‌మన్ తనకు వచ్చిన ఎముక లన్నిటిని మనిషి రూపంలో పేరుస్తాడట. మానవుని శరీరంలో వుండే 206 ఎముకలు లేకపోయినా మిగతా ఎముకలనా రూపం వచ్చేటట్లు అమర్చి, లెక్కలు కట్టి, పరిశీలన మొదలెడతాడట డాక్టర్ క్రోగ్‌మెన్.

స్త్రీపురుష విభేదము కనిపెట్టే విధానము:— స్త్రీపురుష విభేదము నెట్లు తేల్చగలుగుతాడో డాక్టర్ క్రోగ్‌మెన్ ఈ క్రిందివిధముగా చెబుతాడు.

ఎముకల శీర్షకోసలు పెద్దవిగా వుండడం, కపాలం పెద్దదిగా వుండుట, కపాలముయొక్క వెనుక భాగం విరివిగా వుండి, మెడలో బలమైన మాంసపు ఖండములున్నట్లు సూచించుట— ఈ పరిస్థితులనుబట్టి ఆ ఎముకలుకల వ్యక్తి పురుషుడే అన్న నిర్ధారణ చేస్తాడు డాక్టర్ క్రోగ్‌మెన్.

ఇట్లు స్త్రీపురుష భేదములు నిర్ణయించుటలో డాక్టర్ క్రోగ్‌మెన్ తప్పడా అన్న అనుమానం కొందరికి జనించకపోదు. సర్వసాధారణంగా ఆయన నిర్ణయం తప్పదు. ఒక పర్యాయం ఆయనకు విశ్వవిద్యాలయంలో జాగ్రత్తపెట్టబడిన 750 పుర్రెలివ్వబడినవి. ఇవన్నీ పరీక్షించి స్త్రీపురుషుల విభేదం డాక్టర్ క్రోగ్‌మెన్ నూటికి 92 పాళ్లు సరిగా నిర్ణయించుట జరిగినది.

ఒక కపాలమే కాకుండా, కటిప్రదేశమునందుండు ఎముకల పరీక్ష స్త్రీ పురుష భేదములు నిర్ణయించుటలో చాల తోడ్పడునని డాక్టర్ క్రోగ్‌మెన్ అభిప్రాయం. తొడ ఎముకలో పైభాగం పెద్దదిగా వుండి, కటికూపము సన్నగా నున్నయెడల, ఆ ఎముక పురుషుని శరీరములోనిదని ఆయన నమ్మకం.

వయస్సు నిర్ణయించుట:— బాగా వృద్ధియై, పొడవుగా నున్న ఎముకలు, దౌడలు, విస్‌డమ్‌టూత్ కల వ్యక్తికి ఇరవైఐదు సంవత్సరములకు పైగా వుండునని ఆయన నిర్ణయం. దీనితో కటిప్రదేశములోని ఎముకల పరిశీలన, భుజములలో నుండు ఎముకల పరీక్షకూడ వయస్సు నిర్ణయించుట కెంతయో తోడ్పడునట్లు సూచించును. దొరికిన ఎముకల పరిశీలనవలన వయస్సు నిర్ణయించుట సాధ్యముకాని యెడల, ఆ ఎముకలకు ఎక్స్‌రే ఫొటో తీసి, సూక్ష్మ పరీక్ష చేయు నలవాటుకూడ ఈయనకు కలదు. ఎందరో డాక్టర్లు ఎముకలనుబట్టి వ్యక్తియొక్క వయస్సు ఐదుసంవత్సరములు అటో ఇటో ఉజ్జాయింపుగా చెప్పగలిగితే, డాక్టర్ క్రోగ్‌మెన్ మాత్రం ఒక్క సంవత్సరమే వ్యత్యాసములో వయస్సు నిర్ణయించగల ప్రతిభాశాలి. ఎముకల పరిశీలనలో ఈయనకున్న అనుభవం, విజ్ఞానమే ఇందులకు కారణము. అందులకే అనేకమంది శల్య పరిశీలన శాస్త్రములో ఆరితేరిన వారు డాక్టర్ క్రోగ్‌మెన్ ఘనతను శ్లాఘించడము జరుగుతుంది.

జాతి నిర్ణయించుట:— ఇది చాలా కష్టవిషయముగా డాక్టర్ క్రోగ్‌మెన్ ఒప్పుకుంటాడు. ఎందువలనన అస్థిపంజరములన్నియు ఒకేరీతి నుండుటచేత. కపాలము చాలా పొడవుగాను, సన్నగాను వుండి, చెవి కన్నములకు కపాలముయొక్క పైభాగమునకు దూరముండి, నాసికారంధ్రము బాగుగా వెడల్పుగానుండి, కంటిగూడు పొడవుకన్న అతి వెడల్పుగానుండి, ముఖము ముందుకు, క్రిందకు పల్లముగా నున్నయెడల ఆ కపాలము అమెరికను నీగ్రోదిగా అనుకోనవచ్చునని ఆయన ఉద్దేశం.

క్యాలిపర్స్, టేప్ తీసికొని, కపాలమును చాల జాగ్రత్తగా కొలిచి లెక్కలు కట్టి మొదట నిర్ణయించిన విధానము సరియైనదగునో కాదో చూచును. ఎముకలు బాగా పొడవుగానుండి, మోచేతి క్రిందిభాగము, మోకాలు క్రిందిభాగం బాగా పొడవుగా వుండి, కటి పార్శ్వమునందలి ఎముక నిటారుగా వుండినయెడల, అది నీగ్రోదే అని ఆయన ఊహ. ఈలాగుననే తదితరజాతి మనుష్యులను నిర్ణయించు సూత్రము లనేకములను విపులీకరించును.

పొడవు, బరువు నిర్ణయించుట:— అస్థిపంజరమును కొలిచి, వ్యక్తియొక్క పొడవు, బరువు నిర్ణయించుట అతి తేలికైన పని. కాని ఒక్క ఎముకను బట్టి ఇవి నిర్ణయించుట కష్టం. లభ్యమైన ఎముకను బట్టి, అనేక సూత్రముల ననుసరించి వ్యక్తియొక్క పొడవు, బరువు, డాక్టర్ క్రోగ్‌మెన్ నిర్ణయించగలడు.

కొన్ని కొన్ని సమయములందు ఎముకల కొలతలు డాక్టర్ క్రోగ్‌మెన్ కేమాత్రము సహాయపడవు. అప్పుడు ఆయన అనుభవము, విజ్ఞానమే తోడ్పడును. జోసఫ్ నిక్ అనే అతను చికాగోలో ఒక స్త్రీని చంపి, ఆ శరీరాన్ని ఇంటిలోనున్న ఒక కొలిమిలో కొన్ని ద్రావకముల వినియోగముతో పూర్తిగా కాల్చినట్లు పుకారు పుట్టెను. కొలిమిలోనున్న బూడిద నెంత పరీక్షించినను ఒక్క ఎముక కూడ కనబడక పోవుటచే పోలీసుశాఖవారు, కేసు పోవునని భయపడుచు, డాక్టర్ క్రోగ్‌మెన్ సహాయమును కోరిరి. వెంటనే డాక్టర్ క్రోగ్‌మెన్ ఒక వైద్యశాలల

నుండి కొన్ని మానవ శరీరములోని ఎముకలను సంగ్రహించి, ఒక కొలిమిలో వేసి అందరూ చూచుచుండగా మండించెను. మంట ఆర్పిన తర్వాత అణుమాత్రం ఎముకలు మిగిలినవి. ఇది చూసి, కొలిమిలోని మంట ఇంకను జాగ్రత్తగా పెట్టినయెడల ఈ అణుమాత్రం మిగలకుండ చేయవచ్చునని చెప్పెను. వెబ్ యొక్క న్యాయవాది, అంతవరకు, మానవ శరీరము ఏమియు మిగలకుండ దగ్ధమొనరించుట కష్టమని వాదించినవాడు, డాక్టర్ క్రోగ్ మెన్ ప్రదర్శనమును చూచినతర్వాత ఆ వాదన విరమించుకొనవలసివచ్చినది. ముద్దాయి కూడ నేరము సంగీకరించుట జరిగినది.

డాక్టర్ క్రోగ్ మెన్ సిద్ధాంతములననుసరించి, మానవుని ఎముకలు ఎన్నివందల సంవత్సరముల వయస్సుకలవైనను ఆ వ్యక్తి జీవించియున్నప్పుడనుభవించిన బాధలను చెప్పవచ్చును. క్రొత్తరాతి యుగము నాటి ఎముకలను కొన్నిటిని పరీక్షించి, ఆ ఎముకలు గల మనుష్యులు, కీళ్లవాతం మొదలైన కొన్ని జబ్బులలో బాధపడినట్లు ఈయన నిరూపించెను. అల్లెటిట్ అనే రాజుగారి మామగారైన ఆఫేల్‌తిల్ అనే అయనయొక్క అస్థిపంజరం పరీక్షించి, వృద్ధాప్యము యొక్క చిహ్నములు కనపడిన ఒకవిధమైన వ్యాధితో ఆయన బాధపడి వుండినట్లు వెలిబుచ్చెను.

. చాలకాలము ఎముకలను సూక్ష్మముగా పరీక్షించుటవలన డాక్టర్ క్రోగ్ మెన్ చూపు కొంచెం మందగించెను. ఐనప్పటికి ఆయన ఎడమకన్ను బాగుండుటవలన సూక్ష్మపరీక్షలనెల్ల త్వరితముగా ముగించగలడు.

దత్తత సంఘములకు చేయు సేవ

డాక్టర్ క్రోగ్ మెన్ యొక్క ముఖ్య కర్తవ్యం అమెరికాలోనున్న దత్తతసంఘములకు సేవ చేయుడమే. ఈ దత్తతసంఘములు అనాథ బాలబాలికలను పెంచి, ఆ బిడ్డలలో నెవరినైనా పెంచుకొనదలచిన దంపతులకు కాని, వ్యక్తులకు కాని ఆ పిల్లలను దత్తత చేయుదురు. ఈ పిల్లలను పరీక్షించుటలో డాక్టర్ క్రోగ్ మెన్ యొక్క సహాయ మెల్లరకు అవసరం. చిన్నవారిని బాగుగా పరీక్షించి పరిష్కరించెడి దేమన రూపురేఖలలోను, ఆకారస్వభావములలోను, ఆచిన్నవారు పెంచుకొనదలచినవారి కనుకూలముగా నుందురా అని. కొన్నికొన్ని సందర్భములలో ఆ బిడ్డలయొక్క నిజమైన తండ్రి తెలియనప్పుడు డాక్టర్ క్రోగ్ మెన్ పరిశీలన ఎంతియో ఉపకరించును.

ఒకానొక సమయమున, ఒక దత్తతసంఘము నుండి, జాతి విశకృత తెలియని ఒక పిల్లవాని నొకాయన పెంచుకొనదలచెను. ఈ సందర్భములో ఆయన డాక్టర్ క్రోగ్ మెన్ సహాయము కోరెను. డాక్టరా పిల్లవానిని పరీక్షించి, 'పెంచుకొనుటకు మీకీ పిల్లవాడు తగునని' నిర్ణయించెను. వెంటనే ఆ పిల్లవానిని ఆ వ్యక్తి పెంచుకొనుట జరిగినది..

పిల్లల పరీక్షకుడు డాక్టర్ క్రోగ్ మెన్, ఫిలడాల్ఫియాలో పిల్లల అభివృద్ధికి సహాయపడు పరీక్షల కేంద్రము నొకటి 1947 సంవత్సరములో నెలకొల్పియున్నాడు. ఈ కేంద్రముకు, పెన్సిల్ వేనియాలో నున్న వైద్యకళాశాల, ఈవన్సు దంతసంస్థ, ఫిలడాల్ఫియా శిశువైద్యశాల, యునైటెడ్ స్టేట్సు ఆరోగ్యశాఖ మొదలైన సంస్థ లెంతయో సహాయము చేయుచుండును.

ఈ సంస్థయొక్క ముఖ్యాశయ మేమన, ప్రతి శిశువును పరీక్షించి, ఆ శిశువు సహజముగా ఎట్లు వృద్ధి యగునని నిర్ణయించుటయే. ఈ విషయమును పరిష్కరించుటకు డాక్టర్ క్రోగ్ మెన్ కొన్ని సమయములందు శిశువుల తలిదండ్రులను, పినతండ్రి పినతల్లులను, మేనమామ మేనత్తలను కూడ పరీక్షించుట జరుగును. తమ కుటుంబ పరిస్థితుల కనుకూలముగా ఒక పిల్లవాడు పెరుగుటలేదని చెప్పి, ఆ బిడ్డ తలిదండ్రులు డాక్టర్ క్రోగ్ మెన్‌ను పరీక్షించుమని కోరిరి. ఆ కుటుంబములోని వారి ననేకులను పరీక్షించిన తర్వాత, బిడ్డనుకూడ పరీక్షించి, 'ఈ బిడ్డకు తండ్రి అంత పొడగరి కాదనియు, ఈ విషయములోనే ఏకీభవించడనియు, తక్కిన విషయములలో కుటుంబ పరిస్థితుల కనుకూలుడుగా నుండుననియు' చెప్పెను. అది నిజమే అయినది.

అంతేగాక, గ్రహణం మొర్రి మొదలైన దోషములచే వికలాంగులను పరీక్షించి, ఆ అంగవైకల్యము పోవుటకు శస్త్రచికిత్స ఎప్పుడవసరమో మొదలైన ముఖ్యవిషయములను కూడ డాక్టర్ క్రోగ్ మెన్ నిర్ణయించగలడు. దంత పరీక్షలుకూడ చేసి, పండ్లకు, ఎముకలకు, వున్న సంబంధమును తెలిపి, అక్కడక్కడున్న వ్యాధులను చూపి, వాట్లను తొలగించు సాధనములను కూడ డాక్టర్ క్రోగ్ మెన్ చూపగలడు.

ఎన్నో వేల ప్రజల కుపకారముజేయు ఈ శాస్త్రవేత్తసాధన లెంతయో కొనియాడదగినవి. ఇట్టి శాస్త్రవేత్తల జీవితము, కార్యకలాపములు తెలిసికొనుట మన విధి.

[సాటర్ డే ఈవినింగ్ పోస్టు పత్రికలోని వ్యాసం ఆధారము]

వక్రరేఖలు

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

పాత్రలు:

శాంతమ్మ: ఉత్తమగృహిణి.

లక్ష్మమ్మ: పొరుగింటి ఇల్లాలు.

రామం: ఒక బీదవిద్యార్థి.

విమల: శాంతమ్మకూతురు. రామం సహాధ్యాయిని.

* [అదొక మధ్యతరగతి కుటుంబీకుల పంచ పాళీ. వెనుకవైపు మధ్యగా ఇంటిలోపల కొకద్వారం. సంధ్యాసమయం కావటం మూలాన అరుణారుణ సూర్యకిరణాలు అక్కడక్కడ కొన్నివస్తువులపయిబడి ఓ వింతశోభ కల్గిస్తున్నాయి. అయినా మారు మూలలనున్న చీకటి తలయెత్తి ఆ వెలుగు నపహేళన చేస్తూనేవుంది. డ్రాయరుమీదున్న పుస్తకాలు ఆ వింతకాంతికి మెఱసిపోతుండగా—మూలదండెంమీదున్న మాసిన బట్టలు వెలవెలా పోతున్నాయి. చేటలో బియ్యంపోసుకుని నలక లేరుతున్న శాంతమ్మ ముఖం దీర్ఘాలోచనలో వున్నట్లు కన్పిస్తుండగా—వంకెన వేలాడుతున్న జాతిపిత కాంతి ప్రబోధానికయి బోసినవ్వులు విసరుతున్నట్లున్నాడు]

శాంతమ్మ: (బియ్యం ఏరుకుంటూనే — కూని రాగంతో)
"వినవే పల్లవ మృదుచరణా
కరుణా వితరణ గుణభరణా" (అని పాడుకొంటూంటుంది)

రామం: (అడుగులో అడుగు వేసుకుంటూవచ్చి మెల్లగా) శాంతమ్మగారూ!

శాంత: ఎవరూ? (తలెత్తి — ఒక్కసారి ఆశ్చర్యంగా) ఇదేమిటి రామం! అలా మొగమంతా వాడిపోయింది! ఎవరైనా ఏమైనా అన్నారా?

రామం: ఎవ్వరూ—ఏమీ—అనలేదండి.

శాంత: మరి ఎందుకలా గద్గదికంగా గుటకలు మింగుతూ మాట్లాడుతావు?

రామం: వెక్కిరించిన నావిధినీ, పరిహసించిన నా బ్రతుకునూ చూచి ఏంచేయాలో అర్థంకాక.

శాంత: విధినిచూసి మనం వెక్కిరించాలికాని—మనను చూసి అది పరిహసించడమా? అలా అయితే మన జీవితాలు ఏంఫలిస్తాయి? మన బ్రతుకులు ఏం గట్టెక్కుతాయి? ఆ...నా వేదాంతంలో నీగొడవే మర్చిపోయాను. అసలు జరిగిందేమిటి?

రామం: నిన్న మీతో చెప్పానుకదూ! కావలసిన పుస్తకాలు కొనలేదని జాగ్రఫీ మేష్టారూ, హోంవర్కు తగినట్టుగా చూపటంలేదని లెక్కలపంతులుగారూ నన్ను తరిమి క్లాసులనుండి బయటకు పంపించారని.

శాంత: అందుకేగా వారాల ఇళ్లవాళ్లందరిదగ్గరా తలో రెండురూపాయలు అడగమని నేనూ ఓ తృణమో పణమో ఇచ్చింది —

రామం: ఈ విశాల దేశంలో — శాంతమ్మగారూ! కారుణ్యపూర్ణహృదయాలైతే వున్నాయి కానీ—మీలాంటి దయార్ద్రదాతలు లేరు కదా!

---

* ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏకాంకికలపోటీలో ద్వితీయబహుమతిపొందిననాటిక:

శాంత : పిచ్చివాడా! పురుట్లో నే తల్లిని గోల్పోయి—తెలిసీ తెలియనితనంలో నే తండ్రిని గోల్పోయి గోడుగోడున దుఃఖించే నీలాంటి అర్భకులందరూ నావల్ల నే పోషింపబడుతున్నారా? చదువుకోవాలన్న కుతూహలంతో — కట్టుగుడ్డలతో వున్న వూరును విడచి అష్టకష్టాలనుభవించే నీలాంటి అదృష్టహీనులందరూ నావల్ల నే బతుకుతున్నారా?

రామం : అందరూ మీ నీడనే మేడలు కట్టకపోవచ్చు. కాని శాంతమ్మగారూ! మీరే లేకపోతే నా కొక్క క్షణమైనా బ్రతకడానికవకాశముండేదేనా? అన్నాహారాలకై అలమటించే సమయంలో వారాలిప్పించి రక్షించారు. అవహేళనతో కుమిలిపోయే సమయంలో చేయూత ఇచ్చి బ్రతికించారు. ఇంకన్న మానవత్వానికి ఉత్కృష్టత ఎక్కడుంది?

శాంత : రామం—ఒక్కటి గ్రహించు – ఎవరైనా – పరాయివాని సత్స్వభావం కానీ సద్గుణాలు కానీ తనను ఆకర్షిస్తేనే వానికి సహాయం చేస్తారు. తెల్లనివన్నీ పాలు—నల్లనివన్నీ నీరనుకొనే నువ్వు ఈమాత్రానికే ఉబ్బితబ్బిబ్బయితే భవిష్యత్తు నిన్ను తప్పకుండా మోసపుచ్చి వేస్తుంది.

రామం : అంతమాత్రాన మంచిమెచ్చుకోకుండా—ధర్మాన్ని గ్రహించకుండా వుండమంటారా?

శాంత : ఎందుకంటాను? మంచిని మెచ్చుకోవలసిందే—కానీ దానికి దాసోహం కావాలని ఎక్కడుంది? నేనేదో పుస్తకాలకోసమై రెండు రూపాయ లిచ్చానని కృతజ్ఞతతో తల మున్కలై పల్టీకొట్టడం సబబేనా?

రామం : (తెంబేలుపడుతూ) అదేమిటండీ అలా అంటారు?

శాంత : అవును! రామం; నిన్ను సహాయం చేయగలిగాను. చేశాను. ఈరోజున నీ కష్టానికి నే నాదుకోగలనో లేదో! ఆదుకోలేక నిరుత్తరనై—నిస్పృహతో నిన్ను పంపితే అప్పుడీ కృతజ్ఞతకు తావెక్కడ?

రామం : అయితే నే నొచ్చిన పనీ...

శాంత : ఇంతమాత్రానికే—మాటవరుస కన్నదానికి—దిగాలుపడాలా? అసలు పనేమిటో మాటల సందడిలో మరచిపోయాం!

రామం : ఇవాళ బళ్ళో—నా పేరు తీసేశారు.

శాంత : ఆ!...

రామం : అవునండి. మూణ్నెల్లనుంచీ పంతులుగారిని బ్రతిమాలుకుంటూ పేరు కొట్టేయకుండా ఏలాగో కాలం వెళ్లబుచ్చాను. ఎల్లుండి ఇన్స్పెక్షనుట! ఇక ఉపేక్షించకూడదట!..

శాంత : ఎక్కడైనా డబ్బుకోసం ప్రయత్నించేవా?

రామం : యాచించాను హృదయమున్న ప్రతి విద్యార్థినీ కనీసం కానీ అయినా దానం చేయమని. అలాగే కానీలు మాటకట్టుకుంటే వసూలైంది 'హస్తానికి' లోపు. అభ్యర్థించాను పరిచయమున్న ప్రతి పెద్దమనిషినీ. పోగైంది రెండు రూపాయలుకూడా కాదు. వారాల ఇళ్లలో కాళ్లా వేళ్లాబడి బ్రతిమాలుకున్నాను. వడిలో విసరివేయబడ్డవి రెండే రెండు అర్ధరూపాయలు. కట్టవలసిన జీతం ఇరవైరూపాయలకు మించితే పోగైన పైకం పదిరూపాయలకు లోపు. ఏం చేయమంటారు నన్ను? బ్రతుకో భారమైనా చదువుకై సర్వం త్యాగం చేయదలిస్తే—సాధింపులతో—మూతి విరుపులతో నన్ను బయటకు గెంటేవారేకాని—మీరు తప్ప—ప్రేమార్ద్ర హృదయంతో — సాపేక్షతో నా అభివృద్ధిని సతతం కాంక్షించే ధర్మపరాయణు లెవ్వరూ లేరు.

శాంత : రామం! గతం గతం. భవిష్యత్తంటావా మనకు తెలీదు. పూలబాటల్లో నీ రథం నడవాలన్న వర్తమానమే నీకున్న ఆధారం! సహాయం చేయలేదని లోకంమీ దలిగి దాని స్వరూప స్వభావాలు తెలిసికోకుండా ఏం సాధిస్తావు? లక్ష్మమ్మగారిని కూడా అడిగావా? ఏదో పెద్ద ముత్తైదువ. దయాధర్మాలన్నా—న్యాయాన్యాయాలన్నా పట్టుకు వేలాడే పెద్దమనిషి!

రామం : ఆ...అభిమానమంతా చంపుకొని బాధనంతా వెడలగ్రక్కి గానమంతా వెళ్ళబోశాను. దానికి సమాధానమో విదలింపు. ఛీత్కారం.. అసహ్యం—తృణీకారం. ఇంతకన్న ఏం కావాలి ఓ ఆత్మాభిమాని ఆత్మహత్యకు?

శాంత : ఇంతకూ నీకు కావలసింది...

రామం : తప్త హృదయంలో ఎంచిన మార్దైపోవడం!

శాంత : బాబూ! పై లోకంలో ఏం వుందయ్యా! దూషణ భూషణ తిరస్కారాలు లేకపోవి కేనా! అటువంటి సమయంలో ఆత్మనెందుకు నాయనా ఘోష పెడ్తావ్?

రామం : చేతకాక.

శాంత : మంచి మాటన్నావ్! నీకు కావలసిందీనాడు జీతం కట్టడం. అది నెఱవేరితే నీకు బాధా వుండదుకదూ! ఇక లోకులన్నావా – పలు కాకులు. రేపు ఏ కలెక్టరు గిరో నువ్వ చేస్తోంటే—జయంత వసంతుడవూ - ఇంద్ర చంద్ర మహేంద్రుడవూ నువ్వే ఐపోతావు. ఉండు నాయనా ఇప్పుడే ఇవి పొయిమీద పడేసొస్తాను. (బియ్యంతో సహా లోపలకు వెళ్ళుతుంది.)

రామం : (స్వగతంగా) శాంతమ్మగారిలాంటి సహృదయులు కనీసం నలుగురున్నా ఈ లోక మిలా వుండకపోను.

(ప్రత్యక్షంగా) నా కష్టాలు గట్టెక్కినట్లే భావించుకోవచ్చు. ఈడబ్బు నాకు నిజంగా ఆనందప్రదాయి.

[సుడిగాలిలా ప్రవేశించిన లక్ష్మమ్మ— రామం చివరిమాటలు విని—ఒక్కసారిగా ఆగ్రహమూర్తియై]

లక్ష్మమ్మ: (ఎకసక్కెంగా) కష్టాలు మాయమవుతాయి — ఆనందపు టుయ్యాలలూగుతావు—ఏం రామం! రక్తమాంసాలు కరిగించి, అహోరాత్రాలు శ్రమించి గడించిన ఇతరుల ధనం—సునాయాసంగా నీకు లభ్యమైతే కొండమీది కోతినిగూడ నీ పాదసన్నిధిని దాసురాలుగా వుంచుకుంటావుకదూ!

రామం : తప్పక. శాంతమ్మగారి లాంటివారి సహకారం సదా తప్పక నాకు లభ్యమైతే మీ ఆశీర్వచనంతో అలాగే "ఆనందపు టంచులు అనురాగపు లోతులు చూస్తాను.

లక్ష్మమ్మ : (మండిపడిపోతూ) ఎందుకు చూడవ్వూ... శాంతమ్మగారి అమాయకత్వం, లక్ష్మమ్మ గారి నిర్లక్ష్యం తోడయితే తప్పక కొంపలు ముట్టించి ఆ మంటల చివరలు చూస్తావు.

రామం : లక్ష్మమ్మగారూ!

లక్ష్మ : కల్లబొల్లి కబుర్లు చెప్పి—కన్నీటి ధారను సునాయాసంగా వర్షింపజేసి లోడివారిని నిట్టనిలువునా పాతాళాని కంపుతావు.

రామం : ల—క్ష్మ—మ్మ—గారూ!

లక్ష్మ : అర్థం పర్థం తెలియని అమాయకుడుగా నటిస్తూ, తల్లీ తండ్రీ లేని అర్భకుడుగా అందరికీ నమస్కారశతా లర్పిస్తూ, లెక్క పెడతావోయి తిన్న యింటి వాసాల్నే బహు నెమ్మదిగా లెక్క పెడతావు!

(వీరి యీ గడబిడ విని, శాంతమ్మగారు ఆదుర్దాగా బయటికొస్తూ—లక్ష్మమ్మగారి మాటలు విని అర్థం చేసికోలేక)

శాంత : ఏమిటండీ లక్ష్మమ్మగారూ! ఎవరండీ తిన్న యింటి వాసాల్ని లెక్క పెట్టింది?

లక్ష్మ : ఎవరా......మీ......అవినాభావ మానస పుత్రుడు. ప్రాణంలో ప్రాణంగా మమతలలో మమతగా తలుస్తూ మీరు పెంచుకున్నారే ఆ జ్యేష్ఠుడు రామం!

శాంత : రామం!

లక్ష్మ : అవునండీ! అలా ఆశ్చర్యపోతారే—మీ యెదుట చేతులు కట్టుకుని, మాటలాడటానికి జంకిపోతూ, వణికిపోతున్న పెదవులతో వణకిపోతున్నాడే ఆ రామం! అపరాధి కుండే భయం, సిగ్గు, దాపరికం లక్షణాలు స్వచ్ఛంగా అతని మొహంమీద కన్పిస్తున్నాయి కదూ!

శాంత : ఆగండి...అతను చేసిన అపరాధం?

లక్ష్మ : సద్వంశజులు కలలోనైనా తలంచరాని ఘోరాపరాధం—దొంగతనం.

శాంత :
రామం : } ఆ!!!

లక్ష్మి : నేరాల్లో కల్లా సులువైంది. పాపాల్లో కల్లా బలువైంది. అదే దొంగతనం.

శాంత : ఆధారాలేమైనా చూపగలరా మీరు?

లక్ష్మి : ఉన్నత కుటుంబీకులు—సంసారతప్త హృదయులు—ఏమిటండీ అలా మాట్లాడుతారు? నేడో రేపో రాలిపోయే ఈ ముదివగ్గు ఓ అనామకుడికోసం అబద్ధాలాడుతుందా?

శాంత : లక్ష్మమ్మగారూ! క్షమించండి నేనేమైనా అపసవ్యం మాట్లాడితే. చిన్నవాడు అభివృద్ధిలోకి రాదగ్గవాడు ఈ కుర్రవాడు. జీవిత యుద్ధంచేసికొని ఒడిదుడుకులకు తట్టుకో వలసినవారం మనం. అందుకనే అరిషడ్వర్గాలను అదుపులో నుంచుకొని అసలుసంగతి ఆరాతీద్దామని.

లక్ష్మి : శాంతమ్మా! అతిశాంతం అన్నివిధాలా హాని. అయినా నిన్నెందుకు చిన్నబుచ్చాలి. ఈ తుంటరిని విచారించడం నీకూ నాకూ శ్రేయస్కర మనుకుంటాను.

శాంత : ఏం రామం! నీకూ నీ నిర్దోషిత్వం నిరూపణ కావడ మిష్టమే కదూ!

రామం : ఈ కలికాలంలో సత్యాని కేమాత్రం తావున్నా నేనీ పుక్కుచిక్కునుండి బయట పడతాను తల్లీ!

లక్ష్మి : చూశారా! అవకాశవాదం ఎన్నివిధాల విజృంభిస్తోందో! ఆ! రామం! మధ్యాహ్నం మమ్మలను పట్టుకుని చందా ఇయ్యమని పీడించావా?

రామం : దానికి తగిన విదలింపుకూడా పొందాను.

లక్ష్మి : "లేదబ్బాయీ! నాదగ్గిర ప్రస్తుతానికి డబ్బు లేదూ! ఉన్నదొక్క పదిరూపాయలే. అది ఇంటిఖర్చుకు లేకపోతే ఈ నెలాఖరుదాకా నానావస్థాపడాలి" అని నెత్తీ నోరూకొట్టుకుని బోధించానా?

రామం : అలా ఛీదరించుకుని ఓ ఛీత్కారం నా మొహాన పారేశారు.

లక్ష్మి : కానీ నువ్వు నామాట వినకుండా గుమ్మం పట్టుకు వేలాడావు?

రామం : దాంతో నన్ను సహ్యించుకున్నారు.

లక్ష్మి : అయినా బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన నీ కిదేంపనోయ్—

రామం : అని నన్నూ నా కుటుంబాన్నీ తృణీకరించారు.

శాంత : రామం! లక్ష్మమ్మగారి వాదం పూర్తిచేయనిస్తావా?

రామం : క్షమించండి శాంతమ్మగారూ! ఏదో ఆవేశం— ఉద్వేగంవల్ల అలా అన్నాను కానీ సత్యాన్ని అరికట్టుదామని కాదు.

లక్ష్మి : ఆపైన నేను వసారాలో పది రూపాయలున్న సంగతి మరిచి నా పనిమీద ఇంటిలోకి వెళ్ళిపోయాను. మళ్ళీ అయిదు నిముషాల్లో రామం ఉన్నాడో లేడో చూద్దామని బయటికి వచ్చేసరికి ఒక్కరు లేరక్కడ. డ్రాయరుమీద చూస్తే మూడు రూపాయి కాగితాలు మాత్రం గాలికి రెపరెపా కొట్టుకుంటున్నాయి.

శాంత : మిగిలినవి క్రిందేమైనా పడిపోయాయేమో!..

లక్ష్మి : శాంతం వినండి శాంతమ్మగారూ! దాంతో నా గుండెలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. నరనరాల్లో భయం ఆవరించింది. పట్టపగలు. అందులోనూ మిట్టమధ్యాహ్నం డ్రాయరుమీదున్న డబ్బులో కొంత అదృశ్యం కావడం...మీరన్నట్లే నాకూ సందేహం వొచ్చి—గాలించిన పుస్తకాన్నే మళ్ళీ మళ్ళీ గాలించీ—చిమ్మిన యింటినే తిరిగి తిరిగి తుడిచీ—నలుమూలలనూ ఒక కొలిక్కి తెచ్చి నానాయాతనా పడ్డాను.

రామం : దొరికిందా!

లక్ష్మి : ఏలా దొరుకుతుంది! నిక్షేపమున్నది ఒక చోట—త్రవ్వింది మరోచోట.

శాంత : ఎక్కడ?

లక్ష్మి : ఇంతలో మా పనిమనిషి 'మిరియాలు' రావడం చూసి దానికేమైనా తెలుసేమోనని దాన్ని అడిగేశాను. దానికి తెలుసునంది. నా పంచప్రాణాలూ ఒక్కసారిగా లేచి వచ్చినంత పనై 'ఎవరూ?' అని అడిగేశా. మొహం చిట్లిస్తూ 'రాంబాబుగోరూ' అంది.

శాంత / రామం } నిజం!!

లక్ష్మి : చెప్పొద్దూ! సాకూ మొదట్లో మహా గొప్ప చిరాకేసింది అదలా హాస్యాలాడుతున్నందుకు. కానీ అది కళ్ళారా చూసిందట—రామం 'జేబులో అయిదు రూపాయలుంచుకుని - చేతిలో రెండు రూపాయలుంచుకొని' మొహంమీద తప్పుచేసిన ముద్ర స్పష్టంగా కనిపిస్తున్నా ధీమాగా నడచిపోవడం.

శాంత : ఏం రామం! లక్ష్మమ్మగారి మిరియాలు మాటలు విని నీమీద అనుమానపడ్డారు మరి.

రామం : శాంతమ్మగారూ! నేనూ సద్వంశ సంభూతుడనే. సత్శీలం నా నరాల్లోనూ ప్రవహిస్తూనే వుంది. కానీ చదువుకోసం—సరస్వతీ ప్రసన్నంకోసం తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్ఠలు కించపరుస్తున్నా—నైనా ఉద్దేశ్యం లేక—మీలాంటి ధర్మాత్ముల నీడను—ఏదో ఇంత వారాలు చేసికొని కాలం గడుపుతున్నాను. తరతరాలుగా మా యింట వెలిగే దివ్యజ్ఞానజ్యోతి ప్రస్ఫుటంగా నాలో కన్పించకపోయినా అంతర్గతంగా వెలుగుతూనే వుంది. శాంతమ్మగారూ! ఈ ఏడు రూపాయలకోసం నా వ్యక్తిత్వాన్ని మంట కలుపుకోగలనని భ్రమించుకోగలరా?

శాంత : లక్ష్మమ్మగారూ! మఱపు రావాలన్నా మఱపురానిదా దృశ్యం. ఆరోజు సంక్రాంతి. విమల, దాని స్నేహితులు గొబ్బెమ్మల చుట్టూ పాటపాడి అప్పుడే ఇంట్లోకి వెళ్ళారు. అప్పుడే ఈ రామం—ఓ చేతిలో పుస్తకాలు—మరో చేతిలో కలంతో మాయింటి గడపత్రొక్కి—గొబ్బెమ్మలవద్ద ఓ వుంగరం దొరికిందని—కొత్తగా కొద్దికాలం క్రితమే చేయించిన విమల వుంగరం మా కిచ్చి వెళ్ళిపోవటానికి సిద్ధమయ్యాడు. అడిగి సంగతి సందర్భాలు తెలిసికొన్నాం. పరాయివారివద్ద చేయిజాపడానికష్టపడుతున్న ఆ అబ్బాయి ఆత్మాభిమానానికి మే మాశ్చర్యపోయాం మాలో మేమే.

లక్ష్మి : పిచ్చి శాంతమ్మా! ఈ పిదప బుద్ధులకాలంలో ఇంకా నీలాంటి అమాయకు లుండడం ఆశ్చర్యం! అతని కపుడు తెలుసు వుంగరం అతనికి కలకాలం కూడు పెట్టదని—కనిపిస్తూనే వున్నావు మహాలక్ష్మీదేవిలా నువ్వు. అందుకే అతని పాచిక పారింది—కోరిక తీరింది.

శాంత : అయినప్పుడు మీవద్ద సంగ్రహించవలసిన అవసరం?

లక్ష్మి : బళ్ళో పేరు తీశేశారు. చదువు పూజ్యమై మిగిలిన వెన్నున్నా అతని కపుడు అనవసరం—నావలనా పెద్ద ఉపయోగమేదీ జరగడంలేదు ఏకో వారానికోసారి భోజనం మినహాయించి—ఎదురుగ్గా పదిరూపాయలూ ప్రత్యక్షదర్శన మిస్తున్నాయి—చుట్టూతా ఎవరూ లేనేలేరుకదా!

శాంత : తప్పు ఎలా కప్పిపెట్టగలడు?

లక్ష్మి : అతనిమీద ఇంతవరకూ ఎవరికీ ఎట్టి అనుమానమూ లేదు. రహస్యం బట్టబయలైతే శరణు మంత్రం వుండనేవుంది. జరిగింది శాంతమ్మగారూ! నమ్మినా నమ్మకపోయినా!

రామం : అమ్మా! మీ రిద్దరూ జీవితసారం కొద్దో గొప్పో అర్థంచేసికొన్న విజ్ఞానులు. మానవుడు మహోన్నత శిఖరా లధిష్ఠించాలని చేసే ప్రయత్నంలో దరినున్న భీకరాగాధాల వైపు కన్నెత్తి అయినా పరికించడని మీకూ తెలిసిన నగ్నసత్యం.

శాంత : రామం మాటలు పేటలు దాటినా శౌర్యం మాత్రం కోటల్లోనే వుండిపోతోంది. నీమీదున్న అపరాధం కాదని రుజువు చేయక పలుకుల్తో గట్టెక్కాలని ప్రయత్నిస్తావే?

రామం : అపరాధిని కానని—మానవత్వాన్ని గుర్తించమని మరీ మరీ వేడుకున్నా మీరు కరుణించకపోతే ఏంచేయమంటారు?

శాంత : వారంటోంది నువ్వు తీసుకున్న ఏడు రూపాయలని. అందుకోసం నీదగ్గిర డబ్బు

లెక్క చూస్తే ఒక్క కానీ ఎక్కువున్నా నిజం బయలుపడకుందిగా!

రామం : తప్పక... (ఏదో గుర్తుకు వచ్చినట్లు) ఆ!!!

లక్ష్మి : రహస్యం బయలుపడ్తుందని భయపడుతున్నావా?

రామం : ఆ శ్రీరామచంద్రుడే నన్ను రక్షించాలి. సరే ఇదిగోనండి శాంతమ్మగారు? (డబ్బంతా ఆమె ముందు కుమ్మరిస్తాడు—ఆమె లెక్క పెడ్తుంది.)

శాంత : ఎంతపని చేశావు రామం! పరిచయమైన నాటినుండీ కన్న కూతురుకన్న మిన్నగా తలిచానే! క్షుధార్తుడవని—బడలిక నీజీవితంలోనే రూపుమాపదలిచానే—నాకు తెలీకనే ఎన్ని విషవృక్షాలను నీలో పెంచుకున్నావు రామం!

లక్ష్మి : తడిగుడ్డతో గొంతుకోసే పయోముఖ విషకుంభాలు నరరూపంలో ఎలా వుంటాయో ప్రత్యక్షంగా తెలిసికొన్నారా శాంతమ్మ గారూ!

శాంత : ఏమండీ! మీకు కావలసింది మీ డబ్బు. కదూ! (ఆజ్ఞాపూరిత స్వరంతో) రామం! వారికి తిరిగి ఇచ్చెయ్ ఆ ఏనురూపాయలు.

రామం : క్షమించాలి. పరిస్థితుల ప్రాబల్యంతో కల్ల నిజమైతే దానికి శిక్ష నే ననుభవించాలా? యాచనకన్న హీనంగా ఆర్జించి ఈ డబ్బు సంపాదించాను. స్వాభిమానం తాకట్టు పెట్టి ఈధనం గడించాను. అష్టకష్టాలతో అహోరాత్రాలు అలమటించి ఈ లక్ష్మిని మూటగట్టాను.

ఆ డబ్బును, ఆ ధనాన్ని ఆ లక్ష్మిని చెవులుండీ వినలేని వీరి కీయవలసిందేనా? కనులుండీ కనలేని ఈమెకు ధారాదత్తం చేయవలసిందేనా?

శాంత : న్యాయం, ధర్మం, సత్యం అనేవి నీకు కావలసివస్తే, ఇచ్చెయ్ ఆ పాపిష్టిధనాన్ని.

రామం : సావధానంగా మరొక్కసారి ఆలోచించండి. నిర్భాగ్యుడను, నిరపరాధుడను నిర్దయలో దండిస్తారా?

శాంత : సాక్ష్యంతో రుజువైన అపరాధం తిరుగులేని వజ్రాఘాతం. ఇచ్చివేయి. (రామం-సంశయిస్తాడు).

ఇయ్యలేవు. సరే నేనే యిస్తా. నా రామం ధర్మాన్ని గ్రహించలేని మూర్ఖుడనుకుంటూ కుమిలి కుమిలి నేనే యిస్తా.

(విసురుగా లోపలకు పోబోతుంది.)

లక్ష్మి : అహర్నిశలూ నీ క్షేమంకోరే హృదయాన్ని గ్రహించలేని మూర్ఖుడా!

రామం : (ఒక్కసారిగా ఆవేశంతో) ఇదిగో శాంతమ్మగారూ! నేనే అపరాధిని. అన్యాయాన్నెదుర్కోలేని అసమర్థుణ్ని. తీసుకోండి ఆ కటిక రూపాయలు—గ్రహించండి నా ప్రాణాలు వాటిలో ఇమిడ్చి ఇస్తే గలగల్లనిమోగే వెండిరూపాయలు. (క్రిందుంచిన రూపాయలను లక్ష్మమ్మ ఆదరాబాదరాగా తీసి కొంగున కట్టుకుంటుంది.)

శాంత : రామం!

రామం : (దీనంగా) ఏమిటే!

శాంత : వారానికయ్యే ఖర్చిస్తాను. అనుపానాది విషయాల్లో ఇంకేదైనా మార్గం ఆలోచించుకో—వెళ్లు.

రామం : శాంతమ్మగారేనా!

శాంత : ఆ! ఏ శాంతమ్మను నమ్మించి మోసపుచ్చడానికి ప్రయత్నం చేశావో ఏ శాంతమ్మను కలలోనైనా వూహించనివిధంగా కపట వినయంతో బంధించి నిరుత్తరను చేశావో, ఆ శాంతమ్మే చెప్తోంది రేపటినుండి నువ్విక్కడకు రాకూడదూ అని. వెళ్లు.

రామం : సరే. మనసులు మారి మమతలు కలసి మహోన్నత భావాలు రాజిల్లితే అప్పుడే మీ దర్శనం చేసుకుంటాను.

(వంగి శాంతమ్మగారి రెండు పాదాలకు నమస్కరించి—విషణ్ణ వదనంతో వెళ్ళిపోతాడు. అతనికి ఎదురౌతుంది విమల)

విమల : అమ్మా! ఎందుకే రామం అలా దిగాలుపడ్డ మొహంతో వెళ్లిపోతున్నాడు. ఎవరైనా

ఏమైనా అన్నారా? నువ్వేమైనా అన్నావా తొందరపడి?

శాంత : (కూతురి చిబుకం స్పృశించి) అపరాధులకెప్పుడూ పట్టువిడ్డె తిరువాతనే పరివర్తన వస్తుంటుందమ్మా!

విమల : ఎవరమ్మా అపరాధి? ఎందుకమ్మా పరివర్తన?

లక్ష్మి : రామం...దొంగతనం...

విమల : మన రామం దొంగతనం చేశాడా? ఎక్కడ—ఎప్పుడు—ఎందుకు?

లక్ష్మి : మా యింట్లో! మధ్యాహ్నం రెండు గంటలకు! నూర్లు జీతంకోసం.

విమల : (కొంచెంసేపు ఆలోచించి) సరే గాని లక్ష్మమ్మగారూ! నిజంగా మీలాంటి ఆమె అమ్మగా రావడానికి ఎన్ని జన్మల తపస్సు చేశాడో శంకరం!

శాంత : ఏమమ్మా!

విమల : అడిగినప్పుడల్లా కావలసినన్ని డబ్బులిచ్చే అమ్మ ఎంత మంచిదో!

లక్ష్మి : వాడికి నేను చిల్లిగవ్వయినా కనబడనీయనే—

విమల : మరి యీ పుస్తకం ఎక్కడిదో?

లక్ష్మి : ఏమిటది?

విమల : మీ సుపుత్రుడు తన పుట్టినరోజు కానుకగా నాకు బహూకరించిన పుస్తకం. ధర—దాదాపు - ఏ-డు-రూపాయలు.

లక్ష్మి : ఆ! ఆ! ఆ!

శాంత : ఎంత మోసం!

(ఇంటికేతెంచు గోమాతల అంబారవాలు—వీనితో బాటు సన్నని వీణానాదం కొద్దిసేపు వినిపిస్తాయి.)

[తెర]

క్రోచే అభివ్యంజనవాదము

శ్రీ కర్ణ రాజశేషగిరిరావు

అభివ్యంజనవాదము నొక సిద్ధాంతరూపమున బొందుపఱచినవాడు ఇటలీ దేశనివాసుడు బెనిడెట్టో క్రోచే. ఈయన నేపిల్సు పట్టణమునందు 1866 సంవత్సరమున జన్మించెను. క్రోచే ప్రఖ్యాత దార్శనికుడు. ఈతని దార్శనికగ్రంథములు పాశ్చాత్యదేశములందు బహుళ ప్రచారము నందినవి. ఈయన దార్శనికు డగుటవలన నీయన రచించిన శాస్త్రమంతయు వీరి దర్శనమునం దొక యంశమని గ్రహింపదగినది. వీరు గౌణరూపమున దార్శనికులైరి. పదునెనిమిదవశతాబ్దమునందు యూరపునం దొక వినూత్నశక మారంభమైనది. నాటినుండి సాహిత్యసమీక్షయు స్వచ్ఛందవాదము ననుసరింప మొదలిడినది. ఇంగ్లాండున షెల్లీ, కీట్సు, వర్డ్స్‌వర్తు మొదలగు కవులు, కోలరిడ్జి మొదలగు సమీక్షకులు నూతనప్రవాహమునం దీదుచుండిరి. ఫ్రాన్సుదేశమంతయును నూతన రాజ్యవిప్లవమునం దిట్టుడికిన ట్లుడికి అభ్యుదయమును, స్వాతంత్ర్యమును సంపాదింపగలిగినది. జర్మనీదేశమునందు లెసింగ్, వింకల్ మేన్, కాంటు. గేటే మొదలగు కళాసమీక్షకులు, దార్శనికులు, నూత్నవిప్లవమునందు నాయకులైరి. ఇవ్విధంబున సామాజికపరివర్తనము ననుసరించి కళాదృష్టియు, జీవితదృష్టికోణమును పాశ్చాత్యదేశమునందు మారజొచ్చెను. సాహిత్య మీ ప్రవాహమునందు ముందుకు సాగినది.

'లెసింగ్', 'వింకల్ మేను', గ్రీకుకళల నభ్యసించి, వినూత్న పరిభాషలను కాలానుగుణముగ నొనరించిరి. లెసింగు సిద్ధాంతమంతయు సౌందర్యసిద్ధాంతముపై నాధారపడి యున్నది. వీరిసిద్ధాంతము ప్రకారము కావ్యము, కళలు, ఆత్మసౌందర్యము నభివ్యక్తీకరించు సాధనములు, ఆత్మసౌందర్యసంపన్నము అభివ్యక్తియే కావ్యమని వీరి యభిమతము. 'వింకల్ మేను' అభివ్యంజనతత్వములను, తద్భేదములను విశదీకరించెను. 'కాంటు' కావ్యాది కళలకు స్వతంత్రప్రతిపత్తి యున్నదని నిరూపించెను. 'గేటే' యను మహాకవి వ్యష్టి, సమష్టి, స్వరూపములను స్పష్టీకరించెను. 'క్రోచే' పై సిద్ధాంతములను సంగ్రహించి 'అభివ్యంజనవాద' మను పేర రూపొందింపగల్గెను.

మానవుడు జ్ఞానస్వరూపుడు. అతడు నిజజ్ఞానశక్తిచే జగచ్ఛక్తిని గ్రహింపగల్గుచున్నాడు. జగత్తునం దనంతశక్తి విలసిల్లుచున్నది. ఇది సత్తారూపమున పరిఢవిల్లుచుండును. ఇట్టి సత్తారూపమును గ్రహించుటకు మానవుని మనస్సు తోడ్పడును. మనస్సునం దిట్టి సత్యస్వరూపమును గ్రహించు శక్తి యున్నది. క్రోచేదృష్టిలో నీ 'సత్త' మానసవ్యాపారము మాత్రమే. ఉషఃకాలమధురిమను, సాంధ్యకాల సౌందర్యమును గ్రహించుటకు మనస్సు తోడ్పడును. ఇట్టి శక్తిని 'మానసికసత్త' యందుము.

భారతీయనైయాయికులు మానసవ్యాపారమును మూడుతరగతులుగా విభజించిరి. (1) జ్ఞానము, (2) ఇచ్ఛ, (3) యత్నము. మనుష్యు డొక వస్తువు నెఱింగి దానిని బొందుటకు ప్రయత్నించుచుండును. క్రోచే చివరి రెంటిని నొకటిగ సమకూర్చి మానసిక వ్యాపారములు ద్వివిధములుగా విభజించినారు. (1) జ్ఞానము, (ప్రజ్ఞ) (2) క్రియ, (సంకల్పము) మొదటివ్యాపారము సైద్ధాంతికవ్యాపారము; ద్వితీయము వ్యావహారికమును, జ్ఞానప్రాథమిక వ్యాపారమును; క్రియ తదవలంబితము.

జ్ఞానములు ద్వివిధములు. (1) స్వయంప్రకాశజ్ఞానము కళానుగతము; కల్పనాదుద్భూతము; ఇయ్యది విశిష్ట వస్తుజ్ఞాన మనంబడును; వ్యక్తిసంకేతసంగ్రహణమునకు తోడ్పడును. (2) ప్రమాజ్ఞానము తర్కసంగ్రంథితము; నిశ్చయాత్మకబుద్ధి సంప్రాప్యము. భిన్నభిన్న వస్తుసంపర్కమువలన తార్కికజ్ఞాన మేర్పడును. ఇయ్యది జాతిసంకేతసంగ్రహణమునకు దోడ్పడును.

స్వయంప్రకాశజ్ఞానము సౌందర్యశాస్త్రముపై నాధారపడి యున్నది. స్వయంప్రకాశజ్ఞానము ప్రాథమిక మానసవ్యాపారము. ఇందు బుద్ధిబలమునకు తావు లేకయే జ్ఞానోత్పత్తి కలుగును. అనగా సౌందర్యశాస్త్రము, తర్కశాస్త్రముపై నాధారపడి యుండదు. కాని తర్కము సౌందర్యశాస్త్రముపై నాధారపడి యుండును.

సంకల్పాత్మక వ్యాపారము ద్వివిధములు. (1) యోగక్షేమభావానుసారిక్రియ, (2) కళ్యాణానుమోదిభావానుసారిక్రియ. ఇది ఆచార శాస్త్రీయ నీతిక్రియ యగును. కాన మానసవ్యాపారము, మానసశక్తియందును నాలుగు స్తరములు గలవు. (1) సుందరము, (స్వయంప్రకాశ జ్ఞానము) (2) సత్యము (ప్రమా తర్కము), (3) ప్రేయము—లాభానురూప సంకల్పము (అర్థశాస్త్రము), (4) మంగళసంకల్పము (శ్రేయము - శివము — (నీతిశాస్త్రము) కాబట్టి క్రోచె మతానుసారముగ సత్తా స్వరూపము ఈ శ్రేణులలో నుండును. (1) సౌందర్యము, (2) సత్యము, (3) ప్రేయము, (4) శివము.

క్రోచే ననుసరించి మాచిన జ్ఞానము మనస్సు యొక్క ముఖ్యవ్యాపారము. దీని నాశ్రయించి, క్రియాస్వరూపము విస్తృతమగుచుండును. మనస్సు యొక్క శక్తి పూర్ణరూపంబున క్రియా సంకల్పమునం దభివ్యక్తమగును, స్వయంప్రకాశ జ్ఞానము క్రియా సంకల్పమువలన పరిపూర్ణమగును అందువలన క్రోచే దర్శనశాస్త్రమును భూతలలోక సంబంధమును విడనాడి కల్పనా లోకమున విహరింపచేయు వస్తువుగాదని చెప్పినారు. వారి దృష్టి నయ్యదియు జగదాధార సంఘటనములను పరికించు మహనీయ శాస్త్రమైనది. క్రోచే మతానుసారముగ ఐతిహాసిక నిర్ణయమునకు చేరుటయే దర్శనమగును. ఇతిహాసమునందు మానసిక క్రియాభివ్యక్తి తోడ్పడును. యథార్థరూప వ్యాఖ్యానమే యితిహాసము, విశ్వసంఘటనలను జేర్చి మూల్యమున కనుగుణంబుగ సత్యాసత్యములను క్రోడీకరించి యథార్థరూపమున ప్రకటించుటయే ఇతిహాస ప్రయోజనము.

స్వయంప్రకాశ జ్ఞానము

ఇయ్యది ప్రతిభాజన్య జ్ఞానము. ఈ జ్ఞానమే కళా నిర్మాణమునకు ముఖ్య హేతువు. మానవుని యాదిమ మానసిక వ్యాపారమే యీ స్వయంప్రకాశ జ్ఞానము. వ్యక్తివిషయమగుటచే స్వతః సముద్భూత జ్ఞానము. ఉషఃకాలీన సుషమారూపమునందు, సంధ్యానురాగమును వీక్షించినను మనసునందొక విచిత్రమూర్తి విధాన మేర్పడును. ఇది మానసిక వ్యాపారము, ఆదిమము, ప్రారంభదశ; ఇది ప్రతిభాజన్య విశుద్ధ జ్ఞానము. ఇందు సత్యాసత్య నిర్ణయమునకు, అవస్థాభేదములకు వాస్తవిక కల్పనారూప భేదములకు దావులేదు.

స్వయంప్రకాశ జ్ఞానమునందు బుద్ధికి బనియుండదు. ఇయ్యది స్వయముగ మనమునందు రూపొందిన మూర్తి. ఈ కల్పన ఆత్మగతము; ఇది వ్యక్తిగత సంపద. జగదవసిత నానారూప వ్యాపారములను గ్రహించుటయే దీని పని. ఇయ్యది సౌందర్య బోధాత్మక వ్యాపారము. ఈ వ్యాపారము ననుసరించు మానవుడు సౌందర్యము నవగాహన మొనరించుకొనును. క్రోచె మతానుసారముగ ప్రతిమానవుడు స్వభావసిద్ధముగ కళాకారుడుగను, లేక దార్శనికుడుగ బుట్టును. మొట్టమొదట కవి లేక కళాకారుడగును. తదుపరి కళాకారుడగుటవలన దార్శనికుడగును. మనుజుడు జగము నవగాహన చేసికొనును; గాన రూపమును మార్చును. ఎఱుంగును; గాన మార్చగలడు. అనగా జ్ఞానమే సంకల్పమున కాధారము. ఈ జ్ఞానము ద్వివిధములు. (1) కల్పన, (2) విచారము. కల్పనాశక్తియందు మూర్తివిధాన మేర్పడును. ఇది సౌందర్య బోధాత్మక వ్యాపారము. ఈ జ్ఞానము వలన మానవుడు కళాకారుడగును. విచారశక్తియందు, మూర్తి స్వరూప జాతిభేద సంబంధములు స్థాపితమగును. ఈ శక్తిచే మానవుడు తత్త్వవేత్త యగును. ఇందు బుద్ధిబలము వికసించును, కాని కళాకారుడు వస్తురూపము నున్నదున్నట్లు గ్రహించును. కళాకారుని దృష్టి అంతఃస్థలమునుండి యుత్పన్నమగును. ఏ వస్తు వభివ్యక్తమైన నది యాంతరంగికమే యగును. బాహ్యరూప మెన్నటికి గానేరదు.

సారాంశ మేమనగా కల్పనాశక్తియే కళాకారుని నిజసంపత్తి, కల్పనాశక్తి నాతడు భావన జేయగలడు. భావనవలన సౌందర్యము బోధపడును. క్రోచే కల్పనాశక్తికిగల స్వతంత్ర ప్రతిపత్తిని నొక్కి వక్కాణించినాడు. రూపవిషయమునందును, క్రియా విషయమునందు కల్పనా వ్యాపారము విచార వ్యాపారమునకంటె పృథగ్భూత వ్యాపారము. మనసునందు మొదటి వ్యాపారము మూర్తివిధానమగును. తదుపరి విచారాత్మక ప్రయత్నము జరుగును. ఈ విచారాత్మక సంవిధానమందు మనసు వస్తురూపమును విశిష్ట రూపమున సంగ్రహించుటకు అన్యరూప భేదములతో బోల్చి చూచును. అప్పుడు వ్యాఖ్యాన సమీక్షాది వ్యాపారములందు మనస్సు సంలగ్నమగును. తార్కిక బుద్ధి ప్రమాశక్తి నభివృద్ధి నొందించును. ప్రమాశక్తి అవాంతరవర్తి వ్యాపారము గదా! కాని కల్పన కళాజనని యగుటచే ప్రాథమిక మానసిక వ్యాపారమగుచున్నది. కల్పన వినూత్న మూర్తుల నావిష్కరించి, నిర్మించి, రూపొందించుచుండును. కల్పనయందు సౌందర్యము నవగాహన మొనరించు శక్తిగలదు. ఇయ్యది కళాపక్షమునకు సంబంధించిన విషయము. వస్తుసౌందర్యోన్మీలనమే కల్పనాతత్త్వమగును. ఇయ్యది తార్కికబుద్ధి కతీత విషయము.

కళను శాసించునది కల్పనయే. మూర్తులు దీని సంపత్తి. కల్పన పదార్థములను విభజింపదు; గుణలక్షణములనుబట్టి విశ్లేషణ మొనరింపదు. వైజ్ఞానికునివలె వస్తుగుణతత్వమును బోధింపదు; గులాబిపూవును రెమ్మకు రెమ్మ, కొమ్మకు కొమ్మగ విభజించి వస్తులక్షణములను క్రోడీకరింప వచ్చును. గులాబి రెమ్మలను దక్కెరలో కలుపుకొని గుల్కంద చేసి తినవచ్చును. కాని ఉషఃకాలీన సూర్యకిరణములచే ప్రస్ఫుటితమగు గులాబిని జూచునపుడు హృదయమునందొక కల్పనాతీతానందము కల్గును. ఇయ్యది కళావిశేషమే. ఇట్టి పూవును జూచినపుడొక విధమగు యనుభూతి కలుగును. ఇట్టి కళయే విశుద్ధప్రాతిభజ్ఞానమందురు. ఇట్టి కల్పనాశక్తి నాధారముగ గొని క్రోచే ప్రత్యేక మనుష్యుడు కళాకారుడని నిరూపించినాడు. మానవజీవితమునందు కల్పనాశక్తి కెట్టి స్థానమున్నదో నిరూపించిన తత్వవేత్త క్రోచే. ఇట్టి కల్పనాశక్తి నాధారముగ గొను కళ మానవజీవితమునందు చిరంతనమును, వ్యాపకమును, సార్వజనీనమునగు వస్తువు కాగలదు.

అభివ్యంజనము

స్వయంప్రకాశ జ్ఞానశక్తిచే నేదేని వస్తువును జూచినపుడొక రూపమేర్పడును. ఈ రూపమే అభివ్యంజనము. ప్రతిభాజ్ఞాన స్వరూపమే అభివ్యంజనము. అభివ్యంజనమనిన ప్రాతిభజ్ఞానము; మనసునం దేర్పఱచుకొను రూపము. స్వయంప్రకాశ జ్ఞానము అభివ్యంజనము పరస్పర సంపూరకములు. ప్రాతిభజ్ఞానమును, అభివ్యంజనా రూపమును సమీకరించుటయే క్రోచే కళాలక్షణమునకు మూలాధారము.

క్రోచే మతానుసారము సుందరవస్తువున కాధారములు రెండు. (1) ద్రవ్యము. (2) రూపము. ద్రవ్యము దృశ్యమాన జగత్తునందుండు వివిధరూప నిష్పత్తి సంకలన మగును. ఈ ద్రవ్యము నాధారముగ గొని ఆత్మ నిజప్రకాశమున మూర్తిరూపమును బొందుచుండును. సౌందర్య సత్తను కొందరు ద్రవ్యమనియు, ద్రవ్యము రూపవిలసితమనియు సంపూర్ణాభివ్యంజనా సంయోగమనియు తలంతురు. కాని క్రోచే రూపము సౌందర్యమున కాధారముగ దలంచెను. ఆత్మస్వతంత్ర క్రియాకల్పనము నాధారముగగొని మూర్తరూపంబు నొందును. ఈ రూపమే మూలద్రవ్యరూపంబునం బొదిగి నిజరచన నభివ్యక్త మొనరించును. కళాక్షేత్రమున కీ రూపమే యాధారము కాగలదు. గాన ద్రవ్యమహత్వ మేమియునుండదు. ఈ రూప మాత్మకు ప్రతికృతి యనవచ్చును. ద్రవ్యము సంతతి పరివర్తనశీలము; అనేక రూపముల కాధారము, అభివ్యంజనము భౌతికవస్తువుగాదు. మానసికశక్తి. ఏ మూర్తిని కల్పించుకొని మనమే రూపమునందు దానిని గ్రహించెదమో అప్పుడే అభివ్యంజన మారంభమగును, తరుపరి సంపూర్ణమగును. అభివ్యంజనమున కన్యసాధనము లనవసరములు. అభివ్యంజనమునకు లోకానుభవమునకు, సంబంధమే లేదు. లోకానుభవము నభివర్ణించుట బాహ్యపరము, కమనీయ గాన మాధుర్యమునకు చెవులు నోసికొనుట బాహ్యమగు లోకానుభవము మాత్రమే. ఇట్టిది అభివ్యంజన మెన్నటికి గాదు. అభివ్యంజనము మానసికము; బాహ్యపరమైనది కాదు. బాహ్యప్రయోగ మునకొనుట వ్యవహార జగత్తునం దడుగిడుటయే. బాహ్యాభివ్యక్తి ఆంతరికాభివ్యక్తి కొక స్పష్టతర ప్రకాశమగును. లౌకూను అను పేరుగల గ్రీకు మూర్తులను, లేసింగు తన సిద్ధాంతమున కాధారముగగొని కళాసౌందర్యమును నిర్వచించెను. లౌకూను మూర్తులకొక పౌరాణిక గాథ యాధారముండెను. భీషణసర్పములు 'లౌకూను' పరివారమును బిగ మ్రింగుచుండెను. మరియు క్రూరదంష్ట్రములచే బొడుచుచు లౌకూనును చుట్టుకొనెను. ఇట్టి భీషణ పరిస్థితియందు లౌకూను దుర్దశ చిత్రింపబడెను. గ్రీకు కళాకారుడీ చిత్రమునందు సర్పములు క్రూరదంష్ట్రములు, లౌకూను కేకలు పెట్టుట మొదలగు విషయములను గీయనేలేదు. ఇట్లు చూపిన సౌందర్యమూర్తి యయ్యెడిది. కాని చిత్రకారుడు విషాదపూర్ణమగు ఉచ్ఛ్వాస రేఖలను ముఖమునందంకిత మొనరించెను. ఇయ్యదియే అభివ్యంజనాశక్తి విస్పష్టోదాహరణము. కళ ఆధ్యాత్మిక ప్రవృత్తి. బాహ్యప్రయోజనము లాంతరంగిక వ్యంజనమును సుస్పష్ట మొనరించుట కుపయోగపడు సాధనము మాత్రమే.

సౌందర్యము

అభివ్యంజనమే సౌందర్యము. సౌందర్యమే సఫలమగు అభివ్యంజనము. ఇంతకంటె ఎక్కువ గాదు; తక్కువయును గాదు. అభివ్యంజనము సౌందర్యము వలని సఫలము కాగలదు. సౌందర్యమనిన నిచ్చట అభివ్యంజనానుప్రాణిత సౌందర్యము; ప్రకృతి సౌందర్యము మాత్రము గాదు బాహ్యసౌందర్యమే కళాక్షేత్రమునందు సౌందర్యము కానేరదు. సౌందర్యమును బోధించు మానసిక క్రియయే కల్పనాశక్తి యనబడును. కల్పనాసాహాయ్యము లేనిదే (ప్రకృతి) జగత్తునందలి సౌందర్యమును వీక్షింపలేమని క్రోచే యభిప్రాయము. అందువలన ప్రకృతిపదార్థములందుండు సౌందర్యము (భౌతికము) నన్వేషించుట వ్యర్థమైనపని. అభివ్యంజనమునందె సౌందర్యము నిహితము. సౌందర్యము

భౌతిక తత్త్వము గాదు; ద్రవ్యములం దుండదు. సౌందర్యము సంపూర్ణ రూపంబున మానవుని మానసవ్యాపారమునం దనుబద్ధము. ఈ మానసికవ్యాపారమే ఆధ్యాత్మిక తత్త్వము.

'సత్యం, శివం, సుందరమ్' — ఇవే కళా మూల్యముల కాధారములు. కాని క్రోచే ఈ తత్త్వము నీయకొనరు. కళ కళయేయనియు, కళయే సౌందర్యమనియు వారియూహ. సత్యాసత్య వివేచనము తర్కశాస్త్రమున కాధారము. ప్రయోజనా ప్రయోజనములు వ్యావహారికశాస్త్ర సంబంధములు, మంగళామంగళములు, నైతిక జీవితమాత్రములు. అందువలన కళ సౌందర్యసమన్వితమే గాని "సత్యం, శివం, సుందరమ్" — తత్త్వముల కతీతమని క్రోచేయూహ. ఇవ్విధమున క్రోచే అభివ్యంజనమే సౌందర్యమున కాధారమనియు, సౌందర్యమే కళ కాధారమని నొక్కి వక్కాణించినాడు. ఈ సౌందర్యము వ్యావహారిక ప్రపంచమునం దనుకొనెడి అందచందముల కతీత వస్తువు. మానవులకు కొన్ని వస్తువులు శివరూపముగను, కొన్ని భీభత్సరూపమునను, కొన్ని అందచందములుగ గాన్పించును. కాని క్రోచే మతానుసారము సౌందర్యము అభివ్యంజనాత్మకమగుటచే బాహ్యసౌందర్యమున కతిదూరముగ నుండును. ఇయ్యది ఆధ్యాత్మిక సౌందర్యము.

మానవుడు పాడుచుండును; ఆడుచుండును; గంతులు వేయుచుండును. అంతియ గాదు మానవుడు శోకవ్వడు భయకంపితుడగుచుండును; కిలకిల నవ్వుచుండును; క్రోధమునందు మొగ మెఱ్ఱడాలు వేయును. సవ్యసనపుడు పులకితుడగును. ఇవి శారీరకాభివ్యంజనములు. కళాభివ్యంజనమున కివియే పరమాధారములు గావు. వేటగాడు వేటాడుచు నివ్వెఱబోవును; ముందునకు సాగును. వెనుకకు మరలును. ఈ హావభావములు కళాభివ్యంజనమునం దభినయించు హావభావములకు భేదమున్నది.

క్రోచే మతానుసారముగ ప్రతిమానవుడు కళాకారుడే; కవియును గాగలడు. మానవుడు జ్ఞానసంపన్నుడు. విజ్ఞానమువలని మానవుడు కళారాధన జేయగలడు. అట్టిపరిస్థితులందు మానవులందఱు కళాకారులు కావలసినదే. కాని కాలేరు. ఎందువలన? కళాకారుడు ప్రతివస్తువు నంతరదృష్టిని పరికించును; మానవు డనుభూతిమాత్రమునుబొంది అంతర్దృష్టిని వీక్షింపక బాహ్యరూపమును జూరకొనుచుండును. ఈ దృష్టిభేదమునందే అభివ్యంజనభేదము గాన్పించుచున్నది. కాల్పనిక శక్తి అంతర్దృష్టిననుసరించి వికసించుచుండును. అందువలన కళాభివ్యంజనము నీ క్రిందిరూపమున రూపొందింపవచ్చును.

1. అంతఃసంస్కారము: — వస్తువును జూడగానే ద్రష్టలేక శ్రోతయొక్క చిత్తమునందు తజ్జన్య సంస్కార ముత్పన్నమగును.

2. అభివ్యంజనము : — సంస్కారమువలని మనసునందు స్వతః అభివ్యంజనశక్తి యావిర్భూత మగును.

3. ఆనుషంగికానందము : — సౌందర్యభావోత్పన్నమైనది. సౌందర్యబోధనమువలన చిత్తము మహదానందమునందు లీనమగును. సౌందర్యమున కానందమున కవినాభావసంబంధమున్నది.

4. స్థూలరూపావతరణము: — శబ్ద, స్వర, గతి, రేఖాదులందు ఆధ్యాత్మికవస్తువును కళాకారుడు సాహిత్యసంగీతాదిరూపములందు భౌతికజగత్తునం దవతీర్ణ మొనరించును. ఈ నాలుగు స్తరములను దాటిన గాని అభివ్యంజనము పరిపూర్ణము కానేరదు. కాని యిందు ద్వితీయప్రక్రియయే అభివ్యంజనమునకు నిజస్వరూపమిచ్చును.

ఇవ్విధమున క్రోచే నిజసిద్ధాంతమునందు కల్పనాశక్తికి మహత్త్వపూర్ణస్థాన మిచ్చినాడు. భారతీయ రససిద్ధాంతము ననుసరించు కావ్యరూపము భావాత్మకముగను, అనుభూత్యాత్మకముగ నుండును. కాని క్రోచేదృష్టిలో భావానుభూతి సుఖాత్మకము, దుఃఖాత్మకము కాగలదని, కావ్యానుభూతితో దానిని సరిదూచుట కొప్పుకొనడు. క్రోచేయును ఆధ్యాత్మిక సౌందర్యమునే సౌందర్యమనెను. కావున దృష్టికోణమునందు భేదమేమియును లేదని చెప్పవచ్చును. వివరణభేదము లెన్నియో యుండవచ్చును. అందువలనకొందఱు అభివ్యంజనవాదమును కుంతలుని వక్రోక్తివాదముతో పరితూచుదురు. కొందఱు అభివ్యంజనవాదమునందు రసపుష్టి, నైతికబలము, అలంకార సౌందర్యము లేవనియందురు. కొందఱు క్రోచే కళా నిర్వచన మొనరించుచు జగత్తునకు జీవితమునకున్న పరస్పర సంబంధమును మఱచిపోయెనని యందురు. కాని క్రోచే బాహ్యజగత్తునకు, జీవితమునకు స్వతంత్ర ప్రతిపత్తి నీయలేదు. క్రోచే దృష్టిలో జగత్తుకూడ మానసిక ప్రవృత్తికి ప్రతిబింబము; అనగా మనస్సే సర్వసమర్థము, వ్యాపకము, సత్తయని వాని యూహ. క్రోచే మతము ననుసరించి జీవితానుభూతి, కావ్యానుభూతి వేరువేరు తత్త్వములు కానేరవు. జీవితానుభూతులే కళానుభూతులుగ మారుచుండును. జీవితానుభూతినిబట్టి కళానుభూతియు విశిష్టరూపము నొందును. క్రోచే తత్త్వవేత్తయై సమీక్షకుడై కళాక్షేత్రమునం దభివ్యంజనవాదము రూపొందించి పాశ్చాత్య కళాదృక్పథంబు నినుమడింపజేసి కృతకృత్యుడైన మేధావి.

ఐన్‌స్టీన్ ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతము

శ్రీ వై. యస్. దీక్షితులు

1879 వ సంవత్సరములో జర్మనీ లో "ఉల్మ్"లో జననమొందిన డాక్టర్ ఐన్‌స్టీన్ తన 26 వ సంవత్సరములో ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం ప్రచురించారు. తరవాత 10 సంవత్సరములవరకు పరిశోధనలో నిమగ్నులై ఇదివరలో 'రీమాన్' అనే ప్రసిద్ధ గణితశాస్త్రజ్ఞునిచే ప్రారంభింపబడిన "టెన్సార్ ఎనాలిసిస్" (*Absolute Differential Calculus*)ను కనిపెట్టి ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతాన్ని ఈ టెన్సార్ ఎనాలిసిస్ ద్వారా సామాన్య సాపేక్ష సిద్ధాంతమునకు తీసుకుపోయారు. సామాన్య సిద్ధాంతం ప్రత్యేక సిద్ధాంతంకంటె చాలా ముందుకు పోయింది. ప్రత్యేక సిద్ధాంతం ఒక్క *Uniform velocity* తో చలించే *Systems* యొక్క సంబంధములు మొదలైనవాటినిగూర్చి తెలుపుతుంది. (*System* అంటే పొడవు(X) వెడల్పు(Y) లోతు(Z)కల ఒక *Frame*). సామాన్య సిద్ధాంతం *Non-Uniform Velocity* తో చలించే *Systems* ని గూర్చికూడ తెలుపుతుంది. పదార్థమునకు భూమ్యాకర్షణకు ఉండే సంబంధాలు మొదలగువాటినిగూర్చి విపులంగా చెబుతుంది. ఈ వ్యాసంలో నా ఉద్దేశం ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం ఏమిటి? ఎల్లా వచ్చింది? దాని విపులత ఏమిటి? ఈ విషయాలు చర్చించడమే.

డా॥ ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రరంగంలో ప్రతి అంశమునందు చాలా మహత్తర సిద్ధాంతాలు చేశారు. ఇంతవరకు వచ్చిన శాస్త్రజ్ఞులందరిలోను ఈయన మహామేధావి అని ప్రస్తుతకాలపు పరిశోధకులు గౌరవించారు. ఈయన సామాన్య సాపేక్ష సిద్ధాంతంవల్ల న్యూటన్ మహాశయుని సిద్ధాంతాలు *Higher Velocity* లోను, *Quantum Considerations* లోను చెల్లనేరవని ఋజువైనది. డా॥ ఐన్‌స్టీన్ జగత్తునంతటినీ పరిపాలించే ఒకే ఒక్క సిద్ధాంతం కనుగొన ప్రయత్నించారు. అదే *Unified field theory*. దీనిలో ముఖ్యంగా *Gravitational and Electromagnetic* శక్తులను రెంటినీ కలిపిన జగత్తు యొక్క ముఖ్య సూత్రములను కనుగొనడం జరిగింది. ఆయన సిద్ధాంతరూపంలో వాటిని 1958 లో బయట పెట్టారు. కాని వాటికి ప్రయోగాత్మకమైన నిర్ధారణ కాకుండానే 1955 ఏప్రియల్ 18 తేదీని ఆయన పరమపదించారు. ఆయన లేని లోటు శాస్త్రరంగంలో సదా కనపడుతూనే ఉంటుంది. టెన్సార్ ఎనాలిసిస్ ద్వారా ప్రకృతి సిద్ధాంతాలను బయటపెట్టి ప్రపంచములో ఉన్నతమైన స్థానం పొంది మహామేధావి అనే ఘనత వహించారు.

ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం :

భూమిచుట్టూ 'ఈథర్' అనేది ఆవరించుకున్నదనీ ఆ ఈథర్‌లో భూమి వేగం సెకండుకి 20 మైళ్లనీ 1881 వరకూ సిద్ధాంతరీత్యా అందరికీ తెలిసినదే. 1881 లో 'మైకేల్‌సన్' 'మూర్లీ' అనే ఇరువురు భౌతిక శాస్త్రజ్ఞులు భూమియొక్క వేగం 'ఈథర్' నుండా ఎంతో ప్రయోగంద్వారా నిర్ణయించడానికి పూనుకున్నారు. ఈ ప్రయోగంవల్ల శాస్త్రరంగంలో అప్పట్లో ఒక సమస్య ఏర్పడింది.

ఈ ప్రయోగంలో ముఖ్యసూత్రం ఇది: రెండు కాంతికిరణములను భూమితిరుగుతున్న మార్గములోను, దానికి లంబముగను ఒకేసారి పంపి అనువుగా అమర్చబడిన సమానదూరపు అద్దములవలన ఈ కాంతి ప్రసారంవల్ల రెంటి కాలములు (కాంతి కిరణపు

(ప్రయాణకాలం రెండు మార్గములలోను) నిర్ణయించడం. భూమి ప్రయాణం చేసే మార్గంలో పోయిన కాంతికిరణపు కాలము సిద్ధాంతరీత్యా లంబముగా పోయిన కిరణం కాలముకంటె తక్కువ ఉండవలెను. కాని పై యిరువురు ఈ ప్రయోగము అన్ని కాలము లందు చేసిచూసినను ఆ కాలములు రెండు సమానము లన్న ఫలితం వచ్చినది. ఈఫలితంవల్ల అసలు 'ఈథర్' ఉన్నదా దానిలో భూమి తిరుగుచున్నదా అన్న సందేహములు శాస్త్రరంగంలో ఏర్పడినవి. అప్పట్లో ఎవరికి తోచిన సిద్ధాంతం వారు ముందు పెట్టారుకాని ఇవి తిరస్కరింపబడినవి. 'ఫిట్జ్ గెరాల్డ్' 'లారెంజి' అనే ఇరువురు పై ఫలితాన్ని ఈ క్రిందివిధముగా చెప్పారు.

భూమి ప్రయాణంచేసే మార్గములో ఉన్న దూరం కుంచితమవుతుంది. లంబముగా ఉన్న దూరం మామూలుగా ఉంటుంది. ఈ ఫలితంలోంచే 'లారెంజి ట్రాన్స్‌ఫర్ మేషన్' సమీకరణములు ఫలిస్తాయి. ఈ సమీకరణములు చలించెడి *Systems* కి స్థిరముగా ఉన్న *Systems* కి మధ్య సంబంధాలను—పొడవు, వెడల్పు, లోతు, కాలము మొదలైనవానిని తెలియ జేస్తాయి.

పై దూరపు సంకోచమువలన ఒక *Unit Length* లో ఎంత సంకోచం ఉన్నదో గణితశాస్త్రరీత్యా నిర్ణయింపవచ్చును. అలాగ నిర్ణయించగా వచ్చిన ఫలితము.

$$\text{Contraction per unit length} = \frac{1}{\sqrt{1-\frac{v^2}{c^2}}}$$

ఇందలి

V = *Uniform velocity of the moving System.*

C = కాంతి కిరణపు *Velocity per Second.* పై దాన్ని K అని అందాము: అంటే *Contraction per unit length.*

ఈ పై 'మైకేల్ సన్ మార్లీ' ప్రయోగంవల్లనూ ఐన్‌స్టీన్ ఈ క్రింది ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతపు ముఖ్య సూత్రములు వెల్లడించారు.

(1) *Uniform velocity* తో చలించే *Systems* మధ్య ఏ భౌతికప్రయోగంవల్లను తేడాలను కనుగొనలేము.

(2) *Uniform velocity* తో చలించే *Systems* లో ఏ మార్గమువందైనా కాంతికిరణపు వేగం స్థిరము :

ఈ పై సూత్రములమీదను, *Contraction factor* మీదను లారెంజి ట్రాన్స్‌ఫర్ మేషన్ ఆధారపడి ఉంది. ఈ లారెంజి ట్రాన్స్‌ఫర్ మేషన్‌వల్ల మరి రెండు ముఖ్యఫలితములు వచ్చినవి:

(1) *Contraction in Length.*

(2) *Dilatation in time.*

(1) *Length* లో *Contraction* అంటే ఇందాకా చెప్పినట్లు ఒక వస్తువ పొడవు ఆ వస్తువ స్థిరముగా ఉన్నప్పుడు కొలిచిన ఆ విలువ, అదే వస్తువ మననుంచి *Uniform Velocity* తో చలిస్తూన్నప్పుడుంటే పొడవు విలువకంటె తక్కువ ఉండును.

(2) ఒక విమానం మననుంచి అతివేగముతో పోతూన్నదనుకోండి. విమానమునందు జరిగిన రెండు సంఘటనల మధ్యకాలము (*Time between the events*) మనము, ఆ విమానములోనివారు కనుగొన్నా రనుకోండి. వారికి వచ్చిన ఫలితపు విలువ మన ఫలితపు విలువకంటె తక్కువ ఉండును. ఈ ఫలితాన్ని మరింత తీవ్రముగా విమర్శించగా వచ్చిన సందేహములు ప్రత్యేక సిద్ధాంతంవల్ల పరిష్కారము కావు. దానికి సామాన్య సిద్ధాంతపు పర్యవసానాన్ని సమన్వయం చెయ్యవలెను.

ఈ పైవాటి నన్నిటినీ ఆధారంగా చేసుకుని వెలువడిన మరొక మహత్తర ఫలితం "జగత్తులో *Absolute motion* అనేది ఉండదు. చలించెడి ప్రతీ *System* మరి ఒక వస్తువుదృష్ట్యా చలిస్తున్నది అన్నది అతి ముఖ్యము. మామూలుగా భూమి తిరుగుతున్నది అంటే అర్థములేదు. సూర్యుని దృష్ట్యా భూమి తిరుగు తున్నది అనాలి. ఉదాహరణకు శీతకాలంలో రాత్రి రైలులో ప్రయాణం చేస్తున్నాం అనుకోండి. కిటికీలు మూసి నిద్రపోతాము. రాత్రి ఏ 1 గంటకో మెలకువ వస్తుంది. అప్పుడు మనకు రైలు ఎటుపోతున్నదో తెలియదు. రైలు పట్టాలమీదచేసే శబ్దం

టిగా తయారైంది. దీనికి శ్రీ భావరాజు వేంకటకృష్ణా రావుగారి వాక్యాలోక చక్కని తార్కాణం!

స్వీయచరిత్ర ఆనాటి సాంఘికపరిస్థితులకు, పారవశ్యత పరిస్థితులకు చక్కని ప్రతిబింబము. ఇది సంఘోద్ధారకులే గాక వాఙ్మయాభిమానులు కూడా తప్పక పరిశీలింపవలసిన ఉత్తమ కృతి.

నూతిలో గొంతుకలు

బైరాగి. ప్రకాశకులు గ్లోబ్ ట్రేడర్స్, గుంటూరు. వెల ఒక రూపాయి.

ఇది ఒక అత్యంతాధునిక కావ్యం. రచయిత దీనిలో రచనాఫణితిలోనే కాక, భావ వ్యక్తీకరణంలో కూడా కొన్ని కొత్త మార్గాలవలంబించారు.

ఇది టి. యస్. ఇలియట్ మొదలైన ఆధునిక కవులవలంబించిన రచనాధోరణిలో సాగిపోతూంటుంది.

రచయిత దీనిలో అవలంబించినది చాలావరకు స్వేచ్ఛాఛ్ఛందో (*Verse libre*) మార్గం. దీనిలో 'నూతిలో గొంతుకలు', 'హామ్లెట్ స్వగతం', 'అర్జున విషాదయోగం', 'రాస్కాల్నికొవ్', 'సంఘర్షం!' 'ఒక సమష్టి ప్రార్థన', 'కవి సమస్య' అని ఏడు విభాగాలున్నాయి. 'నూతిలో గొంతుకలు' టి. యస్. ఇలియట్ వేస్ట్‌లాండ్‌లోనించి స్వీకరించిన ఒక చిన్న వాక్యానికి అనువాదం. అర్జున విషాదయోగము, హామ్లెటు స్వగతము, అందరకు తెలిసినవే! రాస్కాల్నికొవ్, డాస్టావిస్కీ 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' అనే నవలలో కథానాయకుడు. అతడు ఆ నవలలో 'సోనియా'తో సంభాషిస్తున్నట్టుగా సంశయాత్మకంగా సాగిపోతుందీ ఖండకావ్యం. నిజానికి డాస్టావిస్కీ నవలకు, ఈ ఖండకావ్యానికి ఎలాంటి సంబంధము లేదు. రాస్కాల్నికొవ్ అంటున్నట్టుగా కవే ఈ స్వగతం సాగిస్తున్నట్టు పాఠకులు గ్రహించుకోవాలి.

డాస్టావిస్కీ నవల పూర్వరంగం గాని, లేక హామ్లెట్ నాటకం పూర్వరంగం గాని తెలియని వారికి ఖండకావ్యాలు బోధపడడం కష్టమే.

ఇంచుమించుగా ఇలాంటి ధోరణిలోనే ఇలియట్ తన కవిత్వం రచించాడు. పాశ్చాత్య వాఙ్మయాల్లో కవితలోనేగాక, వచన రచనలోకూడా ఇలాంటి శిల్పధోరణు లెన్నో బయలుదేరాయి.

ఇందువల్ల, ఈవిధమైన అస్పష్టత కొంతవరకు ఈ శిల్పధోరణిలోనే ఉన్నదని అంగీకరించాలి.

ఆధునికజీవితంలో నిరాశాపూర్ణమైన బాహ్యాంతరపరిస్థితులు, లక్ష్యశూన్యత, అసందిగ్ధస్థితి మొదలైన భావాలీ కావ్యంలో అంతటా ధ్వనిస్తూంటాయి.

'ఒక సమష్టిప్రార్థన' లో ఈ రచయిత ఈపరిస్థితులు అధిగమించే ప్రయత్నం మాత్రం కొంతవరకు అవహేళనాత్మకంగా ప్రతిధ్వనిస్తుంది.

ఈ కావ్యంలో ఆదినుంచి అంతంవరకు ఒకే భావం వేర్వేరుప్రస్తారాలతో సాగిపోతూంటుంది. శ్రీ బైరాగిగారు తా మవలంబించిన ఈనూత్న శైలిలో కృతకృత్యులైనారు.

కాని 'ఉన్నతవక్షు నిశ్వాసాలు' 'రుదనాస్రాల' అన్న సమాసంలో 'రుదన' మొదలైన అప్రయోగాలీ కావ్యంలో అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

ఇంతేగాక ఈకావ్యంలో భావవ్యక్తీకరణలో సంక్షిప్తత తక్కువ. ఒకేభావం ఉక్తివైచిత్రీ రూపంలో తిరిగితిరిగి ప్రత్యక్షమౌతూంటుంది.

అయితే ఈ కావ్యంలో అంతటా చక్కని నిజాయితీ, తపన గోచరిస్తున్నాయి. చాలా ఘట్టాలలో కవిత్వం ఉత్తమస్థాయి అందుకుని ఒక మెరుపులా మెరిసిపోతుంది.

"కత్తిరించిన ఒత్తులే
వెలుగుతాయి దివ్యంగా
బాధాదగ్ధకంఠాలే
పలుకుతాయి శ్రావ్యంగా"

ఇలాంటివి కావ్యంలో చాలాచోట్ల కనిపిస్తాయి.

'నూతిలో గొంతుకలు' అత్యాధునిక కవితాభిమానులు తప్పక పరిశీలించవలసిన ఉత్తమ కృతి. ఈ క్రింది ఉదాహరణనుబట్టి వీరి రచనాధోరణి గ్రహించుకోవచ్చును.

"తరతరాల స్పందనాలు నీ
పిడికెడు నరాలలోన
యుగయుగాల క్రందనాలు నీ
అస్థుల వివరాల్లోన
కరిగిన సీసపుధార

కారుతోంది చెవుల్లో:
నిప్పులు కక్కే అగ్నిపర్వత
గహ్వరాల్లా రెండు కళ్ళు.
చేవగల చీకటి నోట
మెరిసే పళ్ళు
రక్తం కాదు కరాళ
కాలకూటం దేహంలో!"

శ్రీ వేంకటేశ స్తోత్రము

ఆంధ్రీకరణము. శ్రీ. కె. నారాయణరావు. ప్రకాశకులు: జయలక్ష్మి అండ్ కంపెనీ. ట్రంకు రోడ్డు. నెల్లూరు. వెల తెలియదు.

ఇది సంస్కృతంలో సాంప్రదాయికంగా వస్తున్న వేంకటేశ స్తోత్రావళికి అనువాదము. ఈ గ్రంథంలో శ్రీ వేంకటేశ స్తోత్రము, శ్రీ వేంకటేశ ప్రపత్తి, శ్రీ వేంకటేశ మంగళాశాసనము అని మూడు కృతులున్నాయి.

రచయిత ఈ మూడింటికీ ఆంధ్రకవితానువాదాలు చేసి మూలస్తోత్రాలతో సహా ఈ గ్రంథంలో ప్రచురించారు. గ్రంథం చివర కేసరి సుందరరామ శర్మగారు సంస్కృతస్తోత్రాలకు తెలుగులో వ్రాసిన లఘుటీక కూడా చేర్చారు.

రచయిత చేసిన అనువాదం అక్కడక్కడ కొంత పెరిగినా మూలభావం చక్కగా వ్యక్తీకరిస్తున్నది.

ఈ క్రిందిమూలశ్లోకము, దాని అనువాదము పరిశీలించిన పాఠకులకు వీరి రచనాధోరణి సుగమం కాగలదు.

"కలవేణు రవావశ గోపవధూ
శతకోటివృతాత్
స్మరకోటిశతాత్
ప్రతివల్లవికాభిమతాత్
సుఖదాత్ వసుదేవసుతా
న్నపరం కలయే"

"కలవేణురవవశ్య చలితాత్మగోప
రమణీమణీ సహస్ర సమావృతుడవు,
స్మరకోటిసన్నిభ సౌందర్యఖనివి,
ప్రతివల్లవికి నభిమతుడవు, సౌఖ్య
దాతవు; వసుదేవతనయుడవీవు!
నీకంటె నన్యంబు నెరి నే నెరుంగ"

అక్షరసుందరి

యస్. ఆర్. యస్. అయాచిత్. ఆంధ్ర విశ్వ సాహిత్యపరిషత్ — విజయవాడ — 2. వెల పన్నెండు అణాలు.

ఇది అభ్యుదయధోరణిలో రచించిన ఖండకావ్యసంపుటి. ఇందులో ఉన్నవన్నీ చాలావరకు మాత్రా ఛందస్సులు, నిషాదాలు మాత్రమే.

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.